మలుపు

కథల సంపుటి

•

డా. కొప్పరపు నారాయణమూర్తి
Ph.D

ఈ పుస్తకం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ఆర్థిక సహాయంతో ముద్రితం.
పుస్తకంలోని అభిప్రాయాలు రచయిత సొంతం.
వాటితో విశ్వవిద్యాలయానికి ఎటువంటి సంబంధం లేదు.

ముద్రణ : డిసెంబర్, 2023
ప్రతులు : 500

ప్రచురణకర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D, హైదరాబాద్
ఫోన్: 7671909759

ముఖపత్రం : రాపిక్సల్.కామ్ సౌజన్యంతో

పంపిణీ :
అనల్ప బుక్ కంపెనీ
జి.కె.కాలనీ బస్టాపు వద్ద,
నేరేడ్‌మెట్ క్రాస్‌రోడ్ దగ్గర,
సికింద్రాబాద్ – 500094,
తెలంగాణ రాష్ట్రం, భారతదేశం.
ఫోన్: 70938 00303

వెల : రూ. 225

ముద్రణ : రమణ ప్రింటర్స్, విద్యానగర్, హైదరాబాద్.

డి.టి.పి. : శ్రీ దుర్గ గ్రాఫిక్స్, తెనాలి. సెల్ : 9110761291

రచయిత గురించి

అసలు పేరు– సి.ఎస్.హెచ్.ఎన్. మూర్తి. ప్రస్తుతం సంక్షిప్తంగా డా॥ కొప్పరపు నారాయణమూర్తి అనే పేరుతో రచనా వ్యాసంగం చేస్తున్నారు. గతంలో 'గిరిజా నారాయణ్' కలం పేరుతో అనేక కథలు, వ్యాసాలు రాశారు. జన్మస్థలం గుంటూరు. కాని విద్యాభ్యాసం ఎక్కువ భాగం ఒంగోలులో సాగింది. చిన్నరామయ్య స్కూల్, పి.వి.ఆర్.ఎమ్.హెచ్. స్కూల్, సి.ఎస్.ఆర్. శర్మా కాలేజీలలో ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు, డిగ్రీ చదువులు పూర్తయినాయి. ఆర్థికంగా బాగా వెనుకబడిన కుటుంబం కావటాన మొత్తం చదువు మెరిట్ స్కాలర్‌షిప్‌ల మీద, మేనమామ ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారి సహాయం పైనా, ఇంకా అనేకమంది మిత్రులు, శ్రేయోభిలాషులు చేసిన ఆర్థిక సాయంతో సాగింది. 1977లో డిగ్రీ ముగిశాక వారు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీలో ఎమ్.ఎస్‌సి. లైఫ్ సైన్సెస్ కోర్సుకు అఖిల భారత పోటీ పరీక్షలో సీట్ సాధించారు. కాని ఒక సెమిస్టర్ పూర్తయ్యేటప్పటికి వారికి సహాయం చేస్తామన్న వారిచ్చే ఆర్థిక సహాయం సరిపోలేదు. ఫలితంగా చదువు మానేసి హైదరాబాద్ వచ్చి 'ఈనాడు' దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా ఆదివారం అను బంధంలో చలసాని ప్రసాదరావుగారి దగ్గర పనికి కుదిరారు. అప్పుడే వారి వ్యాసాలు, కథలు 'ఈనాడు' పత్రిక, విపుల, చతురలలో ప్రచురితమవ్వటం ప్రారంభమైనాయి.

1979లో ఐ.డి.పి.ఎల్.లో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా బయాలజీ డివిజన్ ఆర్&డిలో పరిశోధనలు ప్రారంభించారు. ఈ కాలంలో ఉద్యోగ బాధ్యతలే కాక స్వతంత్రంగా కిరణజన్య సంయోగక్రియపై అనేక పరిశోధనలు చేసి అంతర్జాతీయ పరిశోధనా పత్రికల్లో ప్రచురించారు. ఈ కాలంలోనే పూర్వం కొనసాగించలేకపోయిన ఎమ్.ఎస్‌సి.ని అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి పూర్తిచేశారు. దురదృష్టవశాత్తు 1993లో కంపెనీ మూసివేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించడంతో 36 ఏళ్ళకే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని బయటకు వచ్చారు. ఆ తరువాత ఉద్యోగం చూసుకుంటూ బి.ఇడి., ఎమ్.ఇడి,

ఎమ్.ఏ. ఇంగ్లీషు, ఎమ్.ఏ. జర్నలిజం, ఎమ్.ఫిల్. జర్నలిజం, పిహెచ్.డి. జర్నలిజం కోర్సులు చదివారు. ఈ సమయంలోనే ఆయన 'ఈనాడు' దిన పత్రికలో, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఉదయం వంటి పత్రికలకు నిరాఘాటంగా వ్యాసాలు, కథలు రాసేవారు. అలా రాత్రింబవళ్ళు కష్టపడి చదివిన చదువు ఫలితంగా, చేసిన శ్రమ ఫలితంగా ఆయన విదేశాలకు మీడియా ప్రతినిధిగా వెళ్ళడం జరిగింది. 2003 నుంచి 2005 వరకు ఎరిట్రియా అనే ఆఫ్రికా దేశానికి యు.ఎన్.డి.పి. నిధులపై సలహాదారుగా పనిచేశారు. తిరిగి స్వదేశం వచ్చాక అనేక ప్రైవేట్, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలల్లో జర్నలిజంలో ఆచార్యులుగా పనిచేశారు. సుమారు 25 దేశాలు తిరిగారు. అంతర్జాతీయ, జాతీయ పరిశోధనా జర్నల్స్‌లో 65కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు.

వీరు రాసిన కథలు, వ్యాసాలు సంపుటాలుగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్‌వారు గతంలో ప్రచురించారు. వారు ఇంకా రాస్తూనే ఉన్నారు. సాహిత్యం (కథ, కవిత, నవల) వీరికి ప్రాణం. వాటిపైనే విశ్లేషణలు, వ్యాసాలు రాస్తారు.

❀

ఇదీ వరుస...

పీఠిక

'మలుపు' తిరిగిన కథలు

డా॥ కొప్పరపు నారాయణమూర్తి పూర్వాశ్రమంలో 'గిరిజా నారాయణ్' అనే కలం పేరుతో రచనలు చేశారు. వారు పుట్టింది గుంటూరులో. తండ్రి ఉద్యోగరీత్యా, తన ఉద్యోగాల వలనా నారాయణమూర్తిగారి కార్యక్షేత్రం దేశం మొత్తం. వారి ఆలోచనా పరిధి యావత్ ప్రపంచమే.

నారాయణమూర్తిగారిది పాత్రికేయ వృత్తి. 1977లో 'ఈనాడు' పత్రికలో చేరటంతో వీరి పాత్రికేయ వృత్తి ప్రారంభమైంది. ఆరంభమే చలసాని ప్రసాద రావుగారి దగ్గర. ఈనాడు ఆదివారం అనుబంధం, విపుల, చతురలలో పని చేశారు. వీరివి కొన్ని కథలు, స్పెషల్ ఫీచర్స్ వీటిల్లో కన్పిస్తాయి కూడా.

తరువాతి కాలంలో పాత్రికేయుడిగా పరిశోధనలు చేసి డాక్టరేట్ అందు కున్నారు. కథా రచనపై వీరికి ఆసక్తి మెండు. చర్చించదగిన, ఆలోచించవలసిన సాహిత్య వ్యాసాలనూ అందించారు. గత 16 ఏళ్ళుగా జర్నలిజంలో వీరు చేసిన పరిశోధన పత్రాలు ప్రఖ్యాత అంతర్జాతీయ ఆంగ్ల జర్నల్స్‌లో, ఆంగ్ల సంకలనా లలో అచ్చయినాయి.

వీరి ఇంటి పేరు కొప్పరపు అనగానే 'కొప్పరపు కవులు' గుర్తుకొస్తారు. 'కొప్పరపు' ఇంటి పేరుతో అనేకమంది రచయితలూ, కళాకారులూ వున్నారు. ఆ ఘనమైన వారసత్వం కొనసాగింపుగా సాహిత్య రంగంలో కృషి చేస్తున్నారు ఈ రచయిత.

మొత్తం 32 కథలతో ఈ సంపుటిని మనముందు ఉంచుతున్నారు. ఈ కథల కాలం 1986 నుండి 1991 మధ్య. ఈ కథలు వెలువడిన దాదాపు

మూడు దశాబ్దాల అనంతరం రాస్తున్న ముందుమాట ఇది.

1991 తరువాత మనదేశానికి, ప్రపంచానికి సంబంధించి అనేక వేగ వంతమైన మార్పులూ, పరిణామాలూ అన్ని రంగాలలో చోటు చేసుకున్నాయి. అనేక వాదాలు, ధోరణులు, ఉద్యమాలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలలోను, సామాజికంగానూ తలెత్తాయి. మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ భారతదేశంతో సహా ప్రపంచాన్ని చుట్టు ముట్టేసింది. ఆర్థిక, సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులు అనూహ్యం. ఈ ఆధునికత, అత్యాధునికతలు సంక్షోభాలనూ సృష్టించాయి. సంక్షేమాలనూ కలిగించాయి. మొత్తంగా ఆనాటికే ఒక సంక్లిష్ట సందర్భంలో రాష్ట్రం, దేశం, ప్రపంచం ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో రచయిత కథలను పరిశీలించాల్సిన అవసరముంది. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలు ప్రపంచీకరణ ప్రభావాన్ని ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. అయితే ఈ రచయిత రాసిన కథలన్నీ 1990లకు ముందు. ఒక తరం వెనక్కు వెళ్ళి పరిశీలించాల్సిన పరిస్థితి. ఈ రచయితది ముందుచూపేనని ఈ కథలు చెప్తు న్నాయి. 1990ల తరువాత 'స్త్రీవాదం' తెలుగు సాహిత్యంలో బలంగా పాదం మోపింది. ప్రధానంగా కవిత్వ, కథా ప్రక్రియలలో చాలామంది రచయితలు, రచయిత్రులు అన్ని వర్గాలు, వర్ణాలు, అన్ని ప్రాంతాల నుండి పరిచయమ య్యారు. మంచి రచనలతో ముంచెత్తారు. ఆ కృషిని మరింత బలంగా కొనసాగిస్తున్నారు కూడా.

ఈ సంపుటిలోని తొలి కథ 'మలుపు'. ఇది రచయితకు స్త్రీల పట్ల ఉన్న అభిమానాన్ని తెలుపుతోంది. వాళ్ళు స్వీయ వ్యక్తిత్వంతో రాణించాలన్న అభిలాష వ్యక్తం చేశారు. ఈ కథ చదివినప్పుడు చలం చెప్పిన 'స్త్రీకి శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి' అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. అయితే చలం 'ఇవ్వాలి' అన్నారు. ఈ రచయిత అవన్నీ 'ఇచ్చిన' మంచి కథ. చలం కన్నా ఒక అడుగు ముందుకు వేశారు నారాయణమూర్తి. ఆశ్చర్యకరమైన, ఆనందకరమైన, ఆహ్లాదముతో కూడిన ముగింపు ఈ 'మలుపు' కథ ప్రత్యేకత.

రెండో కథ 'నిర్ణయం'. నూరేళ్ళ వైవాహిక జీవితం భర్త ఆత్మహత్యతో ముప్పయి రోజులలోనే ముగిసిపోయిన సుగుణ కథ యిది– 'వైదిక సంస్కారాల పేరుతో తరతరాలుగా హిందూ వ్యవస్థలో కొనసాగుతున్న 'వైధవ్యం' అనే దుస్సంప్రదాయాన్ని తిరస్కరిస్తూ ఆత్మవిశ్వాసంతో, కట్టుబొట్టులతో జీవితాన్ని కొనసాగించాలని గడపదాటే 'నిర్ణయం' తీసుకొన్న సుగుణ కథ యిది.

'ఈ జాతి దీర్ఘ రోగాల్లో వైధవ్యం ఒకటి' శీర్షికన 30 మే 2022న విశాలాంధ్రలో ప్రముఖ అభ్యుదయ సాహితీవేత్త డా॥ ఆవంత్స సోమసుందర్ ఎన్నో విషయాలను ఉటంకిస్తూ ఓ వ్యాసాన్ని రాశారు. ఈ హిందూ 'అధర్మ' ధర్మాన్ని నిరసిస్తూ ప్రముఖ కథా రచయిత డా॥ కేతు విశ్వనాథరెడ్డి 'ఇచ్ఛాగ్ని' (1995 ఇండియా టుడే వార్షిక 'సాహిత్య సంచిక'), 'ముఖదర్శనం' (అక్టోబర్ 1998 ఇండియా టుడే) కథలు రాశారు. వీటికన్నా ముందుచూపుతో నారాయణ మూర్తి 'నిర్ణయం' కథ రాశారని గుర్తుచేస్తున్నాను. స్త్రీజాతి పక్షాన ధిక్కార స్వరాన్ని వినిపించిన నారాయణమూర్తి చైతన్యాన్ని తెలుగు కథా లోకం తప్పక గుర్తిస్తుందని ఆశిస్తున్నాను. గుర్తించాలి, గౌరవించాలి (ముఖ్యంగా స్త్రీవాదులు).

శాస్త్రోక్తం పేరిట మన సమాజంలో అపరిచితుల మధ్య జరుగుతున్న పెళ్ళిళ్ళు సక్రమమైనవి కావని, వివాహ వ్యవస్థలో పెనుమార్పులు రావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిన కథ 'పెళ్ళి కథ'– పెళ్ళిళ్ళలో 'మంత్ర తంత్రాలకు స్థానం కల్పించటం వివేకం అన్పించలేదు' అని ఇక్కడా ధిక్కారస్వరం వినిపించారు రచయిత నారాయణమూర్తి.

ఈ సంపుటిలోని చివరి 14 కథలను చదివిన తరువాత 'నారాయణమూర్తే ఈ కథలను రాశారా?' అని అనిపించింది. బలహీనమైన, ప్రతికూలమైన యితివృత్తాలు. ఒకరకంగా చేర్చనవసరంలేని కథలు. ఇవన్నీ ప్రధాన పత్రికలలో అచ్చయినవే కావటం గమనార్హం. నారాయణమూర్తి కథల్లో కొసమెరుపు ముగింపులు ఎక్కువ. ఈ ముగింపులే కథలను అనేక మలుపులు తిప్పాయి.

నారాయణమూర్తిగారు బాగా చదువుకున్నవారు అని ముందే చెప్పాను కదా. చలం, తాపీ ధర్మారావు, కొడవటిగంటి కుటుంబరావు, మల్లాది రామకృష్ణశాస్త్రి, కోడూరి శ్రీరామ్మూర్తి, వీరేశలింగం పంతులు, ఇంకా అమృతా

ప్రీతమ్, కమలాదాస్ వంటి రచయిత్రులు, ఆంగ్ల రచయితలు ఓ. హెన్రీ, అస్కార్ వైల్డ్, సోమర్‌సెట్ మామ్ వంటి వారు వీరి రచనల ద్వారా సాక్షాత్కరిస్తారు. గిరీశాన్ని పరిచయం చేశారు. పాత్రికేయుడిగా కూడా నారాయణమూర్తి తన కథల్లో అక్కడక్కడా తొంగి చూస్తుంటారు.

వారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

గుంటూరు
28-10-2023

పెనుగొండ లక్ష్మీనారాయణ
అధ్యక్షులు
అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం

నా మాట

ఈ కథల సంపుటికి 'మలుపు' అని పేరు పెట్టడానికి అనేక కారణా లున్నాయి. నేను రచయితగా జీవితంలో స్థిరపడదామనుకొనే నాటికి తెలుగు కథా కథనంలోనూ, పత్రికారంగంలోనూ 1980-1990 మధ్య చోటుచేసుకొన్న పెనుమార్పులు ఓ చెప్పరాని, చెప్పలేని 'మలుపు.' అది రచనా రంగంలోకి ప్రవేశించినవారికి ఒక సంధికాలం. అప్పటికే సుప్రసిద్ధులైన రచయితలు కూడా తడబడ్డ సమయమది. కథల నిడివి తగ్గిపోయింది. వింత వింత శీర్షికలతో కథల పోటీలు పెట్టడం ప్రారంభించారు. కార్డు కథ, పేజీ కథ, పొట్టి కథ ఇలా రకరకాల కొత్తరకం కథా కథనాన్ని ఆహ్వానించే పత్రికలు పుట్టుకు రాసాగాయి. ఒక క్రమ పద్ధతిలో కథలను 'ప్రచురణకు స్వీకరించాము' అని తెలిపే పద్ధతి ఏ కొన్ని పత్రికలోనో మిగిలింది. ఇది 'మలుపు' నామధేయం వెనుకనున్న ప్రేరణ (సంక్షిప్తంగా).

ఇక నేను రచయితగా రూపొందటానికి దారితీసిన పరిస్థితుల మాట కొస్తాను టూకీగా. చిన్నప్పట్నించి నా తల్లి కీ॥శే॥ కొప్పరపు కోటేశ్వరమ్మ నేర్పిన చదువు, దిద్దించిన అక్షరాలు, చెప్పిన వేలకొద్ది ఆధ్యాత్మిక కథలు, పంచతంత్రం నీతికథలు నాలో ఒక సృజనాత్మక వ్యక్తిని నాకు తెలియకుండానే మలిచాయి. నేను చదువుకున్న పి.వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ (ఒంగోలు), సి.ఎస్.ఆర్. శర్మ కాలేజి (ఒంగోలు) నాలోని సృజనకు నూతన తేజాన్ని, శక్తి నిచ్చి నన్ను బహుముఖంగా మార్చాయి.

స్కూల్‌లో మా తెలుగు ఉపాధ్యాయులు నందిగామ సూర్యనారాయణ,

వావిలాల రామమూర్తి, సి. కోటేశ్వరశర్మ (ప్రధానోపాధ్యాయులు) తెలుగులో, ఆంగ్లంలో వ్యాసాలు, కథలు రాయటానికి పునాదులు వేశారు. ఆ సందర్భాలను వివరిస్తూ పి.వి.ఆర్. మున్సిపల్ హైస్కూల్ 100 సంవత్సరాల జయంతి సందర్భంగా 'గుర్తుకొస్తున్నాయ్' శీర్షికన స్కూల్ సావనీర్‌కి వ్యాసం రాశాను. అందువలన, అందులోని విషయాలను పునరుద్ఘాటించటం లేదు. సుమారు పదేళ్ళ పాటు నేను నిరాటంకంగా చదివిన చందమామ కథలు, కొడవటిగంటి కుటుంబరావు ఐదు సంపుటాల కథలు, యద్దనపూడి, కోడూరి కౌసల్యాదేవి వంటి వారి కాల్పనిక సాహిత్యం, మధురాంతకం రాజారాం, రాచకొండ, కాళీపట్నం, చాసో, త్రిపురనేని, తిలక్, బుచ్చిబాబు కథలు నాలో రచనాశక్తికి కొత్త ప్రేరణను, ఊపునీ ఇచ్చాయి.

వ్యక్తిగత జీవితంలో చిన్ననాటినుంచీ నేటివరకూ నిరాఘాటంగా సంభవించిన, సంభవిస్తున్న కలతలు, గృహఛిద్రాలు, అవి రేపిన మానసిక సంఘర్షణలు, కన్నీళ్ళు నాలో రచయితకు ఆర్ద్రతను చేర్చాయి. కొన్ని లక్షల మానసిక సంఘర్షణల నుంచి రచయిత వివేకం, విచక్షణ, జ్ఞానం, ప్రేమ, సహృదయత రూపొందుతాయి. రచయిత వ్యక్తిగత జీవితం నుంచి రచయిత కథా కథనం ఎప్పుడూ దూరంపోదు. చాపకింద నీరులా రచయిత వ్యక్తిత్వం కథల్లో ఎప్పుడూ ప్రతిబింబిస్తూనే ఉంటుంది. కేవలం వట్టి కాల్పనికత కన్నా, ఈ విధమైన కథాకథనమే నాకు చాలా ఇష్టం. ఇందుకు నాకు స్ఫూర్తినిచ్చిన కొడవటిగంటి, మధురాంతకంలకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

ప్రతివ్యక్తి జీవితం పరిపూర్ణత్వ దిశకు పయనించేప్పుడు అందులో అతని మిత్రులకు అవిభాజ్యభాగం ఉండితీరుతుందని నా విశ్వాసం. చిన్ననాటి మిత్రులు కూనపరెడ్డి సురేష్, నండూరి సాంబశివరావు, రంగరాజన్, బందా ఆంజనేయ వరప్రసాద్, డాక్టరు కోనా వరలక్ష్మి వంటి మంచి బుద్ధిశాలులైన మిత్రులు నాలో విద్యాగంధానికి సానబట్టి పదును తెచ్చారు. ఇంకా అనేకమంది మిత్రులు నా జీవితాన్ని పరిపూర్ణం చేశారు. నేలభొట్ల ఆంజనేయ ప్రసాద్, వేమూరి ఆంజనేయ ప్రసాద్, కొంపల్లి కోటిలింగం, బొమ్మిశెట్టి రాజేంద్రప్రసాద్, తల్లావఝ్ఝుల లలితా ప్రసాద్, తల్లావఝ్ఝుల శివాజి, భీమరాజు సీతాపతి ఇలా

ఎంతోమంది స్నేహితులు నన్నెంతగానో ఆదరించారు. వీరి స్నేహమే చిన్ననాడు నాకు లభించి ఉండకపోతే, నా జీవితంలో నేడున్న వైవిధ్యం అసలు ఉండి ఉండకపోయేది. వారితో చెరువుకట్టలమీద, రైల్వే వంతెనలవద్ద, కొండలపైన, సముద్రం ఒడ్డున నేను నెరిపిన తీవ్రమైన చర్చలు నాలో తర్కానికి ఆనాడు ఎంతో పదును పెట్టాయి. దురదృష్టవశాత్తు కాలేజీ చదువులై జీవితంలోకి అడుగుపెట్టాక అలాంటి బుద్ధిబలాన్నే ఆశ్రయించుకొని, అందులోనే ఆనందాన్ని వెతుక్కొనే మిత్రులు నాకు మళ్ళీ లభించలేదు. అదెప్పటికీ నాకో తీరని కొరతగా, ఒక చిన్ననాటి మధురానుభూతిగా మిగిలేపోతుంది.

ఊరిపట్టున జీవితం గడపటం బావిలో నివసించటం లాంటిది. కాని, ఉద్యోగం కోసం హైద్రాబాదుకు పొట్ట చేత్తో పట్టుకొని వచ్చినప్పుడు నగర జీవితంలో ఎదురయ్యే భిన్న మనస్తత్వాలు, అవి అందించే అపార అనుభవం మరో వింతానుభూతి. జీవన పోరాటంలో అడుగడుగున కొన్ని లక్షల పాఠాలు నేర్చుకొన్నాను. ప్రతి విషయాన్ని విశ్లేషించి అందులో అమృతాన్ని చూశాను. దాన్నంత రాయటం అసాధ్యం అన్నది మొదటిసత్యం. కాని, నగర జీవితాలు ఊరిపట్టున జీవితాల్లా కాక ఎన్నటికీ ఒంటరి జీవితాలే. ఇక్కడ మనస్సు, మమత, ఆప్యాయత, ప్రేమ, సరదా అంతా లాభనష్టాల ముసుగులో వ్యాపారంలా నిరంతర స్వార్థచింతనతో దూషణభూషణాలతో సాగుతుంటుంది. నన్ను కలవరపరచిన అనేక ఘోరసత్యాల్లో ఇదొకటి. ఇన్నింటి నడుమ ఇరుకు సందుల్లో (మనస్సుల్లో) ప్రయాణిస్తున్నప్పుడు, నేను గాడి తప్పకుండా నాకు సమయోచిత సలహాలిస్తూ, వాస్తవాల్ని మరింత విశ్లేషించి నాకు అవగత మయ్యేలా చెప్పి సహాయపడిన మిత్రులు కొంతమంది ఉన్నారు. వారిలో ఒకరే ఉన్నారు ప్రస్తుతం. వారి నామధేయం రాణి రామకృష్ణ. వీరు సన్యసించి స్వామి తత్వవిదానందగా కొనసాగుతున్నారు.

మేనమామ ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (ప్రముఖ భాషాశాస్త్రవేత్త, యూనివర్సిటి ఆఫ్ హైద్రాబాద్ మాజీ ఉపాధ్యక్షులు), పైసాపైసా పొదుపుతో నా చదువు గట్టెక్కించిన కన్నతల్లి కోటేశ్వరమ్మగారి పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను– కృతజ్ఞత నిండిన హృదయంతో, అశ్రుపూరిత నయనాలతో.

పత్రికారంగంలో నాకు పరిచయమున్న మిత్రులు చాలామందే ఉన్నారు. ఆనాడు నేను రాయని పత్రిక లేదు, రాయని ప్రక్రియ లేదు (ఒక కవిత్వం తప్ప). తెలియని సంపాదకులు లేరు. పురాణం సుబ్రహ్మణ్య శర్మ (ఆంధ్రజ్యోతి వారపత్రిక), ఎమ్. మాధవరావు (ఆంధ్ర సచిత్ర వారపత్రిక, కలువబాల), పొత్తూరి వేంకటేశ్వరరావు (ఆంధ్రప్రభ), వాకాటి పాండురంగారావు (ఆంధ్రప్రభ వారపత్రిక), చలసాని ప్రసాదరావు (ఈనాడు ఆదివారం, విపుల, చతుర), బుర్రా సుబ్రహ్మణ్యం, వై.ఆర్.కె.(ఇరువురూ ఈనాడే), తల్లావఝ్ఝల శివాజి, సి. మృణాళిని, మందలపర్తి కిషోర్(ఉదయం దినపత్రిక), శాతవాహన (గులాం గౌస్, ఉదయం ఆదివారం అనుబంధం), దాట్ల నారాయణమూర్తి రాజు (ఉదయం ఆదివారం సంచిక), రాంభట్ల కృష్ణమూర్తి (ఈనాడు), పాలకోడేటి సత్యనారాయణరావు (ఈనాడు, ఉదయం), హెచ్.ఆర్.కె. (ఈనాడు జ్ఞాననేత్రం, ఎడిట్ పేజి), ఆర్.వి. రామారావు (ఆంధ్రభూమి దినపత్రిక), ఎమ్.వి.ఆర్. శాస్త్రి (ఆంధ్రభూమి వారపత్రిక, ఆదివారం సంచిక)... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పెద్ద లిస్టే. వారందరికి నేను 'గిరిజా నారాయణ్'గానే పరిచయం. నా కథలను ప్రచురించిన సంపాదకులందరికీ నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకానికి ముందుమాట పెనుగొండ లక్ష్మీనారాయణగారు రాశారు. వీరిని తెలియనివారు తెలుగునాట ఉండరంటే అతిశయోక్తి కాదు. సాహితీ సంస్థల నిర్వాహణలోనూ అనేక సంకలనాలు (కథలు, వ్యాసాలు) వెలుగులోకి తేవటంలోనూ గత 50 ఏళ్ళుగా వారు జరిపిన అవిరళ కృషి తెలుగు సాహిత్య చరిత్రలో మరవలేనిది. అనేక కథ, వ్యాస సంకలనాలకు సంపాదకత్వం వహించటమే కాక, ఆయన స్వయంగా కొన్ని వ్యాస సంపుటాలను వెలువరించారు. వారు ప్రస్తుతం అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు. అటువంటి మహనీయుడు ఈ కథల సంపుటికి ముందుమాట రాయటానికి అంగీకరించినందుకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు. అయితే వారి ముందు మాటలో ఒక వాక్యానికి ఒక రచయితగా, ఒక ఆచార్యుడిగా స్పందించవలసి ఉంటుంది. ఈ వ్యాఖ్యానం ఈ సంపుటిలోని చివరి 14 కథలపై చేసినది. నిజానికి ఇది ఆహ్వానించదగ్గదే. కాని పాఠకుల అవగాహనను దృష్టిలో పెట్టుకొని

చిన్న వివరణ ఇస్తున్నాను. ఈ పుస్తకంలోని తొలి 18 కథలు తెలుగుజాతి సంప్రదాయ సమస్యల చుట్టూ తిరుగుతాయి. కట్నాలు, వివాహాలు, వైధవ్యాలు, కట్టుబాట్లు, స్త్రీల సమస్యలు, ఒంటరితనం, సహజీవనం ఇలా అనేక సమస్యల చుట్టూ తిరుగుతాయి. అయితే ఇదో జోనర్ మాత్రమే. ఇవి ఎప్పటినుంచో ఉన్నా ఎప్పటికప్పుడు కాలం మారినకొద్దీ, కొత్తరూపం సంతరించుకోవటం వలన కొత్తగా చెప్పవలసి వస్తుంది. కొత్త వాదనలు వినిపించవలసి వస్తుంది. తరువాతి 14 కథలు మానవ బలహీనతల చుట్టూ, దిగజారిన విలువల చుట్టూ పరిభ్రమిస్తాయి.

ఇందులో ఉడికించటం, ఉలికించటం, ఆటపట్టించటం, మోసం చేయటం, గయ్యాళితనం చూపించటం వంటి మానవ అల్పబుద్ధిని సున్నితంగా ఎత్తిచూపటం జరుగుతుంది. ఇవన్నీ కూడా మానవ దైనందిన జీవితములో ఏదోరకంగా సమాజంపైన, మనపైన ప్రభావం చూపుతున్నవే. వీటిలో ప్రతికూల, అనుకూల ఇతివృత్తాలంటూ వర్గీకరణ ఉండదు. సమస్యను ఎలా ఎత్తి చూపామా అన్నదే ప్రధానం. దాని చుట్టే శిల్పము, ఎత్తుగడ, కథా కథనం నడుస్తాయి. ముఖ్యంగా ఈ కథలు రాసే కాలంలోనే పైన చెప్పినట్లు ఒక సంధియుగం వచ్చింది. అందువలన కొన్ని ఆంగ్ల రచనల ప్రక్రియలు ఈ కథల్లోకి చొచ్చుకొచ్చాయి.

ముఖ్యంగా బ్రెయిన్‌టీజర్స్, టిట్‌బిట్స్ ఈ కోవకు చెందినవే. రచయితగా కొత్త, పాత ప్రక్రియల మేళవింపులతో రచనలు చేయటం నాకు అవసరం అనిపించింది. ఆ కారణంగా ఇవి ముందు తరహా కథలకు భిన్నంగా ఉండ వచ్చు. అంతేగాని కథలు మానవజాతి అవతలకు వెళ్ళలేదు. ఈ విషయంలో పాఠకులదే తుది నిర్ణయం.

–డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D

మలుపు

అది ఒంగోలు-విజయవాడ ప్యాసింజరు. తెల్లవారుజామున నాలుగు గంటలకు ఒంగోలులో బయల్దేరి ఎనిమిదింటికి విజయవాడ చేరుతుంది.

ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్ళేవాళ్ళ కోసం, పాలు, పెరుగు, కూరలు చుట్టుపక్కల పల్లెల్లో అమ్ముకొనేవాళ్ళ వసతి కోసం ప్రభుత్వం చాలా తీవ్రంగా ఆలోచించి వేసిన రైలది. కాని దాని ఉపయోగం కేవలం టికెట్టులేని ప్రయాణీకులకే పరిమితమైపోయింది. చినగంజాం చేరేవరకు ఉద్యోగస్తులు, విద్యార్థులు ఈ బండెక్కడం నేనెప్పుడూ చూడలేదు.

నేను సొంతపనుల మీద తిరుపతి నుండి ఒంగోలు వచ్చి పదిరోజులయింది. విజయవాడలో వర్కింగ్ జర్నలిస్టుల మీటింగ్ ఒకటి జరుగుతుంటే హాజరు వేసుకోడానికన్నట్టు బయలుదేరాను. ఇంకా రైలు కదలడానికి అయిదు నిముషాలుంది. రైల్లో జనం సీటుకొకరు విసిరేసినట్లు కూర్చున్నారు.

వేసవిలో తెల్లవారుజామున ప్రయాణం అంటే నాకెంతో ఇష్టం. అందునా శుక్లపక్షంలో నీలాకాశంలో వెన్నెల కురిపించే చంద్రుణ్ణి చూస్తూ రైల్లో పోవడమంటే మహా సరదా కూడా. ఎండాకాలం రాత్రులు ఉడకపోతతో మనసు ఉక్కిరిబిక్కిరి చేసినా, నాలుగో జాములో వీచే మందమారుతాలకు మన ప్రాణాలు మంచున మునిగి, హాయిగా కన్నెపిల్ల కౌగిట్లో మరో లోకాలకు ఎగిరిపోతాయి. అందుకేనేమో రైల్లో ఉన్న కొద్దిమంది కిటికీకి ఒరిగి చల్లగాలికి నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నారు.

ఒక్కసారి నేను కూర్చున్న కంపార్టుమెంటులో ఎవరైనా తెలిసిన మొహాలు

ఉన్నారేమోనని లేచి వెళ్ళి చూసివచ్చాను. ఎవ్వరూ లేకపోగా, ఉన్నవాళ్ళలో తెలీనివారితోనైనా సరే కబుర్లు పెడ్దామంటే బాపట్లదాకా కూడా కంపెనీ ఇచ్చే స్థితిలో ఎవ్వరూ లేరు. ముక్కూమొహం తెలీనివాళ్ళతో కూడా ఎంతో బాగా పరిచయమున్నట్లు ఇట్టే కబుర్లు చెప్పేయటం నాకు వెన్నతో పెట్టిన విద్య. అయినా ప్రయోజనం కనిపించక పోవడంతో విసుగొచ్చి సీట్లో చతికిలబడి, బ్రీఫ్‌కేస్ తీసి అందులోంచి ఓ ఇంగ్లీషు పుస్తకం బయటికి లాగి పేజీలు తిరగేయడం ప్రారంభించాను.

గార్డు విజిల్ చెవిన పడుతుండగా హడావిడిగా ఓ అమ్మాయి, సుమారు యాభైలో పడ్డ ఓ వ్యక్తీ కంపార్టుమెంటులోకి చొచ్చుకురావడం, ఆ ఇద్దరూ నా సీటు ముందు సీట్లో చతికిలబడడం జరిగిపోయింది.

ఆ అమ్మాయిని చూడగానే ఏదో తెలీని వెచ్చదనం నా వెన్నెముకలోంచి ఒళ్ళంతా పాకి మెదడును చేరింది. వెంటనే వెధవబుర్ర పనిచేయడం ప్రారంభించింది. అందంలో విశ్వకర్మ మలచిన పాలరాతి శిల్పంలా, సోయగంలో సన్నజాజితీగలా ఉంది ఆ అమ్మాయి. నునుపు తేలిన బుగ్గలు, అక్కడక్కడ ఎరుపును సంతరించుకుని కాశ్మీర్ ఏపిల్స్‌ను తలపుకు తెస్తున్నాయి. గుండ్రటి కళ్ళు మిలమిలా మెరుస్తూ రెప్పలు టపటపలాడుతుంటే ఎక్వేరియమ్‌లో చేపపిల్ల కదలికల్లా చూడ్డానికి ఎంతో మనోహరంగా ఉంది.

అంతలోనే ఈ అందాల భరిణతో వచ్చిన ఆ పెద్దమనిషి ఎవరై ఉంటారన్నది నా పాడుబుర్రలో మొట్టమొదట ఉదయించిన ప్రశ్న.

'తండ్రి కావచ్చుగా' టక్కున సమాధానం చెప్పింది నా మనస్సు. 'ఆ! ఈ వెధవ దేశంలో అంతటి సహజత్వం కూడానా? బంగారం లాంటి ఆడపిల్లని కాటికి కాలు చాచుకున్నవాడికి కట్టబెట్టే ఎన్ని సంఘటనలు జర్నలిస్టుగా నేను పత్రికల్లో రాయలేదు. 'మన దారిద్ర్యమే నేటి మన సంస్కృతి అయినట్లనిపిస్తుంది అప్పుడప్పుడు' అని మరో ఆలోచన నా మనస్సును హేళన చేసింది.

ఓరగా పుస్తకం అడ్డుపెట్టుకొని మెడలో పుస్తెల తాడుందేమోనని, కాళ్ళకి మెట్టెలున్నాయేమోనని పరీక్షగా చూశాను.

'అవును. ఏదో సినిమాలో డైలాగులా మూరన్నర పసుపుతాడు, ఓ పసుపు

కొమ్ముతో లైసెన్స్‌బిళ్ళలా ఆడదానికి పెళ్ళయిందని ముద్ర వేస్తారు. మరి మగాడికో?' నేను చేస్తున్న పని నా మనస్సుకు నచ్చలేదేమో నన్ను ఎత్తిపొడిచింది.

'ఛీ, వెధవ మనస్సు! సమాధానంకాని, ప్రశ్నగాని మరెవరన్నా వేసేంత వరకూ్కడా ఆగదు. అయినా విచ్చలవిడితనానికి మగ, ఆడ తేడా ఏమిటి? మెడలో తాళి ఉన్నంత మాత్రాన ఆడది విచ్చలవిడిగా ప్రవర్తించలేదని ఎవర న్నారు? అసలు ఎవడన్నాడోగాని ఆడది అబలని, వాడి నాలిక తెగ్గొయ్యాలి? అబల ఆడది కాదు సుమా మగవాడు. స్త్రీ తలుచుకుంటే సృష్టిలో ఎవరు ఎవరికి పుట్టారో కూడా తెలియకుండా చేసి ఈ సంఘాన్నే గల్లంతు చేయగలదు' అని నా ఆలోచనల్ని సర్దిపుచ్చాలని నా ప్రయత్నం.

మనస్సుకు మద్దతు దొరికితే మరీ స్వైరవిహారం చేస్తుంది. 'ఆడవాళ్ళని అబల... అబల... అంటూ తరతరాలుగా మగవాళ్ళు హిప్నటైజ్ చేసేశారు. అందుకే స్త్రీకి ఈ తాడు, ఇన్ని సమస్యలు!' మనస్సొక కంక్లూషన్ పారేసింది.

ఇంతకీ ఆ అమ్మాయి మెడలో మంగళసూత్రం కోసం చూడకపోతే ఇంత మానసిక సంఘర్షణ ఉండేది కాదు కదా? అయినా సహజంగానే మగబుద్ధికి ఉన్న మొట్టమొదటి బలహీనతే అది. దాన్ని నిరోధించడం అంత సులభంకాదని నాకు తెలుసు. అంతటితో ఈ విషయాన్ని ఆలోచించడం మానేసి ఇంకొంచెం ముందుకు పోసాగాను మనసు మార్గంలో.

ఆ అమ్మాయి, ఆ పెద్దాయన విజయవాడ దాకానేనో? కాదో? ఇంతకీ ఇంత తెల్లవారుజామున బయలుదేరారంటే ఒంగోలులో ఏదన్నా రాచకార్యం వెలగబెట్టడానికి వచ్చి వెళ్తుండాలి? లేదా మరెక్కడన్నా కార్యార్థులై బయలుదేరి ఉండాలి. ఈ సుకన్య పక్కన పెద్దమనిషి లేకపోతే కాసిన్ని కబుర్లు చెప్పేందుకు తోడు ఉండి ఉండేది కదా?

ఇలాంటి ఆలోచనలతో నా మెదడు గిర్రున తిరుగుతుంటే 'వాగుడుకాయకు తన జబ్బే అందరికీ రావాలని కోరుకుంటుంది?' అని నా మనస్సు నన్ను మరో మారు హేళన చేసింది.

'అబ్బబ్బ! ఈ వెధవ మనస్సుకు అనవసరమైనదంటూ లేదు ఈ సృష్టిలో. అన్నింటికన్నా మించి దీని ఇంటరాగేషన్ ఎక్కువ. పోలీసువాళ్ళు నయం. కాసేపు

ప్రాణంతీసి వదిలేస్తారు. ఇది మటుకు చచ్చేంతవరకూ వదలదు' అని మనస్సును నేను తిట్టుకొంటూండగా "ఎక్స్‌క్యూజ్‌మీ, మీ చేతిలోని పుస్తకం ఓసారి ఇస్తారా?" అంటూ ఓ సన్నటి కోయిల కంఠం నన్నొక చిరు విద్యుద్ఘాతంలా వచ్చి తాకింది.

ఒక్కసారి ఒళ్ళంతా పులకరించింది. అటూ ఇటూ చూశాను ఆ స్వరం మరెవరిదన్నానేమోనని. కాదు. ఆ కోకిల కంఠం ఆ సుందరిదే? అనుమానం లేదు రూపానికి తగిన కంఠం. ఎంత మధురంగా ఉంది! నా రొట్టె విరిగి నేతిలో పడ్డట్టయింది. 'ఈ ఛాన్సుతోనే ఆ అమ్మాయిని మాటల్లోకి దించాలి, లేకపోతే కాలక్షేపానికి నాకింక బఠానీలే దిక్కు. అవి కూడా ఇంత పొద్దున్నే దొరుకుతా యన్న నమ్మకం లేదు' అని నాలో నేనే అనుకుంటూ, "విత్ ప్లెజర్! కాని ఈ ఇంగ్లీషు పుస్తకంలో బొమ్మలేవీ ఉండవు. కేవలం చదవడానికి ఉపయోగ పడుతుంది. అందునా మీరే లిటరేచర్ మనిషో అయితే తప్ప ఇది మింగుడు పడటం సాధ్యం కాదు" అంటూ ఆ పుస్తకం ఆమెచేతి కందించాను.

"నేను బి.ఏ. లిటరేచర్ చేశాను. పేరు కృష్ణవేణి. ఈయన మా నాన్న. పేరు ప్రకాశరావుగారు. ఇటీవలే రిటైరు అయ్యారు. ఏ.జి. ఆఫీసులో సెక్షన్ ఆఫీసరుగా పనిచేశారు. మరేమైనా వివరాలు కావాలంటే యు ఆర్ మోస్ట్ వెల్‌కం" అంది కృష్ణవేణి.

మాటతీరును బట్టి మంచి మాటకారిగానే ఉంది. అయినా బి.ఏ. లిటరేచర్ అంటే కొంచెం బుర్ర ఉన్న జాతేనన్నమాట. ఇంకేం, చక్కటి కాలక్షేపం! ఈ మధ్య ఎవర్నీ ఇంటర్వ్యూలు చేయక నాలిక తీటబట్టినట్లు ఫీలవుతున్నాను చాలా కాలం నుంచి.

"మీరు బి.ఏ. లిటరేచర్ మాత్రమేనా? ఇంకా టైపు, షార్ట్‌హాండ్ వగైరా, వగైరా క్వాలిఫికేషన్లు కూడా ఉన్నాయా?"

"రెండూ ఉన్నాయి."

"ఇంతకీ మీ సొంత ఊరు?"

"విజయవాడ దగ్గర తిరువూరు. కాని మా తమ్ముళ్ళు, చెల్లెళ్ళ చదువుల రీత్యా మేం విజయవాడలోనే ఉంటున్నాం."

"మరి ఒంగోలు ఎందుకొచ్చినట్లు? తెలుసుకోదగ్గ విషయమైతేనే చెప్పండి"

అని లోపల ఎంత కుతూహలంగా ఉన్నా బయటికి కాజువల్‌గా అడుగుతున్నట్టు అడిగాను.

"పెళ్ళి సంబంధం చూడడానికి."

"ఎవరికి? మీకేనా? మరెవరికైనానా?" కొంచెం ఆశ్చర్యంగానే అడిగాను ఆమెకు అప్పుడే పెళ్ళేమిటా అన్నట్టు.

"నాకే. ఏదో సంబంధం ఉందని మా బాబాయి రాస్తే ఒంగోలు వచ్చాం!"

"చూశారా?"

"ఎవర్ని?"

"ఇంకెవర్ని? పెళ్ళికొడుకుని."

"చూశాను."

"ఎలా ఉన్నాడు? నచ్చాడా?"

"అచ్చోసిన ఆంబోతులా ఉన్నాడు. బ్యాంకు ఆఫీసరట! ముదురు టెంకె మొహమూ, వాడూనూ. అయినా ఈ ప్రశ్నకు కూడా ఇంకా విలువా, నా అభిప్రాయానికి చెల్లుబడి ఉన్నాయనా మీ ఉద్దేశంలో?"

ఆ ప్రశ్న నేను ఆశించిందే అయినా ఆ అమ్మాయి ప్రశ్న వేసిన తీరు నన్ను నిరుత్తరుణ్ణి చేసింది. అసలు ఆ ప్రశ్న ఈ సంఘాన్నే దులిపే బూజుకర్ర లాంటిది. దీనికి ఎవరైనా సమాధానం చెప్పగలిగితే ఆ సమాధానం ఈ సమాజానికి పట్టిన చీడను నాశనం చేయగల బేగాన్ స్ప్రే లాంటిది అవుతుందంటే సందేహం లేదు. ఇక ఆ అమ్మాయితో మాట్లాడాలంటే కొంత జాగ్రత్త వహించక తప్పదని నా మనస్సు నాకు సలహా పారేసింది. అప్పుడప్పుడు ఇలా సాయం కూడా చేస్తుంటుంది పాపం!

కొంచెం మాట తప్పిస్తూ "మరింత తెల్లవారుజామునే బయలుదేరారెందుకని?" అడిగాను కృష్ణవేణి నాన్నగారివైపు చూస్తూ.

"వాళ్ళమ్మగారికి ఒంట్లో అంత బాగా ఉండడం లేదు. కృష్ణవేణే ఇంటికి పెద్ద. అందువల్ల కాలేజీలకు వెళ్ళే మిగతావారి సంగతి చూడాలి గదా?" అన్నాడు ప్రకాశరావు. కాస్త నూనూగుగా నెరిసిన గడ్డం, నలుపు తెలుపుల మిశ్రమం సంతరించుకొన్న జుట్టు, కొంచెం జారిన చెంపలూ. ప్రకాశరావును

చూస్తుంటే జీవితంలో చాలా అలసిపోయినట్లే కనిపించాడు.

"ఓ అయామ్ సారీ. ఈ పరిస్థితుల్లో కృష్ణవేణి పెళ్ళికి తొందరేమొచ్చింది? మీ సొంత విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాననుకోకండి. ఇంకొంతకాలం చదువో, ఉద్యోగమో చేయనిస్తే బాగుంటుంది కదా? రిటైరయిన మీకు కొంత ఆర్థికంగా అండగా నిలుస్తుంది కదా?" అని ఓ చిన్నసైజు సజెషన్ పారేశాను.

"అది మీరన్నంత తేలిక కాదు సుమా. పై చదువులంటే డబ్బుతో కూడిన పని. పైపెచ్చు నాకింకా చదివించాల్సిన మగపిల్లలున్నారు. ఉద్యోగాలంటే పోస్టల్ ఆర్డర్లు, బ్యాంకు డ్రాఫ్టులు, ఇంటర్వ్యూలు, ప్రయాణాలు వగైరా వగైరా చాలా ఉంటాయి. ఇవన్నీ మగపిల్లల విషయంలో ఎటూ తప్పదు. ఆడపిల్లల క్కూడా ఎక్కణ్ణుంచి తీసుకురాను? పై చదువు చదివినకొద్దీ అంతకు మించిన సంబంధం చూడాలి. అది నా శక్తికి మించిన పని. ఇప్పటికే ఓ పిల్లకు పెళ్ళి చేస్తే కుటుంబం గడిచేదెలా అన్న రోజులొచ్చాయి. ఇంకా పెద్ద సంబంధం సంగతి తల్చుకుంటే ఇల్లూ, వాకిలీ అమ్ముకుపోవడం తప్పదేమోననిపిస్తుంది" అంటూ నిట్టూర్చి కిటికీలోంచి వెనక్కిపోతున్న చెట్లు, స్తంభాలు, పొలాలవైపు నిస్పృహతో చూశాడు ఆయన.

ఇది విని కృష్ణవేణి రియాక్షన్ ఎలా ఉంటుందోనని ఆమెవైపు చూశాను.

"ఇదండీ మా నాన్నగారి వరస! ఆ! అన్నట్లు అడగడం మరిచాను."

"ఏం మరిచారు?"

"అదే, మీరెంతవరకూ వెళ్తున్నారని అడగటం."

"విజయవాడే."

"మీరేం చేస్తుంటారు?"

"తిరుపతిలోని ఓ దినపత్రికలో డెస్క్ దగ్గర సబ్-ఎడిటర్‌గా. అంతకు ముందు రిపోర్టర్‌గా కూడా పనిచేశాను చాలాకాలం. అంతకుమించి నాగురించి చెప్పుకొనేది ఏమీ లేదు. కాని నేను ప్రస్తుతం ఆలోచించేది మీ గురించే" అని సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాను.

పరిచయం లేని వ్యక్తి కన్నెపిల్ల కళ్ళలోకి సూటిగా చూస్తే రెప్ప వాల్చటమో, తల తిప్పుకోవటమో చేస్తుంది. కాని కృష్ణవేణి గడుసురకం లాగుంది. తిరిగి

నా కళ్ళలోకి సూటిగా చూస్తూ– "ఏం ఆలోచిస్తున్నారు?" అని అడిగింది.

వెంటనే నా ఆలోచనల్లోంచి మేలుకొని, "అదే మీకు పెళ్ళి ముఖ్యమా?" అని."

"మా నాన్నగారి దృష్టిలో పెళ్ళే ముఖ్యం."

"మరి మీ దృష్టిలో..."

"పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు రెప్పపాటు కాలంలో ఒకరినొకరు చూసుకొని "ఓకే ఓకే" అనుకొనే సంప్రదాయం మనది. అది సరైనదని భావిస్తే, పెళ్ళే ముఖ్యం కావచ్చు."

"తప్పే మరి. కాని ఈ వ్యవస్థకు ఎదురు తిరిగే శక్తి, స్థైర్యం మీకుందా అని?"

"లేకేం? మా ఫాదర్ సపోర్టు, మీ బోటివారి ఎంకరేజ్‌మెంట్ ఉంటే శక్తి, స్థైర్యానికి ఏ లోటూ లేదు."

"అయితే ఓ పని చేయండి."

"ఏమిటది?"

"ముందు పెళ్ళి విషయం పక్కకు పెట్టి ఉద్యోగప్రయత్నం చేయండి. మీ క్వాలిఫికేషన్స్‌కు ఏ కంపెనీ ఎమ్.డి. అయినా మిమ్మల్ని తన పర్సనల్ సెక్రటరీగా అపాయింట్ చేసుకొంటాడు. ప్రయివేటు కంపెనీ ఉద్యోగులకు డీ.డీ.ల ఖర్చు, పోస్టల్ ఆర్డర్ల ఖర్చు ఉండదు. కేవలం తెల్లకాగితం మీద అప్లికేషన్ రాయడమే."

"ఆ తరువాత..."

"మీకు నచ్చాడనిపించిన ఓ నిరుద్యోగిని, అఫ్‌కోర్సు చదువుకొన్నవాడ్ని, మీ అర్హతలకు తగునన్నవాణ్ణే పెళ్ళి చేసుకోండి. దమ్మిడీ కట్నం ఇవ్వొద్దు."

షాక్ తింది కృష్ణవేణి. ఆమెకు అసలు నేనలా ఎందుకు సలహా ఇచ్చానో కూడా బోధపడలేదు. తను సంపాదిస్తూ నిరుద్యోగిని ఎందుకు పెళ్ళి చేసుకోవాలో అర్థం కానట్లు కనిపించింది ఆమెకు. నేనేదో పరాచికాలు ఆడుతున్నానని కూడా అనుకొని ఉండవచ్చు. ఏమైతేనేం? ముఖం కొంచెం సీరియస్‌గా పెట్టిన మాట మాత్రం వాస్తవం.

"నిరుద్యోగినెందుకు పెళ్ళి చేసుకోవాలి?"

"ఈ ప్రశ్న మీరు వేస్తారని నాకు ముందే తెలుసు. ఈ ఆలోచన నేను నా స్నేహితులక్కూడా ఇదివరలో చాలాసార్లు చెప్పాను. బహుశ వాళ్ళకిది నచ్చలేదేమో, దీన్ని పరమ నికృష్టమైన ఆలోచనగా భావించారు. కాని ఆలోచిస్తే దీని వెనక చాలా లాజిక్ ఉంది. కాకపోతే కాస్త నిశితంగా, ఓపిగ్గా, సూక్ష్మంగా ఆలోచించాలి. అందుకు కాస్త మానసిక ధైర్యం కూడా కావాలి."

"ఏమిటది?"

"మీకు ఉద్యోగం రావటంతో మీ కాళ్ళపై మీరు నిలబడగలుగుతారు. అంటే ఆర్థికంగా స్వతంత్రులవుతారు. ఇది మన దేశ స్త్రీకి ఉండాల్సిన మొదటి అర్హత. అవసరం కూడాను. పైగా మీకు నచ్చిన ఓ నిరుద్యోగికి ఉద్యోగం వచ్చే వరకూ ఆర్థికంగా సాయపడగలుగుతారు. స్త్రీ అయినా నిరుద్యోగిగా మీకెన్ని సమస్యలున్నాయో, అన్ని సమస్యలు యువకులక్కూడా ఉన్నాయి. మీ నాన్నగారు చెప్పినట్లు వాళ్ళూ ప్రతి ఉద్యోగ ప్రయత్నంలోనూ డబ్బుకోసం తల్లిదండ్రులను చేయి చాచక తప్పటం లేదు. అందుకే వాళ్ళకు ఆర్థిక బానిసత్వం ఏర్పడింది. ఆ తరువాత ఉద్యోగాలొచ్చినా వాళ్ళు స్వతంత్రించి కట్నం లేకుండా నచ్చిన అమ్మాయిని ధైర్యంగా పెళ్ళి చేసుకోలేకపోతున్నారు. అందుకే వాళ్ళ తల్లిదండ్రులు వేలకు వేలు కట్నాలు గుంజుతున్నారు. ఉద్యోగం ఉన్న అమ్మాయీ ఉద్యోగస్తుణ్ణే పెళ్ళి చేసుకొని, ఉద్యోగం లేని అమ్మాయీ ఉద్యోగస్తుణ్ణే పెళ్ళి చేసుకోవాలనే పక్షంలో మనదేశంలో వరకట్నసమస్య ఎప్పటికీ సమసిపోదు. మార్పు అనేది రావాలంటే అది మీలోనూ, యువకుల్లోనూ ఒకేసారి రావాలి. దానికెవరో ఒకరు నాంది పల్కాలి."

"తీరా అలా పెళ్ళి చేసుకొన్నాక వాడు దుర్మార్గుడైతే ఉద్యోగ ప్రయత్నం మాని, వ్యసనాలకు అలవాటై నా ప్రాణాలు తీస్తే?" అడిగింది ఆదుర్దాగా.

"ఆ పని ఉద్యోగస్తుడైన భర్త కూడా చేయవచ్చుగా. సమస్యంటూ రూపు దాల్చటం తప్పనిసరైతే ఎలాగైనా జరగవచ్చు. ఇలా పెళ్ళి చేసుకొంటేనే మగవాడు వ్యసనపరుడవుతాడు, సోమరిపోతవుతాడనటానికి ఆధారం ఏమిటి? ఎవరికి ఉండాల్సిన వ్యక్తిత్వం వాళ్ళకుంటుంది. ఏమంటారు?"

"అది నిజమే. మరి నిరుద్యోగి కూడా కట్నం అడిగితే?"

"అలాంటివాణ్ణి పెళ్ళి చేసుకోమని నే సలహా ఇవ్వటం లేదే?"

"స్త్రీ సంపాదన మీద బ్రతుకు నెదుర్కోవటం అవమానంగా భావిస్తే?"

"భేషజానికీ, భేడ్జావులకూ తావు లేనిదే పెళ్ళి. ఆ మాటకొస్తే కట్నం తీసుకోవటం మాత్రం సిగ్గు, లజ్జా లేని పని కాదా?"

కొంచెం మౌనం వహించింది కృష్ణవేణి. తరువాత మా ఇద్దరి సంభాషణ కొడవటిగంటి కథలపై పాశ్చాత్య రచయితలైన సోమర్‌సెట్ మామ్, ఆస్కార్ వెల్డ్, ఓ. హెన్రీల ప్రభావం మీద సాగింది. కొడవటిగంటి కథల్లో మానసిక విశ్లేషణ గురించి ప్రస్తుతం నేను చేస్తున్న పరిశోధనా, నాకు పూర్వం "తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ" పుస్తకం రాసిన కోడూరి శ్రీరామ్మూర్తిగారి రచనలో ముఖ్యాంశాల మీద చర్చ సాగింది. కొడవటిగంటి కథల్లో ఇప్పటి కథల్లో కనిపించే కొసమెరుపులు కనిపించవని, తీయని పదాలతో పాత్రలను లోతుగా విశ్లేషిస్తూ కథ ముందుకు సాగిపోతుందని కృష్ణవేణి తన అభిప్రాయం చెప్పింది.

కదలిపోతున్న స్టేషనులు, ఎక్కి దిగే ప్యాసింజర్లు... దేనికదే నిరాఘాటంగా సాగిపోతున్నది. కాసేపు చర్చించుకొన్నాక నేను కూడా మౌనం దాల్చాను. బహుశా నే చెప్పింది కృష్ణవేణి బుర్రలో పనిచేస్తుండవచ్చు. తను కూడా మౌనంగా కూర్చుంది నా ఇంగ్లీషు పుస్తకం తిరగేస్తూ...

టైము చూసుకొన్నాను. పది నిముషాలు తక్కువ తొమ్మిది కావస్తున్నది. ఇక కొద్దిసేపట్లో రైలు విజయవాడ చేరుతుంది. విజయవాడలో సీతాపతి ఉన్నాడు. వాణ్ణి కలవక చాలా నెలలయ్యాయి. వాణ్ణి స్టేషనుకు రమ్మని ఉత్తరం కూడా రాశాను. వాడీమధ్య రూము కూడా మారాడట. వాడు వస్తాడో, రాడో. రాకపోతే వాడి అడ్రసు తెలిసేదెలా? వెధవకు ఉత్తరం ముక్క రాసే అలవాటు కూడా లేదు. ఇప్పుడు వాడికోసం పడిగాపులు కాయాలి కామోసు స్టేషనులో.

విజయవాడ దగ్గరవుతున్న కొద్దీ గతంలో నే విజయవాడలో స్టింగర్‌గా గడిపిన రోజులు గుర్తుకు రాసాగాయి. ఒక్కొక్కటే నెమరేసుకుంటున్నంతలో రైలు కృష్ణా కెనాల్, కృష్ణా బ్యారేజి దాటి విజయవాడ ఔటర్‌లోకి ప్రవేశించింది.

అందరూ బుట్ట, తట్ట, సంచి, సామాను సర్దుకొని తిన్నగా తలుపులవైపుకు ప్రయాణమయ్యారు. నేను బ్రీఫ్‌కేసు తీసుకొని సీట్లోంచి లేచాను.

"మీ పుస్తకం" అంటూ కృష్ణవేణి లేచింది. కృష్ణవేణి నాన్నగారు కూడా నుంచున్నారు. మా చర్చతో ప్రమేయం లేనట్లు ఏదో ఆలోచనలతో సతమత మవుతూ కనిపించారాయన.

"థాంక్స్ ఫర్ యువర్ గుడ్ కంపెనీ" అని నా వంతు కర్తవ్యం నిర్వర్తించిన సంతృప్తితో అడుగు ముందుకు వేశాను.

ముందుకు పడ్డ అడుగును గాలం వేసి వెనక్కి లాగినట్లుగా "మీ అడ్రసు ఇస్తారా?" అని అడిగింది కృష్ణవేణి.

"ఎందుకండీ?"

"ఎప్పుడైనా మీ అవసరం వస్తే సాయపడగలరు గదా?"

"ఓ... ష్యూర్... అలాగే" అంటూ జేబులోంచి తెల్లకాగితం ముక్క ఒకటి తీసి దానిమీద అడ్రసు రాసిచ్చాను.

ఈసారి 'థాంక్స్' చెప్పటం కృష్ణవేణి వంతయింది. ఎవరికీ ఏమీ కానట్లు అంతా రైల్లోంచి దిగిపోతున్నారు. ఇదే జీవితసత్యం కాబోలు అనుకొంటూ నేనూ సీతాపతి కోసం వెతకటం ప్రారంభించాను.

సీతాపతి నాకన్నా నాలుగైదేళ్ళు చిన్నవాడు. ఇద్దరం ఒకేచోట చదువు కోవటంతో చాలా సన్నిహితులమైనాం. నాకు ఉద్యోగం దొరికింది. వాడికి దొరకలేదు. అదే తేడా.

ప్లాట్‌ఫాం మీద ఎటొస్తాడోనని దిక్కులు చూస్తున్న నా భుజం మీద ఎవరిదో చేయి పడటంతో వెనక్కి తిరిగి చూశాను. ఇంకెవరు? సీతాపతే.

ఇద్దరం ఒకర్ని ఒకరు క్షేమసమాచారాలు విచారించుకొన్న తరువాత, స్టేషను బయటికొచ్చి, వాడి రూమువైపుకు నడక సాగించాం.

* * *

జలపాతాలు లోయల్లోకి బరువుగా జారిపోతున్నట్లు, సెలయేర్లు మెలికలు తిరుగుతూ వంకలు, డొంకలు దాటి ముందుకు ఉరుకుతున్నట్లు జీవితం కాలప్రవాహంలో కొట్టుకుపోతున్నది. పాతవిషయాలు స్మృతిపథం నుంచి

తప్పుకొంటూంటే కొత్త విషయాలు రంగప్రవేశం చేస్తున్నాయి.

ఓ రోజు హఠాత్తుగా ఓ ఉత్తరం వచ్చి నా ఆఫీసు బల్లమీద వాలింది. ఫ్రమ్ అడ్రసు కోసం చూశాను. లేదు. కవరు చింపి చదివాను. ఆ ఉత్తరం నేను ఏనాడో రైల్లో కలిసి మాట్లాడిన కృష్ణవేణి దగ్గర్నించి. ఆశ్చర్యం కలిగింది.

"మీ సలహాను ఒక ఛాలెంజ్‌గా తీసుకొని ఉద్యోగ ప్రయత్నం చేసి సఫలమయ్యాను. విజయవాడ సిమెంట్స్‌లో పర్సనల్ మేనేజర్‌కు పి.ఎ.గా చేరాను. నాకు నచ్చిన ఓ నిరుద్యోగిని నా జీవితభాగస్వామిగా ఎన్నుకొన్నాను. ముందు మా వాళ్ళెవ్వరూ అంగీకరించకపోయినా, గట్టి పట్టుదలతో, వాదనతో వాళ్ళను ఈ పెళ్ళికి ఒప్పించగలిగాను. పెళ్ళి చాలా సింపుల్‌గా అరేంజ్ చేశాను. శుభలేఖలు కూడా వేయలేదు. ఓ రకంగా రిజిస్టరు మేరేజ్‌కన్నా సింపుల్‌గా, పరస్పరం ఆత్మవిశ్వాసంతో చేసుకొంటున్న వివాహం. కాబట్టి మీరు తప్పక రావాలి. మా అడ్రసు ఇక్కడ రాశాను. మీ రాక కోసం వేయికళ్ళతో ఎదురు చూస్తుంటాను – కృష్ణవేణి."

నిజానికి నా సంతోషానికి అవధుల్లేవు. నా సలహానో అమ్మాయి సీరియస్‌గా తీసుకొని, దానికి ఆచరణ రూపం కల్పిస్తుందని నేనేనాడూ అనుకోలేదు. ఏది ఏమైనా పెళ్ళికెళ్ళి రావాల్సిందే. ఇంతకీ పెళ్ళి ఎప్పుడో? ఓసారి మళ్ళీ ఉత్తరం అంతా చదివాను. పెళ్ళికింకా రెండురోజులవ్యవధి ఉంది. పెళ్ళికొడుకు గురించి ఉత్తరంలో వివరాలేమీ లేకపోవడంతో నాలోని ఎగ్జయిట్‌మెంటు మరింత యింది. ఉత్తరం మడిచి జేబులో పెట్టుకొంటూ సెలవు పెట్టడానికి మా ఎడిటర్‌గారి గదివైపు నడిచాను.

* * *

అడ్రసు మరోసారి చెక్ చేసుకొని ఇంట్లోకి అడుగుపెట్టాను. పెళ్ళి ఇల్లు అని తెలీడానికి ఇంటికి కట్టిన పచ్చతోరణాలు తప్ప పెళ్ళి హడావిడి ఎక్కడా కనిపించలేదు. సావిట్లో ఓ పాతిక కుర్చీలదాకా ఉన్నాయి. కొన్ని కుర్చీల్లో పెద్దమనుషులు కూర్చుని ఉన్నారు. కుర్చీలకెదురుగా ఓ బల్ల, బల్లమీద పూల ఎంబ్రాయిడరీ చేసిన గుడ్డ, దానిమీద రెండు గులాబీదండలు కనిపించాయి. బల్లపక్కకి రెండుకుర్చీలు వేసి ఉన్నాయి. ఓసారి సావిడి అంతా తిరిగొచ్చి

కుర్చీలో కూర్చున్నాను. అబ్బాయివైపు వాళ్ళెవరో, అమ్మాయివైపు వాళ్ళెవరో తెలిసే పరిస్థితి కనిపించలేదు. అసలు అబ్బాయి వాళ్ళెవ్వరూ వచ్చినట్లు కనిపించలేదు. నాలో ఎగ్జయిట్‌మెంట్ అధికమవుతున్నది.

క్రమంగా కుర్చీలు నిండుతున్నాయి. అందరూ అప్పుడప్పుడు ఇంటి తలుపు వైపు చూస్తున్నారు. వాళ్ళలోని ఎగ్జయిట్‌మెంట్ కూడా నాకు స్పష్టంగా తెలుస్తున్నది. సరిగ్గా నిర్ణయించిన ముహూర్త సమయానికి రెండు నిముషాలుండనగా పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ కొత్తబట్టలతో బయటికి అడుగు పెట్టారు. వెనుకగా ప్రకాశరావూ, ఆయన భార్య, మిగతావారు నడిచారు.

పెళ్ళికొడుకును చూడగానే నా స్పృహ తప్పినంత పనయింది. కాసేపు చుట్టూ ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. కళ్ళముందు కట్టలు కట్ట డబ్బు గాలిలో ఎగిరిపోతున్నట్లన్పించింది. నేను వల్లించే ఆదర్శాల వెనుక ఉన్న అసలు మనస్సు "హి... హి... హిపోక్రసీ...హిపోక్రసీ" అంటూ నన్ను వెక్కిరిస్తూ గాలిలో విలయతాండవం చేస్తున్నట్లనిపించసాగింది. ఎలాగో మనస్సు నదిమిపెట్టి, శక్తినంతా కూడదీసుకొని ముందుకు కదిలాను.

వధూవరులిద్దరి దగ్గరకెళ్ళి "కంగ్రాచ్యులేషన్స్ కృష్ణవేణీ, కంగ్రాట్స్ తమ్ముడూ. పెళ్ళికొడుకు నా సొంత తమ్ముడే అయినందుకు నేను ఎంతో గర్వ పడుతున్నాను" అని మాత్రం బలవంతంగా అనగలిగాను.

మనస్సు మాత్రం 'హిపోక్రసీ' 'హిపోక్రసీ' అంటూ నన్ను వెక్కిరిస్తూనే ఉంది.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5 ఆగస్టు, 1987

❀

నిర్ణయం

"రండి, కూర్చోండి" అంటూ అప్పుడే లోపలికి వచ్చిన వియ్యంకుడికి కుర్చీ చూపించాడు సత్యనారాయణగారు.

ఏనాడో పక్షవాతం వచ్చి ఎడంకాలు పడిపోవటంతో, వాకింగ్ ఎయిడ్స్ సహాయంతో నాల్గడుగులు ముందుకు వేసి సత్యనారాయణ చూపించిన కుర్చీలో చేరగిలబడ్డాడు దశరథరామయ్య.

"ఎండలో వచ్చినట్లున్నారు. కాసిని మంచినీళ్ళు త్రాగండి" అంటూ కూతురు సుగుణకి విన్పడేలా "సుగుణా, మీ మామగారు వచ్చారు. ఓ గ్లాసెడు చల్లటి మంచినీళ్ళు తేమ్మా" అని కేకవేశాడు సత్యనారాయణ. లోపల ఓ మూల కూర్చున్న సుగుణకు తండ్రి పిలుపులో "మీ మామగారు" అన్న వాక్యం చెవిలో డ్రిల్లింగ్ యంత్రంతో చిల్లి వేసినంత ఘోరంగా విన్పించింది. అందుకు కారణం నాల్గురోజుల క్రితం ఆమె జీవితాన్నే మార్చేసే సంఘటన జరగడమే. ఆమెకిప్పుడు జీవితంపై ఏదో తెలీని కసి. అందులో ముప్పయిరోజుల క్రితం ఏర్పడ్డ బంధాలు, అంతలోనే తెగిపోతున్న బంధాలు, అయోమయం. ఇదంతా ఎవరో తనతో ఆడుకుంటున్నారనే భావం కూడా కావచ్చు. తప్పదు కనుక మానవత్వంరీత్యా పాటించాల్సిన మర్యాద కనుక లేచివెళ్ళి నీళ్ళు తెచ్చి పరదా చాటు నుండి మంచినీళ్ళ గ్లాసు బయటకు కన్పించేలా చెయ్యి పెట్టింది.

అది చూసి, "మంచినీళ్ళు తెచ్చింది. తీసుకోండి" అని సత్యనారాయణగారు అనటంతో దశరథరామయ్య ప్రక్కనే ఉన్న తలుపువైపు తిరిగి మంచినీళ్ళగ్లాసు అందుకొన్నాడు. మంచినీళ్ళు తాగి గ్లాసును ప్రక్కనే ఉన్న బల్లపై పెట్టి వెనక్కి

ఒరిగాడు. సత్యనారాయణ కూడా మౌనంగా ఉండిపోయాడు– అవతల వచ్చిన దశరథరామయ్య నుంచి సంభాషణ మొదట ప్రారంభం కావటం కోస మన్నట్లుగా. ఆయన ఊహించినట్లుగానే దశరథరామయ్య “అమ్మాయి ఎలా ఉంది?” అంటూ సంభాషణ ప్రారంభించాడు.

“ఎలా ఉంటుంది? జరిగినదానికి పెద్దవాళ్ళం మేమే షాక్ నుంచి తేరుకోలేక పోతున్నాం. పసిదాని మానసిక స్థితి గురించి వేరే చెప్పాలా?” ఓరకంగా బదులు ప్రశ్న వేసినట్లే సమాధానం చెప్పాడు సత్యనారాయణగారు.

“అవుననుకోండి యిలా జరుగుతుందని కన్నవాళ్ళం మేమైనా ఊహిం చామా? ‘విధి బలీయం’ అనీ పెద్దవాళ్ళు ఊరికే అనలేదు గదా. ఆ మాటకొస్తే చెట్టంత కొడుక్కు అలాంటి దుర్బుద్ధి పుడ్తుందని ఎవరు కలగన్నాం. నవమాసాలు మోసి కన్నందుకు, యింతవాడ్ని చేసినందుకు వాడి తల్లి ఎంత దుఃఖం అనుభ విస్తుందో మాటల్లో ఎలా చెప్పగలను. ఆ పరమాత్మకే తెల్సు. అయినా మీరూ పిల్లలు కలవాళ్ళే. మీకు తెలీందేముంది?” చివరి మాటలంటున్నప్పుడు దశరథ రామయ్య గొంతు సన్నగా మారిపోయింది.

దశరథరామయ్య హృదయావేదనను అర్థం చేసుకోలేనంత కఠినుడు కాదు సత్యనారాయణ. కాని కొడుకును కన్నవాళ్ళు ఆలోచించిన దానికన్నా రెండురెట్లు ఎక్కువగా ఆలోచించాల్సినవాడు తను. ఈ రోజు సమాజంలో ఆడపిల్ల, ఆడపిల్లను కన్నవాళ్ళ పరిస్థితి అలా ఉంది కాబట్టి.

“నిజమే. ఇంత పెద్దవాళ్ళయి మీరీ దుర్ఘటన చూడాల్సి రావటం, పిల్ల నిచ్చుకొన్న మాకు అమ్మాయినిలా చూడాల్సి రావటం ఎంతో దుర్భరంగా ఉంది. ఏ జన్మలో చేసిన పాపమో ఆ కొడుకును కన్నందుకు మీకు, కూతుర్ని కన్నందుకు మాకు భగవంతుడీ శిక్ష వేశాడు” సత్యనారాయణ కూడా గాద్గదిక కంఠంతోనే దశరథరామయ్యను ఊరడించేందుకు ప్రయత్నించాడు.

వాళ్ళిద్దరి సంభాషణను తలుపు చాటునుంచి వింటూనే ఉంది సుగుణ. ఆమె మనస్సులో అంతకు నాల్గురోజుల క్రితం ప్రేలిన అగ్నిపర్వతం లావానింకా విరజిమ్ముతూనే ఉంది. మొదటిసారి ఆ వార్త విన్నప్పుడు అమాంతం తడిగోడలా విరుచుకు పడిపోయింది. ఆ తర్వాత మాట మాటకి స్పృహతప్పటం, తెలివి

రావటం అందర్ని కలవరపర్చింది. ఆమె చాలా బలహీనంగా ఉందని చెప్పారు పరీక్షించిన డాక్టర్లు.

"మేం విశాఖపట్నం వెళ్ళిపోతున్నాం ఈ సాయంత్రం గోదావరిఎక్స్‌ప్రెస్‌కు. కర్మకాండ అంతా అక్కడే జరిపిస్తాం. ఏడోరోజుకు అక్కడికి అమ్మాయిని తీసుకు రండి. మిగతా అన్ని విషయాలు అక్కడే జరిపిద్దాం" అంటూ లేచాడు దశరథ రామయ్య తను వచ్చిన పని పూర్తయినట్లు.

"చూడండి. ఈ విషయం అమ్మాయితో కూడ ఓసారి చెప్పివెళ్ళండి. ఇలా అంటున్నందుకు మరోలా భవించవద్దు. నా పరిస్థితి కూడా కక్కలేక మ్రింగ లేకన్నట్లుంది" అన్నాడు సత్యనారాయణగారు.

"అమ్మాయి సుగుణా ఓసారి యిటు రామ్మా" పిల్చాడు దశరథరామయ్య.

తలుపు దగ్గరే నిల్చున్న సుగుణకు ఆయనేం చెపుతారో తెల్సినా మర్యాద కోసం "ఇక్కడే ఉన్నాను. చెప్పండి" అని ఊరుకొంది.

"ఏమీ లేదు. అబ్బాయి దశదినకర్మ మా స్వంత ఇంట్లోనే పెట్టాలని సంక ల్పించాం. నువ్వుకూడా పదోరోజుకి అక్కడికి రావాలి, లేకపోతే అబ్బాయి ఆత్మకు శాంతి ఉండదు సుమా!"

"క్షమించండి. ఏ ముఖం పెట్టుకురావాలి నేను ఆ ఊరు. మా ముప్పయి రోజుల సంసారం గురించి నల్గురు నన్ను నాల్గువిధాలుగా అనుకొంటుంటే అవి వింటూ అక్కడ నేను ఎలా ఉండగలను? మీ అబ్బాయి ఆత్మశాంతి కోసం నేను ఇక్కడనే భగవంతుడ్ని ప్రార్థిస్తాను. దయచేసి నన్ను బలవంతం చేయకండి" నిష్కర్షగా ముందు చెప్పాలనుకున్నట్లే చెప్పేసింది సుగుణ.

"అలా అంటే ఎలాగమ్మా, చదువుకొన్న పిల్లవి. ఎవరో ఏదో అంటారని మనం ఆచారాలు, సంప్రదాయాలు, వైదిక సంస్కారాలు వదులుకుంటామా?" నచ్చచెప్పబోయాడు దశరథరామయ్య.

"పెద్దవారు, మీతో వాదించటం నాకిష్టం లేదు. పైగా అనవసరం కూడా. అలాంటి వాటిపట్ల గౌరవం మీ అబ్బాయికే ఉంటే ఇలాంటి నీచమైన అకృత్యానికి పాల్పడి నా నూరేళ్ళ జీవితం ఆదిలోనే అంధకారబంధురం చేసేవాడు కాదు. మీ అబ్బాయికి ఉగ్గుపాలతో నేర్పలేకపోయారా వైదిక సంస్కారం, ఆధ్యాత్మిక

చింతన? మీ అబ్బాయికి నచ్చచెప్పుకోలేని మీరు, ఆయన పోయాక కోడలికి నచ్చచెప్పాలని ప్రయత్నించటం ఏమంత మంచి ప్రయత్నం కాదు. దయచేసి వెళ్ళిరండి" ఖరాఖండిగా చెప్పింది సుగుణ.

దశరథరామయ్య నోట మాట పెగల్లేదు. సత్యనారాయణవైపు నిస్సహాయంగా చూశాడు. ఆయన తల వొంచుకొని నిలబడ్డాడు. చేసేది లేక వెనుదిరుగుతూ "మరి నేవెళ్తాను. మీకు విషయం చెప్పటం నా బాధ్యత. ఆపై మీ ఇష్టం" అంటూ వాకింగ్ స్టిక్స్ సహాయంతో బయటికి అడుగువేశాడు.

* * *

సత్యనారాయణగారి ఏకైక కూతురుగా, నల్గురన్నదమ్ముల మధ్య ఒకే ఒక చెల్లెలిగా మమతానురాగాలను పంచుకుంటూ, ఐశ్వర్యం తెచ్చిన ఆనందంతో ఓలలూగుతూ యుగమో క్షణంగా ఇరవైఏళ్ళ జీవితాన్ని హాయిగా నెట్టేసింది సుగుణ. ఏనాడు తనకంటూ ఓ సమస్య లేకుండా పెంచి పెద్ద చేశాడు సత్యనారాయణగారు. అలా పెరిగిన సుగుణకు గత నెలలో వినయ్ చేతుల మీదుగా మూడుముళ్ళు పడ్డాయి.

వినయ్ తండ్రి దశరథరామయ్య ఒకప్పుడు విశాఖపట్నంలో పేరుమోసిన లాయరు. పక్షవాతం రావడంతో ఆయన కోర్టుకు పోలేని పరిస్థితివల్ల ప్రాక్టీసు అంతా అడుగంటిపోయింది. దశరథరామయ్య పెద్ద అల్లుడు హైదరాబాదులో ప్రముఖ కంపెనీకి సెక్రటరీ. ఎన్నో కంపెనీలపై అజమాయిషీ, పలుకుబడి ఉన్నవాడు. ఆ పల్కుబడితోనే దశరథరామయ్య కొడుకు వినయ్ డిగ్రీ కాగానే హైదరాబాదుకు రప్పించి మంచి కంపెనీలో ఎకౌంట్స్ ఆఫీసరు ట్రెయినీగా వేయించి తర్వాత సంవత్సరానికే ఎకౌంట్స్ ఆఫీసర్ అయ్యేలా చేశాడు అల్లుడు.

వినయ్ ఉద్యోగం చేస్తూ ఒంటరిగా ఉండాల్సిన కర్మ ఏమిటని దశరథరామయ్య అతనికి సంబంధాలు వెతకటం ప్రారంభించాడు. ఎన్నో సంబంధాలు చూశాడు. కొంతమంది అమ్మాయిలు వినయ్‌కు నచ్చకపోతే, మరికొందరు ప్రైవేటు ఉద్యోగం ఎప్పుడుంటుందో, ఎప్పుడు ఊడుతుందోనన్న భయంతో పిల్లనివ్వడానికి ముందుకు రాలేదు. ఇలా కొన్ని సంవత్సరాలు వినయ్ పెళ్ళి ప్రయత్నం ఏ ఒడ్డుకు రాలేదు.

ఈ లోపల వినయ్ తన బావగారు కుదిర్చిన కంపెనీ యాజమాన్యంతో గొడవపడి వేరే కంపెనీలో చేరాడు. ఈ కారణంగా వినయ్‌కు, అతని బావగారికి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. ఇప్పుడు వినయ్ బావగారింటినుంచి మకాం బంజారాహిల్స్‌కు మార్చేశాడు. అయినా అప్పుడప్పుడు బావగారి దగ్గరికి, అది కూడా తన అక్కయ్యని చూడటానికంటూ వెళ్ళేవాడు.

వినయ్ అవస్థలు చూడలేక వాళ్ళక్కయ్య కూడ సంబంధాలు చూసే ప్రయత్నంలోకి అడుగుపెట్టింది. ఫలితంగా ఎవరి ద్వారానో సత్యనారాయణగారి అమ్మాయి సుగుణ గురించి తెల్సింది. ఆమె గురించి విచారించారు. హైదరాబాదులో కోఠీ మహిళా కళాశాలలో డిగ్రీ చదివి, టైపు లోయరు, హైయ్యరు, షార్టుహాండు, తెలుగు, ఇంగ్లీషు కూడా ప్యాసయిందని, ప్రస్తుతం వాళ్ళ బాబాయి దగ్గర ఉంటుందని తెల్సింది. మధ్యవర్తి ద్వారా వినయ్ సుగుణని చూడటం, ఇద్దరూ ఒకరికొకరు నచ్చటం, వెనువెంటనే వాళ్ళ వివాహం జరగటం కూడ అయిపోయింది. దంపతులిద్దరూ బంజారాహిల్స్‌లో కాపురం పెట్టారు.

క్రొత్త కాపురం మృదుమధుర లయలతో ప్రారంభమయింది. ఇంటికొచ్చిన స్నేహితులు, బంధువులు క్రొత్తజంటను చూసి మురిసిపోయారు. కాని వినయ్ మానసికంగా చాలా బలహీనుడని, పిరికివాడని, హఠాత్తుగా ఊహించనిది జరిగితే తట్టుకోలేనివాడని అటు సుగుణగాని, ఇటు అతని మిత్రులుగాని ఎప్పుడూ ఊహించలేదు. ఫలితంగా సంసారం పెట్టి ముప్పయిరోజులు కూడ కాకముందే తను చేరిన క్రొత్తకంపెనీ యాజమాన్యంతో గొడవపడి, ఉద్యోగానికి రాజీనామా చేసివచ్చి, సుగుణను వాళ్ళింటికి పంపి, ఆత్మహత్య చేసికొన్నాడు వినయ్. నూరేళ్ళ వైవాహిక జీవితం ముప్పయిరోజుల్లోనే ముచ్చట తీర్చుకొని నిష్క్రమించింది సుగుణ జీవితంలోంచి. సరిగా ఈ ముప్పయి ల బంధాన్నే ఎలా జీర్ణించుకోవాలో తెలీక సతమతమవుతున్నది సుగుణ.

* * *

రోజులు గడుస్తున్నకొద్దీ ఇంట్లో అందరూ విశాఖపట్నం వెళ్ళే ప్రయత్నంలో సుగుణను ఒప్పించడానికే ప్రయత్నించసాగారు. ఆఖరికి ఎంతో చదువుకున్న అన్నలు, తమ్ముళ్ళు కూడ సుగుణ సంప్రదాయం నిర్దేశించినట్లుగానే చేయాలని

వాదించసాగారు. ఈలోగా విశాఖపట్నం నుంచి సుగుణకు, ఆమె తండ్రికి రెండు ఉత్తరాలు వచ్చాయి విశాఖపట్నం రమ్మని.

సుగుణ తన అన్నదమ్ములతో సంప్రదాయం పుట్టుపూర్వోత్తరాల నుంచి, వాటి వెనుకనున్న స్వార్థపు విలువలు, పురుష సమాజం ఉత్పత్తిచేసిన సూత్రాలు– ఎంతో చర్చించింది. కాని వాళ్ళు ఆమె వాదనలోని వాస్తవాల్ని గ్రహించటానికి 'ససేమిరా' అన్నారు. ఈ గొడవల్లో మౌనం పాటించింది ఆమె తండ్రి మాత్రమే.

తొమ్మిదవరోజు దగ్గర పడ్తున్నది. ఆఖరికి స్త్రీ అయివుండి కూడ తన తల్లి తనని వైధవ్యం అంగీకరించమనటం ఆమె మనస్సును కకావికలం చేసింది. అంతకుముందు రాత్రి సుగుణకు నిద్రపట్టలేదు.

"ముప్పయిరోజుల వైవాహిక జీవితం తనపై ఎన్ని క్రొత్త నియమాలు, నిబంధనలు రుద్దబోతున్నది తల్చుకుంటే తన ఒళ్ళు గగుర్పొడుస్తున్నది. ఈ కాసిన్ని రోజుల అనుబంధం తెగినందుకు తను జీవితాంతం ఎందుకు వైధవ్యం అనుభవించాలో బోధపడటం లేదు? ఆయన తన బాధ్యత విస్మరించి, నిష్కా రణంగా పిరికివాడై ఆత్మహత్య చేసుకుంటే దానికి తనెందుకు బలి కావాలి? ఎవర్ని సంప్రదించి ఆయనీ పనిచేశారు? ఇప్పుడు విశాఖపట్నం వెళ్తే అక్కడ తన 'గాజులు పగలగొడ్తాం' 'బొట్టు చెరిపేస్తాం' అంటారు. అన్నింటికి మించి ముత్తయిదువులంతా చివరిరోజు తన్ను పసుపుకుంకుమతో చూడాలని తండోప తండాలుగా వస్తారు. తనకా రోజుతో సంఘంలో పునిస్త్రీగా విలువ పోయినట్లు. దేనికి? తనేమి పాపం చేసిందని తనకీ శిక్ష? ఈ అవమానం తనెందుకు శిక్ష భరించాలి? ఆయన చేసిన అకృత్యానికి తను ఎందుకు శిక్ష అనుభవించాలి? ఆయన సహజంగా మరణించి ఉన్నా లేక తన మానప్రాణాలకోసం జీవితం త్యాగంచేసి ఉన్నా, ఆయన కోసం తను గాజులు, బొట్టు అన్నీ వదులుకొని జీవితాంతం తెల్లచీరలో ఉండిపోవచ్చు. కాని ఇది అలాంటిది కాదే. ఆయన కష్టమేమిటో చెప్పుకొనేందుకున్న ఏకైక తోడు తాను. తనక్కూడా చెప్పుకోకుండా అలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకొన్నాడంటే, తనని భార్యగా పరిగణించలేదనే గదా అర్థం.

'నాతి చరామి' అని ప్రమాణంచేసి, నా జీవితానికి రక్షణ లేకుండా చేసి

వెళ్ళిపోయిన ఆయనకోసం ఈ విషాద పరిస్థితిని తను జీవితాంతం ఎందుకు ఎదుర్కొనాలి? ఒకసారి బొట్టు, గాజులు అందరిముందూ తీసేసాక అవి ఇక తాను మళ్ళీ పెట్టుకొన్నా ఏమి విలువ, సంతృప్తి తనకుంటాయి. అది తన ఆత్మాభిమానాన్ని ఎలా వెక్కిరిస్తుందో, ఆ వెక్కిరింపును తను సహించగలదా?

తనవాళ్ళని ఎదిరించి తను విశాఖపట్నం రానంటే తనికి ఇంట్లో ఉన్న స్థానమేమిటి? సంప్రదాయానికి, మూఢనమ్మకాలకు విలువనిచ్చే కుటుంబ సభ్యులు తాను అందుకు అంగీకరించనందుకు తనపట్ల చూపే అభిమానం ఎటువంటిది? తనపై వేలు ఖర్చుపెట్టి తండ్రి పెళ్ళి చేసిన నాడే తనకీ కుటుంబంతో బంధం తెగిపోయింది. ఇక తాను ఈ ఇంట్లో ఉన్నా వీళ్ళకి భారంగానే ఉంటుంది. తన కాళ్ళపై తాను నిలబడలేని అశక్తురాలికి ఎవరి అండదండలో అవసరం కాక తప్పదు. కాని తన పరిస్థితి వేరు. తాను విద్యాధికురాలు. తనుకూడ వీళ్ళకు లొంగి, గాజులు పగులగొట్టించుకోవటం, బొట్టు తీసేయించు కోవటం, తెల్లచీరె కట్టుకుని తిరగటంలో అర్థంలేదు.

ఈ ఆలోచనలతోనే రాత్రి పొద్దు పోయేవరకూ గడిపింది సుగుణ.

చివరికి సుగుణ మనస్సును దిటవు చేసుకొంది. ఓ నిర్ణయానికి వచ్చింది. వితంతు వివాహమైతే జరిపించాడు కాని, వీరేశలింగం – స్త్రీని వితంతువును చేసే తీరును సమాధి చేయలేకపోయాడు. ఈ దరిద్రసంప్రదాయం ఇలా ఎంతకాలం కొనసాగుతుందో, తనలాంటివాళ్ళు ఎంతమంది దీన్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఎవ్వరూ ఆలోచించటం లేదు. తన నిర్ణయాన్ని వెంటనే అమలు జరపాలనుకొంది. ఒక్కసారి నిట్టూర్చి లేచి బాత్‌రూమ్‌కెళ్ళి స్నానంచేసి వచ్చింది. అద్దం ముందు కూర్చుని జుట్టు దువ్వుకొంది. చక్కగా బొట్టు పెట్టుకొని మనసారా తనని తాను అద్దంలో చూసుకొంది. ఓసారి క్రిందికి వెళ్ళి అందరూ పడుకొన్నారో లేదో చూసివచ్చింది. తన సర్టిఫికెట్లు, బట్టలు, చిన్న అద్దం, కుంకుమబరిణె, దువ్వెన, పెట్టెలో పెట్టుకొంది. చప్పుడు కాకుండా బయటకొచ్చి, తలుపు దగ్గరకేసింది. అప్పుడే అందమైన ఓ పావురం రెక్కలు టపటపలాడిస్తూ గాలిలోకి ఎగిరింది హాయిగా– ఈ విశాల ప్రపంచంలో తాను ఎక్కడైనా జీవించగలనన్న ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోయింది.

అర్థంలేని సంప్రదాయాలకు స్త్రీ బానిసగా నిల్చిపోగూడదనే తన వాదనను, 'ఆత్మహత్య' చేసుకొన్న ఏ పిరికివాడి భార్య ఈ సంప్రదాయాలకు లొంగనక్కర్లేదు అన్న హృదయం తీర్పును అనుసరించి బయటకొచ్చిన తను, తనవారికి, చనిపోయిన భర్తవైపువాళ్ళకి ఓ బరితెగించినదానిలా, క్రూరురాలుగా, అమానుష మైన స్త్రీగా కనిపించవచ్చు. కాని తనకు మాత్రం తన నిర్ణయం నేరమనిపించటం లేదు. అదే ఆలోచనతో ముందుకు సాగిపోయింది సుగుణ. ఆమె తీసుకున్న నిర్ణయం అక్రమమా, సక్రమమా తేల్చాల్సింది ఈ జడసమాజమే.

–ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 22–28 మే, 1987

❀

ఇవేం చదువులు

ఓ రోజు సాయంత్రం మా అమ్మాయి చదువు విన్నాను.

"ఓవెల్", "ఓవెల్" అని అంటోంది మా అమ్మాయి దేన్నో చూసి.

అదేమిటి ఎల్.కే.జీ. పిల్లలకు ఓవెల్స్, కాన్‌సొనెంట్స్ కూడ చెప్తారా? అని నాకు నేనే ఆశ్చర్యపోయాను నోరు తెరచి. అయినా ఇంగ్లీషు మీడియం కదా, చెప్తుండవచ్చులే. ఇప్పుడు స్టాండర్డ్స్ మారిపోయాయి కదాని నన్ను నేను సర్దిపుచ్చుకొని మా అమ్మాయి చదివేది సంగీతంలా వింటూ తలూపసాగాను.

ఇంతలో ఇంట్లోంచి మా ఆవిడ ఒక్క గదుము గదిమేసరికి ఉలిక్కిపడి "ఏమిటి ఒళ్ళు గగుర్పొడిచేలా, గ్యాస్ సిలిండరు బద్దలయినట్లు ఆ అరుపు" అని అడిగాను నేను కోపంగా.

"పిల్ల, ఔల్‌ను పట్టుకొని 'ఓవెల్', 'ఓవెల్' అని చదువుతుంటే వింటూ బుర్రూపుతారేమిటి? 'ఔల్' అని చెప్పండి దానికి" అని కసిరింది. అప్పుడు తెలిసింది మా పిల్ల యిందాకట్నించి దేన్ని 'ఓవెల్' అని చదువుతున్నదో.

"ఏమిటమ్మాయి, ఓడబ్ల్యుఎల్‌ని 'ఔల్' అని చదవాలి. 'ఓవెల్' అని ఎవరు చెప్పారు? 'ఔల్' అంటే గుడ్లగూబ అని అర్థం" అని చెప్పాను నేను మా అమ్మాయి మాళవికకు.

వెంటనే అది, "ఛీ, పో... నీకు, మమ్మీకి ఏమీ రాదు. నిన్న మమ్మీ చెప్పింది కదాని 'ఓవెల్' కాదు 'ఔల్' అని చెప్పాను మా లక్ష్మీ టీచరుతో. 'అయితే నువ్వొక్కదానివి 'ఔల్' అని చెప్పు. మిగతా అందరూ 'ఓవెల్' అని చెప్తారు' అంది టీచరు. నాకు ఎంత అవమానం క్లాసులో అలా టీచరంటే"

అంది మా అమ్మాయి బుంగమూతి పెట్టి. దాని తీరు చూస్తే నవ్వు ఆగలేదు. "నేను మీ స్కూలుకొచ్చి టీచరుతో మాట్లాడ్తాలే" అని చెప్పి పిల్ల చదువయిందనిపించి మా మిత్రుడు భాస్కర్ ఇంటికి వెళ్ళాను.

నన్ను చూస్తూనే భాస్కర్ "రారా! లోపలికి రా! ఇదిగో పిల్లాడి చదువు అనేదానితో కరాటే చేస్తున్నా. వీడి హోంవర్కు నిండా వీడి టీచర్ రెడ్ ఇంక్ మార్కులే. అయినా ఏమి టీచర్లోగాని వాళ్ళకు సరిగ్గా స్పెల్లింగ్స్ కూడ రావురా. 'ఇన్‌కంప్లీట్ హోంవర్కు' అని రాయాల్సింది పోయి 'ఇన్‌కంపీట్ హోంవర్కు' అని రాసింది. పైగా 'ఆల్ ఆఫ్ యు స్లీపింగ్', 'ఈటింగ్' అని ఇంగ్లీషు మాట్లాడ్తుందిట. ఛస్తున్నా! వీడి ఇంగ్లీషు వినలేక" అని అఘోరించాడు భాస్కర్.

అప్పటిదాకా మా ఇంట్లో జరిగిన హోంవర్కు ప్రహసనం వాడికి చెప్పి ఇద్దరం కడుపారా నవ్వుకున్నాం. పూర్వం ఇంగ్లీషువాడి హోటళ్ళలో భారతీయ బట్లర్లు మాట్లాడే ఇంగ్లీషు మా పిల్లలు నేర్చుకుంటున్నారని తెల్సి పొంగిపోయాం. ఇంగ్లీషుపట్ల మాకున్న వ్యామోహం అనే బలహీనత మమ్మల్ని అలా రాజీపడేట్లు చేసింది. ఏం చేయగలం? కొంతసేపు వాళ్ళింట్లో గడిపి వాడ్ని తీసుకొని శంకర్రావు ఇంటికి వెళ్ళాను.

శంకర్రావు మమ్మల్ని చూస్తూనే "వచ్చారా పెద్దమనుషులు రండి! రండి! మీకోసమే బయల్దేరదామనుకొంటున్నా! మా పిల్లలకు ట్యూషన్ ఓ పెద్దసమస్యగా మారిందర్రా. వాళ్ళకు ప్రైవేటు కావాలి. ఇక్కడ దగ్గర్లో ఎక్కడా ట్యూషన్ చెప్పేందుకు ట్యుటోరియల్ కాలేజీ గాని, ట్యూషన్లు చెప్పేవాళ్ళు గాని లేరు. నాకు క్షణం తీరదు. ఏం చేయాలో తోచటం లేదు" అని వాపోయాడు.

"ఐడియా" అన్నాను నేను. "ఏమిట్రా అది?" అడిగారు భాస్కర్, శంకర్రావులు. "మనమే ఓ ట్యుటోరియల్ కాలేజి పెడ్తే పోదు. పనికి పని, పిల్లలకు చదువుకు చదువు" అన్నాను నేను.

"ఆ పుణ్యమేదో నువ్వే కట్టుకో మహానుభావా!" అన్నాడు భాస్కర్.

అనుకున్నదే తడవుగా రెండురోజులు ఆఫీసుకు శలవు పారేసి, ఇంటింటికీ తిరిగి కాలేజీ పెడ్తే ఎంతమంది పిల్లల్ని పంపుతారో సర్వే చేసి, వెంటనే కాలేజీ ఓ క్వార్టర్‌లో ప్రారంభించాం మేముండే కాలనీలో.

కాలేజీ ప్రారంభమైందే గాని పిల్లలు రారే ఎన్నాళ్ళయినా? మళ్ళోసారి అందరిళ్ళకు వెళ్ళి పిల్లల్ని పంపమని చెప్పి వచ్చాను. ఇద్దరు, ముగ్గురు మటుకు మొహమాటానికన్నట్లు పిల్లల్ని పంపారు. తర్వాత విషయమేమిటని విచారిస్తే వాళ్ళు తమ పిల్లల్ని బాగా పేరున్న ట్యుటోరియల్ కాలేజీలు– ఎమినెంట్ ట్యుటోరియల్స్‌కు, తోష్నివాల్ ట్యుటోరియల్స్‌కు పంపారని తెల్సింది.

మేం చదువు స్థాయి పెంచాలనుకున్నామేగాని వ్యాపారస్థాయినందుకోవాలనుకోలేదు కదా! అందువలన ఆకర్షణీయమైన ప్రచారం చేయలేదు. దీన్నికూడ ఓ మైనస్ పాయింట్‌గా మా కాలనీవాసులు భావించారని తర్వాత తెలిసింది.

ఓ రోజు సిగరెట్ అంటించి కాలేజీ బయట నిల్చుని ఉన్నాను. లోపల భాస్కర్ వచ్చిన నల్గురు ఇంటర్మీడియెట్ కుర్రాళ్ళకు ఫిజిక్స్ చెప్తున్నాడు. దూరంగా పదిమందిదాకా పిల్లలు క్రికెట్ ఆడ్తున్నారు. ఎలా అంటించిపోయాడోగాని బ్రిటిష్‌వాడు, మనకు, మన పిల్లలకు జీవితంలో సగం కాలం ఈ క్రికెట్ గజ్జి రూపంలో గడిచిపోవటం నాకిప్పటికీ అంతుపట్టని వింతగానే తోస్తుంది.

వెంటనే ఓ ఆలోచన వచ్చి ఆ పదిమంది కుర్రాళ్ళని కేకేసి పిల్చాను. వారితో మాట్లాడినదాన్ని బట్టి వాళ్ళకి ఇంగ్లీషు, కెమిస్ట్రీ, ఫిజిక్సులో కనీస పరిజ్ఞానం కూడ లేదని అవగతమైంది నాకు. నే చెప్పిందంతా విని "మేమంతా ట్యూషనుకొస్తాం సార్, ఫీజు ఎంత?" అని అడిగారు కోరస్‌గా.

"ముప్ఫయి నెలకొక్కరికి" అని చెప్పాను నేను.

"ముప్ఫయ్యా సార్" అన్నాడొకతను, వాడి జేబులోంచి అన్యాయంగా ఇస్తున్నట్లు. నిజానికి వాళ్ళ నాన్న కమర్షియల్ టాక్స్ ఇన్‌స్పెక్టరు. వాళ్ళ వాళ్ళ తండ్రుల ఆదాయాన్ని బట్టి తీసుకుంటే ఒక్కొక్కడి దగ్గర్నుంచి వందరూపాయలు గుంజవచ్చు. నగరంలో ఉన్న రేటు అదే అయినా మాది కొత్త కాలేజీ కదాని తక్కువే చెప్పాను నేను. కాని వాళ్ళమొహాలు ముప్ఫయ్యంటే అదోలా ఉండటం గమనించి "సరే పాతికివ్వండి" అన్నాను.

"ఓ" అని తలూపి ఆ రోజునే చేరిపోయారంతా.

చేరినప్పట్నించి వాళ్ళ హడావుడంతా ఎప్పుడెప్పుడు ముఖ్యమైన విషయాలు చెప్పించుకొని ట్యూషను మానేద్దామన్నదేనని గ్రహించటానికి ఎక్కువకాలం

పట్టలేదు నాకు. అందులో సగంమందికి పైగా సగం నెల గడిచినా ఫీజు ఇవ్వాలని తట్టకపోవటం వాళ్ళ ఆర్థికశాస్త్ర పరిణతి తెలియచేస్తోంది. ఏది ఏమైనా పేరున్న ట్యుటోరియల్ కాలేజీల్లా ముందుగా వందలు వందలు వసూలుచేసి పాఠాలు చెప్పేదానికి, మాలా నానా పాట్లుపడి డబ్బు గురించి ఆలోచించకుండా పిల్లలకు ముందు చదువు నేర్పాలన్న మాకు, నక్కకూ, నాగలోకానికి ఉన్న సామ్యం లాంటిదని ఇట్టే గ్రహించగల్గాం త్వరలోనే.

ఎలాగోలాగా వార్షిక పరీక్షలు ముగిసే సమయానికి మరొక్క ప్రయత్నంగా పాలిటెక్నిక్, ఎం.బి.బి.ఎస్., ఇంజనీరింగ్ ఎంట్రన్సులకు కోచింగ్ ఇద్దామని అనుకొన్నాము. దాదాపు పదిహేనుమంది కుర్రాళ్ళు మా దగ్గరకొచ్చి చేరారు, మేం చెప్పింది నచ్చాకనే డబ్బులు ఇచ్చే ఒప్పందం మీద! అలాగా చేయక తప్పలేదు మాకు. ప్చ్!

మంచికో, చెడుకో ముందు ట్యుటోరియల్ కాలేజీ పిల్లలకు అదనపు విద్యాభ్యాసం కోసం ప్రారంభించినా ఇంటి అద్దె, ట్యుటోరియల్ టీచర్ల డబ్బులు ఇవ్వాల్సి వచ్చేటప్పటికి చేతినుంచి పెట్టుకోలేక డబ్బు వసూలుచేసే కార్యక్రమం తప్పనిసరై కూర్చుంది. మా రామకృష్ణ, రమణారావు, సాంబశివరావు, నాగేశ్వర రావుగారి పిల్లల్ని కూడ ఇందులో చేర్చమని కోరాం.

ముందు అలాగేనని సంతోషంగా పంపించారు. కాని సగం కోచింగ్ అయ్యాక ఫీజు అడిగేసరికి కొందరు ఏవో వంకలుపెట్టి రావటం మానేశారు.

మొదలున్న సంఖ్య సగమైనప్పటికి "చచ్చినాడి పెళ్ళికి వచ్చిందే కట్నం" సామెత చందంగా సర్దుకొన్నాం. ఉన్న కొద్దిమందితో కాలేజీ పట్టుదలగా నడిపిస్తూ వచ్చాం. ఓరోజు రామకృష్ణగార్ని కల్సి మాటవరుసకు "మీ పిల్లలు మధ్యలో మానేశారేమిటి?" అని అడిగాను.

"సిటీలో ఎమినెంట్ ట్యుటోరియల్, తోష్నివాల్ ట్యుటోరియల్ కోచింగ్ బాగా ఇస్తున్నాయని, మావాడు అక్కడికి వాళ్ళ స్నేహితులతో పోతానంటే తప్పనిసరై పంపాను" అంటూ నీళ్ళు నమిలాడు.

దాదాపుగా ఇలాంటి సమాధానమే మిగతా వాళ్ళ దగ్గర్నుంచీ వచ్చింది.

చిట్టచివరకు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్ ఫలితాలు వచ్చాయి.

నాకు తెల్సిన స్నేహితుల పిల్లల నెంబర్లు పేపర్లో ఎక్కడా కన్పడలేదు. మా కాలేజీ పిల్లలిద్దరికి మటుకు సీటు వచ్చింది.

“అదేమిటి ఎమినెంట్ ట్యుటోరియల్‌వాడు తమ కాలేజీ నుండి ఆరు ర్యాంకులు వచ్చాయని, తోష్నివాల్‌వాడు పది ర్యాంకులు వచ్చాయని పేపర్లో పిల్లల ఫొటోలతో సహా వేశారు. మరి వీళ్ళ పిల్లలకెందుకు రాలేదు” అని అనుకొని రమణారావు ఇంటికి వెళ్ళాను.

అప్పుడే వాళ్ళింటికి వచ్చిన అతని మేనల్లుడు సతీష్‌కుమార్‌తో మాట్లాడు తున్నాడు రమణారావు.

“ఏరా? నీ ఫొటో ఎమినెంట్ ట్యుటోరియల్ కాలేజీవాడి అడ్వర్‌టైజు మెంటులో చూశానీరోజు – “సతీష్‌కుమార్ బెల్స్ ది కేట్” అని రాశాడు. నీకు నాల్గోర్యాంకు వచ్చిందిట కదా! అక్కడ నువ్వు కోచింగ్ తీసుకొంటున్నట్లు మా వెధవలు చెప్పనే లేదు” అంటున్నాడు రమణారావు.

“భలే అడిగావు బాబాయ్! అదంతా బోగస్! నాకేం ఖర్మ, అక్కడ కోచింగ్ తీసుకోడానికి. ఇంట్లో ఎంచక్కా హాయిగా చదువుకున్నాను. నాకు ర్యాంకు వచ్చాక ఎమినెంట్ ట్యుటోరియల్‌వాడు వచ్చి – ‘నీ ఫొటో ఇస్తావా? అయిదు వందలిస్తాను. మా ట్యుటోరియల్ కాలేజీనుంచి కోచింగ్ తీసుకున్నట్లు అడ్వర్‌టైజ్ చేస్తాను పేపర్లలో’ అని అడిగాడు. ‘సరే’ అన్నాను. నాకేం చేదా? ఐదువందలు ఊరికే వస్తుంటే ఎందుకు కాదనాలి?” అని బదులు ప్రశ్నవేశాడు ఆ అబ్బాయి.

రమణారావుకు నోట మాట రాలేదు.

పేరున్న కాలేజీ చదువుల వ్యాపారంలో ఆ చదువుల తల్లికి జరుగుతున్న మోసం తెల్సి బాధపడాలో లేక నాక్కూడ ఓ మంచి వ్యాపారరహస్యం తెలిసిందని సంతోషించాలో తెలీక అయోమయంలో పడ్డాను.

–స్వాతి సపరివార వారపత్రిక, 22–09–1989

భాగ్యనగరంలో బుల్లిపెట్టె!

నేను నా పరిశోధన నిమిత్తం ఓ పుస్తకం కోసం భాగ్యనగరం వచ్చిన ఓ ఎస్.జీ.బి.టిని. అంటే ఓ సంస్కృత ఉపాధ్యాయుణ్ణి. ఎం.ఏ. డిగ్రీ పుచ్చుకొన్నా మూడంకెలజీతంతో గొర్రెతోక బ్రతుకు ఈడుస్తున్న బడిపంతుల్ని. కాని, కూసింత సాహిత్యాభిలాష గలవాణ్ణి కావటం నా దౌర్భాగ్యం.

ఆ పుస్తకం నా పరిశోధనకు ఎంతో అవసరం కాకపోతే నేను ఈ హైదరాబాదు మహానగరం వచ్చేవాణ్ణే కాదు. అంతకుమించి నా మిత్రుడు మూర్తి నాకు ఆ పుస్తకం దొరకటం ఎంత సులువో అరగంటసేపు అనర్గళంగా ఉపన్యాసం ఇవ్వటంతో, నాలో ఆశ మరింత బలం పుంజుకుంది.

దాంతో వెనుకాముందు చూసుకోకుండా, ఒక్కరోజులో తిరిగొచ్చేలా పథకం వేసికొని హైదరాబాదు నగరంలోకి అడుగుపెట్టేశాను ఓ ఆదివారం ఉదయం ఏడుగంటలకల్లా. భుజానికి చిన్నసంచి తప్ప మరే లగేజీ లేదు కనుక స్టేషను బయటికి హాయిగా నడిచాను అసలైన హైద్రాబాదీలా.

రైల్వేస్టేషను ఎదురుగా ఉన్న నేషనల్ లాడ్జికి వెళ్ళి ముఖం కడుక్కొని కాఫీ త్రాగాను. అది చాలా పెద్ద హోటల్. హోటల్లో ప్రొప్రైటరు బల్లపైన నిగనిగలాడుతున్న ఓ అందమైన టెలిఫోను. చూడగానే తళుక్కున నా బుర్రలో ఓ ఆలోచన మెరిసింది. కాని మరుక్షణమే కొంచెం భయం కూడా వేసింది.

నా గత జీవితం అంతా ఒంగోలులోనే గడిచిపోయింది. అక్కడ టెలిఫోన్లు రాకముందూ, వచ్చాక కూడా పెద్దగా వాటి అవసరం నాకు కలగలేదు. అందువల్ల టెలిఫోనుపైన సంభాషణ దగ్గర్నుంచి నాకు సమస్తం కొత్త విద్య

నేర్చుకోబోతున్నట్లే. అయినా సాహసించి, లేచి ఫోను దగ్గరికి పోయాను.

"టెలిఫోను డైరక్టరీ ఉందా?" అని ప్రొప్రైటరును అడిగాను. అతను నావైపోసారి తేరిపార చూసి, మౌనంగా డెస్కు క్రిందనుంచి టెలిఫోను డైరక్టరీ తీసి ఇచ్చాడు. దానిపైన '1986' చూసి ఓక్షణం విస్తుపోయాను. కాని తీరిగ్గా ఆశ్చర్యపడే అవకాశంలేక అందుకు చింతిస్తూ, డైరక్టరీ పేజీలు తిరగేశాను. నాలుగైదు పేజీలు తిరగేశాక నాకు కావాల్సిన సమాచారం ఉన్న పేజీ, అందులో అవసరమైన నంబరు దొరికాయి. అది మూర్తి చెప్పిన నంబరే.

'థ్యాంక్స్ టు హిమ్' అని అనుకొని వెంటనే '197' డయల్ చేశాను. కొంచెంసేపు కుర్, కుర్, కుర్ శబ్దంచేసి ఎంగేజ్‌లో పడిపోయింది లైను. తిరిగి ప్రయత్నించాను. అదే శబ్దం, అదే తీరుగా ఎంగేజ్‌లో పడుతోంది.

అదేమిటి మూర్తి అలా చెప్పాడు? "మీరు క్యూలో ఉన్నారు. దయచేసి కొంచెంసేపు వేచి ఉండండి అని తెలుగులోనూ, హిందీలోనూ, ఇంగ్లీషులోనూ ఫోనులో వినిపిస్తుందని, కాసేపు ఆగితే టెలిఫోను ఆపరేటర్ లైనులోకి వస్తుందని చెప్పాడే! దాని బదులు ఇలా గందరగోళం అవుతుంది ఏమిటి?' అనుకొని టెలిఫోను డిస్‌కనెక్టు చేశాను.

"క్యా సాబ్? నంబర్ నై మిలా?" అడిగాడు హోటల్ ప్రొప్రైటరు. వాడు ఆపాటికే పసికట్టాడు. నేను ఈ ఊరికి కొత్తవాడినని. వాడితో మాటలు కలపటానికి అంతగా మనస్కరించక, వెళ్ళి మళ్ళీ ఇదివరకు కూర్చున్న చోటనే కూర్చున్నాను. క్షణంలో ప్రత్యక్షమయ్యాడు సర్వరు. అల్లావుద్దీన్ అద్భుతదీపంలో దయ్యం ప్రత్యక్షమైనట్లు. వాడిని చూసి ఏం చెప్పాలో తోచలేదు ఆ నిమిషంలో.

"సార్! కాఫీయా, టీయా?" అడిగాడు సర్వరు.

"నీ ఇష్టమొచ్చింది తీసుకురా" అని చెప్పి తలదించుకున్నాను. అంతకు ముందు తాగిన కాఫీనే ఇంకా గొంతు దిగలేదు. ఇక్కడ కూర్చుంటే ఏదో ఒకటి తప్పనిసరిగా ఆర్డరివ్వాలి కామోసుననుకొన్నాను. అయిదు నిమిషాలవ్వ కుండానే కాఫీ తెచ్చాడు వాడు. దాన్ని కషాయం త్రాగినట్లు త్రాగి మళ్ళీ ఫోను దగ్గరికి నడిచాను. ఈసారి కూడా '197' అలాగే గొడవ చేసింది. దాంతో మరో నంబరు వెతికాను. "టెలిఫోను అసిస్టెన్స్ 199" అని కనిపించింది

అక్కడే. వెంటనే ఎంతో ఆశతో దాన్ని తిప్పాను. నంబరు తిప్పీ తిప్పకముందే ఓ యువతి తీగలాంటి కంఠంతో "హలో! టెలిఫోను అసిస్టెన్స్" అంది.

"అమ్మా! కొంచెం ఓ నంబరు కావాలి! అర్జెంటుగా ఇస్తావా?" అని ప్రాధేయపూర్వకంగా అడిగాను.

"సారీ ట్రై 197" అని లైను టక్కున డిస్‌కనెక్టు చేసింది.

చేసేదిలేక '197'కు మళ్ళీ ఫోను చేశాను. ఇందాకటికన్నా మెరుగ్గా ఇప్పుడేం జరగలేదు. పైగా 'టకటక... దగదగ...' శబ్దం చెవులు చిల్లులు పడేలా మోగింది. టపీమని ఫోను పెట్టేశాను – చెవుడొస్తుందేమోనన్న భయంతో.

"క్యాసాబ్? కుచ్ పరేషానీ?" అని అడిగాడు ఆ హోటలు ప్రొప్రైటరు మళ్ళీ ముఖం అదోలా పెట్టి నావైపు చూస్తూ. అలాంటిదేమీలేదని ఎలా చెప్పాలో నాకు చాతనై చావలేదు. నాకు హిందీ రాదు. ఇంగ్లీషు అంతకన్నా రాదు. కాని అర్థమవుతుంది. మాట్లాడలేను. మౌనంగా తలగిర్రున తిప్పేశాను. అతనిక్కూడా ఏం అర్థం కాలేదు!

'హమ్మయ్య' అనుకొని ఈసారి మళ్ళీ ఫోను అందుకొని '199' తిప్పాను. వెంటనే ఇదివరకటి సన్నాయి కంఠం లైనులోకి వచ్చింది. "తల్లీ! ఆ 197లో ఎవ్వరూ పలకటంలేదు. దయచేసి నాకు నంబరు చెప్పు తల్లీ. నీకు ఋణపడి ఉంటాను. నేనీ ప్రాంతంవాణ్ణి కూడా కాదు" అని గడగడ ప్రార్థన పూర్తిచేశాను.

ఆ మహాతల్లి వెంటనే "197 కాకపోతే 38415 ట్రై చేయండి. నన్ను మాత్రం విసిగించకండి. నేను నంబరు చెప్పనుగాక చెప్పను" అని డిస్‌కనెక్ట్ చేసింది. 'రక్షించావు తల్లీ' అని మనస్సులో ఆవిడకు వందనాలర్పించుకొని, చెప్పిన నంబరు తిప్పాను. వెంటనే ఈసారి మరో మహాతల్లి లైనులోకి వచ్చింది.

"హల్లో!" అన్నాను నేను.

"... ..."

"హల్లో!"

"... ..."

"హల్లో!"

"... ..."

ఆవిడగారు ఫోను చెవిలో పెట్టుకొని మరెవరికో తెగ కబుర్లు చెప్పేస్తున్నది. వాళ్ళందరి 'ఇకఇకలు, పకపకలు' నాకు వినిపిస్తూనే ఉన్నాయి. కాని నా 'హల్లో' మాత్రం ఆవిడ చెవిన సోకేలా అనిపించటం లేదు.

చివరికి విసుగ్గా "హల్లో" అని పెద్దగా అరిచాను.

అప్పటికి ఆ మహాతల్లి "హల్లో!" అని నిదానంగా పలికింది.

"అమ్మా! దయచేసి ఓ నంబరు తిప్పు తల్లీ. ఓ నంబరుకోసం ఇందాక ట్నించి ఛస్తున్నాను" అని అడిగాను.

"197 డయల్ చేయండి" అంది ఆ మహాతల్లి నా గోలేమి తనకు పట్టనట్లు.

"అమ్మా! నా మొర కాస్త ఆలకించు. 197 ట్రై చేస్తే మోగటం లేదో, ఎవ్వరూ ఎత్తటం లేదో నాకు తెలీదు. 199కు ట్రై చేస్తే అక్కడో మహాతల్లి ఈ నంబరు ఇచ్చింది. నువ్వు కూడా నంబరు చెప్పవామ్మా?" అన్నాను నీళ్ళు నములూ.

"అలాగా! సారీ అండీ. మీరు ఫోను పెట్టేసి తిన్నగా మళ్ళీ 197 చేయండి. నేను అక్కడే ఉంటాను. అప్పుడు నంబరు చెప్పను వీలవుతుంది" అని ఫోను పెట్టేసింది టంగుమని.

ఇదంతా గమనిస్తున్న హోటలు ప్రొప్రైటరుకు నన్ను చూస్తుంటే ఏదో భయం కలుగుతున్నట్లుంది. నా గడ్డం, నా మెళ్ళో బ్యాగు, నా ధోవతి, నా లాల్చి, నా అరుపులు, గగ్గోలు– అంతా వాడికేదో ప్రమాదం వాటిల్లే సూచన లున్నట్లు అనుమానం కలిగించసాగాయి. బహుశ నన్నో నక్సలైటు అనుకున్నా, లేక పిచ్చివాడనుకున్నా కూడా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.

ఇంతలో ఓ సర్వరు ఓ ఖాళీ కుర్చీలాగి నా దగ్గర పడేశాడు కూర్చోమన్న ట్లుగా. కానీ కూర్చోబుద్ధి కాలేదు. వాడు నావైపోసారి వింతగా చూసి... "కాఫీగాని, టీగాని తాగుతారా?" అని మళ్ళీ అడిగాడు.

"వద్దు బాబూ, థాంక్స్!" అని చెప్పి– 'హమ్మ హమ్మ! టీ, కాఫీలు ఇలా మంచినీళ్ళు తాగినట్లు తాగితే ఇక నాకు వాంతులే గతి!' అని మనస్సులో అనుకున్నాను. ఆ సర్వరు అక్కడనుంచి కదిలేలా ఓ చూపు చూస్తూ, ఓ క్షణం అగి ఊపిరి పీల్చుకొని మళ్ళీ '197' తిప్పాను.

ఈసారి వెంటనే ఆవిడ లైన్లోకి వచ్చింది.

"అమ్మా! తల్లీ! ఓ నంబరు చెప్పి ఇప్పటికైనా నీ కటాక్ష వీక్షణాలు నాపై సారించు" అని కాళిదాసు దేవీస్తుతి చేసినట్లు చేశాను.

"ఉపన్యాసం వద్దు. ఎవరి నంబరు కావాలో త్వరగా చెప్పు క్విక్" అంది ఆవిడగారు.

"శేషేంద్ర గుంటూరు శర్మగారిది" అన్నాను హడావుడిలో.

"ఎవరిదీ?" అని విసుగ్గా అడిగింది మళ్ళీ.

"ఉండండి. కంగారులో పేరు పొరపాటు పడ్డాను. గుంటూరు శేషేంద్ర శర్మగారిది."

"ఓ క్షణం లైన్లో ఆగండి" అని ఆవిడ మౌనం దాల్చింది.

నంబరు చెప్తుందో, చెప్పదో, అసలు ఆయనకు ఫోనుందో, లేదోనన్న మీమాంసలో ఇక్కడ నాకు క్షణం ఓ యుగంగా గడుస్తోంది.

ఇంతలో "ఆ! రాసుకోండి" అంది ఆవిడ.

గబుక్కున ప్రొప్రైటర్ టేబుల్‌మీదున్న పెన్సిల్‌తో ఆవిడ చెప్పిన నంబరు రాసుకొన్నాను. ఆవిడ ఫోను పెట్టేసింది మరుక్షణం.

నాకు సంతోషంతో ప్రాణం ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. అంతవరకూ పడ్డ కష్టం అంతా దూదిపింజలా గాలిలోకి ఎగిరిపోయింది. 'అసలు మనిషి దొరికాడు. ఇక ఆయనకు ఫోనుచేసి, ఆయన్ని కలిస్తే నా పుస్తకం దొరికినట్లే. అంటే నేనింక మధ్యాహ్నం గోల్కొండకెళ్ళిపోతే, రేపు స్కూలుకు పోవచ్చు. హమ్మయ్య' అనుకున్నాను మనస్సులో. ఇక 'ఆలస్యం అమృతం విషం' అన్న సామెత గుర్తుకురాగా వెంటనే ఆయన ఇంటి నంబరు డయల్ చేశాను.

అవతల ఓ ఆడకంఠం పలికింది "హల్లో!" అని.

"హల్లో శేషేంద్రశర్మగారున్నారా?" అని అడిగాను నేను ఆత్రుతగా.

"మీరెవరు?" అని అడిగింది అవతల్నించి ఆమె.

"హల్లో! క్షమించాలి. ఆ విషయం చెప్పటం మరిచాను. నేనో సంస్కృత పండితుణ్ణి. శేషేంద్రశర్మగారితో పనుంది. ఆయన రాసిన ఓ పుస్తకం నా పరిశోధనకు కావాలి. ఒంగోలు నుంచి వచ్చాను" అని చెప్పాను.

"అలాగా! సారీ! ఆయన ఇప్పుడు లేరు. బయటికి వెళ్ళారు" అంది ఏమీ పట్టనట్టుగా.

"అయ్యో! ఎలాండి? నేను ఆయన్ని అర్జంటుగా కలవాలి. దయచేసి ఆయన ఎక్కడ ఉంటారో చెప్తారా?" అని మళ్ళీ అడిగాను.

"అయితే ఈ నంబరు రాసుకోండి. అక్కడికి ప్రయత్నించండి. ఆపైన మీ అదృష్టం" అని ఆవిడ వేరే ఫోను నంబరు చెప్పి, లైన్ డిస్కనెక్ట్ చేసింది.

ఆవిడ ఫోను పెట్టేసాక, ఆవిడ చెప్పిన నంబరుకు ప్రయత్నించాను.

"హల్లో!" ఓ మగకంఠం పలికింది.

"హల్లో! శేషేంద్రగారా?"

"అవునండి. తమరెవరు?" అడిగారు ఆయన ఎంతో శాంతంగా.

"అయ్యా! నేను తమ విధేయుడిని. ఓ పరిశోధకుడిని. నా పరిశోధనకు మీరు రాసిన ఓ పుస్తకం అత్యంత అవసరమై ఒంగోలునుంచి వచ్చాను. దయ చేసి తమ చిరునామా చెప్తే అక్కడికి స్వయంగా వచ్చి, మీ నుంచి ఆ పుస్తకం తీసుకెళ్తాను. తిరిగి ప్రాణప్రదంగా మీకు ఆ పుస్తకం పంపుతాను" అన్నాను నేను.

"అయ్యా! తమరు కొంత నిదానంగా మాట్లాడితే బాగుంటుంది"

"చిత్తం!"

"తమరికి కావాల్సిన పుస్తకం పేరు చెప్తారా?"

చెప్పాను ఫోనులో.

"అయ్యా! ఆ పుస్తకం ఎప్పుడో ఇరవైయేళ్ళ క్రింత అచ్చయింది. తిరిగి అచ్చువేసిన వారు లేరు. పుస్తకం బజారులోనూ దొరకదు. నా సొంత కాపీని ఇలానే మీలాంటి పరిశోధకుడు ఒకడు తీసుకొనివెళ్ళి మూడేళ్ళయింది. ఇంత వరకూ అది నాకు చేరలేదు. నేను క్షంతవ్యుణ్ణి. ఇలా నేను రాసిన అనేకపుస్తకాలు నా దగ్గర్నే లేనివాణ్ణి. కావలిస్తే నా దగ్గర్నుంచి మీరు అడిగే పుస్తకం తీసుకున్నా యన పేరు చెప్తాను. ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో లెక్చరరు. చిరునామా, ఫోను నంబరు వగైరా తెలీదు" అని, ఆ లెక్చరరు పేరు, హోదా చెప్పి ఫోను పెట్టేశాడు ఆయన.

నా పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకయింది. తీగ కాలుకు తగిలింది కదా అని సంతోషించబోతే, అది నన్ను లాగి కిందపడేసేలా తయారైంది. ఓ క్షణం ఆలోచించాను. టెలిఫోను డైరక్టరీలో ఆ పేరున్నవాళ్ళు ఓ అరడజనుమంది ఉన్నారు. అది చూడగానే గుండె గుభేలుమంది.

ఇంతలో మరో ఐడియా వచ్చింది.

వెంటనే ఉస్మానియా యూనివర్సిటీకి ఫోనుచేసి, ఆయన వివరాలు అడిగితే ఎలా ఉంటుందన్నదే ఆ ఐడియా. ఎందుకంటే ఈ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ప్రొఫెసర్లు వృత్తిమీద భక్తికన్నా పెళ్ళాం పిల్లలపోరు తప్పించుకోవడానికి ఆదివారాలు కూడా డిపార్టుమెంటుకొచ్చి మాటామంతీ జరపటం నేనెరుగుదును. అందుచేత నా అదృష్టం మరోసారి పరీక్షించుకోవాలనిపించింది. చిలకజోస్యం వైపుకన్నా మనస్సు టెలిఫోనువైపే మొగ్గటంతో మళ్ళీ డైరక్టరీ తీసి ఉస్మానియా యూనివర్సిటీ ఫోను నంబరు చూశాను.

డయిల్ చేసిన వెంటనే “ఈ నంబరు ఇప్పుడు లేదు” అని ఫోనులో ఎవరో పలికినట్లు వినిపించింది. ప్రాణం చచ్చినట్లయింది. ప్రొద్దుట్నించి ఇలా కావటం ఎన్నిసార్లో లెక్కమాత్రం పెట్టలేదు.

దాంతో ఉస్మానియా యూనివర్సిటీ నంబరు మారినట్లు, మళ్ళీ ‘197’ నంబరే గతన్నట్లు నిర్ధారణయింది.

భయపడ్తూనే 197 చేశాను మళ్ళీ. ఈసారి వెంటనే, ఓ మహావనిత లైనులోకి వచ్చింది “హల్లో!” అంటూ.

“అమ్మా! ఉస్మానియా యూనివర్సిటీ నంబరు కావాలి చెప్తారా?” అని అడిగాను. టపీమని నంబరు చెప్పి ఫోను పెట్టేసింది ఆవిడ. ఆవిడ చెప్పిన నంబరు డయల్ చేశాను.

“హల్లో! ఉస్మానియా యూనివర్సిటీ” అంటూ ఆపరేటర్ ఫోను ఎత్తాడు.

“అయ్యా! ఫలానా లెక్చరరుగారు అక్కడ పనిచేస్తున్నారు. ఆయనకు ఫోనుందా? ఉంటే నంబరు ఎంత? లేక ఇంటి అడ్రసు మీకైమైనా తెలుసునా? ఎక్కడా? నేను ఆయన్ని అర్జంటుగా కలవాలి. దయచేసి సాయపడగలరా?” అని అర్థిస్తూ అడిగాను.

"అయ్యా! మీరడిగిన వ్యక్తి అసలు ఇక్కడ పనిచేస్తున్న సంగతి కూడా నాకు తెలీదు. పొద్దున్నే నన్ను విసిగించకండి" అంటూ ఫోను పెట్టేశాడు ఆ ఆపరేటరు.

అప్పుడు చివరి ప్రయత్నంగా ఓ పత్రికాఫీసులో సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్న నా మిత్రుడు మూర్తికి ఫోను చేద్దామని వాడిచ్చిన నంబరుకోసం జేబు లోంచి డైరీ తీసి చూశాను. అదృష్టవశాత్తు వెంటనే వాడి నంబరు దొరికింది.

వెంటనే ఆ నంబరుకు డయిల్ చేశాను. "ఈ నంబరు ఇప్పుడు లేదు" అని మళ్ళీ ఫోనులో ఇందాక వినిపించిన మాటే వినిపించింది. ఫోను పెట్టేసి "సార్! ఇదే సంవత్సరం?" అని అడిగాను హోటలు ప్రొప్రైటర్ని.

వాడికి అసలే ఇందాకట్నించి నాపై రకరకాల అనుమానాలు, భయాలు. ఈ ప్రశ్నతో వాడికి తన అనుమానం ఖాయం అయినట్లు అదోలా ముఖంపెట్టి "1989" అని సమాధానం చెప్పాడు.

"అయితే 1986 తరువాత కొత్త టెలిఫోను డైరక్టరీ రాలేదా?" అని అడిగాను.

"రాలేదు" అని చెప్పాడు. ఇప్పుడర్థమైంది వాడికి నేనా ప్రశ్న ఎందుకు వేశానో. మొదటిసారిగా ఓ చిరునవ్వు అలా వాడి పెదాలమీద కదిలి మాయ మైంది. ఇక తిరిగి 197 చేయలేక, మూడేళ్ళలో మారిపోయిన టెలిఫోను నంబర్లు గాలంవేసి పట్టుకోలేక, ఆ పుస్తకంపైన ఆశలు వదులుకొని మధ్యాహ్నం రెండింటికి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో పోవడానికి నిశ్చయించుకున్నాను.

"బిల్లు ఎంతయింది?" అని ప్రొప్రైటర్ని అడిగాను.

"ముప్ఫయి రూపాయలు" అని చెప్పాడు. నేను చేసిన అన్ని నంబర్లు వాడు ఓ కాగితంమీద రాసుకొన్నట్లుగా ఆ కాగితం కూడా చూపాడు. అందులో కొన్నింటికి డబుల్‌చార్జీలు, కొన్నింటికి సింగిల్‌చార్జీలు వేశాడు. ఒక్కో ఫోను కాల్‌కు రెండున్నర రూపాయలు వసూలు చేస్తున్నాడుట.

చచ్చినట్లు డబ్బులు కట్టి రోడ్డుపైన పడ్డాను.

ఆ రోజు ఆదివారం కనుకనేమో ఫుట్‌పాత్‌లపైన రకరకాల పాత, కొత్త పుస్తకాలు విశాలంగా పరిచి అమ్ముతున్నారు. ఏవి ఎంత ధరో కూడా ఆ

పుస్తకాల ముందు కార్డులపైన రాసున్నాయి.

సరే, ఇక్కడింకేవైనా పుస్తకాలు దొరుకుతాయేమో అన్న ఆలోచనతో ఆ పుస్తకాలవైపు చూస్తూ ముందుకు పోసాగాను. ఓచోట నా కళ్ళు ఓ పుస్తకంపైన నిలిచిపోయాయి. దాన్ని చూడగానే నా ఆనందానికి అవధుల్లేవు. అది అక్షరాలా నాకు కావాల్సిన పుస్తకమే. వంగి దాన్ని అందుకున్నాను. చాలా పాతవాసన కొడుతున్నది.

"దీని ఖరీదు ఎంత?" అని అడిగాను నేను.

"మూడు రూపాయలు" చెప్పాడు దాని విక్రేత.

వీపుమీద కొరడాతో చరచినట్లయింది. ఆ వెంటనే ఠక్కున ఓ విషయం నా స్ఫురణకు వచ్చింది. ఓ క్షణం ఆలోచించాను. నెలక్రితం మూర్తి ఒంగోలుకు వచ్చినప్పుడు ఆ మాటలు ఎందుకన్నాడో నాకు ఇప్పుడు అవగతమవుతున్నది.

"మీకేంరా! హైదరాబాదులో ఉన్నా కదాని 'అది విచారించు, ఈ పుస్తకం కొని పంపు. అది తీసుకురా!' అని తేలిగ్గా చెప్పేస్తారు. అక్కడ ఈ పనులు చేయడానికి మాకు ఎంత శ్రమ, చేతినుంచి ఎంత చిలుము వదులుతుంతో మీకెవ్వరికీ తట్టదు. ప్రతి ఒక్కడూ పని చెప్పేవాడేగాని 'ఇంద, ఇది ఉంచు' అని చేతికి నాలుగు రూపాయలు కూడా ఇవ్వడు. మరి అలాంటప్పుడు మా కష్టం ఎవరితో చెప్పుకోవాలి?" అని మూర్తి ఓసారి అద్దంకి శ్రీనివాస్‌తో అన్న మాటలు నా చెవుల్లో ఇంకా రింగు రింగున టెలిఫోన్ బెల్‌లా మోగుతూనే ఉన్నాయి.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27–12–1989

❁

బస్సు నాకు సాక్షిగా...

ఆ రాత్రి తొమ్మిదిన్నరకు ఒంగోలు–హైద్రాబాదు సెమీలగ్జరీ బస్సులో హైద్రాబాదుకు బయల్దేరాను. నా సీటు నెంబరు ముప్పయి, సెమీలగ్జరీ బస్సులోని సీట్ల క్రమంలో వెనుక టైరుపైకి సరిగ్గా వచ్చింది. అయినా కిటికీ ప్రక్క సీటు అవటం కొంత ఊరట కల్గించింది. పైగా అనుకోనివిధంగా అది పౌర్ణమి రాత్రి అవటం నాలోని రసహృదయానికి కొంత కొత్త ఊపునిచ్చింది.

నా సీటులో చతికిలబడి, కిటికీ అద్దం ప్రక్కకు నెట్టి తల దానికాన్చి బయట వీస్తున్న చల్లగాలి స్పర్శని ఆనందించసాగాను. తొమ్మిదిన్నరయినా బస్సు స్టార్టవలేదు. కాలంతో నిమిత్తం లేనట్లుగా కండక్టరు ప్రయాణీకుల టికెట్లు తనిఖీ చేస్తున్నాడు. మధ్య మధ్య ఎవరో ఎక్కి ఆయన్ని తమ శక్తివంచన లేకుండా విసిగించి దిగిపోతున్నారు. నిర్ణయించిన ప్రయాణ సమయం దాటి పోతుంటే విసుగనిపించి ఉండబట్టలేక "ఏమిటండి ఆలస్యానికి కారణం?" అని అడిగాను కండక్టర్ని.

"ఆర్టీసి చైర్మన్‌గారి బంధువులు నల్గురు, డిపో మేనేజరుగారి బంధువు లిద్దరు రావాల్సి ఉంది. వాళ్ళకోసమే ఈ నిరీక్షణ" తాపీగా చుట్టూ కలియజూస్తు చిరునవ్వు నవ్వాడు కండక్టరు.

కండక్టరు సమాధానానికి నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. 'ఆర్టీసి మీకోసం, మనకోసం, అందరికోసం' అన్న రేడియో ప్రకటన అర్థం ఇదేనా? అన్పించింది నాకు. "ఇదే నాబోటివాడెవడైనా రావటం ఆలస్యమైతే బస్సును ఇలానే ఆపుతారా?" అని ఎదురుప్రశ్న వేశాను.

"భలేవారండి. మీరే అంటున్నారు 'మీబోటివారని'. మరి వాళ్ళకోసం బస్సు ఎందుకాగుతుందండి? ఇది చైర్మన్‌గారి సొంత ఊరు. పైగా మీకూ, చైర్మన్‌గారి బంధువులకూ తేడా లేదూ?" అన్నాడు నావైపు ఎగాదిగా చూస్తూ.

ఇంతలో సదరు చైర్మన్‌గారి బంధువులు రావటం, డ్రైవరు బస్సెక్కటం ఒకేసారి జరిగాయి. ఆ తర్వాత కొద్దిసేపు వీడ్కోలు ముచ్చట అవటం కోసం డ్రైవరు ఆగటం జరిగింది. చిట్టచివరకు నలభై నిముషాలాలస్యంగా బస్సు బయల్దేరింది.

కండక్టరు టిక్కెట్లు తనిఖీ చేస్తూనే ఉన్నాడు. రిజర్వుడు బస్సులో నిల్చునే ప్రయాణీకుల్ని అనుమతించరన్న రూలున్నా, కండక్టరు దయాదాక్షిణ్యాలపై జనం ఎక్కవచ్చునన్న సంగతి జగద్విదితం. బస్సు బయల్దేరగానే ఓ పదిమంది చెంగున బస్సులోకి దూకేయటం, తలుపు 'టక్' అంటూ పడిపోవటం జరిగింది. వాళ్ళెవ్వరికీ రిజర్వేషన్ లేదన్నది వాళ్ళ ముఖాలు, నిల్చున్న తీరునుబట్టే తెలుస్తున్నది. ఇంతలో ఒకరు కండక్టరుకు ఇషారా చేయడం, కండక్టరు వాళ్ళకేసి చూసి చిరునవ్వుతో "అవి అద్దంకి కోటా సీట్లు, బస్సు అద్దంకి చేరేవరకూ మీరు వాటిల్లో కూర్చోవచ్చు'" అని చెప్పాడు మర్యాదగా.

సంతోషంగా అందరూ తలా ఓ సీట్లో చతికిలబడ్డారు. అంటే నా ముందు కుడి, ఎడమగా ఉన్న ఖాళీ సీట్లన్నీ అద్దంకి కోటా సీట్లన్నమాట.

బస్సు బయల్దేరగానే దీపాలు ఆర్పలేదు. అయినా కొంతమంది నిద్రలోకి జారుకున్నారు. నాకు మటుకు బస్సు ప్రయాణంలో అంత త్వరగా నిద్రపట్టదు. కండక్టరు మిగతా వాళ్ళ టిక్కెట్లు నత్తనడక వేగంతో తనిఖీ చేస్తున్నాడు. ఆయనలా చేస్తుండగానే బస్సు అద్దంకి చేరింది. కండక్టరు దిగి వెళ్ళి రిజర్వేషను ఛార్టు తీసుకొచ్చాడు. సుమారు పదిమంది అచ్చమైన పల్లెటూరి జనం బస్సెక్కారు. వాళ్ళు హడావుడిగా తమ సామాను సర్దుకుంటున్నారు. వారిలో ముగ్గురు ఆడవాళ్ళు చంకలో చంటిబిడ్డలతో నిల్చొని ఉన్నారు. ఏదో శుభకార్యానికి హైద్రాబాదు ప్రయాణం చేస్తున్నవారిలా వారి ముఖారవిందాల్ని బట్టి గ్రహించగల్గాను. ఏనాడు ఎర్రబస్సు తప్ప సెమీలగ్జరీ బస్సు ఎక్కినట్లు అన్పించలేదు వాళ్ళు. వాళ్ళని బస్సెక్కించడానికి వచ్చిన మనిషి ఒకడు బయట్నించి "ఓరే

సింగన్నో! బస్సులో యిరవైఒకట్నుంచి యిరవైతొమ్మిదిదాకా పదిసీట్లు మనయే. కండక్టరు దొరకు టిక్కెట్లు చూపితే ఆయనే కూకోబెడ్తాడు మిమ్మల్ని" అంటూ బిగ్గరగా అరిచాడు.

అప్పటికే ఆలస్యం అయిందన్న భావనతో డ్రైవరు, కండక్టరు బస్సు ఎక్కగానే స్టార్టు చేశాడు బస్సును.

సింగన్నకు బయటనుంచి అరిచిన వ్యక్తి అరుపు సరిగ్గా విన్పించనేలేదు. బస్సు గందరగోళంగా తయారైంది. ఆడవాళ్ళ చంకల్లో చంటిపిల్లలు ఏడుపు లంకించుకున్నారు.

ఈ ప్రహసనం అంతా వేడుకగా చూస్తున్నారేగాని, వాళ్ళ సీట్లల్లో కూర్చున్న ఖరీదైన పెద్దమనుషులెవరూ అంగుళం కదల్లేదు సీట్లలోంచి.

"లేండయ్యా, ఈ సీట్లు మాయి" అని ఎవర్నీ ప్రత్యేకించి సంబోధించ నట్లుగా అర్చాడు సింగన్న.

ఎవరూ కదల్లేదు. లేవలేదు. తమని కానట్లుగానే కూర్చున్నారు.

ఓసారి ఆ పల్లెటూరి జనాన్ని పూర్తిగా పరికించాను. చింపి తలలు, చినిగిన బట్టలు, అర్ధనగ్నంగా అనాచ్ఛాదితంగా ఉన్న వాళ్ళ ఆడవాళ్ళ పైఎద, బాగా నలిగిన గుడ్డలతో ఉన్న పిల్లలు, ఎంతో ఆర్థికంగా దిగజారిన వాళ్ళలా ఉన్న వాళ్ళ ముఖంలోని అమాయకత్వం, బలహీనత నన్ను విచలితుడ్ని చేశాయి.

ఏదో తెలీని వింత భావం నన్ను ఆవహించింది. బహుశ అప్పుడు కాక పోతే అంత తీరిగ్గా నేనెప్పుడూ ఆలోచించేవాడ్ని కాదేమో వాళ్ళ గురించి. పగలనకా, రాత్రనకా కష్టించి పనిచేసే ఆ అమాయకజనం తాము చెమటోడ్చి సంపాదించిన డబ్బుతో సీట్లు రిజర్వు చేయించుకొంటే మధ్య ఎవరో వాళ్ళ హక్కును బలవంతంగా కాలరాచి హేళన చేస్తున్నట్లు అన్పించింది నాకు. ఎలాగైనా వాళ్ళ సీట్లు వాళ్ళకు ఇప్పించి తీరాలి అని నిశ్చయించుకొన్నాను ఆ క్షణంలో.

వెంటనే సింగన్నకు సైగచేసి దగ్గరకు పిల్చి చెవిలో మెల్లగా చెప్పాను, "కండక్టరు దగ్గరకెళ్ళి మీ సీట్లు మీకు చూపించమని గట్టిగా అడుగు" అని. పద్ధతి ప్రకారం పోవాలని నా ఉద్దేశ్యం.

అలాగేనంటూ తలూపి కండక్టరు దగ్గరికెళ్ళాడు సింగన్న. కండక్టరు తల వంచుకొని తన సీట్లో కూర్చుని ఎస్.ఆర్. రాసుకొంటున్నాడు.

"ఓ కండక్టరూ ఇగో మా టిక్కెట్లు. మా సీట్లు మాకు చూపించు" అడిగాడు సింగన్న.

కండక్టరు సింగన్నవైపు ఓసారి తేరిపార చూసి, టిక్కెట్లు తన చేతిలోకి తీసుకొని శల్యపరీక్ష చేసి, "లేండయ్యా వాళ్ళ సీట్లు ఇరవై ఒకట్నించి ఇరవై తొమ్మిదివరకు" అని గట్టిగా అరిచి తన పనిలోకి మళ్ళీ జారుకున్నాడు. కండక్టరు వైఖరి నాకు చాలా ఆశ్చర్యమేసింది. అద్దంకిలో రిజర్వేషను ఛార్టు చూసినప్పుడే ఆ సీట్లు ఎవరివో, ఎవరికి కేటాయించినవో తెల్సును. అయినా వాళ్ళ సీట్లలో ఒంగోలు నుంచి వేరేవాళ్ళను కూర్చోబెట్టినతను, వాళ్ళను లేపాల్సిన బాధ్యత ఉన్నతను, అలా పట్టీపట్టనట్లుగా అర్చి ఊరుకోవటంలో అర్థమేమిటి? అందరికీ తెల్సిన అర్థమే అది. కొంతమంది అలాంటి కండక్టర్లు ఉండటంవలన ఆర్టీసీ పేరు అలా మారింది.

ఎవ్వరూ కదల్లేదు. బస్సులో కలయజూసి సింగన్న మళ్ళీ అడిగాడు కండక్టర్ను తమ సీట్లు చూపించమని.

"ఏమిటయ్యా? ఏమిటి నీ గోల? మీ సీట్ల దగ్గరికెళ్ళి వాళ్ళని లెమ్మను. లేస్తారులే" కండక్టరు కసిరిగొట్టాడు సింగన్నని.

సింగన్న బిక్కమొహం వేసుకుని మళ్ళీ వెనక్కి వచ్చాడు.

ఇంతలో నా ముందు కూర్చున్న పెద్దమనిషి తన పక్కతనితో– "ఛీ! ఛీ! ఈ అలగాజనంతో బస్సు కళే పోయింది. ఎక్కడ్నించి వస్తారో వీళ్ళు" అంటూ చీదరించుకోవటం విన్పించింది నాకు.

"కూర్చున్నవాళ్ళని లెమ్మని అడుగు సింగన్నా లేస్తారేమో చూద్దాం" అన్నాను నేను.

సింగన్న ఆ కూర్చున్న పెద్దమనుషుల దగ్గరికెళ్ళి బ్రతిమాలుతున్నట్లు అడిగాడు. ఇద్దరు నసుగుతూ లేచారు. ఆ సీట్లలో వాళ్ళ ఆడవాళ్ళు కూర్చున్నారు పిల్లలతో. మిగతావాళ్ళు తమని కాదన్నట్లుగా అలాగే కూర్చున్నారు. నాకు కోపం, బాధ రెండూ కల్గాయి ఒకేసారి. ఈ పల్లెటూరి వెన్నెముకలాంటి

అమాయక జనం అంటే ఈ డాబుసరోళ్ళకు ఎంతటి నిర్లక్ష్యం. వాళ్ళకి తమతో అన్ని విషయాల్లోనూ సరైన హక్కుందని వీళ్ళు ఎందుకు మర్చిపోతున్నారు? ఇక నేను ఉపేక్షించలేదు.

"లేండి సార్ లేండి. వాళ్ళ సీట్లు వాళ్ళకివ్వండి" అని అర్చాను నేను నా ముందుసీట్లో కూర్చున్న పెద్దమనిషితో.

దుక్కలా ఉన్న ఆ పెద్దమనిషి నావైపు, మిగతావారివైపు చూపులు మార్చి మార్చి చూస్తున్నాడు. ఖద్దరు లాల్చీ, లాల్చీకి బంగారు గుండీలు, తెల్లగా రిన్‌సబ్బుతో ఉతికినట్లు మిరుమిట్టుగొల్పే ధోవతి ధరించి ధగద్ధాయమానంగా మెరిసిపోతున్నాడా పెద్దమనిషి.

"ఏమిటండీ? లెమ్మంటే ఆ బిత్తర చూపులేమిటి? మిమ్మల్నే" అన్నాను ఈసారి.

ఇక తప్పదన్నట్లు మౌనంగా లేచాడాయన. నేను జోక్యం చేసుకొని ఆయన్ను లేపటం బస్సులో కొంతమంది ప్రయాణీకులకు కూడ నచ్చినట్లు లేదు. బహుశ ఆయన ఓ చిన్నపాటి లీడరు కావచ్చు. ఆయనతోపాటు వచ్చిన పదిమంది ఆయన వందిమాగధులు కావచ్చు. వాళ్ళభిప్రాయంలో ఇది ఓ చిన్న ప్రజా తిరుగుబాటు కూడ కావచ్చు– వారి పదవిపై, పెద్దరికంపై, అహంకారంపై.

"ఏమిటయ్యా నీ దబాయింపు, వాళ్ళ సీట్లలో వాళ్ళు కూర్చుంటే నీకేమి తీపరంట? వాళ్ళని లేపేందుకు నువ్వెవరివి? అంతగా వాళ్ళపై నీకు జాలి ఉంటే నీ సీటు ఖాళీ చేసి ఇవ్వరాదు. అయినా వీళ్ళు మాత్రం మనుషుల్లా కన్పడటం లేదా? పైగా కండక్టరంటూ ఒకడున్నాడుగా? ఆయనే లేపుతాడు అవసరమైతే. కాకపోతే వాళ్ళే కాస్సేపు చూసి సర్దుకుంటారు ఎక్కడోక్కడ. మధ్యలో నీ పెత్తనమేమిటి? బోడిపెత్తనం" అంటూ నాపై చాలామంది విరుచుకుపడ్డారు ఒక్కసారిగా.

అంతమందితో ఏకకాలంలో వాదించటం కష్టం. పైగా బస్సు రాకెట్టులా ఎగుడు, దిగుడుపై దూసుకుపోతుండం వలన తూలుతూ మాట్లాడ్డం ఇంకా కష్టమనిపించింది.

ఈ ప్రజలకు ఖద్దరుగుడ్డలు, ఇస్త్రీబట్టలంటే ఎంత సానుభూతి! ఈ పల్లె ప్రజలంటే ఎంతటి హీనభావం. అప్పియరెన్స్ విలువ అలాంటిది. వీళ్ళననుకొని ఏమి ప్రయోజనం? ప్చ్! అనుకొని నేను మళ్ళీ ఏదో బుల్లెట్‌లాంటి సమాధానం ఇవ్వబోయేంతలో కండక్టరు లేచి వచ్చాడు.

వెంటనే ఆ పెద్దమనిషి కండక్టరుకు విష్ చేసాడు. ఆ 'విష్'లో ఏ అర్థ ముందోగాని కండక్టరు పల్లెటూరి జనంవైపు చూస్తూ "ఎక్కడోచోట సర్దుకోం డయ్యా, ఆడవాళ్ళకు సీట్లు దొరికాయికదా! ఇలా గుడ్డపర్చుకొని క్రింద కూర్చోండి. మనమంతా ఒక్కటే. ఎవరు సీట్లో కూర్చుంటే ఏముంది? ఆమాత్రం సర్దుకోకపోతే ఎలా?" అంటూ చిన్నమోస్తరు రాజీ ఉపన్యాసం ఇచ్చాడు.

కొంతమంది కండక్టరు తీర్పుకు అతన్ని ఎంతో అభినందించారు. మరి కొంతమంది ఏమీ పట్టనట్లు కళ్ళు మూసుకున్నారు.

"కూర్చోండయ్యా కూర్చోండి" అంటూ ఆ పెద్దమనిషి తాలూకు జనం పల్లెటూరి జనంపై కేకలు వేశారు.

అసలు సమస్యేమీ లేదన్నట్లు ఎంతో తెలివిగా మాట్లాడి విషయం కప్పి పుచ్చాలన్న కండక్టరు ప్రయత్నాన్ని, తెలివిని అంత ఉద్రేకంలో కూడా అభినం దించకుండా ఉండలేకపోయాను. పాపం! బ్రతకనేర్చిన వాడులాగుంది.

"ఏమిటి కండక్టర్? మీరనేది ఏమిటి? వాళ్ళెందుకు క్రింద కూర్చోవాలి? సీట్లు లేనప్పుడు అందరిలాగే ఈ పెద్దమనుషులు నుంచోవాలి? లేక క్రింద కూర్చోవాలి. సీటు రిజర్వేషను చేయించుకోవటం దేనికసలు? క్రింద కూర్చో టానికా? ఆ పెద్దమనుషులకు ధైర్యంగా చెప్పలేక వీళ్ళపై ఉపన్యాస వర్షం కురిపిస్తావా నువ్వు" అని అడిగాను నేను కండక్టర్ని నిలదీసి.

తడబడ్డాడు కండక్టరు. ఆర్టీసీ ఛైర్మన్‌గారి బంధువులు అదే బస్‌లో ఉన్న సంగతి గుర్తుకొచ్చింది కాబోలు తోకముడిచేశాడు కండక్టరు.

వెంటనే "ఆ... ఆ... అదే నే చెప్తున్నది. మీకు మీరు సర్దుకుపోవాలి. రండిసార్. నా సీట్లో కూర్చోండి మీరు. నర్సారావుపేట కోటాలో ఏదన్నా ఖాళీ ఉంటే ట్రైచేస్తా" అంటూ ఆ పెద్దమనుషుల లీడర్ని తన సీటుకు ఆహ్వానించాడు కండక్టరు.

ఆయన, ఆయన భట్రాజు బృందం నావైపు కొరకొరా చూస్తూ కండక్టరు వెనుకే నడిచారు. వెంటనే పల్లెటూరి జనం సంతోషంతో విప్పారిన ముఖంతో ఆ సీట్లు ఆక్రమించారు.

నేను మళ్ళీ నా సీట్లో చతికిలపడ్డాను. బస్సు వేగంగా దూసుకుపోతున్నది. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదుగాని నాకు మెలకుల వచ్చేసరికి బస్సు హైద్రాబాదు చేరింది.

బస్సు దిగి ముందుకు నడవబోతుండగా ఆంధ్రపత్రిక పేపరు చేతికందిం చాడు ఓ పదేళ్ళ కుర్రవాడు. వాడి చేతిలో రూపాయి పెట్టి, పేపరు తీసుకొని తిరగేస్తూ అఫ్జల్‌గంజ్ బస్సు డిపోవైపు నడక సాగించాను.

ఆ పేపర్లో ఓ చోట పెద్ద పెద్ద అక్షరాలతో కన్పించిన వార్త నన్ను ఇట్టే ఆకర్షించింది.

"ఆర్టీసీలో అవినీతిని ప్రక్షాళన చేసి, సామాన్య ప్రజలకు కూడా ప్రయాణం సౌలభ్యంగా ఉండేట్లు ఆర్టీసీని తీర్చిదిద్దుతామని వినుకొండ బస్సు డిపో ప్రారంభిస్తూ ఆర్టీసీ చైర్మన్, రవాణామంత్రి ప్రజలకు హామినిచ్చారు."

రాత్రి జరిగినదోసారి తలపుకు తెచ్చుకొని నాలో నేనే నవ్వుకున్నాను ఆ వార్త చదివి. ఎందుకంటే పై వార్తని చాలాసార్లు విన్నాను కనుక, అది జరిగేది కాదు కనుక.

–స్వాతి మాసపత్రిక, డిసెంబర్, 1988

❀

పెళ్ళి కథ

శ్రీనివాస్ తన కూతురు పెళ్ళికి రమ్మని నన్ను పిల్చినప్పుడే వాడితో అన్నాను, "ఎందుకురా ఇంత ఆర్భాటం? ఎంచక్కా ఏ గుళ్ళోనో దండలు మార్చేస్తే అది పెళ్ళి కాదా లేక రిజిష్టరు మారేజీ చేస్తే సరిపోదా?" అని. ఆ మాటలు వాణ్ణి కించపరడానికి అన్నవి కాదు. కేవలం వాడి ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని అన్నవి మాత్రమే. కాని వాడికి నా మాటలు అంత రుచించినట్లు కనబడలేదు. ముఖం అదోలా పెట్టాడు. ఇక వాడితో వాదనకు దిగి బాధపెట్టడం ఇష్టంలేక వాడిచ్చిన శుభలేఖ అందుకొని వాణ్ణి పంపించేశాను.

శ్రీనివాస్ నాకు ఆప్తమిత్రుడు. నేను, వాడు, జగన్నాథం చిన్నప్పట్నించీ కల్సిమెల్సి తిరిగాం. చదువుకున్నాం. ఆడుకొన్నాం. శ్రీనివాస్ మధ్యతరగతి కుటుంబీకుడైనా తన మొదటి కూతురు పెళ్ళి ఎంతో ఆడంబరంగా, సంబరంగా, శాస్త్రోక్తంగా జరుపుకోవాలని తహతహలాడడం సహజమే. నా స్నేహితుడు జగన్నాథాన్ని కల్సి పెళ్ళికి రమ్మని బలవంతం చేసి బయల్దేరతీశాను. ఇద్దరం రేపల్లె వెళ్ళే బస్సెక్కాం.

నిజానికి శాస్త్రోక్తం అంటూ ఈనాడు జరిపే పెళ్ళిళ్ళ విషయానికివస్తే నా అభిప్రాయం కొంత ఎబ్బెట్టుగానే ఉంటుంది. కానీ అది పచ్చి నిజమంటే ఎవ్వరూ కాదనడానికి సాహసించరు.

అసలు పెళ్ళనేది ఓ కాంట్రాక్టు మాత్రమే. చట్టరీత్యా చెప్పుకుంటే పరస్పరం ఒడంబడిక, ఒప్పందం మాత్రమే వివాహానికి పునాది, ఆలంబన అవుతాయి. అంతకుమించి తొలినాటికి ఆ నూతన దంపతుల మధ్య ఎక్కువ ఆశించటం,

అందులోనూ వధువుల్ని కిరోసిన్‌తో తగలబెట్టే ఈ రోజుల్లో ఏవో ఆశించటం మరీ అతి అవుతుంది. అసలు ప్రేమ లేకుండా కాపురం చేసే భార్యాభర్తల్ని కూడా కోట్లలో ఎరుగుదును నేను. ఏది ఏమైనా వైవాహిక బంధం ఆర్థిక సూత్రాలకు లోబడే నూటికి నూరుశాతం ఉంటుందని చెప్పడానికి ఈనాడు కోట్ల ఉదాహరణలు చూపవచ్చు. విషయమిది అని ఇదమిత్థంగా తెల్సినా మంత్రతంత్రాలకు స్థానం కల్పించటం వివేకం అన్పించలేదు. వివాహం పరస్పర సేవాధర్మానికి, త్యాగానికి సంకేతం అన్న ఆధ్యాత్మిక భావం నేడు మృగ్యం.

మంత్రతంత్రాల మాటకొస్తే అదో వ్యాపారమైపోయింది. మంత్రాలు స్పష్టంగా ఉచ్చరించే బ్రాహ్మణులు గతించి చాలా కాలమయింది. ఇటీవల నా స్నేహితుడొకడు ఓ భాషాశాస్త్రవేత్తతో వాళ్ళ పిల్లకి అక్షరాభ్యాసం చేయిం చాలని, బ్రాహ్మణ్ణి వాళ్ళింటికి తీసికెళ్ళి కార్యక్రమం అంతా నిర్వర్తించాడు. తీరా ఆ భాషాశాస్త్రవేత్త పిల్లచేత అక్షరాభ్యాసం చేయించ వచ్చేటప్పటికి, ఆ బ్రాహ్మణుడు ఆయన్ని "ఓం నమఃశివాయః సిద్ధం నమః" అని దిద్దించండి అని చెప్పాడుట. "శివాయః ఏమిటి? శివాయ, మాత్రమే" అని బ్రాహ్మణ్ణి సరి చేయబోయాడట ఆ భాషాశాస్త్రవేత్త. ఇక ఇద్దరూ వాగ్యుద్ధానికి దిగిపోయారు. ఇలానే సంకల్పం చేయించేప్పుడు– సహకుటుంబాణాం అనే తప్పుడు ప్రయోగం తోనో, పెళ్ళిళ్ళప్పుడు "కన్యాం తుభ్యమహం సంప్రతతే నమమ" అని, ప్రమాణా లప్పుడు "ధర్మేచ, అర్థేచ, మోక్షేచ, కామేచ" అని వెన్కాముందు ఆలోచించకుండా ఉన్నవి లేనివి కలిపి చదివేస్తుంటారు. పెళ్ళి జరిపించే బ్రాహ్మణులకుగాని వధూవరులకుగాని పెళ్ళి తాలూకు పవిత్రత, ఆధ్యాత్మికత బొత్తిగా తెలీదు. వారిరువురికి అదో షో బిజినెస్ అంటే సరిగ్గా ఉంటుందేమో. ఇలా జరిగే ఈ కాలంలో శాస్త్రోక్తంగా పెళ్ళేమిటి, నా ముఖం – అంతా వ్యాపారంగానే.

ఇలా నా ఆలోచనలు పెళ్ళి చుట్టూ పరిపరివిధాలుగా పోతుండగా బస్సు రేపల్లె చేరింది. పెళ్ళి సాయంత్రం ఆరుకనగా మధ్యాహ్నం మూడింటికి రేపల్లె చేరాం. పెళ్ళి రైలుపేట తడవర్తివారి కళ్యాణ మంటపంలో. ఆ సరికి పెళ్ళి పందిరి కోటప్పకొండ తిరణాళ్ళలా ఉంది. "ఓరినాయనో ఇంతమందిని పిలిచా డేమిటి పెళ్ళికి?" అన్నాడు జగన్నాథం ఆ జనప్రవాహాన్ని చూసి విస్తుపోతూ.

“ఉష్! గట్టిగా అరవకు. ఎవరైనా వింటే ఏమైనా అనుకుంటారు. ఎంత ఎక్కువమంది పెళ్ళికి వస్తే అంత గొప్ప. వీళ్ళంతా మన శ్రీనివాస్ కూతురు పెళ్ళికి ప్రత్యక్షసాక్షులు. రేపు ఎటు పోయి ఎటొచ్చినా వీళ్ళంతా వాళ్ళమ్మాయి కాపురం నిలబెడతారా?” అన్నాను నేను మెల్లగా.

వెనకాల ఎవరో అమ్మాయి నా మాటలు విన్నట్లుంది, కిసుక్కున నవ్వింది. ఇద్దరం కుర్చీలోంచి వెనక్కి తిరిగి ఆ అమ్మాయిని చూశాము. ఎర్రగా బుర్రగా బాగానే ఉంది. కానీ, మమ్మల్నిద్దర్నీ వెర్రి వెంగళప్పలకింద జమకట్టేసినట్లుంది. ‘పరమానందయ్య శిష్యుల బాపతు’ అనుకొంది కామోసు. మేం వెనక్కి తిరిగి చూడగానే ఓ వెకిలిచూపు చూసి తుర్రుమంది.

అవతల బ్రాహ్మడు మంత్రాలు అప్పచెప్పేస్తున్నట్లుంది. బెల్లం జీలకర్ర పెట్టేసినట్లున్నారు. మేళతాళాలు మిన్నంటాయి. ఆ కార్యక్రమం అయ్యాక కాసేపటికి వధూవరులు ఎదురెదురు పీటలమీద నుంచి ప్రక్క ప్రక్కకు వాలారు. తిన్నగా నేను కుర్చీలోంచి లేచి వెళ్ళి బ్రాహ్మడి పక్కన చతికిలపడ్డాను. మా జగన్నాథం బ్రాహ్మడికి రెండోవైపు కూర్చున్నాడు. శ్రీనివాస్ దంపతులిద్దరూ వధూవరులకు ఎదురెదురుగా కూర్చున్నారు. వాడు మా ఇద్దర్నీ చూసి కళ్ళతోనే సంతోషం వ్యక్తపరిచాడు. ఇక బ్రాహ్మడు జనతా ఎక్స్‌ప్రెస్‌లా మంత్రాలు గడగడ వల్లిస్తున్నాడు. మంత్రాల్లో పదిసార్లు ‘సంకల్పం’ ఉంటే ఓసారి ‘సంకల్పం’ చేయిస్తున్నాడు. మధ్యలో సంకల్పం పూర్తిచేయకుండానే వేరే మంత్రమందుకుం టున్నాడు. వాళ్ళ గోత్రాలు వీళ్ళకీ, వీళ్ళ గోత్రాలు వాళ్ళకి మార్చి మార్చి వల్లె వేస్తున్నాడు. అప్పుడప్పుడూ మంత్రాలు మనస్సులోనే చదువుకొని పైకి కంచు గిన్నెలో రాళ్ళేసి గలగల లాడించినట్లు చదువుతున్నాడు. ఉన్నట్లుండి సిలోన్ రేడియోలో మలయాళ పాటల్లా సాగుతోంది ఆయన మంత్ర పఠనం. ఆయన ఇష్టమే ఇష్టం. శ్రీనివాస్ దంపతులు, వధూవరులు నోళ్ళు వెళ్ళబెట్టుకొని దిక్కులు చూస్తున్నారు. మధ్యమధ్య పెళ్ళికొడుకు మావైపుచూసి ముఖం దించేసుకుంటు న్నాడు. అతణ్ణి ఎక్కడో చూసిన గుర్తు. కానీ సరిగ్గా జ్ఞప్తికి వచ్చి చావటంలేదు. ఏదోలే ఎక్కడో తారసపడి ఉంటాడనుకున్నాము. ఏ ఒక్కరికీ మంత్రాలపట్ల ధ్యాస ఉన్నట్లు కనిపించలేదు. ఇక జనం సంగతి చెప్పనక్కరలేదు. పెళ్ళికొడుకు

బదులు, పెళ్ళికూతురు బదులు అన్నీ బ్రాహ్మడే జరిపిస్తున్నాడు.

ఇంతలో బ్రాహ్మడు గొణగొణ గణగణ ఆపి "ఇక మంగళసూత్రధారణ కార్యక్రమం. ఏవి వాయిద్యాలూ?" అంటూ దూరంగా ఉన్న వాళ్ళవైపు చెయ్యి ఊపాడు. శ్రీనివాస్ భార్య అమ్మాయి జడెత్తింది. అబ్బాయి లేచి మూడు ముళ్ళు వేశాడు. మేళాలు దుందుభుల్లా మోగాయి. ఫొటోలు రీళ్ళయిపోతున్నాయి. వీడియో కెమేరాలు చకచకా తిరుగుతున్నాయి. జనంపాటికి జనం అక్కడక్కడ గుంపులు గుంపులుగా చేరి వాళ్ళ కబుర్లలో వాళ్ళు పడ్డారు. ఓవైపు కుర్చీలు తీసేసి పొద్దు పోతుందేమోనని భోజనాలకు పట్టాలు పరుస్తూ, విస్తళ్ళు వేసే కార్యక్రమానికి ఉద్యుక్తులవుతున్నారు మరికొంతమంది.

మా వాడు నన్ను తన ప్రక్కనే కూర్చోమన్నాడు. కానీ నాకప్పటికింకా ఆకలిగా లేదు. "నువ్వు కూర్చో, నేను ప్రక్క వరుసలో కూర్చుంటాలే. ఈలోగా కాస్త పనులేమన్నా ఉంటే చూస్తాను" అన్నాను.

నే వడ్డనలో నెయ్యి అందుకొన్నాను. వడ్డన చురుగ్గా సాగుతోంది. అందరూ చకచకా భోజనాన్ని పొట్టకు పట్టించేస్తున్నారు. మావాడు ఇంకా కూరలోనే ఉన్నట్లు గమనించి వాడి దగ్గరకు వెళ్ళాను. అప్పుడు తెలిసింది, వాడి భోజన ప్రియత్వం వల్ల ఒక్కోటి నింపాదిగా తినటంలో కొన్ని ఐటమ్స్ మిస్సయ్యాడని. వాడిలాగా లెక్కకు ఓ పాతికమందిదాకా తేలారు. వాళ్ళకు మారువడ్డన వేయమని అడగడానికి పోయిన నేను వడ్డన చీఫ్ చెప్పిన సమాధానం విని నివ్వెరపోయాను. "జనం విరగబడి వచ్చారు. కార్డుకు నల్గురు చొప్పున వస్తే వంటకాలు మారువడ్డనకెలా సరిపోతాయి చెప్పండి. ముఖ్యమైనవాళ్ళు మగపెళ్ళి వారు కదా!వాళ్ళకు మారువడ్డన చేస్తాం. మనసైడువాళ్ళని సర్దుకోమని చెప్పండి" అన్నాడతను.

చేసేది లేక సరేనని తలూపి, జనంలోకి నెయ్యి వడ్డనకు మళ్ళీ ఉపక్రమించాం. పంక్తిలో ఎవరైనా లడ్డు అడిగితే 'రేయ్ ఇక్కడ ఓ లడ్డుట్రా' అని వెనక్కు తిరిగి అరుస్తాడు. వాడి వెనకవాడు అదే మాట పెద్దగా మళ్ళీ అరుస్తాడు. కానీ ఎంతసేపైనా లడ్డులు రావు. ఈ తంతు గమనించి నాలో నేనే నవ్వుకున్నాను. మావాడు నావైపు తేరిపార చూసి కడుపునోసారి ప్రేమగా నిమురుకొని

పెరుగన్నం కూడా తినకుండా అందరితో లేచి వెళ్ళి చేయి కడుక్కున్నాడు. అప్పుడు తేల్సింది వాడి భోజనప్రియత్వం ఎంతటి ప్రమాదం తెచ్చి పెట్టిందో వాడికని. అందుకే వాడు త్వరపడి ఎక్కడికీ భోజనానికి వెళ్ళడు. ఈ విషయం వాడు ముందే మొత్తుకున్నా నేను వినకుండా బలవంతపెట్టాను.

ఇక రెండోపంక్తి మూడోపంక్తి వచ్చేప్పటికి అన్నం కూడా మారువడ్డనకు మిగల్లేదు. అన్నం బదులు పులిహోర వడ్డించేశారు. మారు అన్నం అడిగినా "అక్కడ అన్నంట" అని కేకేసి ముందుకు వెళ్ళిపోయాడా వ్యక్తి. మళ్ళీ తతంగం మామూలే. కానీ అన్నాన్ని ఎవ్వరూ తీసుకురారు. బహుశ నేను తక్కువగా పెళ్ళిళ్ళకెళ్ళటం వలన కాబోలు నాకు ఇదంతా వింతగా తమాషాగా ఉంది. దాదాపు సగం శాస్త్రోక్తంగా పెళ్ళిళ్ళన్నీ ఇంతేనట. తర్వాత తెలిసింది నాకు.

భోజనాలు అయ్యేప్పటికి రాత్రి పదయింది. ఆ సరికే ఎక్కడ సర్దుకొనే వాళ్ళు అక్కడ సర్దుకొన్నారు. ఓ గంటలో తడవర్తివారి కళ్యాణమండపం రైల్వే విశ్రాంతిగదిలా తయారయింది. మా జగన్నాథం కోసం చూశాను అటూఇటూ. వాడు ఎక్కడో ఒరిగినట్లున్నాడు. దూరంగా పెళ్ళికొడుకు తాలూకూ వాళ్ళు ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళ కబుర్లని బట్టి వాళ్ళకు ముట్టిన పెళ్ళి కానుకలు, బట్టలు నాసిరకమైనవని అఘోరిస్తున్నట్లు బోధపడింది నాకు. ఎప్పుడు నిద్రలోకి ఒరిగానో తెలీదు కానీ హఠాత్తుగా ఏవో కేకలు వినపడేప్పటికి ఉలికిపాటుతో లేచి గడియారం వంక చూశాను. సమయం మూడు గంటల వుతున్నది, మగపెళ్ళివారు, ఆడపెళ్ళివారు కాట్లకుక్కల్లా అరుచుకొంటున్నారు. ఎందుకన్నది నాకు బోధపడలేదు. మన పెళ్ళిళ్ళలో కుక్కల్లా కీచులాడుకోవటం, దెప్పుకోవటం, సాధించుకోవటం, మనస్సులు రగిల్చి కాల్చుకోవటం శాస్త్ర విరుద్ధమైన తెలుగు సంస్కృతని తెలిసి నవ్వాలో ఏడవ్వాలో తెలీదు నాకు.

చివరకు ఆ గుంపులో శ్రీనివాసెక్కడున్నాడో వెతికి పట్టుకొని పక్కకులాగి "ఏమిటి విషయం?" అని అడిగాను.

"ఏముందీ! తెల్లవారుజామున ప్యాసింజరుకు వెళ్తామంటే టిఫిన్ చేయించాలని వంటవాళ్ళను కదిపాను. ముందు చెప్పలేదు గనుక ససేమిరా వంట చేయమన్నారు వంటవాళ్ళు. రాత్రి నిద్రలేక, పైగా బడలికమీద ఆడవాళ్ళు

లేచి టిఫిన్ చేసినట్లున్నారు. అది కాస్త అయోమయంగా తయారైంది. దాంతో మర్యాదలు సరిగ్గా జరగలేదని తిట్టిపోస్తున్నారు" అన్నాడు శ్రీనివాస్.

"మరి మధ్యలో 'స్కూటర్', 'లూనా' అంటారు అదేమిటి?" అని అడిగాను.

"అదా, అలకపాన్పు కోరికట. తర్వాత ఇస్తామంటే ఇప్పుడే డబ్బు ఇవ్వాలి అని పట్టుబట్టారు. ఉన్నపళంగా అంత డబ్బు ఎక్కణ్ణుంచి తీసుకురాను?" అని వాపోయాడు శ్రీనివాస్ బిక్కమొహం వేసి.

ఇంతలో శ్రీనివాస్ పెళ్ళాం వచ్చి అతణ్ణి ఇవతలికి పిల్చింది. వాళ్ళిద్దరూ ఏమి మాట్లాడుకున్నారో తెలీదుగాని, అప్పటికి ఆ గందరగోళం ముగిసి వాళ్ళు ప్రయాణమయ్యారు గునుస్తూ. తర్వాత మా జగన్నాథం కూపీ లాగితే తెల్సింది, శ్రీనివాస్ మరదలు తన మెళ్ళో బంగారుగొలుసు తీసి అవసరానికి ఏదో సర్దుబాటు చేసుకోమని చెప్పటంతో ఆ గొలుసునిచ్చి మనవాడు "లూనా" కింద జమకట్టుకోమని సర్దిపుచ్చాడుట.

హఠాత్తుగా మా జగన్నాథం "ఒరే ఆ పెళ్ళికొడుకు మనల్ని చూసి ముఖం చాటువేసినట్టుంది కదూ, గమనించావా? వాడు మన రాజమండ్రిలో నన్నయ గారి వీధిలో ఉష అనే అమ్మాయిని తెచ్చి కొంతకాలం కాపురం చేసిన సత్యంలా లేడూ... ఆ అమ్మాయి తర్వాత ఉరేసుకుని చచ్చిపోయింది. గుర్తువచ్చిందా?" అని అన్నాడు నాతో.

నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఒళ్ళు జలదరించింది. వెన్నెముకలోంచి జ్వరం సన్నగా పైకి ప్రాకుతున్నట్లనిపించింది. వెంటనే బస్సు దిగి వెళ్ళి మా శ్రీనివాస్‌కు జరిగిన అన్యాయం గురించి చెబ్దామనిపించింది. ఇంకా ఈ విషయం చెప్పి వాణ్ణి బాధించటం ఎందుకు? దోపిడీ దొంగల్లా రావలసిన లాంఛనాలూ, బట్టలు, వస్తువులు, ఆభరణాలూ అన్నీ మూట కట్టుకొని మరీ వెళ్ళిపోయారు వాళ్ళు. ఇక ఆ అమ్మాయిని దాని అదృష్టానికి వదిలేయక తప్పదు అని ఊరుకొన్నాను.

మొత్తంమీద నాకెందుకో ఈ పెళ్ళితో ఉన్న మనశ్శాంతి పోయింది. తాపీ ధర్మారావుగారు రాసిన "పెళ్ళి–దాని పుట్టుపూర్వోత్తరాలు" చదివితే ఎవ్వరూ ఈనాటి పెళ్ళిళ్ళు సక్రమమని ఆమోదించరు. మార్పు రావాలని ప్రతి ఒక్కరూ

కోరుకుంటారు. కానీ ఆచరణకొచ్చేసరికి ఎవరికి వారు తమతో ఓ కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించటానికి ఇష్టపడరు. మరి మార్పు రావాలంటే ఎక్కడ్నుంచీ వస్తుంది? పెళ్ళిళ్ళలోని శాస్త్రధర్మం వివరిస్తూ శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రిగారు చక్కటి పుస్తకం రాశారు. దాన్నీ పాటించరు. ఇంకేం పెళ్ళిళ్ళండి, అఘోరింపులు కాకపోతే అవి.

నిజానికి ఇద్దర్నీ కలపడానికి ఇంతమంది 'అహం' సంతృప్తి పెళ్ళి అనే తంతుతో కలిగించాలని నియమం సృష్టించిన మహానుభావుడెవరో కాని, అతనికి నా శతకోటి వందనాలు.

ఈ 'శాస్త్రోక్తం' అనే పెళ్ళిళ్ళ పేరిట వేల ఖర్చు తగ్గి ఆడపిల్లల తల్లిదండ్రులు అప్పులపాలు కాకుండ పెళ్ళి చేయగల రోజులెప్పుడొస్తాయి? ఇది ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో సాధ్యమయ్యేదేనా?

ఇవన్నీ యథావిధి జరపాలన్నా మా శ్రీనివాస్ పట్టుదల తన తాహతుకు మించిన ప్రయత్నం కాదా? ఆ సత్యం వాడు ఇప్పుడు గుర్తించితే మాత్రం జరిగే ప్రయోజనమేముంది?

ఈ ప్రశ్నలు చివరి క్షణంలో మేము బయల్దేరి వస్తున్నప్పుడు శ్రీనివాస్ చూసిన దయనీయమైన చూపుల్లా... నన్ను ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. ఈ అనుభవం నాకు కలిగించిన శ్రీనివాస్‌కు, అతని కూతురుకు మాత్రం ఇక ముందైనా శుభం జరగాలని, ఓ శ్రేయోభిలాషిగా నేను ఎప్పటికీ కోరుకొంటూనే ఉంటాను. తనకేమీ పట్టనట్లు ముందుకు సాగిపోయే బస్సులో ఆర్ద్రమయిన నా కళ్ళను జేబురుమాలుతో తుడుచుకొని, కిటికీవారగా వాలిపోయాను – మానసికంగా అలసిపోయి.

–జ్యోతి మాసపత్రిక, జూలై, 1989

❀

విచిత్ర పరిచయం

నేను కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు నుంచి విజయవాడకు ప్రయాణం కట్టడం వెనుక ఓ బలమైన కారణం ఉంది. కారణమంటే ఏదో అనుకునేరు. దాని వెనుక ముప్ఫైయ్యేళ్ళ మా ఇరువురి స్నేహబంధం ఉంది. దానికి ఇంకా వెనుకన మా చిన్ననాటి నుంచి స్నేహంలో ఆప్యాయత, ఆత్మీయత, అనురాగం, మృదుత్వం నాకు రుచి చూపించిన నా మిత్రుడు సీతాపతి అభ్యర్థనను త్రోసి పుచ్చలేని నిస్సహాయత ఉంది. ఆ మాటకొస్తే, అభ్యర్థిస్తే తిరస్కరించలేని వెన్న లాంటి మనస్సు వాడికి ఉంది. అంతేగాక, ఇలా పెనవేసుకుపోయిన మా ఆత్మీయతల మధ్య రవ్వంత సాహిత్యాభిమానం, అభిరుచి చోటుచేసుకోవటం మా స్నేహానికి ఉన్న ప్రత్యేకత, మా అదృష్టం కూడా.

జీవితచక్రంలో ఆటుపోటుల్తో బీడైపోయిన మా గుండెల్లో కొద్దిపాటి సాహితీజల్లుల కోసం మేమిద్దరం ఎంతో ఉబలాటపడతాం. అందులో ఎంతో ఊరట, ఉపశమనం పొందుతాం. అందుకే విజయవాడలో రేపట్నించి జరగ బోతున్న ఆంధ్రరచయితల మహాసభకు నన్ను కూడా రమ్మని మరీమరీ కోరుతూ వాడు ఉత్తరం రాస్తే, శరీరం నా వయస్సుతో సహకరించక సమ్మె చేస్తున్నా బలాన్నంతా కూడదీసుకొని మరీ బయల్దేరాను నేను.

నేను రిటైరయి హైదరాబాదు నుంచి ఒంగోలు వచ్చేసి కూడ అప్పుడే ఐదేళ్ళు గడిపోయాయి. ఈ కాలంలో ఉత్తరాలే మమ్మల్ని సన్నిహితంగా ఉంచా యంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు ఈ రచనయితల మహాసభ వంకన వాడూ, నేనూ పంజరంలోంచి బయటపడ్డ చిలుకల్లా పైకెగిరి, విజయవాడలో

వాలాలన్న తహతహతో ఈ ప్రయాణానికి నడుము బిగించాం.

అయితే ఈ మొత్తం తతంగంలో నాకు నచ్చనిది రవ్వంత ఉండనే ఉంది. అది బహుశా వీడికి తెలీదనుకొంటా.

"అక్కడకు నాకు తెలిసిన దూరదర్శన్ వాళ్ళు కూడా వస్తారు. వీలైతే నిన్ను కూడా ఇంటర్వ్యూ చేసే ఏర్పాట్లు చేస్తాను. ఇన్నేళ్ళుగా హైదరాబాద్‌లో ఉండటం మూలాన ఆ మాత్రం పలుకుబడి సంపాదించుకోగలిగాను. బహుశా నీకు సమ్మతమేననుకొంటా!" అని రాశాడు వాడు.

ఆ వాక్యాలు చదువుతున్నప్పుడు నాకెందుకో నవ్వు వచ్చింది. అందుకు నాకుండే కారణాలు నాకు ఉన్నాయి. బహుశా అవి ఈ కాలంలో నలుగురికీ నచ్చొచ్చు, నచ్చకపోవచ్చు కూడా. కాని, సాహిత్య వినీలాకాశంలో మిలమిల మెరిసే నక్షత్రాల్లాంటి మహా రచయితలు ఎందరో ఉన్నారు. అయితే వాళ్ళలో వెయ్యోవంతు మందిని ఎవ్వరూ సరిగ్గా పట్టించుకోలేదు, ఇంటర్వ్యూ చేయలేదు. అథవా చేసినా అది అంతంతమాత్రంగానే కన్నీటి తుడుపుగా ఉంటుందే కాని, మనోరంజకంగా, వైజ్ఞానికంగా ఎంతమాత్రం ఉండదు. మహారచయితల కృషిని, ఆవేదనను వాళ్ళ సాహిత్యం చదివి, ముందు అర్థం చేసుకొని, తర్వాత ఏ నేపథ్యంలో ప్రశ్నిస్తే ఆ మహామహుల హృదయాంతరాల్లోని అమృతభావాలు, మాటల జల్లులై ప్రేక్షకలోకంపై కురుస్తాయో ఊహించి ప్రశ్నిద్దామన్న చిత్త శుద్ధి ఇంటర్వ్యూలు, పరిచయాలు చేసేవారిలో చాలామందికి ఉండదని నాకు ఎప్పుడో అర్థమైంది. ఇటీవలికాలంలో చాలా రకాల ఇంటర్వ్యూలు చూశాను, చదివాను. అవి కేవలం అలంకారప్రాయంగానే ఉన్నాయి తప్ప ఆనందదాయకంగా లేవని నాకు అనిపించింది.

పోన్లే. అసలు సిసలైన సాహిత్యానికి, కథా కథనశిల్పానికి కాలం చెల్లిపోయి, నకిలీ సాహిత్యం వీధులవెంట స్వైరవిహారం చేస్తుంటే నా అభిప్రాయాలు ఎవరికి కావాలి. పైగా నోరు విప్పితే అందరితోను లేనిపోని శత్రుత్వం కొనితెచ్చుకొన్న వాడినవుతాను అని నన్ను నేనే ఊరడించుకొంటుంటాను.

కాసేపు ఇలా సుదీర్ఘమైన ఆలోచనల్లో మునిగిన నేను ఏదో బలమైన తాకిడికి హఠాత్తుగా ఈలోకంలోకి వచ్చి పడ్డాను. ఇద్దరు మనుషుల మీదనుంచి

లాంగ్‌జంప్ చేసి, నా ముందు ఖాళీ అవబోతున్న సీట్లోకి ఓ వ్యక్తి దూకడం, ఆ ప్రయత్నంలో నా కాళ్ళను అతను ఫుట్‌బాల్ ఆడుకోవటం ఒకేసారి జరిగి పోయాయి. అప్పుడు గమనించాను. రైలు వేటపాలెంలో ఆగిందని, దాని ఫలితంగా ఈ సర్కస్ ఫీటు జరిగిందని.

నా చిన్ని చేతిబ్యాగ్‌లోంచి రావిశాస్త్రి షష్ఠిపూర్తి సంచిక 'జులై 30' బయటికి తీసి, పేజీలు తిరగేయటం ప్రారంభించాను. రావిశాస్త్రిగారి రచనలు నాకు అర్థమయ్యేప్పటికి నా సగం జీవితం దాటిపోయింది. ఈ 'జులై 30' సంచికలో ఆయన కథలు, నవలలపై అనేకమంది ప్రముఖుల వ్యాసాలు ఉన్నాయి. వాటిలో 'రాచకొండ రచనలలో సిమిలీ' అని భద్రిరాజు కృష్ణమూర్తి గారు రాసిన వ్యాసం అంటే నాకెంతో ఇష్టం. అప్పట్లో పత్రికలన్నీ ఈ సంచికను సమీక్షిస్తూ ఈ వ్యాసాన్ని బహుధా ప్రశంసించాయి కూడా. రాచకొండ, సిమిలీ లను సందార్భానుసారంగా వర్గీకరిస్తూ, ఆ సిమిలీలు ఆర్ద్రమైన, ఆవేదనాభరిత మైన పాత్రల గుండెల్లోంచి ఎంత సహజంగా వస్తాయో, వచ్చాయో భద్రిరాజు గారు వివరించిన తీరు నన్ను పదేపదే ఆ వ్యాసాన్ని చదివింపచేస్తుంటుంది.

ఇంతలో నా ముందుసీట్లోకి పిడుగులా వచ్చిపడ్డ కుర్రాడు "సార్! మీరేం అనుకోకపోతే ఓ చిన్నప్రశ్న. మీ చేతిలోని పుస్తకం పేరు 'జులై 30' అని ఉంది. అదేదన్నా జ్యోతిషశాస్త్రానికి సంబంధించిన పుస్తకమా?" అని అడిగాడు.

అతన్ని ఓసారి ఆపాదమస్తకం పరిశీలించాను. ముప్పయ్యేళ్ళు మించి ఉండదు వయస్సు. చాలా అందంగా, చురుగ్గా, మాటకారిలా కన్పించాడు. ఇది నా ఊహ కాదు. ఉత్తుత్తిగా అన్పించటమూ కాదు. నిజంగా అందుకుతగ్గ ఆవేశం, తొందరపాటు అతనిలో ప్రస్ఫుటంగా కనిపిస్తూనే ఉన్నాయి. నేను అవకాశం ఇవ్వాలే కాని అతను ఇప్పుడు ఈ క్షణంలో ఈ రైలుపెట్టె మొత్తాన్ని ఏకం చేయగల సమర్థుడు. నాకు ఎందుకో కొందరిని చూడగానే ఓ అభిప్రాయం మొట్టమొదటే కలుగుతుంది. చాలామటుకు నా అభిప్రాయం సరైందనే చివరికి తేలుతుంది. ఒక్కోసారి అరుదుగా అది తప్పనికూడా ఋజువు అవుతుంటుంది. ఇతని విషయంలో నా అదృష్టం పరీక్షించుకొందామనుకున్నాను. కొత్త మనుషు లతో కలవక, మాట్లాడక చాలా కాలామైంది కూడా.

నా ఆలోచనలు, నా ముఖంలో వ్యక్తపరిచిన భావాలు అంతవేగంగానూ అతను చదివేశాడేమో తెలీదు కానీ, "ఏం సార్! మిమ్మల్నే, పలకరేంటి? ఆ పుస్తకం పేరు 'జూలై 30' అని ఉందేమిటి? అభ్యంతరం లేకపోతే ఆ పుస్తకం ఓసారి ఇలా ఇస్తారా?" మళ్ళీ అతను అడిగాడు.

"చూడు బాబూ! ఈ పుస్తకం పేరు 'జూలై 30' అని ఉండటానికి కారణం అది ఓ మహారచయిత పుట్టిన తేదీ కాబట్టి, ఈ పుస్తకం సరిగ్గా ఆ తేదీన ఆవిష్కరించారు కాబట్టి. ఆ మహారచయిత ఎవరో తెలుసా? బహుశ మీ తరం వాళ్ళకి తెలీకపోవచ్చు. ఆయన పేరు రాచకొండ విశ్వనాథశాస్త్రి. సాహితీ లోకం ముద్దుగా ఆయన్ను 'రావిశాస్త్రి' అని పిలుస్తుంది" చెప్పాను నిదానంగా.

"ఓహో! అయితే మీకు సాహితీ వ్యవసాయం పట్ల కొంత అభిరుచి ఉందన్నమాట. భేష్, మీ పేరేమిటి సార్?" అని అడిగాడు అతను.

"ఏనుగులవాడ విశ్వనాథం."

"అరెరె! మీరేనా ఏనుగులవాడ విశ్వనాథంగారంటే! భలేవారే! అడిగేవరకూ చెప్పారు కాదు!" అన్నాడు అతను నేనెంతో సుపరిచతమైన వ్యక్తినన్న భావం వ్యక్తపరుస్తూ.

"అయితే మీరు నన్ను ఎరుగుదురా?" అడిగాను నేను. నాకు ఇదేదో మరీ తమాషాగా, ఆనందంగా, హుషారుగా కూడ అనిపించింది.

"ఆ... ఎరక్కేం! బాగా ఎరుగుదును. మీరు ప్రఖ్యాత రచయిత కదూ!" అన్నాడు గొప్ప రహస్యం కనుక్కున్నవాడిలా పోజిస్తూ.

"అంటే ఎవరైనా చెబితే విన్న బాపతా! లేకపోతే నేను రాసినవి ఏవైనా చదివావా?"

"రెండూనూ" అన్నాడతను అలవోకగా.

"వెరీగుడ్. ఇంకా ఈ పృథ్వీమీద నన్ను జ్ఞాపకం పెట్టుకొనే వాళ్ళుకూడ ఉన్నారన్న మాట" నిట్టూరుస్తూ అన్నాను నేను. నాకెందుకో ఆ క్షణంలో చెప్ప లేనంత విచారం కూడా ముంచుకొచ్చింది. వయస్సు ప్రభావం! ప్చ్!

నేను ఇలా అనడం అతనికి మరింత ఊపును ఇచ్చింది కాబోలు.

"అదేం సార్! అలా అంటారు. ఈ రోజు రచయితలతో పోలిస్తే మీకేం

తక్కువ. కాకపోతే ఈ రోజు రచయితలు రచనల్లో వాళ్ళ సత్తా చూపించటంకన్నా వాళ్ళ ఫొటోల్లో సత్తా చూపిస్తున్నారు. ఛ... ఛ... అసలు సాహిత్యరంగం అంతా ఓ వ్యాపారరంగంగా మారిపోయిందంటే నమ్మండి సార్!" అన్నాడు అతను నన్ను ఓదార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా.

అతని మాటల్లో కొంత ముఖస్తుతి, కొంత చేదునిజం కలిసిపోయాయి. అందుకే ఓ ముక్క చెప్పాలనుకున్నాను.

"చూడు బాబు! నాకు ముఖస్తుతి అంటే అంతగా పడదు. నా మటుకు చెప్పాలంటే నేను చేసిన సాహిత్య కృషి అంతా కేవలం ఓ ఆర్తితో, నిర్మల హృదయంతో, ఆత్మసంతృప్తి కోసం చేసిందేగాని ఇతరుల సర్టిఫికెట్లకోసం, ముఖస్తుతి కోసం ఏమాత్రం కాదు. ఈ విషయంలో కొడవటిగంటి కుటుంబరావు అన్న మాటలు చిరకాల సత్యాలు. 'నా రచనలు చదివి చైతన్యం పొందే ప్రజలు ఎవరైనా ఉంటే వాళ్ళు తప్పనిసరిగా నా రచనలు చదవాలి. వాళ్ళకు నా రచన పట్ల ఎంత త్వరగా ఏహ్యం, ఏవగింపు కలిగితే, నాకూ సాహిత్యానికి వాళ్ళు అంత మంచి చేసినవారు అవుతారు' అని. ఆయనలాంటి మహానుభావుడే అంతటిమాట అంటే నేనెంత? ఆయన ముందు నేనో పసి రచయితను."

"అబ్బా! ఏం కొటేషన్ ఇచ్చారు సార్!"

"నేను ఇవ్వడమేమిటి? కొడవటిగంటే స్వయంగా రాసుకొన్న మాటలివి. అంతే నిరాడంబరంగా రాసుకొన్నారు కాళీపట్నం మాష్టారుగారు."

"సార్! మీ మాటలు వింటూంటే మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు వేయాలని పిస్తోంది. మీకేమన్నా అభ్యంతరమా సార్?"

"నిరభ్యంతరంగా అడుగు" అన్నాను నేను. నిజానికి నాకు ఇక అతనితో మాటలు పొడిగించే ఉద్దేశం లేకపోయినా, అతని ప్రశ్నల స్థాయి ఏమేరకు ఉంటుందో గ్రహించాలన్న బలమైన తపనతోనే అందుకు అంగీకరించాను.

"మీరు ఎన్నో కథలు, నవలలు రాసి సాహిత్యానికి అపూర్వమైన కృషి చేశారు కదా! దానికి మీకు ప్రేరణ ఎలా కలిగింది?"

"ఇలాంటి చచ్చు ప్రశ్నలుటయ్యా వేసేది? ముందు నీ ప్రశ్న సవరించు. నే కథలు మాత్రమే రాశాను. నవలలు రాయలేదు. ఇక ప్రేరణ అంటావా?

అది ఒక్కొక్కరికి ఒక్కో రూపంలో వస్తుంది. ఎలా వచ్చిందన్నది అసలు విషయం కాదు. ఎలా వచ్చినా స్పందించే హృదయం రచయితకు ఉండాలి. సమాజం, జీవితాలు, వాటి చుట్టూ అల్లుకుపోయిన నైతిక, ఆర్థిక విలువలు, ముడి సరుకులుగా తీసుకొని రచయిత సమాజానికి ప్రేరణ అవుతాడు. అంతేగాని రచయితకు ప్రేరణ ఏమిటి? ప్రేరణలు ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఉంటాయి. అయితే అందరూ రచనలు చేయగలరా? జీవితాలను శోధించి పిండగల మేధాశక్తి చైతన్యం, స్పందన ఉన్నవాడికి జీవితమే ప్రేరణ. మరెవరో కానక్కర లేదు" అన్నాను నేను.

"అబ్బే, మీరు పొరబడ్డారు. నన్ను సరిగ్గా అర్థం చేసుకొనే ప్రయత్నం చేయండి. నవలలంటే కూడా పెద్దకథలనే నా ఉద్దేశం. అది మీరు సరిగ్గా అర్థం చేసుకోలేదు. అలాగే 'ప్రేరణ' విషయంలో గూడా మీరు నన్ను అపార్థం చేసుకొన్నారు. నా అభిప్రాయంలో 'ప్రేరణ' మీరనుకొనే 'ప్రేరణ' కాదు. 'ఉదాహరణకు పానుగంటివారి 'సాక్షి' వ్యాసాలకు ఎడిసన్ రాసిన 'స్పెక్టేటర్' ప్రేరణట కదా! అలాగే రాచకొండవారికి 'డికెన్స్'ట కదా! ఆయనే స్వయంగా చెప్పుకొన్నారు. అలా మీపై ఎవ్వరి ప్రభావమూ లేదాని నా ప్రశ్న."

అతని మాటతీరుకు అరికాలి మంట నెత్తికెక్కింది నాకు. కాని, ఇలాంటి చచ్చు ప్రశ్నలు వేసేవాళ్ళని ఉపేక్షించగూడదు. 'చూపిస్తాను, చూపిస్తాను నా తడాఖా ఏమిటో ఇతనికి' అనుకున్నాను మనస్సులో.

"ఏం సార్! నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి సార్. ఎంతో ఉత్సాహంగా ఉంది సార్ మీ సమాధానం వినాలని" మళ్ళీ అడిగాడు అతను.

"చూడు బాబు! నువ్వు బలవంతం చేస్తే తప్ప ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగూడదనుకొన్నాను. ఎందుకంటే ఇంతకంటే ఛంఢాలపు ప్రశ్న సృష్టిలో మరోటి ఉండదు. కొడవటిగంటిని, రాచకొండను, తిలక్‌ను మీలాంటివాళ్ళు ఇలా వేధించుకుతింటే, తప్పించుకోలేక ఏదో ఓ సమాధానం చెప్పి ఉండవచ్చు. కాని వాళ్ళెవ్వరూ ఈ కాలంలో కొందరు రచయితల్లా ఇంగ్లీషు నవలలు కాపీ కొట్టి రాసే రచయితలు కాదు. అలా రాయలేదని కూడా నాకు బాగా తెలుసు. కాకపోతే వారికిగాని, నాకుగాని కొంతమంది విదేశీరచయితలు చెప్పిన వస్తువు,

శైలి, నేర్పు నచ్చి ఉండవచ్చు. అంతే! ఇలాంటి పిచ్చిప్రశ్న మళ్ళీ అడక్కు ఎవర్నీ" అన్నాను నేను.

"అలాగే సార్! మీ తొలికథ పేరేమిటి? అది ఎందులో అచ్చయింది? అప్పుడు మీకు కలిగిన అనుభూతి కొంచెం వివరిస్తారా?" అని అడిగాడు అతను. అతని గొంతులో కొంత భయం, బెరుకూ గోచరించాయి ఈసారి.

అతని ముఖంవైపోసారి చూశాను. పాపం! నా సమాధానం తీరుకు అతను సగం చచ్చినపట్లు అతని ముఖంలో వ్యక్తమయ్యే బాధ చెప్పకనే చెప్తోంది.

"చూడు బాబూ! ఇలాంటి ప్రశ్నలంటే నాకు చిర్రెత్తుకొస్తాయి. ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకొనేవాడిలా ఇప్పుడా వివరాలన్నీ నీకు చెప్పాలా? అయినా ఇలాంటి గణాంకవివరాలు, పుచ్చువివరాలతో మీకు ఒరిగేదేమిటయ్యా? ఏదైనా కాస్త మంచిప్రశ్నలేయి" అన్నాను నేను.

"అది కాదండి! నాకెందుకో అలాంటివి తెలుసుకోవాలని సరదా!" అన్నాడు అతను ముఖాన కొంచెం గంటు పెట్టుకుని.

"బాగుంది. ఇంతకు మునుపు రాచకొండవారిని ఇలాంటి ప్రశ్నలే వేశారు ఎవరో. మీ ఇంటికి 'రాచకొండ' అని పేరు ఎందుకు వచ్చింది? మీ నాన్నగారు లాయర్ వృత్తి మానేస్తే, మీరు వెలగబెట్టారు ఎందుకు? ఇలాంటి ప్రశ్నలు వేస్తే ఏ రచయితలైనా ఎంత నిరుత్సాహపడతారో అడిగేవారికి తెలీదు. కాని నే చెప్తాను, రచయితలు కోరేది కీర్తిప్రతిష్ఠలు, డబ్బు కాదు. వాళ్ళు రాసింది పాఠకులు చదివి వాళ్ళని తిరిగి ప్రశ్నించాలన్న ఒకే ఒక కోరికతో రచయిత జీవితకాలం ఎదురుచూస్తాడు. కాని దురదృష్టవశాత్తు అలాంటి ప్రయత్నం ఏ కొద్దిమందో చేస్తారు. దానితోనే సంతృప్తి పడతారు రచయితలు. రచయితల రచనల్లో సమాజాన్ని నిద్ర లేపాలన్న తర్కం ఒకటి ఉంటుంది. ఆ తర్కంపై ప్రశ్నలు వేయాలి. అంతేగాని ఇలాంటి ప్రశ్నలు కాదు. వీటివల్ల ఒనగూడే ప్రయోజనం కూడా శూన్యమే" అన్నాను నేను కొంత నిదానం, శాంతం తెచ్చుకుంటూ.

"సారీ అండీ! మిమ్మల్ని మీరు కోరిన నేపథ్యంలో ఇంటర్వ్యూ చేయాలంటే నాకు సాధ్యంకాదు. అందుకు బాగా చదువుకొని ఉండాలి. ముఖ్యంగా మీరు

రాసినవేవీ నే చదవలేదు” అన్నాడతను బుంగమూతి పెట్టి.

“పోన్లే బాధపడకు. తెలిసీ, తెలియకుండా ఇంటర్వ్యూలు చేసే ఈ తరం వారికి నువ్వు ఓ ప్రతినిధివి. అంతే!” అన్నాను నేను. అతనిపట్ల నే మొట్టమొదట ఏర్పర్చుకొన్న అభిప్రాయం తప్పుకాదని ఇప్పుడు రూఢి అయింది నాకు. ‘అదే ఓ గెలుపు నాకు ఇప్పుడు’ అని మనస్సులో అనుకున్నాను.

“క్షమించండి! మీరు వస్తున్నది విజయవాడ రచయితల మహాసభకే నాండి?”

“ఆహా, అక్షరాల దానికే? ఏం?” అని అడిగాను నేను ఆసక్తిగా.

“ఏం లేదండి. అక్కడ దూరదర్శన్ తరఫున మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయమని నాకు పైనుంచి ఆర్డర్లు వచ్చాయండి. నేను వేటపాలెంలో జీడిమామిడి తోటల పెంపకం గురించి వీడియోతీసి, విజయవాడలో మీ మహాసభ విశేషాలు, మిమ్మల్ని ఇంటర్వ్యూ కూడా చేసి మరీ వెళ్ళాలండి రాజధానికి. నేను దూరదర్శన్ ప్రతినిధిని. ఇదిగో నా ఐడెంటిటీకార్డు” అని జేబులోంచి కార్డుతీసి చూపించాడు.

ఒక్క క్షణం నిశ్చేష్టుడ్నయ్యాను. ‘హతోస్మి! సారీరా సీతాపతి! ఈసారి నీ కోరిక తీర్చడంకోసం విజయవాడ రాలేకపోతున్నాను’ అని లోలోన అనుకొని, అతను నిద్రలో తూగుతున్నప్పుడు, నేను తెనాలిలో రైలు దిగిపోయాను రెండో సారి ఆలోచించకుండా.

–ఈనాడు ఆదివారం, 18 ఫిబ్రవరి, 1990

అనుభవ మథనం

"డియర్ వాసూ,

సుమారు పదిహేనేళ్ళ తర్వాత మళ్ళీ ఒంటరివాడివయ్యావని తెలిసి చాలా సంతోషించాను. ఇలా రాసినందుకు దయచేసి నన్ను అపార్థం చేసుకోకు. నీ అంతరంగం గురించి తెలియక రాయటం లేదు. నీ మిత్రుడుగా నువ్వు ఇకనైనా సుఖపడాలన్న ఆశతో ఇలా రాస్తున్నాను.

సముద్రంలాంటి జీవితంలో ఎన్నో ఎడతెరపిలేని తుఫానులనెదుర్కొని, నీ జీవన నావ ఇప్పుడు ఓ ఒడ్డుకు చేరింది. ఇది జీవిత ప్రయాణంలో అనేక మజిలీల్లో ఓ మజిలీ మాత్రమే అనుకో. ముగింపు మాత్రం కాదు. కాకూడదు.

అలా అని నీ భార్య పోయినందుకు నేను ఆనందిస్తున్నాననుకునేవు. చినిగిన గాలిపటంలాంటి జీవితం నుంచి ఆ మహా ఇల్లాలు నిష్క్రమించింది. దూరతీరాలకు, పుణ్యలోకాలకు తరలిపోయింది. బతికినంతకాలం ఆవిడ సుఖపడలేదు. ఆవిడని అలా చూస్తూ నువ్వూ సుఖపడలేకపోయావు. ఆమె ఓ శాపగ్రస్తురాలు. జీవితంలోని కటిక చేదును, విషాన్ని మీరుభయులూ అనుభవంలో చూశారు. ఇకనైనా ఆ జీవితానికి తెరదించమని నా ప్రార్థన. కనీసం శేషజీవితమైనా నువ్వు సుఖపడాలని నా ఆశ, అభిలాష. దయచేసి ఒంటరివాడిగా జీవితం గడపాలని మాత్రం అనుకోకు.

ఒంటరి జీవితం భరించలేనిది. భరించరానిది. లేవలేనినాడు 'మన' అనే ఆత్మీయుల స్పర్శ మనకు అమృతతుల్యమవుతుంది. ఆ స్పర్శ ఇచ్చే ఓదార్పు మరేది ఇవ్వలేదు. ఎంతోచూసిన అనుభవంమీద నీకు నే రాస్తున్న ఉత్తరం ఇది.

నీకు అంగీకారమైతే మా ఊళ్ళో నాకు తెలిసిన ఓ మంచి సంబంధముంది. అమ్మాయి గొప్ప అప్సరస కాకపోయినా, మంచి మనస్సున్న పిల్ల అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. విద్యావంతురాలు కూడా. టీచర్‌గా పనిచేస్తోంది. ఆ అమ్మాయి దురదృష్టమేమిటోగాని, ఎంత ప్రయత్నించినా ఒక్క సంబంధమూ కుదరలేదు ఇప్పటిదాకా. తిరుగు జవాబులో నీ మనస్సులోని మాట రాస్తే, నేను ఆ పిల్ల తండ్రితో మాట్లాడతాను. బాగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటావని ఆశిస్తూ...

నీ మిత్రుడు రాము"

విశాఖ-2

మధ్యాహ్నం రెండుగంటల టపాలో వచ్చిన ఆ ఉత్తరం వాసు చదవటం ఇది రెండోసారి. సమయం కోసం గడియారం వంక చూశాడు. సాయంత్రం అయిదున్నర కావస్తున్నది. ఓసారి ఆఫీసునంతా కలయజూశాడు. ఎక్కడా మనిషి అలికిడి, జాడ లేదు. అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయారు. సిగరెట్టు అంటించాడు. అతని మస్తిష్కం నిండా రాము రాసిన ఉత్తరం లేపిన ఆలోచనలే గిర్రున తిరుగుతున్నాయి. అవును! తన భార్య కమల పోయి సంవత్సరమైంది. ఈ సంవత్సరంపాటూ కమల మిగిల్చిపోయిన జ్ఞాపకాలతోనే జీవితం నెట్టేశాడు తను. క్షణంపాటు గతం అతని కళ్ళముందు లీలగా మెదిలింది.

తను కమలను పెళ్ళిచూపులు చూడటం, ఆ తర్వాత అందరినీ తోసిరాజని ఆమెనే పెళ్ళి చేసుకోవటం, రెండేళ్ళ తర్వాత ప్రసవంలో కమలకు పక్షవాతం రావటం, ఆ వ్యాధితోనే కమల చివరి క్షణందాకా ప్రతి నిమిషం కుమిలిపోతూ జీవితం గడపటం, తానే సమస్తమై కమలకు తుది ఘడియదాకా సేవచేసి, ఆమె మరణానంతరం ఆమెకు పట్టుబట్ట కట్టి, పసుపు కుంకుమలతో ఘనంగా వీడ్కోలు చెప్పటం- అంతా సినిమారీళ్ళలా గిర్రున తిరిగింది మనోమందిరంలో.

కమల గురించి స్మృతులు వాసు కనుకొలనుల్లో నీటిబొట్లను నిలిపాయి. అతని హృదయం బరువెక్కింది. ఒక్కక్షణం నిట్టూర్చి సీట్లోంచి లేచి బయటికి నడిచాడు. అయినా రాము రాసిన ఉత్తరం అతని మదిలో తవ్విన సొరంగంలో, ఆలోచనలనే సాలిగూళ్ళు వేగంగా అల్లుకుంటూ పోసాగాయి.

జీవితంలో ఓ వ్యక్తి ప్రవేశం, నిర్గమనం అంత తేలిగ్గా తీసుకోలేకపోతు న్నాడు తను. కమల స్థానంలో మరో వ్యక్తిని ఊహించటమే తనకు చాలా బాధగా, కష్టంగా ఉంది. వెన్నలాంటి ఆమె మనసును చవిచూసిన తను, అనుక్షణం ఆమె వియోగాన్ని తలపోస్తూ, జీవితంలో అడుగడుగునా వగరుస్తూ బ్రతగ్గలడా? ఒకవేళ మరో స్త్రీని తన జీవితంలోకి రానిస్తే తను కమలను మరిచిపోగలడా? అలా మరిచిపోలేకపోతే తన జీవితం ఇంతకంటే నిర్లిప్తంగా, పేలవంగా, ఓ వ్యథగా మారిపోదా?

ఇవే అతన్ని వేధిస్తున్న ఆలోచనలు. నిజమే మరి! భార్యాభర్తలు నిజంగా ఒకరినొకరు ఆరాధించుకున్నప్పుడు, వారిరువురిలో ఒకరి నిర్గమనం మరొకరికి ఎంత పెద్దసమస్య అవుతుందో చాలామందికి తెలియదు. అందుకే ఇది చాలామందికి అరుదైన సమస్య. మరికొందరికి ఇది సమస్యే కాదు. మనుషుల మార్పిడి తప్ప మనస్సుల విలువలు తెలియనివారికి ఇది అసలు పట్టనే పట్టదు.

కాని వాసు మనస్సున్న మనిషి. అందుకే అతనికి ఇది ఓ చిక్కు సమస్య. ఓసారి జీవితంలో దెబ్బతిన్న వ్యక్తి రెండోసారి తొందరపడటానికి జంకుతాడు. సరిగ్గా ఇదే అతని మానసికస్థితి కూడా. కమల, తానూ సుఖపడ్డారా, కష్టపడ్డారా అన్నది తనకు అప్రస్తుతం. తామిరువురూ పరస్పర అంకితభావంతో ప్రేమగా కడదాకా మెలిగారు. అలాంటి తనముందు భయంకరమైన ఒంటరిజీవితం కాలనాగులా కోరలు చాచుకు కూర్చుంది. తనేం చేయాలి? ఇలా ఊగిసలాడే మనస్సుతో ఇంటికి చేరాడు వాసు. ఇంటికి వేసిన తాళం కప్పకు ఓ చీటీ వేలాడుతూ కనిపించింది. ఆ చీటీ తీసి చదివాడు.

"డియర్ వాసూ! చాలా కాలమైంది మనం కలిసి. మీ ఇంటికి వచ్చాను సాయంత్రం. నువ్వు లేవు. వీలైతే రేపు ఉదయం ఓసారి నా క్లినిక్‌కి రా! కులాసాగా కాసేపు మాట్లాడుకుందాం – డాక్టర్ గోపాల్"

చీటి చదువుకుని జేబులో పెట్టుకుని తాళం తీశాడు వాసు.

ఉదయం ఎనిమిదింటికల్లా గోపాల్ నర్సింగ్ హోమ్‌లోకి అడుగుపెట్టాడు వాసు. బయట కనబడిన వ్యక్తిని "డాక్టరుగారున్నారా?" అని అడిగాడు.

"ఉన్నారు సార్!" చెప్పాడతను.

జనం లేరు. హాస్పిటల్ నిశ్శబ్దంగా ఉంది. ఇంకాసేపైతే ఇదే హాస్పిటల్ జనంతో గందరగోళంగా ఉంటుందనుకుంటూ కన్సల్టింగ్ రూము దగ్గరకు నడిచాడు వాసు. అక్కడ నిలబడ్డ వ్యక్తి వాసును విష్‌చేస్తూనే "లోపల పేషంట్ ఉన్నారు సార్! ఒక్క క్షణం ఆగండి" అని చెప్పాడు వినయంగా.

అతను ఆ మాట చెబుతూండగానే లోపలి వ్యక్తి ఓ కర్ర సాయంతో నడుస్తూ, టక టక శబ్దం చేస్తూ కన్సల్టింగ్ రూమ్ నుంచి బయటికి వచ్చేశాడు. అతని వంక ఓసారి తేరిపార చూసి లోపలికి అడుగుపెట్టాడు వాసు. వాసును చూస్తూనే "రా వాసు, రా! చాలా రోజులైంది నిన్ను చూసి. ఎలా ఉన్నావ్?" అంటూ ఆదరంగా పిల్చాడు గోపాల్. కుర్చీలో కూలబడ్డాడు వాసు.

"ఇదిగో ఇలా ఉన్నాను. ఏమిటి విశేషాలు?" అంటూ కుర్చీలో కూల బడ్డాడు వాసు.

"ఏముంది? ఇప్పుడెళ్ళిన పేషెంట్‌ను చూశావా? అతనో వండరఫుల్ జంటిల్మన్!" అన్నాడు గోపాల్.

"చూశాను. ఏమిటి ఆయన స్పెషాలిటీ?"

"ఆయనకు ఇప్పుడు సుమారు డెబ్బై ఏళ్ళు ఉంటాయి. పేరు కృష్ణమోహన్. మిలటరీలో కొంతకాలం పనిచేసి ఆ తర్వాత వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్‌కింద రిటైరయ్యాడు. యూ నో, హీ ఈజ్ ఏ బాచిలర్!" అన్నాడు గోపాల్.

గోపాల్ చెప్పిన చివరిమాట వాసు మనసును ఇట్టే ఆకర్షించింది. దాంతో అతనికి కృష్ణమోహన్ గురించి మరింత తెలుసుకోవాలన్న ఆసక్తి పుట్టుకొచ్చింది. ఒక్కోసారి ఒక్కో విషయానికి ఒక్కో రీతిగా స్పందించడం వ్యక్తుల మానసిక స్థితిపైన ఆధారపడి ఉంటుంది. "ఈజిట్'? మరి ఇంతకాలం ఒంటరి జీవితం ఎలా గడిపాట్ట? అడిగావా ఎప్పుడైనా?" అడిగాడు వాసు ఎంతో క్యూరియస్‌గా.

"ఎస్! ఆయన మా ఇంటి పక్కనే ఉంటారు గనుక వివరాలన్నీ బాగా తెలుసు. కాలిలో ఎముక ఎక్కువ పెరిగి నొప్పిచేసి నడవలేకపోతుంటే చూపించ టానికి వచ్చాడు. రెండురోజుల్లో ఆపరేషన్ చేస్తానని చెప్పాను. మేజర్ ఆపరేషన్."

"ఏమన్నాడు?"

"అలాగేనన్నాడు. సరిగ్గా ఎల్లుండి ఉదయం ఈ టైముకల్లా వస్తానన్నాడు."

"మరి ఆపరేషన్ అంటే భయపడలేదా? తోడు తెచ్చుకుంటానని అనలేదా?"

"వాసూ! చెప్పానుగా. అతనో స్ట్రేంజ్ పర్సనాలిటీ. అతని గురించి నీకు అంతగా తెలుసుకోవాలనుంటే పూర్తిగా చెబుతాను విను. మొదటిసారి అతను పరిచయమైనప్పుడు అతన్ని గురించి తెలిసి నేనూ ఆశ్చర్యపోయాను. ఎందుకు పెళ్ళిచేసుకోలేదని అడిగాను. అతనేమన్నాడో తెలుసా? ఆ అవసరం అతనికి లేదనిపించిందట. అసలు పెళ్ళి ఆలోచనే ఆ వయస్సులో అతనికి అంత పెద్దగా కలగలేదుట. శారీరిక అవసరాలు కూడా అతన్ని ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదట. అలాంటి అవసరం ఎప్పుడైనా ఉందనిపిస్తే ఏదో ఓ పని కల్పించుకుని మనసును ఆ దారికి మళ్ళించేవాడట. పెళ్ళంటే ఏవిధమైన విముఖత ప్రత్యేకంగా లేదన్నాడు. పెళ్ళి చేసుకున్నవాళ్ళు సుఖమనుభవిస్తున్నారనుకోవటం ఉత్త భ్రమ అని కొట్టిపారేశాడు. 'పెళ్ళి చేసుకున్నవారు పిల్లల్ని కంటారు. అది ప్రకృతిసహజం. వారితో ప్రేమలను ముడివేస్తారు. అక్కడే తప్పటడుగు వేస్తారు. చివరకు పోయేటప్పుడు ఆ పిల్లల తిరస్కారానికి గురవుతారు. ఎంతమంది తల్లిదండ్రులు పిల్లల్ని వాళ్ళ సంతృప్తిమేరకు పెంచగలుగుతున్నారు? ఎంతమంది పిల్లలు చివరికాలంలో తల్లిదండ్రులను ఆదుకొంటున్నారు? సో, ఇదంతా ఓ అర్థంలేని తతంగం' అని అన్నాడు. అంతేకాదు. చివరికాలంలో ఆయన్ని ఎవ్వరూ చూడాల్సిన పని లేదట. ఆస్పత్రులలో సిస్టర్స్‌ను మించిన బంధువులు లేరనీ, వాళ్ళు ఆయన్ని కష్టాల్లో ఎన్నోసార్లు ఆదుకున్నారని అన్నాడు. పైగా మరణానంతరం ఆస్తినంతా రామకృష్ణ మఠానికి చెందేలా రాశానని కూడా చెప్పాడు. ఒంటరి జీవితంకన్నా హాయి మరోటి లేదన్న దృఢమైన అభిప్రాయం కలవాడు. ఫెంటాస్టిక్, బట్ నైస్‌మాన్" అంటూ ముగించాడు గోపాల్.

గోపాల్ చెప్పింది విని తనకు తెలియకుండానే ఆలోచనలో పడిపోయాడు వాసు. కృష్ణమోహన్ జీవితంలో ఏదో సత్యం కనిపించినట్లయింది వాసుకి.

"ఏరా? అలా స్టన్ అయిపోయినట్లు ఉండిపోయావ్ ఏమిటి?" అడిగాడు గోపాల్ వాసును చేత్తో తడుతూ. తత్తరబడుతూ ఈలోకంలోకి వచ్చాడు వాసు.

"అవును గోపాల్. కృష్ణమోహన్‌గారి జీవితంలో నిజంగానే ఓ సందేశం ఉంది. ప్రస్తుతం నేనెదుర్కొంటున్న సమస్యకు ఆయన జీవితం ఓ పరిష్కారం

కూడా కావచ్చు" అంటూ తనకు రాము రాసిన ఉత్తరం గోపాల్‌కు అందించాడు.

రాము రాసిన ఉత్తరం చదివి, తిరిగి ఆ ఉత్తరం వాసుకు ఇస్తూ "చూడు వాసూ! ఇప్పటికే నీ జీవితంలో ఎవ్వరూ చూడని దురదృష్టాన్ని చూశావు. ఓసారి దెబ్బతిన్న మనిషికి మరోసారి ఏమూల ఏమి పొంచి ఉందో అన్న జాగ్రత్త కూడా అవసరం. ప్రతిసారీ దెబ్బతినేందుకు మనిషి మనస్సు సిద్ధంగా ఉండదు. ఇక రెండో పెళ్ళి విషయానికి వస్తే నీ అదృష్టం ఎలా ఉందో ముందే ఊహించటం కష్టం. ఒకవేళ విధి వక్రిస్తే, కోరి కష్టం తెచ్చుకున్నట్లవుతుంది. జాగ్రత్త మాత్రం చెప్పగలం. ఆపైన నీ ఇష్టం. నువ్వే ఆలోచించి ఓ నిర్ణయానికి రా" అని చెప్పాడు గోపాల్.

గోపాల్ సమాధానం విని, మరికాసేపు అతనితో మాట్లాడి, సెలవు తీసుకుని ఆఫీసుకు బయలుదేరాడు. అనుకోని ఈ సంఘటనతో అతని మనస్సు ఒంటరి జీవితంవైపే మొగ్గింది. అదే నిర్ణయం రాముకు రాద్దామనుకున్నాడు.

సాయంత్రం వాసు ఇంటికొచ్చేసరికి ఇంటి దగ్గర సూర్యం, శాంతమ్మ దంపతులు వచ్చుండటం చూసి ఆశ్చర్యపోయాడు వాసు. సూర్యం, శాంతమ్మ, వాసులది ఒకే ఊరు. వాసు చదువుకునే రోజుల్లో సూర్యం, శాంతమ్మలు ఒకరోజు భోజనం పెట్టేవారు. అదే వారి మధ్య బాంధవ్యం.

వాసు ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే "బాగున్నావా బాబూ? మేం గుర్తున్నామా?" అని అడిగాడు సూర్యం.

"ఆ... గుర్తుండకపోవటమేమిటి? మీ ఉప్పు తిన్నవాడిని. ఏమిటిలా వచ్చారు? ముందుగా ఉత్తరం రాస్తే నేనే స్వయంగా స్టేషన్‌కు వచ్చి ఉండే వాణ్ణి కదా! ఎలా ఉన్నారు పిన్నీ?" ఇద్దర్నీ ప్రేమగా పరామర్శించాడు వాసు.

"మాదేముందిలే బాబూ? పెద్దవాళ్ళమై పోయాం. నీ సంగతి తల్చుకుంటేనే బాధేస్తోంది. పాపం కమల పోయిందటగా" అడిగింది శాంతమ్మ వేదన వ్యక్తం చేస్తూ. శాంతమ్మ ప్రశ్నకు వాసు దగ్గర బదులేముంది? అందుకే మౌనందాల్చి, తలుపుతీసి సూట్‌కేసు, ఇతర సామానులు లోపలికి పట్టుకెళ్ళాడు. శాంతమ్మ సూర్యంగారికి భుజం మోటింపు ఇచ్చి లోపలికి నడిపించుకు రాబోయింది.

అదిచూసి గబగబా పిన్నికి ఎదురొచ్చి "ఏమైంది పిన్నీ, బాబాయికి?"

అని ఆదుర్దాగా అడిగాడు వాసు. ఆమెను పక్కకు తప్పించి సూర్యంగారి భుజం అతడు అందుకున్నాడు వెంటనే.

"ఏమని చెప్పను నాయనా? వారం క్రితం స్నానాలగదిలో జారిపడ్డారు. మోకాలిక్రింద ఎముక ఏదో విరిగిందట. మన ఊరి గురించి తెలియందే ముంది? అక్కడ డాక్టర్లు మందులు రాసి ఇక్కడికి పొమ్మన్నారు. ఇక్కడ పెద్దాసుపత్రిలో చూపించాలని తెచ్చాను" అంది శాంతమ్మ.

"మరి మీ పిల్లలు చంద్రం, గుర్నాథం ఏరి? వాళ్ళు రాలేదా? వాళ్ళు ఎక్కడ ఉన్నారు?" తన సంశయాలను వరుసపెట్టి గుప్పిస్తూ అడిగాడు వాసు.

"గుర్నాథం కలకత్తాలో ఉంటున్నాడు. వాడికి పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. భార్య కూడా ఉద్యోగం చేస్తోంది. చంద్రం ఢిల్లీలో ఏ.జీ. ఆఫీసులో ఆడిటర్గా పనిచేస్తున్నాడు. వాడిక్కూడా పెళ్ళయింది. ఓ కొడుకు వాడికి."

"మరి వాళ్ళకు ఈ విషయం రాయలేదా?"

"ఎందుకు రాయలేదు బాబూ? రాశాం. కానీ ఎవ్వరికీ ఇప్పుడు సెలవులు దొరకటం కష్టమట. ఆ తిప్పలేవో మమ్మల్నే పడమని రాశారు. సరే! ఊళ్ళో నువ్వున్నావు కదా అని నీ అడ్రస్ తీసుకుని ఇక్కడికి వచ్చాం. డాక్టర్లు ఆపరేషన్లో ఎముక సరిచేయాలట. ఈ గండంనుంచి నువ్వే గట్టెక్కించు బాబూ! నీ రుణం తీర్చుకోలేం" అంది శాంతమ్మ అర్థిస్తున్నట్లుగా.

"ఛ! అదేమిటి పిన్నీ! మీరంతా తలా ఓ చేయి వేయకపోతే నేనింతవాడిని అయ్యేవాడినా? మీ చంద్రం, గుర్నాథంతో సమానం కాదా నేను. నిజమే పిన్ని, ఒక్కోసారి ఏవో ఇన్స్పెక్షన్లంటూ హడావుడి రిపోర్టులంటూ గవర్నమెంటు ఉద్యోగస్తులకు అత్యవసరాల్లో కూడా సెలవులివ్వరు. పాపం! వాళ్ళు మాత్రం ఏం చేస్తారు?" అన్నాడు వాసు.

ఆ రాత్రికి శాంతమ్మే వంట చేసింది.

తను ఆడవాళ్ళ చేతివంట తినక ఎంతకాలమైంది? తను వండుకునే నాలుగు చప్పిడి మెతుకుల ముందు పిన్ని వంట మధురాతిమధురంగా అనిపించింది. ఆ ఆలోచనలు సహజంగానే రాము రాసిన ఉత్తరం దిశగా పయనించాయి మళ్ళీ.

ఆ రాత్రి వాసుకు చాలాసేపు నిద్రపట్టలేదు. ఓవైపు ఆ బ్రహ్మచారి మోహన్, మరోవైపు బాబాయి, పిన్నీ అతని మనసులో సాక్షాత్కరించారు. తిరిగి అనేక ప్రశ్నల అంతర్యుద్ధం. అలా ఘర్షణ పడుతూనే నిద్రలోకి జారుకున్నాడు.

సూర్యం, మోహన్‌లకు ఆపరేషన్ చేశాడు గోపాల్. ఇద్దరిదీ ఒకే గది. పక్క పక్క మంచాలే. ఉదయం, సాయంత్రం ఆఫీసుకు వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడూ వాసు హాస్పిటల్‌కి వస్తూనే ఉన్నాడు. సూర్యం జీవితం అనుభవం అనే పూలు పూసి, పళ్ళు పండిన చెట్టు. మోహన్ జీవితం తర్కంతో మోడైపోయి వెదురు బొంగులా నిలిచిన చెట్టు. ఈ రెండు పక్క పక్కనే ఉండటం చూసి "ఆహా! ఏమి కలయిక?" అనుకున్నాడు వాసు.

సూర్యం, మోహన్ మంచాలపై మౌనంగా పడుకోలేదు. ఒకరి జీవితానుభవాలు మరొకరికి చెప్పుకున్నారు. ఒకరి జీవితంలో చేదును మరొకరు పంచుకున్నారు. ఒకరికి తెలియకండా ఒకరిపైన ఒకరు జాలిపడ్డారు. ఇద్దరూ తల పండిన తత్త్వవేత్తలే. జీవితాన్ని శోధించినవారే. ఇద్దరూ ఏకీభవించినవి ఉన్నాయి, అంగీకరించనివి ఉన్నాయి. ఉన్న పదిహేను రోజులూ ఒకరితో ఒకరు వాగ్యుద్ధం చేసుకుంటుంటే ఆస్పత్రికంతా వినోదంగానే మారింది. వారి వాదాలు డాక్టర్ గోపాల్ చెవికి, అతని ద్వారా వాసుకి చేరేవి. అవి విన్నప్పుడు వాసు మనస్సులో మాటిమాటికి అంతర్యుద్ధం గూడా జరిగేది.

రోజులు దొర్లిపోయాయి వేగంగా. ఆ రోజు ఇద్దర్నీ డిశ్చార్జి చేస్తారని తెలిసి పొద్దున్నే ఆస్పత్రికి వెళ్ళాడు వాసు.

"సూర్యంగారూ! మీతో ఎన్నోసార్లు వాదించాను. వాదించింది మాత్రం వాదన కోసం కాదు. మీతో వాదించాక ప్రతిసారీ మనస్సులో మీరు చెప్పింది విని విశ్లేషించి ఆలోచించాను. జీవితంలో ఒంటరితనం ఓ భాగమేనని ఇప్పుడు మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. అది తప్పనిసరైతే తప్ప మనిషి కోరుకోరానిదన్న అనుభవంతో మీరు చేసిన వాదం ముందు తొలిసారి నేను తలవంచుతున్నాను. పిల్లలను కనటం, వారిస్పర్శలో ఆనందం, అనుభూతి పొందటం, వారి కోర్కెలు తీర్చి మన ముచ్చట తీర్చుకోవటం, వారంటే ప్రేమపడటం అంతా ఓ అపూర్వమైన

అనుభవం. జీవితంలో ఎత్తుపల్లాలను చూసే అపూర్వమైన అవకాశం కలిగిస్తుంది ఆ అనుభవం. అది లేని ఒంటరిజీవితం నిరర్థకం. మనిషి తనకోసమే తాను బ్రతకటం పూర్తిగా స్వార్థం. అర్థరహితం అని మనసారా ఒప్పుకుంటున్నాను. ఈ సత్యాన్ని ఇంతకాలం తెలుసుకోలేకపోయినందుకు చింతిస్తున్నాను. ఎప్పుడన్నా వీలైతే తప్పక మిమ్మల్ని కలుస్తాను మళ్ళీ. సెలవు" అన్నాడు మోహన్.

"క్షమించండి కృష్ణమోహన్‌గారూ! మీ మనస్సు కష్టపెట్టాలని నేనెప్పుడూ వాదించలేదు. మీ ఒంటరిజీవితం నుంచి పిల్లల నిరాదరణకు గురైన తల్లి దండ్రులు నేర్చుకోవాల్సిన ఆదర్శం ఎంతో ఉంది. మీలా ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో ఒంటరితనం ఎదుర్కోలేక, చేతకాక చాలామంది తమ పిల్లల పంచనే పడి భరించరాని దుఃఖానికి, అవమానానికి గురవుతున్నారు. అలాంటి వాళ్ళు ఇకపై ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాల్సిన రోజులివి. కాని జీవితం ఒక వనంలాంటిది. ఏ చెట్టుకా చెట్టు విడిగా ఉన్నా అన్ని చెట్లూ కలిసి ఉంటేనే అది వనం అవుతుంది. మబ్బులను ఆకర్షిస్తుంది. వానలను కురిపిస్తుంది. ఎండలను అడ్డుకుంటుంది. అలాంటిదే సహజీవనం. అదే జీవనవనం, మానవ వనం. అందుచేత తప్పనిసరైతే గానీ, ఏ వ్యక్తీ ఒంటరిజీవితం కోరుకోగూడదు. అదే నేను మీకు చెప్పింది. దయచేసి నా అభిప్రాయం మన్నిస్తారని భావిస్తాను. సెలవు" అన్నాడు సూర్యం.

వాళ్ళిద్దరి మాటలు విన్న వాసుకు అంతవరకూ పీడిస్తున్న అన్ని సమస్యలు సమసిపోయాయి. ఒక్కసారిగా అతని మనసు తేలికపడింది. సూర్యం బాబాయిని ఇంటికి తీసుకువెళ్ళిన వెంటనే రాముకు ఆ పెళ్ళిసంబంధం గురించి ఉత్తరం రాద్దామనుకున్నాడు వాసు.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 14–3–1990

❀

భిన్న కోణాలు

నా భార్యకు ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ. ఏ మాట మాట్లాడినా చటుక్కున తప్పర్థమే స్ఫురిస్తుంది దానికి మొట్టమొదట. ఆ సంగతి మనం విడమరచి చెప్పినా ససేమిరా అంగీకరించదు. పైగా, వాదానికి దిగుతుంది. దాంతో మన బుర్ర గిర్రున తిరిగి పసిఫిక్ మహాసముద్రంలో పడుతుంది. అంతవరకే అయితే బాగానే ఉండేది. వాదించేవాడే పోతాడు గుంటేసి గంట వాయించి. కాని, నిష్కారణంగా కోపం తెచ్చుకొనే బలహీనతవల్ల, నోటిదురుసు వల్ల ఇరుగుపొరుగుతో చీటికిమాటికి చిటుకూ, చిటుకూ కొట్లాటలు తెస్తుంది. అక్కడ మాత్రం ఆవిడని అదుపుచేయడం ఎవరివల్లా కాదు. ఎవ్వరూ దొరక నప్పుడు నన్ను చెండుకుతింటుంది. దానికి బాధ్యుడిని నేనేనని మీరంటే కాదని నేనెలా అనగలను చెప్పండి! ఈ భూమి ఎందుకు పుట్టింది? అని ప్రశ్న వేస్తే ఏమి సమాధానం వస్తుందో, మా ఆవిడకి కోపం ఎందుకు వస్తుందనటానికి కూడా అదే సమాధానం వస్తుంది.

అయితే, అప్పటికి మా ఆవిడేదో చాలా ప్రత్యేకం అనుకొనేరు. మా ఆవిడ లాంటి మనస్తత్వం ఉన్న ఆడ, మగవారిని చాలామందిని నే నెరుగుదును. ముషీరాబాదు ఇంట్లో నేను అద్దెకుండే రోజుల్లో మా ఇల్లుగల ఆయన గుండేరావు భార్య వాళ్ళాయనని “నా మొగుడు ముండాకొడుకు” అంటూ ముద్దుగా సంబో ధించేది. ఆవిడ మాటలన్నీ పచ్చిబూతుల్లా ఉన్నా ఆయన మాత్రం “పాపం మా ఆవిడ అమాయకురాలు. లోకం తెలియనిది. దానికి కపట నాటకాలు బొత్తిగా చేతకావు” అని నవ్వుతూ నాతో అంటుండేవాడు. అయితే త్వరలోనే

అతని స్థానంలోకి నేనూ చేరతానని మాత్రం నే ఊహించలేదు. నిజానికి ఇలాంటివి ఎవరూహిస్తారు చెప్పండి?

నా చిన్నప్పుడు మా ఇంటి దగ్గర ఉండే టుబాకో సూపర్‌వైజర్ లక్ష్మీ నారాయణగారు, మా మాష్టారు సూర్యారావుగారు వాళ్ళ భార్యలను "లకార, జకార, మకారా"లతో ముద్దుగా సంబోధించి తమ వాక్పటిమకు మురిసి పోతుండేవారు. అప్పుడప్పుడు నేను నన్ను గూడా ఈ లిస్టులో వేసుకొని ఏవో ఊహల్లో తేలిపోతుండేవాడిని. అనుకరణ అనేది చిన్నప్పటి నుంచి మనకు తెలియకుండా మనమీద వేసే ముద్రలు ఇలాంటివే. వీటిలో బాగా చలాయించే మనస్తత్వాన్ని చిన్ననాటి మన మనస్తత్వాలు సులువుగా ఆకర్షిస్తుంటాయి. అనుకరిస్తుంటాయి. ఈ సత్యాలన్నీ పెళ్ళి అయ్యాక నాకు తెలిసి వచ్చేటప్పటికి విషయం చాలా దూరం వెళ్ళిపోయింది. మా స్నేహితులు పెళ్ళి ముందురోజు నన్ను చివరిసారిగా నవ్వించి తీయించుకున్న ఫొటోనే నాకు దక్కిన ఆస్తి. పెళ్ళయిన తర్వాత నేనిక మనస్ఫూర్తిగా నవ్వలేదు. కాకపోతే ఒక్కటి మాత్రం నిజం. నాలాగా నవ్వనివారు, నవ్వలేనివారు ప్రతి ఐదుగురిలో ముగ్గురు ఉన్నా ధైర్యంగా ఇలా రాయగలినవాళ్ళు మాత్రం నూటికి ఒక్కరు మాత్రమే.

పెళ్ళయిన కొద్దిసంవత్సరాలలోనే మా ఆవిడకు, నాకు పొసగటం అసాధ్య మనిపించింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నానాటికీ ఉధృతమైందే తప్ప తగ్గలేదు. ఈ సంగతి మా ఆవిడవైపువాళ్ళకు, మావైపు పెద్దవాళ్ళకు తెలియ పరిచినా పెద్ద ప్రయోజనం కనిపించలేదు. మా ఆవిడవైపువాళ్ళదంతా ఆడ పెత్తనం. మా మామగారు తన భార్య ఓ పెద్దమూర్ఖురాలు అని తెలిసిన మరు క్షణమే ఆమెకు శిరస్సు వంచి ప్రణమిల్లాడు. పైగా ఓ గ్రహణం పీడవదిలినా వదిలినట్లేగా– అని మనస్సులో సంతోషించి, కూతురుకు వత్తాసు పలకటమే ఆత్మరక్షణగా భావించాడు. మావైపు మగపెత్తనం సంప్రదాయమైనా, నావరకు వచ్చేసరికి నాకు మద్దతుగా అక్కయ్యలు తప్ప మరెవ్వరూ లేకపోయిరి. అమ్మ నా పెళ్ళినాటికే అంతంతమాత్రం ఆరోగ్యంతో ఉండేది. ఆమె ఆరోగ్యం ఇప్పుడు ఇంకాస్త దిగజారిపోయింది. అంతటితో నేను శరణార్థుల జాబితాలో చేరక తప్పలేదు. కాని, లోలోన ఈరకమైన స్త్రీ మనస్తత్వం మీద తిరుగుబాటు

చేయాలనే ఉండింది. కాని అవకాశం నన్ను కరుణించలేదు.

భర్త వేధింపులు పడలేని భార్యల కథలు ఎంతో తక్కువశాతం ఉన్నా పత్రికల్లో ప్రముఖంగా కనిపిస్తాయి. మరి భార్యా బాధితుల సంఘంవారి మొర వినేదెవరు? ఈ సంక్షుభిత పరిస్థితిలో మా ఇద్దరి మధ్య మౌన ఒడంబడిక కుదిరినా పరిస్థితి మరోలా ఉండేదేమో? అలాంటి ఆలోచన మరెవ్వరికీ అప్పట్లో కలగకపోవడం శోచనీయమే.

ఇక నా పరిస్థితి ఏమి చెప్పను? సంసారంపట్ల నాకు ఉన్న గాలిమేడలన్నీ కుప్పకూలిపోయినాయి ఈ పదేళ్ళ సంసార జీవితంలో. ఆఖరికి భోజనం విషయంలో కూడా మా మధ్య గొడవలే. 'భోజన విషయం' అని ప్రధానంగా ఎందుకంటున్నానంటే నాకు తిండంటే మహాప్రాణం. అసలు మనిషి ఉద్యోగం చేసేది జానెడు పొట్టకోసమే కదా! అదికూడా ముప్పూటలా నోచుకోని జీవితం నాది. ఏం చెప్పమంటారు నా దౌర్భాగ్యం! నిజానికి నాకు తిండి విషయంలో కూడా కొన్ని ప్రత్యేక అభిరుచులు, కోరికలు ఉన్నాయి. ప్చ్! ఆఖరికి సన్యాసిగా అఘోరించిన రోజుల్లో కూడా రూములో వంట చేసుకొంటుంటే ఆ ఘుమఘులకు ఇరుగుపొరుగు అమ్మలక్కలు ముక్కుమీద వేలేసుకొనేవారు. నిజానికి అప్పుడున్న సుఖం కూడా ఇప్పుడు లేదు మరి! ఇలా నా జీవిత పూర్వరంగాన్ని ఓసారి సింహావలోకనం చేసుకొంటూ, 'మరపురాని బాధకన్నా మధురమే లేదు' అని పాట పాడుకుంటూ స్కూటర్‌మీద ఇల్లు చేరేసరికి, బయటకి ఘుమఘుమ లాడుతూ ములక్కాడ పులుసు వాసన వచ్చి ముక్కుపుటాలను అదరగొట్టింది.

"అబ్బో! ఏమిటి విశేషం? ఈనాడు నాకిష్టమైన వంటకంతో ఇల్లు సుగంధ పరిమళ ద్రవ్యాలను వెదజల్లుతోంది. అదేదో వక్కపొడి ప్రకటన చెప్పినట్లు" అన్నాను నేను.

నా అభిప్రాయంలో అది ఓ ప్రశంస. కాని, మా ఆవిడ "ఛీ! ఛీ! ఎప్పుడూ మీకిష్టమైన వంటకాలే చేస్తున్నా ముఖం వాచినట్లు మాట్లాడతారు. మీలాంటి వాడికి వంట చేయటంకన్నా ముండమోసి ఓ మూల కూర్చోవటం నయం" అని కొంగు ముడివేసి, నడుము కట్టులోకి దోపి గరిటకాడ నావైపు చూపించింది నన్ను కొట్టాలన్నట్లుగా.

ఆమె అవగాహనాశక్తికి, అంత అపురూపంగా బ్రహ్మ పనిగట్టుకొని మరీ ఆమెను సృష్టించినందుకు ఆయనగారికి, క్రియరూపేణా కారకుడైన మా మామ వెధవాయికి మనస్సులోనే జోహార్లు అర్పించుకొని "అది కాదోయ్! నేను నిన్ను పొగుడుతుంటే దెప్పినట్లు ఎందుకనిపించింది నీకు?" అని వివరించబోయాను.

"చాల్లెండి! ఇంతసేపు బజార్లో స్నేహితులతో అఘోరించి ఇంటికొచ్చారు. ఈ పూటయినా సినిమాకు వెళ్దాం. మీ దరిద్రపు తిరుగుళ్ళతో ఒకటీ నెరవేరి చావదు. ఛీ! ఛీ! మీలాంటాయన ఉన్నా పోయినా ఒక్కటే నాకు" అంటూ ముక్కు చీదింది. చేసేదిలేక, దాని కోపానికి కారణమేమిటో అసలు తెలియక దాని మాటల హోరుకు ఉక్కిరిబిక్కిరై, మతి చెడినట్లై, ఏదీ పాలుబోని స్థితిలో చతికిలబడ్డాను. తిన్నగా వంగి బూట్లు విప్పబోయాను.

ఇంతలో గయ్యిమని అందుకొంది మా ఆవిడ, "అవి విప్పకండి. మొద్దు బుర్ర! చెబితేగాని తెలుసుకొని చావలేరు. ఈ రోజు మన పెళ్ళిరోజు, గుర్తుకు రాలేదా? ముందు మొహం మొద్దులు చేసుకురండి" అంది.

"ఓసి నీ ప్రేమ మునక్కాడ పులుసులో ఉడకా! అదా విషయం. పదపద సెకండ్‌షో సినిమాకన్నా వెళ్దాం" అంటూ బాత్‌రూమ్‌వైపుకు నడిచాను.

ఆ క్షణంలో నాకు ధైర్యం నూరిపోస్తూ ముషీరాబాదు గుండేరావు, మా మామగారు నా కళ్ళముందు సాక్షాత్కరించారు. 'ఈ ప్రపంచంలో ఎవ్వరినీ నీ మంచి గురించి ఒప్పించడానికి ప్రయత్నించబోకు. ఎందుకంటే నువ్వు అలా ప్రయత్నించినకొద్దీ అవతలివారు మరింత కొండెక్కి కూర్చుంటారు' అని నా మిత్రులు పదే పదే బోధించిన మాట ఆ క్షణం నా చెవుల్లో మారుమ్రోగింది.

మేమిద్దరం తన్నుకు తలకు పోసుకున్నా పెళ్ళిరోజు మాత్రం సిగ్గులేకుండా ఘనంగా జరుపుకుంటాం. అంతా పాశ్చాత్యుల పద్ధతి. ఈనాడు ఈ రకమైన భార్యాభర్తల దాంపత్యమే ఆదర్శదాంపత్యం కదా! సనాతన హిందూపద్ధతి భార్యాభర్తల సంసారం మాట ఎత్తితే వీరనారీ శిరోమణులంతా స్వేచ్ఛా స్వాతంత్ర్యం, బానిసత్వం, మగవాడి దౌర్జన్యంలాంటి పెద్దపెద్ద పదాలతో హడల గొట్టేస్తారు కదా! పైగా వారి వాదాన్ని సమర్థించని వారిని 'మేల్ చవనిస్టులు'గా నిర్ణయించేస్తారు కూడా. అందుకు భయపడి పత్రికలు కూడా వీరోచితంగా

స్త్రీ–పురుష అసమానత్వం అనే ఓ పదాన్ని వీరికి, వారికీ, అందరికీ ఏవగింపు పుట్టే స్థాయిదాకా విమర్శించి, “అమ్మయ్య, మన పనైపోయింది. కొన్ని తీవ్రవాద ప్రేతాత్మలు శాంతిస్తేనే మన పత్రికలకు మనుగడ” అని సంతృప్తిపడతాయి.

నిజం ఆలోచిస్తే అంతేగదా! స్త్రీ–పురుష అసమానత్వం అనేదాన్ని ఎంత పెద్ద భూతద్దంలో చూపిస్తేనే అది అంత ఎక్కువై సంఘంలో శాశ్వత సమస్యగా ఉండిపోయేది. సమస్య పరిష్కారం అయితే ఈ నినాదంమీద బట్టకట్టే ఎన్ని జీవాలు నిరుద్యోగులవుతాయి. పోన్లెండి. అది ఉద్యమాల విప్లవాల ఎకనామిక్స్. వాటిల్లోకి పోతే ఉద్యమం ఉండదు. విప్లవం ఉండదు. అంతా బూజు. ఆ విషయం నాకు, ఉద్యమకారులకు కూడా బాగా తెలుసు. కాకపోతే ఆ నాటకాన్ని ఎవరు నడపాలి? అందుకే ఈ గందరగోళం అంతా! ఇలా పెళ్ళిరోజు మరచి పోదామన్నా మరచిపోలేని నా దౌర్భాగ్యపుబ్రతుక్కు లోలోనే చింతిస్తూ, బాత్రూం నుంచి బయటికి రాగానే అంది మా ఆవిడ– “ఏమండీ! మీ అమ్మగారినుంచి ఉత్తరం వచ్చింది, పండుగకు ఒంగోలు రమ్మని. మనవణ్ణి, మనవరాలిని చూడక చాలా కాలమైందిట. అందరం పోదామా?” అని.

షాక్ కొట్టినంత పనైంది. నోరు వెళ్ళబెట్టేశాను నేను.

“అసలు వాళ్ళంటేనే మండిపడే నాకు ఇదేం కోరికబ్బా అనుకుంటున్నారా? మీకు ఫస్ట్‌క్లాస్ హోం టవున్ ఎల్.టి.సి. ఈనెలతో అయిపోతుందని మీరేకదా అన్నారు. మీ ఊరెళ్ళి అక్కడ ఏదన్నా లాడ్జిలో దిగి సాయంత్రంపూట షికారుగా మీ వాళ్ళింటికి వెళ్దాం. ఏమంటారు?” అంది.

నా ఎల్.టి.సి., ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్, పెన్షన్ ఫండ్ ఎమౌంట్స్, ఎల్.ఐ.సి. వివరాలన్నీ మా ఆవిడకే నాకంటే బాగా తెలుసును కనుకనే అలా పొడిచింది. అయినా ఈ వివరాలన్నీ దానికి చెప్పడం నా బలహీనత కదూ! ఇప్పుడేం ఏడ్చి ఏం ప్రయోజనం? అందుకే మా శంకర్రావుగారు అంటూంటాడు ‘భర్తపోయి మన కంపెనీలో ఉద్యోగం సంపాదించిన ఆడవాళ్ళకు భాగ్యలక్ష్మీ లాటరీ కొట్టినంత సంతోషమండీ!’ అని. ఆలోచిస్తుంటే అదే నిజమనిపిస్తుంది. పోన్లే! మనం బతికి సుఖపడ్డామా లేదా అన్నది చస్తేగాని తేలదు. ‘బర్రె చస్తే కాని పాడి బయటపడదు’ అని ఊరికే అన్నారా? మొత్తంమీద మా ఆవిడ

మనస్సు అటువంటి మనుషుల మనస్తత్వానికి దగ్గరి బంధువే అయినా ఆశ్చర్య పోవలసిన పనిలేదు.

"ఏమిటా వెధవ ఆలోచనా, మీరూనూ? ఈ అలవాటు నా తాడు తెగితే కాని మీకు పోయేటట్లు లేదు" అంది మా ఆవిడ.

వెంటనే నా ఆలోచనల లోకంనుంచి బయటపడి 'తథాస్తు' అని మనసులో అనుకుని, "చూడు లాడ్జిలో ఉండేంత డబ్బు లేదు నా దగ్గర. మా వాళ్ళింటికని వెళ్ళి లాడ్జిలో మకాం పెడితే బాగుండదు" అన్నాను నేను.

"సరే, అలాగైతే మీ ఊర్లో ఉండే ప్రోగ్రాం రెండు రోజులకు కుదించేసి వస్తూ వస్తూ తిరుపతి పోయి ఆ వేంకటేశ్వరుని దర్శించివద్దాం. పోనీ ఇదన్నా అంగీకారమేనా?" అని అడిగింది. ఆలోచించి, సరేనన్నాను.

"అయితే ఓ షరతు, మీ వాళ్ళింట్లో ఉండటానికి నేను ఒప్పుకొన్నా కనుక నేను చెప్పిందానికి మీరు ఒప్పుకోవాలి" అంది నా శ్రీమతి.

"ఏమిటది?" అని అడిగాను నేను గుండె మోకాల్లోకి జారుతుందేమోనని బిక్కుబిక్కుమంటూ.

"అక్కడ వాళ్ళింట్లో తిండిముఖం తెలియనివాడిలా, నేనెప్పుడూ ఏదీ చేసి పెట్టనట్లు ముఖం వాచినట్లు అడుక్కుతినేవాడిలా 'భలే ఉంది. భలే ఉంది!' అంటూ లొట్టలేస్తూ తినకూడదు. సరేనా?" అంది.

నీ ఉపమానాలు తగలడా? అని లోలోనే అనుకొని అయితే "నీ షరతు నాకు అంగీకారమే. మరి నా షరతు ఇంకొకటి" అన్నాను.

"చెప్పండి."

"అక్కడ మా వాళ్ళతో పేచీపడి వాళ్ళని ఇష్టమొచ్చినట్లు ఏమీ అనకుండా ఉండాలి ఉండే రెండు రోజులు" అన్నాను నేను.

"పోన్లెండి. ఈ రెండురోజుల కొరకు నా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దానం చేస్తాను" అంది మా ఆవిడ వీరనారీమణిలా పోజిస్తూ.

రెండు రోజుల్లో ఒంగోలు చేరాం. పాపం రెండేళ్ళ తర్వాత నన్ను చూసిన నా తల్లి హృదయం పాలవెల్లువలా పొంగిపోయింది. ఆమె కనుకొలనుల్లో నిలిచిన ఆనందబాష్పాలు నాలోంచి మాటలను బయటికి రానివ్వలేదు. ఆమె

తల్లే కాదు. అసలు సిసలైన స్త్రీ మూర్తి. నా భార్య ఆవిడని ఎంత నిరాదరించినా, ఎంత ఛీకొట్టినా ఒక్కనాడు కూడా నా భార్యను ఆమె చాటునగాని, నా ముందు గాని తప్పు పట్టలేదు. పైగా "పోన్లేరా! నేను పాతకాలపుదానిని. మా మాటలు, పద్ధతులు ఈ కాలం వాళ్ళకు చాదస్తంగా అనిపిస్తే అనిపించనీ, ఆ అమ్మాయి అభిప్రాయం ఆ అమ్మాయిది" అని నన్ను బాధపడనీయకుండా చేసేది. అటువంటి స్త్రీమూర్తికి ఎవరో కొందరి మూర్ఖప్రవర్తనవల్ల ఈ కాలపు కోడళ్ళ దగ్గరుండే అర్హత పోయింది. ఈమధ్య కొత్తగా వచ్చిన చట్టాలు అమాయకులైన అత్తమామలను మరింత భయపెట్టి నోరు మూసేశాయి. ఎలాగైతేనేం ఒంగోలును, తల్లిని రెంటిని చూడగలిగాను.

ఒంగోలులో ఉన్న రెండు రోజులూ మా అమ్మ నాకిష్టమని ఎన్నో రుచుల వంటకాలు చేసింది. కాని పెళ్ళాన్ని ముందు పెట్టుకొని ఏ మాట పైకి అనలేక, ఎక్కువ తినలేక 'భేషుగ్గా ఉంద'ని మనస్సులోనే అనుకుని మితంగానే ముగించాను. మొత్తం మీద మా అమ్మకు సంతృప్తి గలిగేలా నేను ఆ రెండు రోజులు ప్రవర్తించలేకపోయాను. అక్కయ్య కూడా ఎంతో బాధపడింది. నాకు ఇష్టమని పచ్చిపులుసు, పంజాబ్ సూప్, మునక్కాడ మజ్జిగపులుసు, పొడికారం– ఇలా ఎన్నెన్నో చేసింది మా అక్కయ్య. నాకు ప్రాప్తం లేనప్పుడు వాళ్ళు చేయ గలిగిందేముంది? నిజానికి మధ్యతరగతి కుటుంబాలలో ఆర్థిక సమస్యలకన్నా మానసిక సమస్యలు, సంక్లిష్టతలు ఎక్కువేమోనని కూడా నాకు అనిపించింది.

నే కాలేజీకి వెళ్ళే రోజుల్లో అమ్మ ముద్దలు కలిపి నాకు తినిపించటం గుర్తు వచ్చినప్పుడల్లా మళ్ళీ పసితనం వస్తే ఎంత బాగుంటుందో అనిపిస్తుంది. సుభద్రా కుమార్ చౌహాన్ కవితలో "ఆజా బచ్‌పన్ ఏక్‌బార్ ఫిర్" అంటుంది. ఎంతటి మధురమో అది మా ఆవిడకి ఎలా తెలుస్తుంది? స్త్రీ అయి పుట్టినా సాటి స్త్రీ తల్లి మనస్సు తెలుసుకోలేని మొండితనం ఆమెకు ఉంది. ఈ మనస్తత్వమే స్త్రీలకు ప్రధాన శత్రువంటే మహిళా సంఘాలన్నీ నా గొంతు పిసుకుతాయి. అందుకే మౌనం. రెండు రోజులు ఒంగోలులో ఉన్నామనిపించుకొని, తిరుపతి వేంకటేశ్వరుడికి ఎసరు పెట్టడానికన్నట్లు బయల్దేరాం. మావాళ్ళంతా స్టేషన్‌కు వచ్చి ఎంతో ప్రేమగా వీడ్కోలు చెప్పారు. రైలు బయల్దేరి వేగం పుంజుకొంది.

వెన్నెల్లో పట్టాలపై నల్లతాచులా రైలు మెలికలు తిరుగుతూ ముందుకుపోసాగింది. పొలాలపై వెండి వెలుగు మధురస్మృతులను మదిలో రేకెత్తిస్తున్నది. ఈ గాలి... ఈ నేల... ఈ ఊరు... అన్న సిరివెన్నెల పాట నా చెవుల్లో గింగుర్లెత్తసాగింది.

ఇంతలో మా ఆవిడ చెయ్యి నా భుజంపై పడటంతో ఉలిక్కిపడి దానివైపు చూశాను.

"ఏమండీ! ఈ పదేళ్ళలో మొదటిసారి మీరు మరోచోటికి ముఖ్యంగా మీ వాళ్ళింటికి వచ్చినప్పుడు మన స్థాయికి, హోదాకు తగ్గట్లు ప్రవర్తించారు. నాకెంతో నచ్చింది. నిజంగా ఆనందం కలిగింది. మీ నడవడివల్ల, ఇప్పటికి మీరు నన్ను పూర్తిగా అర్థం చేసుకొన్నారు. ఎంతో మారిపోయారండి మీరు" అంది తన ప్రేమనంతా నాపై ఒలకబోస్తూ.

ఆమె మాటకు నాకు నవ్వాలో, ఏడ్వాలో తెలియలేదు. ఆమె అహంకార సంతృప్తికోసం ఎంతమంది మమతానురాగాలకు సంకెళ్ళు వేసిందో ఊహించే స్థితిలో లేదు. అహంకారం అటువంటిది. అయినా ఆ క్షణంలో నాకో ప్రశ్న వేయాలనిపించింది. కాని ఎంతోభయం కూడా కలిగింది. ఎందుకంటే అప్పుడు మేమున్నది రైలులో. ఆమె కయ్యమని లేస్తే ఏమన్నా ఉందా? అలా అని ఆ ప్రశ్నను సమయోచితంగా ఆ క్షణంలో వేసే అవకాశాన్ని జారవిడుచుకొందుకు నా మనస్సు అంగీకరించటం లేదు. ఇలా ఓ క్షణం గంభీరమైన తర్జనభర్జన చేశాక ప్రశ్న వేయడానికే తెగింపు వచ్చింది. అది ఏదోనాడు రావలసిందేకదా!

"ఏమోయ్! ఓ చిన్న ప్రశ్న అడుగుతాను. సరదాగా, కేకలేయకుండా జవాబు చెప్తావా?" అని అడిగాను.

ఏ మూడ్‌లో ఉందో సంతోషంగా 'ఓ' అని తలూపింది.

"రేపు నీ కుమారరత్నం చంద్రహాస్‌కు కూడా ఇలా సవాలక్ష ఆంక్షలు విధించే భార్య కోడలుగా వస్తే నువ్వు ఇంత గారాబంగా పెంచే నీ కొడుక్కు కూడా నా గతేనా పట్టేది?" అన్నాను.

"ఛీ! ఊరుకోండి ముదనష్టపు నోరు, పనికిరాని మాటలూనూ. మీ కర్మ ఇలా కాలింది గాబట్టి, నా కొడుకు బంగారపు భవిష్యత్తు ఇలాగే అవుతుందని ఎందుకనుకోవాలి? వాడికి వచ్చే భార్యను మొదటి నుంచీ నా చెప్పుచేతల్లో

నల్లిలా ఎలా ఉంచాలో వాడికి సమస్తం నూరిపోయనూ?" అంది నా శ్రీమతి, తన సామర్థ్యానికి, తెలివికి తానే అబ్బురపడుతూ.

"ఓ వేళ నాకైనట్లు నీ తమ్ముడికైతేనో?" అని వెంటనే ఆలోచించే అవకాశం ఇవ్వకుండా అడిగాను.

"అలాంటి దాని మొహంమీద విడాకులు కొట్టించేస్తాను" అంది తడుము కోకుండా.

"ఓ వేళ ఆ అమ్మాయి స్థానంలో మీ చెల్లెలు ఉంటే కూడా అదే తీర్పు చెబుతావా?"

తను ఊహించని నా ఈ ప్రశ్నకు కాసేపు నివ్వెరపోయింది. క్షణకాలం ఆలోచించి మౌనం దాల్చింది. ఎప్పటిలా ఎగరటం చేయలేదు. నేనిక రెట్టించ దల్చుకోలేదు. మనిషి ఆలోచించటం మొదలుపెడితే ఎప్పటికో ఒకప్పటికి సరైన ఆలోచనను చేరుకొంటాడు. సరైనవిధంగా ఆలోచిస్తే సరైన సమాధానమే లభిస్తుందని కూడా నాకు తెలుసు.

ఓ న్యాయమైన అహంకారాన్ని ఊహించుకొని, దాన్ని కేంద్రంగా పెట్టుకొని తన చుట్టూ ఉన్న ఆడ, మగను బంధుత్వ ప్రాధాన్యంతో జడ్జ్ చేయాలనుకోవటం లోనే స్త్రీ తన మనస్తత్వంపైన అవగాహన కోల్పోతున్నది. ఫలితంగా కెలైడో స్కోపులో రంగు రంగుల కోణాలుగా తన మనస్సును భిన్న కోణాల్లో తిప్పుతోంది. చివరకు తానే ఓ భిన్న కోణంగా మిగులుతోంది.

నిజానికి నా భార్య మనస్తత్వంతో రాజీపడే వైఖరి నాకు, నా వాళ్ళకు ఉండబట్టే ఆమెకు తెలియకుండా రెండు రాత్రులు మా అమ్మచేత నాకు ఇష్టమైనవి కలిపించుకు తిని, ఆవిడ కళ్ళలో శబరి, యశోదల ప్రేమను చూసుకోగలిగాను. కాని ఈ సత్యాన్ని నేను ఏనాటికీ బయటపెట్టలేను.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 24 ఏప్రిల్, 1991

❀

వ్యక్తిత్వం కోసం...

తను ఒంటరిదే. కాని అనాథ కాదు. తనలో ఏదో ఆరాటం. ఏదో చెప్పాలని తాపత్రయం. కాని వినేవాళ్ళు లేరు. ఆత్మీయత లోపించిన భావం తన మనస్సును మెలి తిప్పేస్తున్నది. గుండెను పిండి పిప్పి చేస్తున్నది.

హిమజ్వాలను దూరంగా ఊటీలో రెసిడెన్షియల్ స్కూల్లో చదివించటం వలన చిరకాలంగా ఒంటరితనం సృష్టించిన ఘర్షణ తారాస్థాయికి చేరింది ఈ రోజు. ముఖ్యంగా తన కూతురు రాసిన రెండే రెండు ముక్కల ఉత్తరం తన అంతరంగంలో రేపిన సుడిగుండాల హోరు అంతా ఇంతా కాదు. వ్యక్తపర్చలేని మహావ్యథ, వేదన. హిమజ్వాల విసురుతున్న సవాలు తనకు కాదు, తన జీవితానుభవానికి. కోరి తన కూతురే ఇలా చేయడానికి నిర్ణయిస్తే మరొకరి సంగతి ఆలోచించే అర్హత తనకేముంది?

ఏదో అశాంతి, అసహనం, అస్థిరత్వం, చాంచల్యం ఆమెను చుట్టు ముట్టాయి. ఇంతకాలం తను ఎలా బ్రతికిందో అర్థం చేసుకోని హిమజ్వాలకు ఏమని చెప్పాలి? ఎలా చెప్పాలి? తనసలు ఏమనుకొంది? తన్నించి తెల్సు కొందుకు ఏమీ లేదన్న అభిప్రాయం హిమజ్వాలకెందుకు కల్గింది అసలు? ఎప్పుడు కల్గింది? ఇప్పుడు తనేం చెప్పినా హిమజ్వాల వింటుందా? ఎలా చెబితే తననర్థం చేసుకున్న ఆ ఒక్కమనిషి తన కూతురు హిమజ్వాలే అన్న సంతృప్తి తనకు మిగుల్తుంది?

సోఫాలోంచి లేచి అటూ ఇటూ పచార్లు చేయసాగింది నిరంజని. అనేక ఆలోచనలు ఆమెను జోరీగల్లాగా వేధించసాగాయి. అసహనంగా తిరిగి

కుర్చీలో కూర్చుంది. టేబిల్‌పై ఉన్న హిమజ్వాల ఉత్తరం మరోసారి చదివింది.

ప్రియమైన అమ్మకు, ఊటీ

బెనర్జీ ఎవరో తెల్సుననుకొంటాను. నాలాగే మంచి టెన్నిస్ ప్లేయర్. అతని స్ట్రోక్సును లిఫ్ట్ చేసే కెపాసిటీ ఒక్కోసారి కాలేజి ఛాంపియన్‌నైనా నాకే లేదని ఇదివరలో చాలాసార్లు రాశాననుకొంటాను. అతని చూపుల్లో ఏదో సమ్మోహనశక్తి, ఆకర్షణ నా మనస్సును తన తన మనస్సుతో పెనవేసుకొనే అమోఘమైన శక్తి. అందుకే... అందుకే... అతడ్ని ప్రేమించకుండా ఉండలేక పోయాను. అతని అంగీకారం తెల్సాక పెళ్ళి చేసుకోదల్చుకున్నాను కూడా. స్త్రీ స్వేచ్ఛ గురించి కొన్ని వందల కథలు, డజన్లకుపైగా నవలలు రాసిన మహారచయిత్రివి. ఈ విషయంలో నీ అనుమతి కోరటం నిన్ను అవమానించి నట్లేనని నా భావన. నీ నిర్ణయం ఇందుకు వ్యతిరేకమయినా నే చేయగల్గింది ఏమీ లేదు అని తెల్సుకోగలవు. అందుకే మళ్ళీసారి శుభలేఖ పంపిస్తాను. అందగనే మా పెళ్ళికి తప్పక వస్తావు కదూ!

శలవు,

హిమజ్వాల.

ఉత్తరం మడిచి బల్లపై వేసింది. పట్టుమని ఇరవైయేళ్ళు కూడా నిండని ఆ చిన్నారి పసిహృదయంలో ప్రేమ, పెళ్ళికి ఎంత ఆరాటం. ఈ రెంటిగురించి సరిగ్గా తెలియని ప్రాయంలో ఉండే ఆశలు, ఊహలు, అందమైన హరివిల్లులా ఉండటంలో ఆశ్చర్యం లేదు. కాని జీవితం ఊహల్లో గడవదే. ఆకాశంలో విహరించదే. నేలపై పల్లేరుకాయలు, తుమ్మముళ్ళు, కోసురాళ్ళు, బురద గుంటలపైన, ఎగుడుదిగుడుపైన నడిచి, పరిగెత్తి డస్సిపోయి మృత్యువు కౌగిల్లో పశ్చాత్తాపంతో రాలిపోయే పండుటాకు జీవితం.

హోటల్ కిటికీలోంచి దూరంగా కన్పిస్తున్న సముద్రంవైపు చూసింది. సున్నితమైన ఒడ్డును చేరాలని వేగంగా వచ్చే అలలు, రాళ్ళను ఢీకొని చిప్పిల్లి తుంప తుంపరులుగా గాలిలోకి లీనమైపోతున్నాయి.

'సువిశాలమైన పయోనిధి ఘోష తన అంతరంగ ఘోషను ద్విగుణీకృతం చేస్తున్నది. దాని ఒడ్డుననే ఆశలనే నత్తగుల్లల్ని ఏరుకొనే పసిపిల్లలు, క్రొత్త

జీవితానికి బాటలు వేసుకొనడానికి అవి నీటిపై గీతలు అని తెలీక ప్రమాణాలు చేసుకొనే అమాయక ప్రేమ జంటలు, గమ్యం ఏమిటో వెతుక్కుంటూ సాగరమనే జీవితంలో ఒడ్డునొదిలి తెలీనితీరాలకు సాగిపోయే నావలు, చూస్తుంటే ఒక్కో చోట నవరత్నాలు కుప్పలు పోసినట్లు ఎన్ని జీవితసత్యాలు. తమాషాగా ఉంది కదూ ఈ ప్రకృతి' మనసులో అనుకొంది తను.

తన పద్దెనిమిదవ ఏటనే కుటుంబభారం మోయాల్సి వస్తుందని పదిహేడవ పుట్టినరోజున తను ఊహించలేదు. అప్పుడు తను చదువుతున్నది కేవలం ఇంటర్మీడియెట్. అమ్మా, నాన్న బద్రీనాథ్ చూసొస్తామని ఉత్తరదేశ సంపూర్ణ యాత్రకు బయల్దేరిన వాళ్ళు, ఎప్పుడెప్పుడు తిరిగి వస్తారని తమ్ముడు, చెల్లెల్తో నిరీక్షిస్తున్నది తను. కాని వాళ్ళు మళ్ళిక తిరిగిరారని అప్పుడు రైలెక్కించేపుడు తను ఊహించలేదు. వాళ్ళు పోయాక పదిరోజులకు టెలిగ్రాం వచ్చింది వాళ్ళిక లేరని, ఈశ్వరసాయుజ్యం జంటగా పొందారని.

గుండె గుభేలుమంది. దుఃఖం పొంగి పొర్లింది. భూపొరల్లోతుల్లోకి కుంగిపోతున్న భావం కల్గింది. ఆ టెలిగ్రాం తన్ను ఎంత కుదిపిందో పసివాళ్ళ యిన తన తమ్ముడికీ, చెల్లెలికీ తెలీదు. అర్థం చేసికొనే ప్రాయం అప్పుడు వాళ్ళకు లేదు. క్రమంగా ఏదో తెలీని తెగింపు, ధైర్యం, వివేకం తన్ను ఆవహించాయి. శక్తిని కూడదీసుకొని జీవితంలోకి అడుగేసింది తను. తనకున్న సంగీత పరిజ్ఞానంతో, దేవుడిచ్చిన కమ్మని కంఠంతతో ఆలిండియా రేడియోలో వెంటనే క్యాసువల్ ఆర్టిస్ట్‌గా చేరింది.

పద్దెనిమిదేళ్ళ ప్రాయానికే ఉద్యోగంలో అడుగుపెట్టిన తనను కాకుల్లా పొడవటానికి ఈ సంఘం తన ముక్కును బాగా పదును పెట్టించుకొంది.

తనతోపాటు పనిచేసే మగవాళ్ళు తన అందాలను తడిమిచూసే చూపులను తను ఎప్పటికీ మర్చిపోలేదు. ఇక సోదరి భావం ఊసెత్తే పనే లేదు. అది ఈ దేశంలో బహుశ పుస్తకాల్లోని 'ప్రతిజ్ఞ'తోనే ఆగిపోయింది.

పనిలేకుండా కూడా వచ్చి తనని పల్కరించి "సాయంత్రం అలా షికారుగా బీచ్‌కెళ్దామా?" అని అడిగినవాళ్ళు ఎంతోమంది.

"ఇంత అందంగా ఉన్నావు. నువ్వు కోరినది ఏదీ కాదనము. కాని ఆ

ఒక్క కోర్కె తీర్చడానికి వొప్పుకోవడంలో ఉంది నీ వివేకమంతా. స్వర్గపుటంచులు అందుకునే మార్గం నీ చేతుల్లో ఉంది. అందువల్ల నీకు అరిగిపోయేది, కరిగి పోయేది ఏమీలేదు. నువ్వు అవునంటే చాలు, ఈ ప్రపంచంలోని వెండి, బంగారం, ఫ్రిజ్‌లు, టి.వీ.లు, కార్లు, కాస్మొటిక్స్ అన్నీ నీ సొంతమే" అని తన్ను ఊరించి లోబర్చుకోవాలని ప్రయత్నించిన వాళ్ళు చాలామంది. రోడ్డుపై వస్తుంటే తన మర్మప్రదేశాలపట్ల ఆకలితో చూస్తూ కొంటెగా కన్నుగొట్టి, చిన్నగా ఈలవేసి వెనక్కి వెళ్ళి ముసిముసినవ్వులు నవ్వుకొనేవాళ్ళను ఎరుగుదును.

ప్రేమంటూ ప్రారంభించి, చివరకు నికృష్టమైన పదజాలంతో అంగాంగ వర్ణనలు చేస్తూ, 'కామం సర్వ మోక్ష ప్రదాయకం' అన్న సూక్తితో ముగించి రాసిన ఉత్తరాలు అందుకొంది తను. ఎవరు ఎట్నుంచి ప్రారంభించినా, ప్రేమన్నా, అభిమానమన్నా, అనురాగం అన్నా, ఆప్యాయత అన్నా తన్నుంచి కోరుకున్నది మాత్రం ఒక్కటే– అది తనతో లైంగిక సమాగమం. తన్ను వివస్త్రను చేసి, తనలోని అందాలనూ చూసి, వాటితో ఆడుకొని చివరకు తన్ను ఓ విలాసవస్తువుగా అనుభవించి లోలోన వారి మగతనానికి తాను లొంగిపోయి నందుకు గర్వంగా మీసం ఉన్నా లేకపోయినా మెలివేయాలన్న తాపత్రయం వ్యక్తపరిచే కామం వర్షించే చూపులవి. ఫ్రాయిడ్ చెప్పిన 'లిబిడో' అది.

పద్దెనిమిదేళ్ళకే జీవితంలో అడుగుపెట్టే అవకాశాన్నిచ్చిన తల్లిదండ్రులకు తనెంతో ఋణపడి ఉంది. తను ఆడపిల్లయి పుట్టినందుకు ఏమాత్రం బాధపడ లేదు. పైగా సంతోషించింది. తను తన ఈడు మగవాడికన్నా ఎక్కువ జీవితాన్ని, అనుభవాన్ని గడించింది. ఈ అవకాశం ఎంతోమంది ఆడపిల్లలకు లభించదు. తనందుకు గర్వపడ్తున్నది. ఈ ఉద్యోగం ఎందరి మనస్తత్వాలనో భిన్నకోణాల నుంచి చూసే అవకాశాన్నిచ్చింది. చలంగారి రచనల్లోని స్త్రీ స్వేచ్ఛను ఆదర్శంగా తీసుకున్న స్త్రీలను చూసింది తను. కొడవటిగంటిగారి 'పచ్చనోటు', 'పెళ్ళి వ్యవహారం' వంటి రచనల్లోని స్త్రీలను చూసింది తను.

భర్తతో విరోధించి, పరపురుషుడి మాయమాటలకు కరిగిపోయి అతనితో కామవాంఛలు తీర్చుకొని తృప్తిపడే స్త్రీలను చూసింది. తన భర్త పరాయి ఆడదాన్ని అలా చూడటంలేదని వాదించి సమర్థించుకొనే ఓ రకం స్త్రీలు వాళ్ళు. కాని

తమకే బాధ్యత లేదని స్పష్టంగా తెల్సిన పురుషుడు తీయని మాటలతో ఒక్క స్త్రీని కాదు, ఎంతమందినైనా లాలించగలడన్న నిజం వీళ్ళకు తెలీదు.

భార్యలతో జీవితం విషాదమయమైందని చెప్పుకుంటూ, పరస్త్రీ లాలనలో ఎంతో సుఖం వెతుక్కోవచ్చని తనలాంటి ఆడవాళ్ళ వెంటబడే పురుషుల్ని తను అర్థం చేసుకోలేకపోలేదు. వాళ్ళు నిజంగా కోరుకొనేది పరస్త్రీవద్ద వారి సమాగమ శక్తి, పటిమ అమోఘం అని ఆమె పొగడటం, కుటుంబ అవసరాలు, ఖర్చులు అంటూ డబ్బులడగని ఇల్లాలు, కష్టనష్టాలను భర్తగా భరించమని, చిందులు వేయవద్దని ఆదేశించే స్త్రీ భార్య కాకుండా ఉండాలన్నది వారి ఆలోచన వెనుక తత్త్వం. కేవలం అంతరంగాన్ని మోసంచేసి, మభ్యపెట్టి ప్రపంచానికి తెలీకుండా జాగ్రత్త పడగల్గామన్న కృత్రిమ సంతృప్తికోసం ఆరాటం వాళ్ళది.

తను శరత్‌చంద్ర నవలలు చదివింది. ప్రేమ్‌చంద్ సాహిత్యం చదివింది. ఓ హెన్రీ, ఆస్కార్ వైల్డ్, సోమర్‌సెట్ మామ్ పుస్తకాలు చదివింది. సమాజం, సంఘంపట్ల వాళ్ళు నెరిపిన అధ్యయనం, వాళ్ళిచ్చిన నిర్వచనాలు, ఏర్పరచుకొన్న నిర్దిష్ట భావాలు, మనోవిశ్లేషణ చేయడంలో వాళ్ళు చూపించిన నైపుణ్యం తను పుక్కిట పట్టింది. ఎమ్.ఏ. ఇంగ్లీషు, డిప్లొమో ఇన్ జర్నలిజం చేసింది. రచనా నైపుణ్యానికి కావల్సినవన్నీ రేడియో ఆర్టిస్టుగా శ్రద్ధగా నేర్చుకుంది.

తన ఉద్యోగం తన ప్రతిభపైనే పర్మనెంట్ అయ్యేలా చేసుకోగల్గింది. ఎవ్వరి కామవాంఛలకు, బెదిరింపులకు లొంగలేదు. "నువ్వు కాకపోతే మరొకరు. మీ బలహీనతలన్నీ నా గుప్పిట్లో ఉన్నాయి. మీ బ్రతుకులు జాగ్రత్త. మీ పరువు రచ్చకెక్కకుండా ఉండాలంటే, మీ పెళ్ళాలు మిమ్మల్ని కోర్టుకీడ్వకుండా ఉండా లంటే మీ హద్దులో మీరుండండి" అని ధైర్యంగా బెదిరించే స్థాయికి ఎదిగింది.

అందుకే తనంటే వాళ్ళ గుండెల్లో పిడుగుపాటు భయం. నమస్కారం పెట్టడం మినహా తనవైపు కన్నెత్తి చూస్తే, తన ఎర్రజీరలు వారిన వాడికళ్ళు వర్షించే అగ్నిలో దీపపు సమిధల్లా ఆహుతయిపోతారన్న భయం కల్గించింది వాళ్ళలో. తను ఈ సంఘాన్ని జయించింది. ధైర్యంగా, ఒంటరిగా ఎదుర్కొని మరీ జయించింది. తను చూసిన సంఘాన్ని, తన కళ్ళముందు జరుగుతున్న నికృష్టాన్ని హృదయం స్పందించినప్పుడల్లా వాడైన పదాలలో పెట్టి కథలుగా,

నవలలుగా మార్చింది. తన నవలలకు పాఠకుల ఆదరణ పెరిగింది. పత్రికా సంపాదకులు తనకు వెన్నుతట్టి చేయూతనిచ్చారు. తన కలం రోజు రోజుకు పదునెక్కసాగింది. ఇప్పుడు తనను అడ్డే రచయితలు చాలా తక్కువ.

తమ్ముడి చదువు, చెల్లెలు చదువు పూర్తయ్యాక తమ్ముడ్ని చెల్లెలు పెళ్ళి బాధ్యత వహించమని చెప్పి తన బరువు దించేసుకుంది. తనకిక విశ్రాంతి కావాలన్పించే ఆ నిర్ణయం తీసుకొంది. ఒకే వ్యక్తి సమస్తం త్యాగంచేసి తక్కిన అందరి జీవితాలు నిలబెట్టే 'క్రొవ్వొత్తి వెలుగు' చందంగా తను కాకూడదను కొంది. స్వశక్తి అందరిలోనూ పెంపొందించాలి. ఒకరి సాయం మరొకరిలో బలహీనత కల్గించగూడదన్నదే తన అనుభవం నేర్పిన పాఠం. ఇప్పుడు తను హాయిగా స్వేచ్ఛతో నీలి గగనాల్లో విహరించే శ్వేతకపోతం పొందే అనుభూతిని పొందింది.

తనకు ఓ పసిపాప ఉంటే బాగుండుననిపించింది. చిన్నారి పసికందు లేత చేతులతో, కాళ్ళతో ఎదపై తడ్తుంటే ఆ స్పర్శకి పులకించిపోవాలనిపించింది. చిన్ని చిన్ని నీలి గాజు కళ్ళతో అమాయకంగా చూసే పసివాడి చూపుల్తో తన చూపుల్ని కలిపి చిలిపిగా ముద్దాడాలనుకొంది. మృదువుగా ఉండే పసి స్పర్శల వెచ్చదనం ఆశించింది. చిన్ననోరు, సన్నని గులాబిరంగు పెదవులు, పాల బుగ్గలు, పసివాడి ఉంగా, ఉంగా ఏడుపులు, సెలయేటి గలగలల్లా సందడి చేస్తుంటే సంబరపడాలనుకొంది. కాని సంసారం అనే నరకకూపం తన్ను మళ్ళీ భయపెట్టింది. తన్ను పెళ్ళి చేసుకోవాలనుకొన్న మగవారి ఆలోచనల్ని ఇట్టే పసిగట్టింది తను.

తన సంపాదనతో కుటుంబం గడుపుతూ, వ్యాపారం చేసుకోవచ్చునను కొన్న మగవాళ్ళను చూసింది. వాళ్ళ దృష్టిలో తను ధనార్జన చేసే ఓ మొబైల్ ఇండస్ట్రీ. కట్నంలాంటి ఛండాలమైన ఆశలతో తన వెంబడి తిరిగిన మగపిల్లల తండ్రుల్ని ఎరుగును. 'చాలు బాబు... ఈ పెళ్ళి అనే రొంపిలో దిగకపోయినా ఫర్వాలేదు' అన్పించింది చివరికి.

వయస్సు పెరిగినకొద్ది పురుషస్పర్శ కావాలనిపించింది. రాత్రిళ్ళు వెన్నెల వేడికి ప్రకృతి ఇష్టమొచ్చినట్లు తన మనస్సును, మేనిని మెలితిప్పి, లోపల

తుపాన్ను రేపి తెల్లారేసరికి మాయమయ్యేది. కాని, తనలోని ప్రకృతివాంఛను, అప్పుడు వ్యక్తపర్చే తీపి సమాగమ అనుభూతుల్ని, హావభావాల్ని, తన బలహీనతలుగా, వారి విజయాలుగా భావించి తన్ను పిల్లలు కనే ఓ యంత్రంగా భర్త భావిస్తే సమస్య మళ్ళీ మొదటికే వస్తుందని భయపడి విరమించుకొంది ఆ ఆలోచన.

తను ఎక్స్ట్రీమిస్ట్‌లా ఆలోచించలేదు. ఎక్సెంట్రిక్‌గా అంతకంటే ప్రవర్తించలేదు. సంఘంలో ఒంటరిగా పోరాడి గెలువగల్గే శక్తి ఎంతమంది స్త్రీలకుంది ఈనాడు. కాని తను జయించింది. తన కష్టకాలంలో ఏ మగవాడి అండా తీసుకోలేదు. ఇప్పుడు తనకు స్పష్టమైన వ్యక్తిత్వం, గౌరవం, స్థానం ఉన్నాయి సంఘంలో. పెళ్ళి పేరుతో వాటిని వదులుకొని ప్రకృతి సిద్ధమైన కోర్కెలకు లొంగిపోయే బానిసగా బ్రతకటం తనకు అయిష్టంగా అన్పించింది.

సరిగ్గా ఆ సమయంలో తన జీవితంలోకి ప్రవేశించాడు వాసుదేవ్. అతనో జర్నలిస్ట్. ఓ ప్రముఖ తెలుగు దినపత్రికలో పనిచేస్తున్నాడు. కేవలం రాజకీయ వ్యాఖ్యలు, రిపోర్టులు కాక కథలు, గేయాలు, కవితలు రాస్తాడు. అభ్యుదయవాదిగా పరిచయమయ్యాడు ఓసారి బీచ్ వద్ద. ఆ పరిచయంతో తరచూ విశాఖపట్నం వస్తుండేవాడు.

అతని చూపులు నిర్మలంగా ఉండేవి. భావాలు వివాదరహితంగా కన్పించేవి. కలుషితమైన మనస్సు కాదతనిది. అతని ఆవేశంలో పవిత్రత ఉంది. ఆ ఆలోచనల్లో సార్థకత ఉందనిపించింది.

మగవాళ్ళలో మాణిక్యాలుంటారని అన్పించిందతనిని చూసినప్పుడు. అతను వచ్చినప్పుడు బీచ్ వెంట కల్సి తిరిగేవాళ్ళం. గంటల తరబడి రాజకీయ, సాహిత్య చర్చలు చేసేవాళ్ళం. ఓసారి తను సముద్రపు ఒడ్డున పెద్ద కొండ రాయిపై కూర్చుని ఉంది. తన కాళ్ళను మృదువుగా స్పృశిస్తున్నాయి సముద్రపు అలలు. నీటి తుంపరలు తన మోమును ముద్దాడుతున్నాయి.

హఠాత్తుగా తన పాదాలను చుంబించాడు వాసుదేవ్. "మీ పచ్చటిపాదాలు అరవిచ్చిన కలువపూలలా ఉన్నాయి. తుషార బిందువులు నిల్చిన మీ మోము తామరపూవులా ఉంది. నునుపెక్కిన మీ భుజసౌష్టవం హిమవత్ సానువుల్లా

నిగనిగలాడుతున్నాది. అస్తమిస్తున్న సూర్యుడి వేడికిరణాలు పడి ప్రకృతి అంద మంతా మీలో ఇముడ్చుకున్న మీరు నిజంగా ధన్యులు" అన్నాడు అతను.

ఆ వర్ణన తనను క్షణకాలం తన్మయత్వంలో ముంచెత్తింది. క్షణంలో ఏదో మెరుపు తన వీపును చరిచినట్లయింది.

"వాసుదేవ్, నిన్ను అందరి మగాళ్ళలా కాకుండా భిన్నంగా ఊహించాను. నాలో నువ్వు వర్ణించిన ఈ ప్రకృతిసౌందర్యం కొంతకాలానికి వాడిపోతుంది. ఇంతకన్నా అందంగా ఉన్నప్పుడు నీకంటే ఎక్కువగా ఎంతోమంది వర్ణించి నన్ను లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. ఫలితం లేకపోయింది. నువ్వు అంతఃసౌందర్యం చూడగల వివేకవంతుడివనుకొన్నాను. ప్చ్! బ్యాడ్‌లక్" అంది తను విసురుగా. తన మాటలకు వాసుదేవ్ నివ్వెరపోయాడు. తను అలా సూటిగా మాట్లా డుతుందని అతను ఊహించకపోవటం విచారకరం.

"నేను పవిత్రమైన భావంతోనే నిన్ను వర్ణించాను. ఆ వర్ణన వెనుక ఏ మాలిన్యపు ఆలోచనా లేదు" అని స్పష్టంగా చెప్పాడు.

తను అతని కళ్ళలోకి సూటిగా చూసింది. నిశ్చలమైన అతని కళ్ళు మాత్రం తన చూపులకు బెదరలేదు. నిజమేననిపించింది తనకు. ఆ తర్వాత వాసుదేవ్ ఎప్పుడూ అలాంటి పని చేయలేదు. తను అతన్ని ఉంచాల్సిన దూరంలోనే ఉంచుతూ ఉత్తరాలు రాసేది. జవాబు రాసేవాడతను. చివరగా తనకు బాగా గుర్తు. వాసుదేవ్ అన్నివిధాల తనకు యోగ్యుడైన జీవిత భాగస్వామి కాగలడన్న భావంతో తనని పెళ్ళిచేసుకోమని తను రాసిన ఉత్తరానికి అతను ఆర్నెల్లక్కూడా జవాబు రాయలేదు.

తను అనాథ శరణాలయం నుంచి ఓ పసికందును తెచ్చుకొని 'హిమజ్వాల' అని పేరుపెట్టి పెంచుకోసాగింది. ఓ ఆర్నెల్ల తరువాత వాసుదేవ్ నుంచి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చూసి ఆశ్చర్యపోయింది. "ఇదా వాసుదేవ్ అంతరంగ స్వరూపం" అన్పించింది తనకు. ఆ ఉత్తరం తమ స్నేహానికి తీపిగుర్తుగా భద్రంగా ఉంచుకొంది తను. అదే వాసుదేవ్ తనకు రాసిన ఆఖరి ఉత్తరం.

హిమజ్వాలను పదేళ్ళు దాటాక ఊటీ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించింది. సాహిత్య వ్యవసాయంలో జీవితం క్షణం తీరికలేకుండా సాగిపోయింది తనకు.

మనస్సును, ప్రకృతి నుంచి దూరం చేయగల్గింది, ఈ సాధనలో తను విజయ వంతంగా. మరో పదేళ్ళు గిర్రున తిరిగిపోయాయి. ఇప్పుడు తనకు యాభైఐదు సంవత్సరాలు. మరో మూడేళ్ళలో తను రిటైరవుతుంది. తన పాప తన దగ్గరికి చదువైపోయి వచ్చేస్తుంది. ఇక తనూ పాప ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్ళి జీవించ వచ్చుననుకొంది. పాప టెన్నిస్ పోటీలో నెగ్గి చాంపియన్‌గా మారుతుంటే ఆ ఆటతీరును చూసి ప్రజలు హర్షధ్వానాలు, పత్రికలు పొగడ్తలు విసుర్తుంటే చలించిపోవాలనుకుంది.

కాని ఇంతలోనే ఈ ఉత్తరం.

ఒక్కసారి తల విదిలించి గతంనుంచి వర్తమానంలోకి వచ్చింది నిరంజని.

హిమజ్వాలకు తను జవాబు రాయాలి. తను గ్రహించిన ఒకే ఒక సత్యం ఆమెకు అర్థమయ్యేలా సంక్షిప్తంగా రాసి, తుది నిర్ణయం దానికే వదిలేయాలి.

కాగితం కలం తీసుకొని ప్రారంభించింది నిరంజని.

ప్రియమైన హిమజ్వాలకు ఆశీస్సులతో, విశాఖ

నీ ఉత్తరం చూసి ఖిన్నురాలినైనాను. స్త్రీ స్వేచ్ఛ గురించి మాట్లాడే నేను జీవితానికి అన్వయించే అనేక సత్యాలను కూడ దృష్టిలో పెట్టుకోవల్సిందని ప్రతి కథలోనూ, నవలల్లోనూ ఆడపిల్లల్ని హెచ్చరిస్తూనే వచ్చాను. అది గ్రహించ లేదా నువ్వు? నువ్వు గొప్ప టెన్నిస్ ప్లేయర్‌వి. ఇంకా ఎంతో భవిష్యత్తు ఉంది. స్టెఫీగ్రాఫ్, మార్టినా నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్‌లాయిడ్‌లా నువ్వు ప్రపంచప్రఖ్యాతి గడించాలని నీ గురించి రంగురంగుల మేడలు కట్టాను. కాని నువ్వు తొందరపడి పెళ్ళి నిర్ణయం తీసుకొంటున్నావేమోనన్పించింది నాకు. బెనర్జీ నిన్ను నా ఆశల స్థాయికి ఎదగనిస్తాడన్న ఆశ నాకు లేదు. నువ్వు ఎన్నోసార్లు 'మమ్మీ నువ్వెందుకు పెళ్ళి చేసుకోలేదు?' అని అడిగావు. అప్పట్లో ఆ ప్రశ్నకు సమాధానం ఇస్తే అర్థం చేసుకొనే ప్రాయం కాదు నీదని జవాబు చెప్పలేదు. ఇప్పుడు చెప్తున్నాను. వాసుదేవ్‌గారి గురించి నీకు చాలాసార్లు చెప్పే ఉంటాను. అతన్ని మనసా వాచా కర్మణా ప్రేమించాను. పెళ్ళి చేసుకొందామనుకున్నాను. కాని అతను నా కోరికకు సమాధానంగా రాసిన ఆఖరి ఉత్తరంలో ఏముందో తెల్సా? అతను నన్ను పెళ్ళి చేసుకొనే పక్షంలో నా రచనా వ్యాసంగానికి తెర దించివేయాలిట.

అతనికంటే పేరుప్రఖ్యాతులున్న భార్య అతనికి ససేమిరా అంగీకారం లేదన్నాడు. కేవలం 'వ్యక్తిత్వం' అడ్డం వచ్చిన నేను జీవితాంతం ఇలా ఉండిపోయాను. నీవు ఈ సత్యాన్ని గ్రహించగల్గితే చాలు. కేవలం పెళ్ళి చేసుకొని పిల్లల్ని కని జనాభా పెంచేయటం ఒక్కటే స్త్రీ బాధ్యత కాదు. వ్యక్తిత్వం నిలబెట్టుకోవటం కూడ ఈనాటి స్త్రీకి తప్పనిసరి. సగటుస్త్రీకి పెళ్ళి ఓ వరం, ఓ అండ. వ్యక్తిత్వమున్న స్త్రీకి పెళ్ళి ఓ శాపం కూడ కావచ్చు గుర్తుంచుకో.

ఇట్లు,

నిరంజని.

ఉత్తరం రాసి బజర్ నొక్కి పోస్ట్‌మాన్‌కిచ్చి పంపించింది నిరంజని. సినిమా కథ రాసిపెట్టేందుకు హోటలు రూము బుక్ చేశాడు ఆమె కోసం ఆ సిన్మా ప్రొడ్యూసర్. కాని హిమజ్వాల ఉత్తరంపై ఆలోచించటంతోనే తన సగం కాలం గడిచిపోయింది. తిరిగి తను కథ రాసే పనిలోకి జారిపోయింది. వారం తర్వాత స్పీడ్‌పోస్టులో కవరు వచ్చింది నిరంజనికి ఓ రోజు. అందులో హిమజ్వాల పెళ్ళి శుభలేఖ, తల్లికి రాసిన ఉత్తరం ఉన్నాయి.

చదవటం మొదలుపెట్టింది నిరంజని.

ప్రియమైన అమ్మకు,

నీ జవాబు చూసి ఆశ్చర్యపోలేదు. వ్యక్తిత్వంకోసం నువ్వు ఈ సంఘాన్ని, సంసారసుఖాన్ని దూరం చేసుకున్నావు. నా దృష్టిలో నీది అవివేకం, మూర్ఖత్వం. నీది అమ్రితా ప్రీతమ్, కమలాదాస్‌వంటి రచయిత్రుల జీవితాన్ని పోలిన జీవితం. కాని నే కోరుకుంటున్నది వేరు. సంఘంలో ఓ వివాహిత స్త్రీకి భర్త సాహచర్యం వలన లభించే గౌరవం, పసుపు, కుంకుమ నాకు పూజనీయమైనవి, పవిత్రమైనవి. భర్తకోసం ఎదురుచూడటం, అతనితో కల్సి ముచ్చటిస్తూ భోం చేయటం ఓ థ్రిల్. పార్టీలకు, పిక్‌నిక్‌లకు భర్తతో కల్సివెళ్ళటం ఓ గొప్ప స్టేటస్. అతని విజయంలో భాగం పంచుకోవటంలో ఔన్నత్యం, సంస్కారం ఉన్నాయి. పెళ్ళయినాక నేను 'వ్యక్తిత్వం' అంటూ ఉంచుకోక, అతని వ్యక్తిత్వమే నా 'వ్యక్తిత్వం' అని భావించటం ఓ అనిర్వచనీయమైన అనుభూతి. అందుకోసం నేను నా భర్త బెనర్జీతో ఏ విషయంలోనైనా రాజీపడ్తాను. ఆఖరికి నా టెన్నిస్

ఆటను కూడా త్యాగం చేయగలను. నువ్వూ, నేను 'వ్యక్తిత్వం' అనే నాణానికి రెండు ముఖాలం. అంతే తేడా. గ్రహించగలవు.

ఇట్లు,

హిమజ్వాల.

ఇరవై ఒకటో శతాబ్దంలో కూడ స్త్రీ 'వ్యక్తిత్వం' అంటే ఏమిటో తేల్చుకోలేక సతమతమవుతున్నది ఆధునిక స్త్రీ. సేవాతత్వాన్ని స్త్రీ బానిసత్వ భావంగా దాస్యంగా 'వ్యక్తిత్వం' రెండో ముఖంగా ప్రవచించాలన్న ప్రయత్నంలో తమను తాము అధోస్థితికి దిగజార్చుకొంటున్న అయోమయ స్త్రీజాతిని చూసి బాధ పడాలో, నవ్వాలో తెలీటం లేదు నేటి స్త్రీజాతికి. హిమజ్వాల ఉత్తరానికి దిమ్మెరపోయి కుర్చీలో కూలబడిపోయింది నిరంజని. ఆమె చేతిలోని ఉత్తరం ముందుతరానికి ప్రశ్నలా శ్వేతకపోతంలా ఎగిరిపోయింది కిటికీలోంచి వీచిన గాలికి.

-కలువబాల పక్షపత్రిక, 16-30 నవంబర్, 1988

❀

ఇది జరగని కథ

తూర్పుకనుమలు ఎర్రబారుతున్నాయి. ఆకాశం సింధూర వర్ణమౌతోంది తనని తానే తాకే అంచుల్లో. నీలం చీరెకు ఎర్రంచు జరీలా ముచ్చటగా, హుందాగా అన్పించింది ఆ దృశ్యం మాలతికి. తోటలో బంతిపూలను సుతారంగా గిల్లి సజ్జలో వేసుకొంటోంది మాలతి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, పులకిస్తూ.

ఇంతలో ఇంటిముందు వేగంగా వచ్చి ఆటో ఆగటంతో తలెత్తి చూసింది మాలతి. అందులోంచి దిగింది ఎవరో కాదు సాక్షాత్తు తను ప్రాణంగా భావించే స్నేహితురాలు సుగుణ. ఆ సమయంలో సుగుణ అలా హఠాత్తుగా ఊడిపడటం మాలతిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. క్షణం తర్వాత తేరుకోగల్గింది మాలతి.

"హాయ్ సుగుణ, ఇలా వచ్చావేమిటి?"

"ఏముంది ఓసారి నిన్ను చూసిపోదామని" ఎంతో ఆప్యాయత ఆ గొంతులో.

"రా, లోపలికెళ్దాం. అన్నట్లు చదువుతున్నావా కోర్టు కేసు విచారణ పేపర్లలో?" అడిగింది మాలతి కుతూహలాన్ని ఆపుకోలేక.

"పేపర్లలో వచ్చే కోర్టు ప్రొసీడింగ్స్ అన్నీ చదువుతున్నాను. అవి చదివి ఆందోళన కలగబట్టే ఇలా హఠాత్తుగా వచ్చాను. ఏమిటే? నిన్ను అబిడ్స్ పోలీసులు వ్యభిచారం చేస్తుండగా పట్టుకున్నారని డిఫెన్సు లాయర్ రామ చంద్రయ్య వాదిస్తున్నాడేమిటి?" అడిగింది సుగుణ భయంగా ముఖం పెట్టి. ఆమె భయం చూస్తే మాలతికి జాలి, నవ్వు సమ్మిళితమైన ఓ అనుభూతి కల్గింది.

"అదంతా ఓ పెద్ద కథ. అయినా నువ్వు నిజంగా నమ్మేశావా? నాకెప్పుడూ నా ధైర్యం గురించి గర్వపడటం అలవాటే, కాని నువ్వు ధైర్యంగా మాత్రం ఉండలేవు. ఆడదానికి పిరికితనం, భయమే శాపాలే సుగుణ. అది సరేగాని ఈసారి వాయిదా ఆఖరి వాయిదా తెల్సా? నెక్స్ట్ జడ్జిమెంట్?" అంది మాలతి.

"తెల్సు తెల్సు. ఇంతకీ ప్రాసిక్యూటర్‌గారు ఏమంటున్నారు?"

"మనం గెల్చి తీరుతాం అని అంటున్నాడు."

"పాపం! పరబ్రహ్మం ఎలా ఉన్నాడో?"

"అంత జాలిగా ఉందా నీకు?"

"ఛ, ఛ, అదేంలేదు. మొండితనానికి పోయి నిజం చెప్పకపోతే శిక్షపడ్తుంది కదా! ఒకటా, రెండా పైగా ఏడు సంవత్సరాలు. కఠిన కారాగారశిక్ష. అందు కంటున్నా" అంది సుగుణ.

"నిజం చెప్పాల్సింది అతను కాదే నేను. లొంగి కాళ్ళబేరానికి రావాల్సింది అతను. కేసు ఇంత తలక్రిందులైనా ఇంకా పట్టువదలని విక్రమార్కుడిలా భీష్మించుకుని కూర్చోవటం వల్లనే అతను ఇంతకింత ప్రాణంపైకి తెచ్చుకున్నాడు. చూశావా, ఆడవాళ్ళమై కూడా మనం ఇన్ని ఆలోచిస్తాం. అందుకే మగ వాళ్ళు మరీ అంత బరితెగించి పోతున్నారు" అంది మాలతి స్త్రీ బలహీనతను ఎత్తి చూపుతున్నట్లుగా.

"చూడు సుగుణా! మగవాడు రేప్ చేస్తే, రేప్ చేసినందుకు ఆడది కోర్టులో కేసు వేస్తే, కేసు వేసినందుకు వ్యభిచారి, కులట అని నిందిస్తాడా డిఫెన్స్‌లాయర్? అతనికి శిక్ష వేయడానికి కోర్టుకు సాక్ష్యాలు, ఆధారాలు కావాలా? అవన్నీ ఆడదానికి అందుబాటులో ఉండేలా మగవాడు నిజంగా రేప్ చేస్తాడా? అది అటుంచుదాం. ప్రేమించినట్లు నటించి, నమ్మించి ఆడదాన్ని అనుభవించి 'దిక్కున్నచోట చెప్పుకో' అని సవాలుచేసే నక్కముఖం మగవాళ్ళను ఏ చట్టం, ఏ శిక్షాస్మృతి క్రింద శిక్షించాలో కోర్టులను చెప్పమను. అందుకే... అందుకే ఈ పనిచేశాను. దిక్కున్నచోట చెప్పుకోమని నేను వాడిని సవాలు చేస్తున్నాను. వాడివల్ల కావటంలేదు. కేవలం బిక్కచచ్చి, బింకం బిగువుతో బ్రతుకుతున్నాడు" ఆవేశంగా మాట్లాడింది మాలతి.

"అవును, నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళు కరెక్ట్. చిన్నప్పట్నించి చూస్తున్నాను. అప్పటికీ, ఇప్పటికీ నీ ఆవేశంలో మిల్లీగ్రాం తేడా లేదు. పోన్లే ఈ కేసు గెలిస్తే నీ లక్ష్యం, ఆదర్శం నెరవేరతాయి. విష్ యూ ఆల్ ది బెస్ట్" అంది సుగుణ.

"థాంక్స్... నే గెలిచి తీరుతాను. న్యాయం జరిగి తీరుతుంది. ఆడవాళ్ళను మోసంచేసి పారిపోయే మగవాళ్ళకు చట్టపరంగానే బుద్ధిచెప్తాను. అన్నట్లు అసలు సంగతి అడగటం మర్చిపోయాను. పాప ఎలా ఉంది?"

"పాపకేం నిక్షేపంలా ఉంది. 'మాలతీ' ఆంటీ దగ్గర కెప్పుడు తీసుకెళ్తావ్? అని మరీ మరీ అడుగుతోంది" అంది సుగుణ. సుగుణ వెళ్ళిపోతుంటే ఆమెవైపే తదేకంగా చూస్తూ నిలబడిపోయింది మాలతి. సుగుణ ముందుకేసే అడుగులు మాలతి మనో మందిరంలోకి గతాన్ని తీసుకొచ్చాయి.

అవును, ఇక మూడు రోజులాగితే పరబ్రహ్మంకు శిక్షపడటం ఖాయం. అసలు తనని పరబ్రహ్మం చెరిచాడని కేసు వేసినప్పుడు తను ఆశించింది, ఊహించింది వేరు. ఇప్పుడు జరుగుతున్నది వేరు. నిజానికి తను ఏం సాధించా లనుకొంది? చివరకు ఇది ఏమౌబోతున్నది? తల్చుకుంటే తల తిరుగుతోంది. అన్యాయం జరిగిన ఆ పిల్ల ఆమెకు అన్యాయం ఇలా జరిగిందని కోర్టులో నివేదించుకోలేక, లాయర్ల ప్రశ్నలకు సిగ్గుపడి, అభిమానంతో చచ్చి చివరకు ఆత్మహత్యలకు పాల్పడ్తుంటే అలా జరగకూడదని, ఆడది ఆత్మస్థైర్యంతో పరిస్థితి ఎలా ఎదుర్కోవాలో నిరూపించేందుకు అయినవాళ్ళను కూడా కాదని ఎదిరించి రంగంలోకి దిగింది తను. తన శపథం నిరూపించుకుని అన్యాయం జరిగేవాళ్ళకి న్యాయం జరిగేలా న్యాయాన్ని మధించగలననుకొంది. ఇప్పుడయింది ఏమిటి? ఈ మధ్యకాలంలో పోలీసులు వచ్చి అబిడ్స్ కేసుకు సంబంధించి తన వివరా లన్నీ చెక్‌చేసుకొని మరీ వెళ్ళారు. ఇక ఆ ప్రాసిక్యూటర్‌గారే తనకిచ్చిన మాటను నిలబెట్టుకొని కేసు సవ్యమైన మార్గంలో నడిచేలా చేయగల్గాలి. ఆయనే ఈ ప్రస్తుత గందరగోళంలో, తన ఒంటరి పోరాటంలో గోరంత వెలుగు, మిణుగురు దీపం, ఆశ–అన్నీను. ఇంతలో కాలింగ్ బెల్ మోగిన చప్పుడయింది. మాలతివెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ఎత్తైన భారీ విగ్రహం. నుదుటన వైష్ణవ తిలకం,

చేతిలో పొన్నుకర్ర, పచ్చని పసిమితో అరవైఏళ్ళ వ్యక్తి అతను. అతని వెనుకనే డ్రైవరు నుంచొని ఉన్నాడు. దూరంగా గేటు దగ్గర మారుతి కారు ఆగి కన్పడింది మాలతికి. "గుర్తుపట్టావామ్మా?" అడిగాడు ఆయన. "లేకేం. మీరు పరబ్రహ్మం నాన్నగారు కదూ. కోర్టులో చూసినట్లు గుర్తు" అంది మాలతి.

"సరిగ్గా చెప్పావు. మరి నేనెందుకు వచ్చానో కూడా ఊహించి ఉంటావే?" అన్నాడాయన. ఆ ముఖంలో నైర్మల్యం, ప్రశాంతత కన్పించాయి మాలతికి.

"ఇంకెందుకు. మీ వాడ్ని వెనుకేసుకొచ్చి, నన్ను ఈ కేసు ఉపసంహరించుకోమని చెప్పాలనో లేక బెదిరించాలనో" అంది మాలతి తడుముకోకుండా.

"లేదమ్మా! పొరబడ్డావు. మావాడు ఏ నేరం చేయనిది ఏ ఆడపిల్లా ఇలా కోర్టుకీడుస్తుందని నేననుకోను. డబ్బు మదంతో ఏం చేసినా చలామణి అవుతుందన్న ధైర్యంతో మాకు తెలీకుండా ఏదో పాడుపని చేసే ఉంటాడు. సందేహం లేదు. కాని నిజమేమిటో తెలీటం లేదు. కోర్టులోనే కాక జైల్లో కూడా నేను, లాయరు కలిసి అడిగినప్పుడు వాడు తనే పాపం ఎరగనంటాడు. అసలు నిన్నెప్పుడూ చూడలేదంటాడు. నువ్వెవరో తెలీదంటాడు. మరి నువ్వేమో అతను నిన్ను చెరిచినట్లు బట్టలతో సహా మెడికల్ పరీక్ష కాగితాల్ని కూడా చూపించి వాడే నిన్ను చెరిచాడని ఘంటాపథంగా చెప్తున్నావు. అసలు నిజమేమిటో ఇప్పుడైనా తెల్సుకుందామని వచ్చాను" అన్నాడాయన వేదనగా.

"చాలా తెలివైనవారు. మీ డిఫెన్స్ లాయరు నిజం కనుక్కోలేక ఈవిధంగా మిమ్మల్ని నాపైకి ప్రయోగించి చూస్తున్నాడన్నమాట" అంది మాలతి.

"అయ్యయ్యో, అపార్థం చేసుకోకమ్మా. పోనీ నిజం చెప్పనక్కర్లేదు. నిన్ను కోడలిగా స్వీకరిద్దామన్న ఉద్దేశంతో నీ అంగీకారం కోసం వచ్చాను. ఎటూ నీ పేరు, మావాడి పేరు పత్రికలకెక్కాయి. నిన్ను మాత్రం ఎవరు చేసుకుంటారు చెప్పు? నిన్ను మావాడు పెళ్ళి చేసుకుంటే ఈ సమస్య తీరుతుందని నా ఆశ."

"ఛీ... ఛీ... ఆ నీచుడ్ని పెళ్ళి చేసుకోవాల్సిన ఖర్మ ఏమిటి? నన్ను 'కో' అంటే కోటిమంది పెళ్ళి చేసుకుంటారు. నాకు భయం లేదు. మీరేమీ నాపై జాలి చూపనక్కరలేదు. రేపో ఎల్లుండో శిక్షపడే మీ అబ్బాయిపైన చూపుకోండి మీ జాలినంతా" అంది మాలతి.

"పోనీ మా వాడికి శిక్ష పడకుండా తప్పే మార్గం ఏమీ లేదా? నువ్వు మొదట్లో అన్నట్లే వాడ్ని శిక్ష నుంచి తప్పించడానికి కన్నతండ్రిగా నిన్ను వేడుకోవడానికి వచ్చాననుకో. దయచేసి ఏదన్నా మార్గం నువ్వే చెప్పమ్మా. ఏ నేరం చేయలేదని వాడు నెత్తి, నోరు కొట్టుకొని మరీ చెప్తున్నాడు. చేశాడని నువ్వు వాదిస్తున్నావు. మీ మధ్యలో నేను, నా భార్య ఎంత నలిగి, కృశించి పోతున్నామో నీకర్థం కాదు. మాకెందుకీ గుండెకోత? నా పరువు, ప్రతిష్ఠలు ఎటూ మంట కలిశాయి. మా కుటుంబానికి చెరగని మచ్చ వచ్చింది. ఇక మేం బ్రతికి ఏం లాభం? నువ్వు కాదంటే ఏ నుయ్యో గొయ్యో చూసుకోక తప్పదు." ఆయన గొంతు జీరబోయి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. మాలతి హృదయం కొంచెం కదలింది ఓ మూల. స్త్రీ సహజమైన జాలి ప్రవేశించింది ఆమెలో.

"అయితే మీ అబ్బాయి నేను ఏది చేయమంటే అది మేజిస్ట్రేట్‌గారి ముందు ప్రమాణ పూర్తిగా చేయడానికి సిద్ధమేనా?" అడిగింది మాలతి.

"ఓ కావలిస్తే జీవితాంతం నీ ఇంట్లో ఊడిగం చేస్తాడు. చెప్పమ్మా! ఏం చేయమంటావు?" అడిగాడు ఆతృతగా.

"అది ఇప్పుడు చెప్పను. ఈసారి కోర్టుకు హాజరైనప్పుడు మీ వాడు అదే మాటపై నిలబడితే అందరి సమక్షంలో అప్పుడు చెప్తాను. ముందు మీ డిఫెన్సు ఉపసంహరించుకోండి. మర్యాదగా ఉంటుంది" చెప్పింది మాలతి.

"అలాగే. వెళ్ళొస్తాను. మళ్ళీ మనస్సు మార్చుకోకు" అన్నాడాయన ఆందోళనతో కూడిన వదనంతో ప్రాధేయపడుతున్నట్లుగా.

"మీరిప్పుడు నా ముందు ఒప్పుకున్నదానికి భిన్నంగా ఏమాత్రం జరిగినా మీ అబ్బాయికి శిక్ష ఖాయం. గుర్తుంచుకోండి" నిష్కర్షగా చెప్పింది మాలతి.

"అలాగే" అంటూ వెళ్ళిపోయాడు పరబ్రహ్మం తండ్రి. 'భేష్! ప్రాసిక్యూటర్ గారు అన్న మాట నిలబెట్టుకున్నారు. ఇక నేనాశించింది ఈ చివరి వాయిదాలోనే జరిగి తీరుతుంది' అనుకొంది తన మనస్సులోనే మాలతి.

* * *

అది మానభంగాల కేసుల్ను విచారించే ప్రత్యేక న్యాయస్థానం. కోర్టు ప్రారంభం కాగానే ప్రాసిక్యూటర్ కోరికపై మాలతి, పరబ్రహ్మం ఇరువైపులా

బోనెక్కారు. ప్రాసిక్యూటర్ మాలతికి కనుసైగ చేసిన మరుక్షణం మాలతి జడ్జి వైపు తిరిగి "మీరు క్షమిస్తే పరబ్రహ్మాన్ని ఈ కోర్టు సమక్షంలో కొన్ని ప్రశ్నలు వేస్తాను" అని వినయంగా కోరింది.

జడ్జిగారు అంగీకర సూచకంగా తలూపారు.

మాలతి పరబ్రహ్మం కళ్ళల్లోకి సూటిగా చూస్తూ "మిస్టర్ పరబ్రహ్మం! ఒక అమ్మాయిని ప్రేమించినట్లు నటించి, నమ్మించి, మోసం చేసి, చివరికి గర్భవతియైన స్త్రీ అన్న కనికరం లేకుండా మెడపట్టి గెంటేశావు, సుమారు సంవత్సరం క్రితం. గుర్తుకు వచ్చిందా? ఆ అమ్మాయి ఎవరు?" అడిగింది.

క్షణంపాటు నివ్వెరపోయాడు పరబ్రహ్మం. అతని హృదయంలో సుగుణ రూపం. ఆమె తన బిడ్డకు తండ్రిగా సమాజంలో ఓ స్థానం కల్పించమని ప్రాధేయపడటం, తన కాళ్ళపై పడి బ్రతిమాలటం, తను నిర్దాక్షిణ్యంగా ఆమెను గెంటించటం స్పష్టంగా మెదిలింది. అతని ముఖం వెలవెలబోయింది.

మరోసారి మాలతి "ఏం మిస్టర్ పలుకవేం?" అని అడిగేవరకూ అతని నోరు బిగుసుకుపోయింది. పెదవులు కదల్లేదు. మౌనంగా తలూపాడు అతను.

"పేరేమిటి ఆ అమ్మాయిది?" అడిగింది మాలతి.

"సుగుణ" చెప్పాడు పరబ్రహ్మం.

జడ్జిగారి నుంచి అందరూ అయోమయంలో పడ్డారు.

"ఆమెను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధమేనా?" అడిగింది మాలతి.

సిద్ధమేనన్నట్లు తలూపాడు పరబ్రహ్మం.

"థాంక్స్" అంటూ జడ్జిగారివైపు తిరిగి తమరు క్షమిస్తే వాస్తవాన్ని విన్న వించుకుంటాను. ఇందులో నా తప్పును బట్టి మీరు నాకు ఏ శిక్ష విధించినా సంతోషంగా స్వీకరిస్తాను" అంది మాలతి.

"నిర్భయంగా చెప్పవచ్చు" శలవు ఇచ్చారు జడ్జిగారు.

"మిలార్డ్. నిజానికి సుగుణ అనే అమ్మాయి, ఈ పరబ్రహ్మం ప్రేమించు కున్నారు. ఆమెను తన కోరికలకు అనుగుణంగా ఇష్టమొచ్చినట్లు అనుభవించాడు పరబ్రహ్మం. ఆ తర్వాత ఆమె గర్భవతి అయిన సంగతి తెల్సుకొని, తనకంతకంటే డబ్బున్న అమ్మాయి సంబంధం మంచిదని భావించి ఆమెను తరిమివేశాడు

అర్ధరాత్రిపూట. అదేరాత్రి సుగుణ అప్పట్లో వర్కింగ్ ఉమెన్స్‌హాస్టల్లో ఉంటున్న నా దగ్గరకొచ్చి జరిగినదంతా వివరంగా చెప్పి ఆత్మహత్య చేసుకొంటానంది. సుగుణ నా చిన్ననాటి స్నేహితురాలు. మేమిద్దరం ఒకరికొకరం ప్రాణ సమాన మయ్యాం. అందుచేత నేనామెను ఓదార్చి, ధైర్యం చెప్పి, పరబ్రహ్మానికి తగిన బుద్ధి చెప్పి వాళ్ళిద్దరికీ పెళ్ళి చేస్తానని హామీ ఇచ్చాను. సుగుణను వరంగల్లో నా స్నేహితురాలింట జాగ్రత్తగా ఉంచాను. ఆమె ఇప్పుడు పరబ్రహ్మం బిడ్డకు తల్లి. ఆ రోజు రాత్రే నేను నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి పరబ్రహ్మం నన్ను చెరిచాడని కంప్లైంట్ ఇచ్చాను. పోతే డిఫెన్స్‌వారు వాదించినట్లు నేను వ్యభిచా రిణిని కాను. నాకు అంతకుముందే కొద్ది వారాలక్రితం రత్నాకర్‌రావుతో పెళ్ళయింది. మాది లవ్ మ్యారేజ్. ఉద్యోగరీత్యా నా భర్త ఉండేది బెంగుళూరులో. ఇక్కడికి నా భర్త వచ్చినప్పుడు మేమిద్దరం హోటల్లో కలుస్తూనే ఉండేవాళ్ళం. అప్పుడోసారి అబిడ్స్ పోలీసులు రైడ్‌చేసి మేమిద్దరం భార్యాభర్తలమని మొత్తుకున్నా వినకుండా నామీద కేసు బుక్ చేశారు. ఆ తర్వాత మేం రిజిస్ట్రార్ ఆఫీసునుంచి సర్టిఫికెట్ ఆఫ్ మ్యారేజ్ తెచ్చాక కేసు కొట్టేశారు.

ఇక స్నేహంరీత్యా నా బట్టలు సుగుణ కట్టుకోవటం తరచూ జరుగు తూండటం వలన పరబ్రహ్మం గెస్ట్‌హౌస్‌లో నా చీరెలు, పెట్టీకోట్స్ దొరికాయి. సుగుణ మా హాస్టలుకు వచ్చిన రాత్రి నేను, నా భర్త శారీరికంగా కల్సి ఉండటం వలన, ఇప్పుడే పిల్లలు వద్దనుకోవడం కారణంగా మెడికల్ రిపోర్టులో వీర్యరహితమైన పెనిట్రేషన్ అని రాయటం జరిగింది ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్స్. సుగుణ పిరికిది, భయస్తురాలు కావటం వలన, ఆమె అప్పుడున్న స్థితిలో ఎంత ధైర్యం చెప్పినా వినేది కాదు. కనుక నేను సుగుణకు న్యాయం జరగడం కోసం, పరబ్రహ్మం తప్పించుపోయి మరో పెళ్ళి చేసుకోకుండా ఉండటానికి ఈ కేసు పెట్టాను అతనిపై. ఇప్పుడైనా అతను నిజం చెప్పడం ఎంతో సంతోషంగా ఉంది. అతనికి, ఆమెకు వివాహం జరిపించేలా న్యాయస్థానం చొరవతీసుకుంటే సాటి స్త్రీకోసం నే పడ్డ మానసిక శ్రమకు, కష్టానికి ఫలితం ఉంటుంది" అని ముగించింది మాలతి.

* * *

మాలతి సాహసం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. వాళ్ళకిదో విడ్డూరం. అసలు ఇలా ఎప్పుడూ జరగగలదని ఎవ్వరూ ఊహించలేదు. లోకంలో ఎంత సాహసులుంటారు?

జడ్జిగారు తీర్పునిచ్చారు. పరబ్రహ్మం సుగుణను పెళ్ళి చేసుకోవాలని, పెళ్ళయినతర్వాత కూడా పరబ్రహ్మం ప్రవర్తనను, వారిరువురి కాపురాన్ని రెండేళ్ళ పాటు పోలీసులు అనుక్షణం గమనిస్తుండాలన్నది ఆ తీర్పు సారాంశం.

సాటి స్త్రీకోసం తనవాళ్ళను ఎదిరించి, వాళ్ళ బెదిరింపులు సైతం లెక్క చేయక పరువుప్రతిష్టలను ఫణంగాపెట్టి పోరాడిన మాలతిని అభినందిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పుకు యువతరం నీరాజనాలు పల్కింది.

అయినప్పటికీ సుగుణలా కొన్నివేలమంది అమాయక స్త్రీలు మగవారి కామాగ్నికి బలైపోతున్న ఈ కాలంలో ఎంతమంది స్త్రీలు తన సాటి స్త్రీకోసం ముందుకు రాగలరన్న ఆలోచన మటుకు మాలతిని అప్పుడూ, ఇప్పుడూ వేధిస్తూనే ఉంది.

అందుకే 'ఇది జరగని కథ'నే. కాదంటారా?

"ఎంతైనా ఆడపుట్టుక పుట్టలా? ఆడదానికి ఇంత బరితెగింపు తగదు'' అని బుగ్గలు నొక్కుకుని లోలోన గుసగుసలాడుకునే సగటు స్త్రీలకు ఇది జరగని కథనే, అవునా?

"సుగుణలాంటి అన్యాయం జరిగిన అమ్మాయిలే ధైర్యంగా ముందుకువచ్చి పోరాడాలి కాని మాలతి పోరాడిన తీరు సరైన పంథా కాదు" అని వాదించే విప్లవకారులకు ఎన్నటికీ 'ఇది జరగని కథ'నే. ఏమంటారు?

–ఉదయం ఆదివారం, 7 ఫిబ్రవరి, 1988

❀

ఎదురు దెబ్బ

"హలో!" హుషారుగా విష్ చేశాడు అరవింద్.

"హలో!" నీరసంగా, పేలవంగా పల్కింది కృష్ణవేణి.

"ఏమిటలా ఉన్నారు?"

"ఎలా ఉన్నాను..."

"అదే... నీరసంగా ఉన్నట్లుంటేను..." నీళ్ళు నమిలాడు అరవింద్.

"ఒంట్లో బాగా లేదు రెండు రోజుల్నుంచి."

"ఓ... అలాగా, అయితే డాక్టరుకు చూపించలేకపోయారా?"

"ఇంత చిన్న విషయానికి డాక్టరు ఎందుకండి?"

"అలా అంటే ఎలాండి?"

"ఏం ఫర్వాలేదు. రెండు రోజులు పోతే అదే సర్దుకుంటుంది."

"లేదు. మీరేదో దాస్తున్నట్లనిపిస్తున్నది. మీ ఆడవాళ్ళు ఎప్పుడూ ఇంతే."

"మీకెలా తెల్సు ఆ విషయం..."

"ఏ విషయం?"

"అదే ఆడవాళ్ళు ఇంతేనని. అయినా ఎంతమంది ఆడవాళ్ళతో పరిచయం ఉందేంటి మీకు..?"

"ఛ... ఛ... అలాంటిదేమీ లేదు... మీ ఫేస్‌ను బట్టి..."

"బట్టి... ఉ... అంటే మీకు ఫేస్‌రీడింగ్ కూడ వచ్చా?"

"అదొస్తే ఇలా బ్రతికేందుకేం ఖర్మ? మహారాజులా ముఖాలు రీడ్‌చేసి డబ్బులు రాలగొట్టుకొనేవాడ్ని. అయినా ఫేస్‌రీడింగ్ గొప్ప ఆర్టండి. ఆస్ట్రాలజీ

ఎప్పుడూ చదవలేదా?"

"మరి నా ఫేస్ చూసి ఎలా చెప్పగల్గారు?"

"మీకు తెలీదా... నిజంగా... ఎలా చెప్పగల్గానో..."

"నిజంగా తెలీదు..." ఓ చిరునవ్వు ఆమె ముఖంపై దోబూచులాడింది.

"మై గుడ్‌నెస్..." అరవింద్ అలసిపోయాడు. తను చెప్పదల్చుకొంది అంతకుమించి మాటల్లో పెట్టలేకపోయాడు. "మీతో మాట్లాడటం చాలా కష్టం..." అన్నాడు.

"థాంక్స్ ఇప్పటికైనా గ్రహించారు."

"ఇంతకీ విషయం చెప్పనంటారు..." మళ్ళీ అడిగాడు అరవింద్.

"ప్రస్తుతానికి ఏమీ చెప్పలేను... సారీ."

"అంతేనంటారా?"

"సారీ..." మరోసారి అంది. "ప్రస్తుతానికి ఇంతే" అంటూ వడివడిగా నడుచుకొంటూ ముందుకు సాగిపోయింది కృష్ణవేణి. ఆమె వెళ్ళినవైపే చూస్తుండిపోయాడు అరవింద్. అరవింద్ కృష్ణవేణిల పరిచయం నిన్నమొన్నటిది కాదు. దాదాపు వాళ్ళ చదువంతా కలిసే జరిగింది. ఆ పరిచయంతోనే వాళ్ళప్పుడప్పుడు కలిసి ఒకళ్ళ సమస్యలొకరికి చెప్పుకొంటూంటారు.

సహజంగానే కృష్ణవేణి మంచి మాటకారి. ఆ రోజు కృష్ణవేణిలో ఎప్పటి హుషారు ఉత్సాహం, కళ్ళలో మెరుపు, ముఖంలో కాంతి లేవు.

కృష్ణవేణి కావ్యనాయికలా పెద్ద రూపసి కాదు. చామనఛాయ, గుండ్రటి ముఖం, సన్నటి నడుము, చక్కని యౌవ్వన సంపద, పేరుకు తగ్గట్లు నల్లటి పొడవాటి జడ. చూడటానికి ఆకర్షణీయంగా కన్పిస్తుంది.

కృష్ణవేణి అంటే అరవింద్‌కు ప్రత్యేక అభిమానం, గౌరవం ఉన్నాయి. ఆ దినం కృష్ణవేణి అలా కన్పించటం, ఎంతో మాట్లాడాలనుకొన్న అరవింద్‌ను చాలా నిరుత్సాహపరచినా, 'ఆడవాళ్ళ అలకకి, కినుకకి కారణం, ఆ కృష్ణ పరమాత్మకే అర్థం కాలేదు. ఏ అనుభవంలేని నాకెలా అర్థమవుతుంది' అని సర్దుకున్నాడు అరవింద్.

* * *

అరవింద్‌ని తప్పించుకొని ఇంటిముఖం పట్టిందేకాని కృష్ణవేణి మనస్సంతా కకావికలంగా ఉంది.

ఆ రోజు ఆఫీసులో జరిగినదానికి ఆమె మనస్సు ఉడికిపోతున్నది.

ఎప్పటిలాగే ఆ రోజూ ఆఫీసుకు పదిగంటలకు వెళ్ళింది కృష్ణవేణి. ఆమె సీట్లో కూర్చుండబోతుండగా ఎదురుగా సాక్షాత్కరించాడు ఆఫీస్‌బాయ్ రంగయ్య.

"సార్ పిలుస్తున్నారు అమ్మగోరు" అన్నాడు రంగయ్య.

"ఏ సార్?"

"మన మేనేజర్ సార్."

"ఎందుకు?"

"ఏమో తెలీదండి."

"సరే. వస్తున్నానని చెప్పు."

రంగయ్యని పంపించి, టేబిల్ డ్రాయర్లో పర్సుపెట్టి ఓసారి అంతా చెక్ చేసుకొని మేనేజర్ దగ్గరికి వెళ్ళింది కృష్ణవేణి.

"పిల్చారుట."

"చూడండి... ఆ ఆకుపచ్చ ఫైలు మీకు పంపి రెండురోజులయింది. ఇంతవరకూ మీరు దానిని నాకు పుటప్ చేయలేదు. కారణం..?"

"ఏ ఆకుపచ్చ ఫైలు సార్?"

"ఎన్ని ఆకుపచ్చ ఫైళ్ళున్నాయి?"

"చాలా ఉన్నాయి సార్. అందుకే విషయం అర్థం కాక..." మధ్యలో ఆగింది కృష్ణవేణి.

"మేడమ్, డోన్ట్ బి సిల్లీ" కోపంతో జేవురించింది మేనేజర్ ముఖం.

"ఎస్, సార్... మన దగ్గర ఫైళ్ళకు రెండే రకాల ఫోల్డర్సు. కొన్నింటికి ఆకుపచ్చ, కొన్నింటికి రెడ్ కలర్ ఫోల్డర్స్ ఉన్నాయి. ఏమ్ ఐ రాంగ్ సార్?"

"మిస్ కృష్ణవేణి" అరిచాడు మేనేజర్.

"మన దగ్గర ఫైల్స్‌కు ఏ రంగు ఫోల్డర్స్ ఉన్నాయో నువు చెబితేగాని తెల్సుకోలేని స్థితిలో నేను లేను. బిహేవ్ యువర్ సెల్ఫ్ ప్రాపర్లీ. అయామ్ యువర్ బాస్... మైండిట్" గర్జించినట్లు మాట్లాడాడు మేనేజర్.

కృష్ణవేణికి తల కొట్టేసినట్లయింది. అందరూ తనవైపే వేడుక చూస్తున్నట్లు గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. పైగా తనకిది మొదటి ఉద్యోగం.

"ఇంతకీ ఆ ఫైలు సంగతి" మళ్ళీ దబాయించి అడిగాడు మేనేజర్.

"ఏ ఫైలు సార్..." అని తడబడి "సారీ... అదే అడగొద్దన్నారు కదా..." అని నిల్చుండిపోయింది.

"ఆ ఫైలు నాకు చాలా అర్జంటు. అది హరిజనుల ఇళ్ళస్థలాలకు సంబంధించినది. వెరీ ఇంపార్టెంట్. కలెక్టర్ ఆ ఫైలు కావాలని అడిగారు" చెప్పాడు మేనేజర్.

"ఆ ఫైలు నా దగ్గరకి రాలేదు సార్."

"వాట్... నీ దగ్గరికి ఆ ఫైలు రాలేదా..? ఆశ్చర్యంగా ఉందే. నేనే నీకు స్వయంగా మార్క్ చేశాను. నీ దగ్గరికి రాకుండా ఎలా పోతుంది?" అంటూ బజర్ నొక్కి రంగయ్యని పిల్చి టపాల్ బుక్ తెమ్మని ఆర్డరేశాడు మేనేజర్.

అడిగిందే తడవుగా రిజిస్టర్ తెచ్చి మేనేజర్ కందించాడు రంగయ్య. హడావుడిగా పేజీలు తిరగేసి "ఇదిగో ఇక్కడ ఫైల్ నెంబరు, దాన్ని నువ్వు రిసీవ్ చేసుకొన్నట్లు సంతకం" అని అందరికీ కన్పించేలా చూపిస్తూ కృష్ణవేణి కిచ్చాడు. 'అవును... అది తన సంతకమే. కాని ఆ ఫైలు వచ్చి చాలా రోజులయింది. ఎప్పటి ఫైల్సు అప్పుడు క్లియర్ చేసే తను ఆ ఫైల్‌ను ఎలా మిస్సయి ఉంటుంది. ప్రస్తుతం తన బల్లపై ఒక్క ఫైలు కూడా పెండింగ్ లేదు. మరి ఆ ఫైలు ఏమయినట్లు?' ఆలోచనల్లో పడింది కృష్ణవేణి. అక్కడుండి ఆలోచించి ప్రయోజనం లేదని గ్రహించి, "సరే సార్... మరోసారి నా దగ్గర ఉందేమో చెక్ చేస్తాను" అంటూ వెనక్కి తిరిగింది.

"నో, యు షుడ్ గెట్ యిట్" గట్టిగా నొక్కి మరీ చెప్పాడు మేనేజర్. నాల్గంగల్లో తన సీటును చేరుకొంది కృష్ణవేణి. టేబిల్‌పైన, కప్‌బోర్డుపైన, టేబిల్ డ్రాయర్స్ అన్నీ చెక్ చేసింది. ఓసారి ఓరచూపుతో ఆఫీసంతా పరీక్షించింది. అందరూ తనవైపే దృష్టి కేంద్రీకరించటంతో మరింత అవమానంగా ఫీలయ్యింది.

ఇలాంటి అవమానాలు జరగటం ఆమె జాయిన్ అయినప్పట్నించి ఏదో రకంగా జరుగుతూనే ఉన్నాయి.

ఓ రోజు అయిదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు రిజిష్టరులో సంతకం పెట్టనీయకుండా అడ్డుపడ్డాడు.

మరోసారి, 'సాయంత్రం ఐదు గంటలకే ఇంటికి ఎలా వెళ్ళావు? ఎవర్ని డిగి వెళ్ళావు? చెప్పి పోనక్కర్లేదా?' అంటూ ఐదుగంటలకే ఇంటికి వెళ్ళటం ఓ పెద్ద నేరంగా అరిచి రభస చేశాడు.

ఏదోరకంగా రోజూ అవమానాలు తప్పటం లేదు. ఎక్స్‌ప్లనేషనులు ఇవ్వక తప్పటం లేదు. కాకపోతే ఇంతవరకూ జరిగిన అవమానాలన్నింటికన్నా ఇది కాస్త పెద్దది. సీరియస్‌గా తలపట్టుకు కూర్చుంది. హఠాత్తుగా ఆ ఫైలు ఎవరో తీసి దాచి ఉంటారన్న ఆలోచన తన మెదడులో స్ఫురించింది. ఐతే అలా ఫైలుతీసి దాచటం వెనుక ఉన్న మోటివ్ కృష్ణవేణికి అంతుబట్టలేదు ఆ రోజల్లా.

* * *

మర్నాడు ఎప్పటికన్నా ఓ గంటముందే ఆఫీసుకు బయల్దేరింది కృష్ణవేణి.

ఆ శనివారం. రంగయ్య ఆఫీసులో ఓ మూలనున్న కాళికాదేవి పటానికి అలంకరణ చేస్తున్నాడు. ఆ సరికే ఆఫీసు శుభ్రంగా చిమ్మి బల్లల్ని తడిగుడ్డతో తుడవటంతో ఆఫీసు ఎంతో కళకళలాడ్తోంది.

ఓ గంట ముందే వచ్చిన కృష్ణవేణిని చూసి విస్తుపోయాడు రంగయ్య. పచ్చని జరీచీర, మేచింగ్ బ్లౌజ్, చేతికి పచ్చటి గాజులు, నుదుట కాసంత ఎర్రని బొట్టుతో రంగయ్య కంటికి సాక్షాత్తు లక్ష్మీదేవి నడిచి వచ్చిందా అన్పించేలా ఉంది కృష్ణవేణి.

"ఏంటమ్మగోరు ఈయాళ చాలా తొందరగొచ్చేశారు?"

"నీ పూజ చేద్దామని."

"ఎగతాళి పట్టించకండమ్మగోరు. సదువురానోడ్ని. నా పూజేం బాగుంటుం దని. నేనేమన్న గుళ్ళో అయ్యవారు సేసినట్లు సేత్తానా ఏమిటి?" అమాయకంగా మొహం పెట్టాడు రంగయ్య.

"చదువుకున్నా ముఖ్యం హృదయం, మంత్రాలకన్నా ముఖ్యం భక్తి రంగయ్య."

"కరెక్టు సెప్పినారమ్మా. సిన్నప్పుడు మా నానమ్మ కూడా ఇదే సెప్పేది."

"అయితే దేవుడంటే నీకంత భక్తి కదా! ఆ దేవుడి సాక్షిగా ఎవ్వరికీ చెప్పకుండా నాకో సాయం చేస్తావా?"

"సెప్పండమ్మగోరు... మీరడగిందే తడవుగా సేత్తా."

"మళ్ళీ వెనక్కు తగ్గవుగా."

"పోనంటే పోనండి."

"అయితే నా బల్లపై ఫైలు ఎవరు తీసుంటారంటావు?"

"ఇలాంటివన్నీ ఇక్కడ మాములేనండి... అరుంధతమ్మగోరే తీసుంటారండి."

"ఆవిడకేమి అవసరం..?"

"సెప్పగూడదు కానండి అరుంధతమ్మగోరు మన మేనేజరుగోరి మనిసండి."

"అంటే?"

"ఆవిడగారి భర్త సనిపోతే, ఈవిడగారికి ఉద్యోగమిచ్చారండి ఈ మేనేజర్ గోరు. అప్పట్నించి ఆవిడగోరు మన ఆ మేనేజరుగోరి వల్లో పడిపోయారండి."

"ఛీ... మేనేజరు అలాంటివాడా?"

"సిన్నగా సెప్తారేటండి. మన అనసూయమ్మగోరు కూడా పెళ్ళికి ముందు ఆయనకు అలవాటుపడ్డ మనిషేనండి."

"పెళ్ళయినాక మానేసిందా?"

"మన ఆఫీసరుగోరు ఓ ప్రత్యేకంలేండి. పెళ్ళయిన ఆడోళ్ళ ఊసెత్తరండి. వాళ్ళ జోలికెళ్ళరంటే నమ్మండి."

"ఏం?"

"ఏమోనండి..!"

"ఫైలు మాయం చేయటంవల్ల అరుంధతికేం లాభం?"

"ఆఫీసరుగోరి సూపు ఇప్పుడు మీపైన పడుంటదండి. ఆ విషయం అరుంధతమ్మగోరికి సెప్పుంటారండి. ఆయన మెప్పుకోసం ఇలాంటి పనులుసేసి మిమ్మల్ని భయపెడితే మీరు ఆయనకి లొంగిపోతారని వాళ్ళ అభిప్రాయం కావస్సండి."

"అప్పటికీ నేనొప్పుకోకపోతే..."

"సస్పెండ్ సేస్తారేమోనండి. మీరు రాకముందు సుశీలమ్మగోరిని కూడా లొంగనందుకు ఇలాగే సేసారండి. ఇంకా ఆవిడోరి ఎంక్వైరీ జరగలేదండి. ఇయ్యాళో రేపో ఎంక్వైరీకి పైనుండి పెద్ద ఆఫీసరుగోరు వస్తారని విన్నానండి."

"మరిప్పుడు ఫైలు బయటికి తీయటం ఎలా?"

"అదే అర్థం కావటం లేదండి" బుర్రగోక్కున్నాడు రంగయ్య.

"అది సరే... నీ పూజకు ఆలస్యం అవుతున్నది. త్వరగా పూజ కానియ్యి. మళ్ళీ వాళ్ళంతా వస్తారు" అని చిన్నగా తన సీట్లోకి వెళ్ళి చతికిలబడింది.

పరిస్థితి అర్థమయింది కృష్ణవేణికి. 'ఇటువంటి సమాజంలో తనలాంటి పెళ్ళికాని ఆడపిల్లలకు జీవితం ఎంత ప్రమాదమో?' మొదటిసారిగా అర్థమయింది ఆమెకు. పెళ్ళికాని పిల్లకు కాలేజీలోనే కాక ఉద్యోగంలో కూడా ఎన్ని ప్రమాదాలు ఎదురవుతాయో మెదడులో తళుక్కున మెరిశాయి. కానీ హఠాత్తుగా పెళ్ళి చేసుకోవటం ఎంత అసాధ్యమో కూడా అర్థమయింది కృష్ణవేణికి.

'తనిప్పుడు ఉన్నఫళంగా పెళ్ళి చేసుకున్నా, ఫైలు కన్పించలేదని తన్ను ఉద్యోగం లోంచి తీసెయ్యటం ఖాయం. పైగా తన తల్లికున్న ఒకే ఒక నీడ తను. అందుచేత ఉద్యోగం తనకు చాలా అవసరం. ముందు ఆ ఫైలు వెతికి తెప్పించే ప్రయత్నం గురించి తాను ఆలోచించాలి' అనుకుంది.

తృటికాలంలో ఓ నిర్ణయానికి వచ్చింది. టేబిల్ సొరుగులాగి బయటికి కాగితం, పెన్ను తీసి లీవ్ లెటర్ రాసింది.

పూజ చేసి ప్రసాదం ఇవ్వడానికి వచ్చిన రంగయ్యతో "రంగయ్యా, మేనేజర్‌గారికెంతమంది పిల్లలు?" అడిగింది.

"ఇద్దరు. ఒక మగ, ఒక ఆడమ్మా..." చెప్పాడు రంగయ్య.

"అమ్మాయి పెద్దదమ్మా... కాలేజీలో బి.ఏ. చదువుతోంది."

"సర్లే. నాకు ఒంట్లో బాగుండకపోవటం వలన సెలవు పెట్టానని చెప్పి ఈ లీవ్ లెటర్ ఇయ్యి" అని చెప్పి ప్రసాదం తీసుకొని గబగబ బయటికి నడిచింది.

* * *

అరవింద్‌ను అంతదూరంలో చూస్తూనే ప్రాణం లేచివచ్చినట్లయింది కృష్ణవేణికి.

"వెతకపోయిన తీగ కాలికి తగిలినట్లు నీ గురించి నే వస్తుంటే సరిగ్గా నువ్వే ఎదురుపడ్డావు" చనువుగా అంది దగ్గరికొచ్చి అరవింద్‌తో.

"ఏమిటో అంత విశేషం?"

"ఏమీ లేదు. నీతో వ్యక్తిగత విషయం మాట్లాడాలి."

"మాట్లాడు."

"ఇక్కడ కాదు. పార్కు ప్రక్క చెరువు గట్టుపైన కొబ్బరిచెట్టు నీడలో మాట్లాడ్దాం" అంది కృష్ణవేణి.

"సరే! పద."

ఇద్దరూ మౌనంగా పార్కు దగ్గరికి నడిచారు. ఓ చోట అరవింద్ మౌనంగా కూర్చున్నాడు. అతనికి దగ్గరగా కృష్ణవేణి కూర్చుంది. తన ఆఫీసులో జరిగిన విషయం అంతా అతనికి వివరంగా చెప్పింది. అలాగే తనాలోచించిన పథకం కూడ చెప్పింది.

కృష్ణవేణి సాహసానికి అరవింద్ నోట మాట రాలేదు. అసలు అలాంటివి ఎక్కడో జరుగుతాయని విన్నాడు. మహా అయితే నవలల్లో, సిన్మాలో జరగటం ఎరుగును గాని నిజంగా చూడటం ఎప్పుడూ జరగలేదు. అలాంటిది స్వయంగా, స్వయంగా... ఆలోచించుకోలేకపోతున్నాడు అరవింద్.

"ఏమిటలా నోరెళ్ళబెట్టావు?" అడిగింది కృష్ణవేణి.

"ఆహ, ఏమీలేదు" తడుముకున్నాడు అరవింద్.

"ఇంతకీ నాకు సాయం చేస్తావో లేదో చెప్పు" నిలదీసింది కృష్ణవేణి.

ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా కన్పించాడు అరవింద్.

"ఓ.కే. అలాగే, నువ్వు చెప్పినట్లు చేస్తాను" చెప్పాడు అరవింద్.

"హమ్మయ్య... ఇప్పటికి మగాడివి అనిపించావు" అంది కృష్ణవేణి.

* * *

ఆఫీసులో ఫోను "ట్రింగ్, ట్రింగ్" అని మ్రోగింది. మేనేజర్ పర్సనల్ అసిస్టెంట్ ఫోను ఎత్తాడు.

"హల్లో! మేనేజర్ ఉన్నాడా?..." అవతలి నుంచి ఓ మగకంఠం కరుకుగా పల్కింది.

"ఉన్నారు. మీరెవరు?" అడిగాడు పి.ఏ.

"నేనెవరైతే నీకెందుకుబే... మేనేజర్ ఏకైక కూతురు వాళ్ళ డాడీతో మాట్లాడుతుందట, ముందు కనెక్షన్ ఇవ్వు" ఆజ్ఞాపిస్తున్నట్లుంది ఆ కంఠం.

ఇంటర్‌కమ్‌లో మేనేజర్‌కు ఆ విషయం వివరించాడు పి.ఏ. "సరే లైను కనెక్ట్ చేయి" అన్నాడు మేనేజర్ కంగారుగా.

"హలో!" కూతురు వసంత కంఠం విన్పించింది మేనేజర్‌కు.

"హలో!"

"ఎవరు డాడీయా?"

"ఆ... అవునమ్మా, డాడీనే. ఏంటి విషయం?"

"డాడీ, ఎవరో దుండగులు నన్ను బలవంతంగా ఇక్కడికి తీసుకొచ్చారు."

"ఎవరమ్మా వాళ్ళు?" ఆదుర్దాగా అడిగాడు.

"ఎవరో డాడీ, చాలా భయంకరమైన రౌడీల్లాగా ఉన్నారు."

"ప్రస్తుతం నువ్వెక్కడ్నించి మాట్లాడుతున్నావు?"

"తెలీదు... ఇదంతా ఏదో క్రొత్త ప్రాంతంగా ఉంది. నాకు భయమేస్తోంది డాడీ..."

"అసలేం జరిగింది" సీట్లోంచి ఆదుర్దాతో లేచి మళ్ళీ కూర్చున్నాడు మేనేజర్.

"ఏమో డాడీ... కాలేజీకి వెళ్తుంటే హఠాత్తుగా పైనబడి కళ్ళుమూసేసి గంతలు కట్టి ఇక్కడికి కారులో తెచ్చారు. ఏదో ఫైల్ కోసమని అలా చేశామని చెప్తున్నారు."

"ఏం ఫైలు... నిన్నేమీ చేయలేదు గదా!" అయోమయంగా అడిగాడు మేనేజర్.

"కృష్ణవేణని మీ ఆఫీసులో పనిచేసే ఆవిడ బల్లపై ఫైలుతీసి దాచేశావుటగా. ఆ అమ్మాయిని లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నావుటగా..."

"ఛ... ఛ.. ఎవరు కూసింది?" అమాయకంగా ముఖం పెట్టాడు మేనేజర్.

"ఏమో వాళ్ళంటున్నారు. ఇంతకుముందు సుశీలనే ఆవిడ్ని కూడ

లొంగలేదని ఇలాంటి నెపంతో సస్పెండ్ చేశావుటగా?"

మతిపోయినట్లయింది వసంత తండ్రికి. అవాక్కయిపోయాడు.

"హలో... హలో..." అవతలి కంఠం ఇంకా పిలుస్తూనే ఉంది.

"హలో..." ఊపిరి బిగపట్టి పల్కాడు.

"డాడీ... ఆ ఫైలు నువ్వు ఓ గంటలో అరుంధతి దగ్గర్నుంచి తీసుకొని కృష్ణవేణి బల్లపై పెట్టకపోతే నన్ను మానభంగం చేస్తారుట" అని చెప్తూనే "ఆ... వద్దు. వద్దు. మా డాడీ తప్పక ఒప్పుకొంటారు, ప్లీజ్ ఒక్కక్షణం ఆగండి" అంటూ ఆర్చింది. ఆ మాటలు ఫోనులోంచి స్పష్టంగా వినపడ్డాయి మేనేజర్‌కు.

"వసంత... వసంత... హలో... ఏం జరిగింది?" అడిగాడు వేదనగా.

"డాడీ వాళ్ళు నా జాకెట్టు హుక్స్ తెంచేశారు... లంగా బొందు కూడా... క్విక్. డాడీ ఆ ఫైలు ఎక్కడుందో చెప్పేయి..." ఏడుస్తూ అంది వసంత. ఫోనులో వసంత ఎక్కిళ్ళు మరింత స్పష్టంగా విన్పిస్తున్నాయి.

"ఇదిగో ఇప్పుడే ఆ ఫైలు అరుంధతి దగ్గర్నుంచి తెప్పించి, కృష్ణవేణి బల్లపై పెట్టిస్తాను. ఓ క్షణం ఆగమను వాళ్ళని" అంటూనే బజర్ నొక్కాడు.

అరనిమిషంలో అరుంధతి లోపలికి రావటం, మరుక్షణం కృష్ణవేణి బల్ల పైకి ఆ ఫైలు చేరటం జరిగిపోయాయి.

"హలో..." వసంత కంఠం పల్కింది.

"హలో... ఫైలు కృష్ణవేణి బల్లపై పెట్టించానమ్మా... అయినా నే పెట్టించానో లేదో వాళ్ళకెలా తెలుస్తుంది? వాళ్ళనెవర్నయినా వచ్చి చూసుకోమను."

"అక్కర్లేదుట డాడీ. అది బల్లపైకి వచ్చిన మరుక్షణం వాళ్ళకిక్కడికి ఫోను వస్తుందట. అదిగో ఇప్పుడే ఫోను మ్రోగుతున్నది. ఒక్క క్షణం లైన్‌మీదనే ఉండు డాడీ. నాకంతా అయోమయంగా, భయంగా ఉంది."

నిమిషం దాటిపోయింది. గడియారం చూసుకుంటూ టెలిఫోన్ అలానే పట్టుకున్నాడు. రెండు, మూడు, నాల్గు నిమిషాలు దాటిపోతున్నాయి.

"హలో, హలో" అంటూ ఫోనులోకి అరిచాడు మేనేజర్.

"డాడీ... ఇంతటితో ఈ విషయం మర్చిపో... పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలని ప్రయత్నించకు. ఎందుకంటే నీ ఆఫీసులోని అన్ని ఫోన్లు టాప్‌చేసి ఉంచారు.

నువ్వు పోలీస్ కంప్లైంట్ ఇవ్వగానే ఇక్కడ వీళ్ళు నన్ను మానభంగం చేస్తారుట."

"అలానేనమ్మా... అలానే నిన్ను వదిలివేయమని ప్రాధేయపడ్తున్నానని చెప్పు."

"అలాగే డాడీ. మరో కండిషనుట. సస్పెండ్ చేసిన సుశీలమ్మని తిరిగి జాయిన్ చేసుకోవాలిట. ఇంకెప్పుడూ లేడీ స్టాఫ్ జోలికి పోనని హామీ ఇవ్వాల్ట."

"అలాగే అన్నింటికీ ఒప్పుకొన్నానని చెప్పు."

"థాంక్యూ డాడీ. నన్ను ఇంటి దగ్గర దిగపెడ్తామని సైగ చేస్తున్నారు... ఇంకో అరగంటలో ఇంట్లో ఉంటాను."

"నీ కోసం ఇంటి దగ్గర ఎదురుచూస్తుంటాను."

ఫోను పెట్టేసి, సెలవుచీటి రాసేసి సెక్షను సూపరింటెండెంట్‌కు పంపించి గబగబ బయటికి నడిచాడు మేనేజర్.

* * *

"థాంక్యూ వసంత... నువ్వు ఇంత బాగా నటించగలవని నే ఊహించ లేదు సుమా... అవతలి వ్యక్తి కన్నతండ్రని తెల్సి కూడా మాతో సహకరించావు. నీ వ్యక్తిత్వానికి హాట్సాఫ్. అసలు అరవింద్ మాట్లాడాల్సి వస్తుందేమోననుకొన్నా" అంది కృష్ణవేణి.

"ఇట్స్ ఆల్‌రైట్ కృష్ణవేణి. నీ ఉద్యోగం, అంతకన్నా విలువైన నీ శీలం కాపాడగల్గినందుకు నాకెంతో సంతృప్తిగా ఉంది. నిజానికి మీరు చెప్పేదాక మా డాడీ ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్నట్లు మాకెవ్వరికీ తెలీదు. ఏదయితేనేం ఇక ఆయన ఎవ్వరి జోలికీ పోడు. సుశీలకు కూడ జాబ్ వచ్చే స్తుంది. మా డాడీని కరెక్ట్ చేయడానికి ఇంతకన్నా సరైన మార్గం ఉందను కోవటంలేదు. అందుకే నేను థాంక్స్ చెప్పాలి. బైదిబై ఓ చిన్న సజెషన్. అరవింద్ నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాడు. కేవలం అతనికి ఉద్యోగం లేదనే తప్ప అతను చాలా ఇంటలిజెంట్. జంటిల్మెన్ కూడ. ప్రస్తుతానికి నీకు ఉద్యోగం ఉంది కదా. అతన్ని ఎందుకు పెళ్ళి చేసుకోగూడదు? నీకో మొగతోడు ఉంటుంది. అలాగే అరవింద్‌కు 'ఆర్థికంగా' ఉద్యోగం సంపాదించకోవటంలో సాయిపడినదానివవుతావు."

ఆ మాటలకు కృష్ణవేణి బుగ్గ లెరుపెక్కాయి సిగ్గుతో. "అలాగే, అరవింద్‌తో మాట్లాడి చూస్తాను. అతనికేం అభ్యంతరం లేకపోతే మా పెళ్ళికి నీవే చీఫ్ ఆర్గనైజర్‌వి. ఓ.కే." అంది కృష్ణవేణి.

"ఓకే" అంది వసంత. ఇద్దరూ చేతులు కలిపారు. జీవితంలో విపత్తు వాటిల్లినప్పుడు మనిషి కృంగిపోవటం సహజం. కానీ స్త్రీ అయి వుండి కూడ కృష్ణవేణి ధైర్యం పోగొట్టుకోకుండ ఓ పథకంతో మేనేజర్‌ని దెబ్బకొట్టింది. అంతకంటే సాహసానికి మరేం ఉదారణ కావాలి. మీరేమంటారు?

వాళ్ళిద్దరూ నడుస్తూ పోతుంటే దూరంగా 'నిద్రలేచింది మహిళా లోకం. దద్దరిల్లింది పురుష ప్రపంచం' ఘంటసాలగారి పాట విన్పిస్తూంది.

–స్వాతి సపరివార పత్రిక, 26–9–1989

❁

తుఫాన్

తుఫాన్!

గంజి నీళ్ళ కోసం తుఫాన్.

ఆప్కో చీరె కోసం తుఫాన్.

రెండ్రూపాయల బియ్యం కోసం తుఫాన్.

పూరిపాకల కోసం తుఫాన్.

బురదగుంటల కోసం తుఫాన్.

శూన్యపు జీవితాల్లో ఆశల తుఫాన్.

గరీబును భూస్థాపితం చేసే తుఫాన్.

అసలు సిసలైన బంగాళా తుఫాన్.

తుఫాను వెనుక శతకోటి రాజకీయాల తుఫాన్.

తుఫాన్... తుఫాన్... తుఫాన్!...

ఎనిమిదేళ్ళ సత్తిగాడు చదువుతున్న కవితకు గుడిసెలోంచి కసురుకొంది రత్తి.

“ఏట్రా? తుఫాను అంటూ ఆ కాకిగోల?” అంటూ సత్తికి చిర్రెత్తుకొచ్చేలా అరిచింది.

“ఎహె, నీకర్థం కాదులే నా కయిత్వం వెనుక భావం. ఇగో సరిగా ఇనుకో. ఇయ్యాల రేపు భయంకరమైన తుఫానుండాదని గిప్పుడే రేడియోలో సెప్తుండారు. అదినగానే కయితొచ్చేసింది నోట్లోంచి” అంటూ తనలో అప్పుడే తప్పటడుగులేస్తున్న బాల కవిభానుడ్ని జోబుచ్చేశాడు సత్తి, తల్లి కసురుకు ప్రతి చర్యగా.

ఉరుముల ఫెళ ఫెళలు... రయ్యిమని వీచే గాలి ఈలల హోరు... పాక కప్పు ఎగిరిపోతుందేమోనన్న గుబుళ్ళు సత్తి, రత్తి గుండెల్లో ఏకకాలంలో. రత్తి బైటకొచ్చి ఆకాశంవంక చూసిందోసారి. పొద్దుట్నించి కమ్మిన కారుమబ్బులు భూతాల్లా, రాక్షసుల్లా ఘీంకరిస్తూ, గర్జిస్తూ ప్రచండంగా కుంభవృష్టి కురిపిస్తు న్నాయి. ఏదో మామూలు వర్షమేమో అనుకున్న రత్తికి సత్తిగాడి మాటలు గుండెల్లో అగ్నిపర్వతాన్ని బ్రద్దలయ్యేలా చేశాయి.

క్రిందటేడు తుఫానువల్ల జగ్గయ్యదొర వద్ద చేసిన అప్పు ఫలితంగా ఆ దొరకాడ, వడ్డీక్రింద ఈ ఏడు తన భర్త ఎల్లయ్య చేస్తున్న చాకిరీ, ఈ ఏడు పంటనమ్మి అసలు తీరుస్తానని ఎల్లయ్య రాసిచ్చిన కాయితాలు, ఉన్న ఇల్లు అమ్మి పంచేసుకుని శ్మశానం గట్టున తాము పాకేసుకున్న ఆ చీకటి రోజులు, ఒక్కసారి రత్తి మనో మందిరంలో మెదిలాయి. ఆమె కళ్ళు చెమర్చాయి.

ఇంతలో, ఎల్లయ్య పొలం కాపుకు పోతూ “రేతిరికి రాను, అక్కడే గట్టున పాకలో తొంగుంట. సత్తిగాడికి టిపిని డబ్బా ఇచ్చి బేగినే పంపు” అని తన భర్త చెప్పిన సంగతి గుర్తొచ్చి గబగబా జొన్నరొట్టెలు నాలుగు పోయిపై కాల్చి డబ్బాలో వేసి సత్తిగాడికిచ్చి జాగ్రత్తగా పోయి రమ్మంది సత్తి. వర్షానికి తడవకుండా గోతాం సంచి వాడిపై కప్పింది.

జొన్నరొట్టెలు తీసుకుని పాలబుగ్గల, మెరుపుకళ్ళ సత్తిగాడు కవితా మబ్బుల్లో విహరించడానికి బయల్దేరాడు. వాడికా వర్షంలో బయటికెళ్ళి తుఫాను బీభత్సం ప్రత్యక్షంగా చూసి ఇంకా బాగా కవితలు రాయాలని లోలోన తహతహ. తన కోర్కె తల్లి మామూలుగా ఒప్పుకొనేది కాదని సంబరం ఇప్పుడు.

వడగళ్ళు పడడం మొదలయింది. అప్పాపురం–పెదనందిపాడు కృష్ణ కాలువకు పొంగు వచ్చినట్లు ఎవ్వరికీ తెలియదు. గట్టుదాటి నీళ్ళు క్షణక్షణం పరవళ్ళు ఉరవళ్ళు తొక్కుతూ ఊరివైపు దూసుకురాసాగాయి. సత్తిగాడు వడగళ్ళ ధాటికి తట్టుకోలేక పరిగెత్తబోయి కంప కాలికి చుట్టుకుని నీళ్ళలో మునిగాడు.

చలికి మందేసుకుని రంకులో సుఖమెతుక్కుంటున్న ఎల్లయ్య, తుఫాన్నూ హించని ఎల్లయ్య, గుడిసె కూలి దానిక్రింద వెంకమ్మతో సహా కూరుకుపోయాడు నీళ్ళలో. పొలాలు తలలు వాల్చేశాయి.

రత్తి ప్రాణాలు బిగబట్టుకొని బయటికి పరిగెట్టింది నల్గురితోటి. గుడిసెలు గాలిపటాల్లా ఎగిరిపోయాయి. మూడ్రోజులు వీధి, వాడా, ఊరు తిరిగేసి మట్టుబెట్టి మాయమైంది తుఫాన్.

నాల్గోరోజు ముఖ్యమంత్రి వచ్చాడు. జీపుల జర్ జర్‌లు... ఆఫీసర్ల గిరికీలు. గంభీరంగా విషాదం పోజు ఇచ్చాడు ముఖ్యమంత్రి. ఆయన్ని అలా చూడగానే రత్తితో సహా అందరూ ఏడ్చేశారు భోరున. సిన్మాలో హీరో కష్టాల్లో ఉన్న దృశ్యం వాళ్ళ కళ్ళముందు మెదిలినట్లయింది. "ఓ నా తెలుగు ఆడపడుచు లారా" అంటూ ముఖ్యమంత్రి రత్తిని గట్టిగా కౌగలించుకుని ఉక్కిరిబిక్కిరి చేశాడు. రత్తి గువ్వలా ఒదిగిపోయింది ఆయన బాహువుల మధ్య. ప్రజలకన్నీ అందచేస్తానని, పక్కా ఇళ్ళు కట్టిస్తానని హామీల కుప్పలు పోశాడు. ఆ జోరుకు అదిరిపోయింది రత్తి. "అన్న మాటంటే మాట" అన్నారు మిగతా వాళ్ళంతా.

టీ.వీ.లు, కెమెరాలు క్లిక్, క్లిక్‌లు. సంబరపడింది రత్తి. కాని అన్న చెప్పినవి ఏవీ జరగలేదు. ఇంతలో మరో వర్గం వాళ్ళు వచ్చారు. ప్రధానమంత్రి వస్తున్నాడని చెప్పారు. "ఈ అన్న కాకపోతే పెద్దన్న వస్తున్నాడు– తమ సంగతి పట్టించుకోకపోతాడా?" అని ఊరడిల్లింది రత్తి లోలోన.

ప్రెదానమంతిరితో మళ్ళీ ముక్కెమంతిరొచ్చాడేమిటబ్బా? అనుకుంది రత్తి. మధ్యలో ఎవరో మంత్రులు ప్రెదానమంతిరికి ఏదో సెప్తుండారేంటి? అనికూడా అనుకొంది. తను ఏదో సెప్పాలనుకుంది. తన భర్త, బిడ్డ సనిపోయారని సెప్పా లనుకుంది. క్రిందటేడు అప్పు అలానే ఉందని, ఈ యేడు పొలం పూర్తిగా పోయిందని సెప్పాలనుకుంది. తమకే సాయం అందలేదని సెప్పాలనుకుంది.

ముందుకొచ్చి ప్రధానమంత్రితో ఏదో మాట్లాడబోయింది. ప్రధాని ఏదో అడిగాడు రత్తిని. రత్తి సమాధానం మరేదో. ఇంతలో ముఖ్యమంత్రి, మరో మంత్రి "యూ ఫూల్" అంటే, "యూ ఫూల్" అని అరుచుకోవడంతో భయపడి పోయింది రత్తి. ప్రధాని చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు.

రత్తి మరుదులు డేగల్లా దిగారు రంగంలోకి. ఎవర్నో పట్టుకుని రత్తికి రావల్సినవి వసూలు చేసుకున్నారు.

ఎవరు ఎవరికి సాయం చేస్తున్నది తనిఖీ లేని సమయం. దోచుకునే

దొరబాబులకు సువర్ణావకాశం. బ్రోకర్లకు, పార్టీలకు పండుగ రోజులవి.

రత్తికి తన కొడుకు సత్తి సెప్పిన కవిత ఇప్పుడు బోధపడింది. తనకేమీ రాదని తేలిపోయింది రత్తికి. బరువెక్కిన హృదయంతో, విషణ్ణ వదనంతో పొట్ట పట్టుకుని అప్పాపురం రోడ్డు పట్టింది. ఆ రాత్రి, తళుక్కున ఏదో మెరుపు ఆమెలో. నవచైతన్యం ఏదో ఆమెను తాకింది.

చచ్చిన శవాల నడుమ
కన్నీటి నాటకాల తుఫాన్
కాలిన కడుపుల మధ్య
మంత్రుల సంబరం తుఫాన్
అబద్ధాల హామీల తుఫాన్
దొర దొంగల దోపిడీ తుఫాన్

అప్రయత్నంగా రత్తి గుండెల్లోంచి, వేదనలోంచి సత్తిగాడు పల్కించిన పల్కులివి. రత్తే ఆశ్చర్యపోయింది తన భావావేశానికి. రత్తిప్పుడు రచయిత్రి. విప్లవ రచయిత్రి. మరో విప్లవ తుఫాన్‌కు పథకం సిద్ధం చేస్తున్నది. చాపకింద నీరులా మార్పు కోసం.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 15–6–1988

❁

జింక బ్రతుకు

తన కూతురు ఆరణి పెళ్ళికి ముహూర్తం నిశ్చయమైందని తెలిసినప్పట్నించి ఏదో గుబులు, భయం అలుముకొన్నాయి ప్రియదర్శిని ఎద నిండా. తన చేతులు, కాళ్ళు సన్నగా వణకసాగాయి.

'ఏమిటో పెళ్ళనేది నూరేళ్ళ పంట' అన్నారు పెద్దలు. 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అన్నారు వేదాంతులు. కాని, మారుతున్న కాలానికి దాన్లో నిజం ఎంత అని ఎవరూ ఆలోచించరు.

కూతురు పెళ్ళవగానే తల్లిదండ్రులకు ఎక్కడలేని సంబరం. ఓ బాధ్యత, బరువు దిగిపోతాయి అన్న ఆనందంలో వెర్రిమొర్రిగా ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడరు. ఉత్తరాలు, శుభలేఖలు రాయటం, పెళ్ళికి కావల్సిన సంబారాలు కొనటం, అచ్చట్లు, ముచ్చట్లు తీర్చేందుకు, రకరకాల వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు పెళ్ళికూతురి వైపు వాళ్ళు చూపే ఉత్సాహం, ఆరాటం అంతా ఓ జెట్ వేగంతో సాగిపోతుంది.

ఈ తతంగం మధ్యలో పెళ్ళికూతురి మనోభావాలకు ప్రాధాన్యమే ఉండదు. ఎంతటి చులకనభావం స్త్రీ మనసన్నా, వ్యక్తిత్వం అన్నా ఈ సంఘానికి.

ఇలా కూతురు ఆరణి పెళ్ళి గురించి ప్రారంభించిన ఆలోచనలు ప్రియదర్శిని తన గతం తవ్విన సొరంగంలోకి తీసుకెళ్ళాయి.

తన పెళ్ళినాటికి తన వయస్సు కేవలం పదహారు సంవత్సరాలు. సుమారు ఇరవై అయిదేళ్ళ క్రితం పరిస్థితి తనిప్పుడు ఆలోచిస్తున్నది.

పెళ్ళయి, మూడురాత్రుల ముచ్చటై తను అత్తవారింట కాపురానికి అడుగు

పెట్టింది. అత్తవారింట తనతోబాటు వచ్చిన తోబుట్టువులు రెండే రెండు– సందేహాలు, సంశయాలు. అవి అడుగడుగునా తనని వెంటాడేవి. అనుక్షణం ఉలికిపాటు తప్పలేదు తనకు. ఇక్కడ తనకు ఆప్తులు లేరన్న న్యూనత నిండిన హృదయం తనను ఓవైపు నిరంతరం క్రుంగతీసేది. ఎవరన్నా చూస్తుండగా మంచినీళ్ళు తాగాలన్నా భయం. భోంచేయటానికి భయం. మామగారి ముందు నిల్చోటానికి భయం. భర్తతో ముఖాముఖీ మాట్లాడాలంటే భయం. తత్తరపాటు, ఎవ్వరి కళ్ళలోకి చూడలేని పిరికితనం, అచ్చంగా దోషి మనస్తత్వం. ఏమిటో తను చేసిన పాపం తనకే తెలిసేది కాదు. తనకు జ్వరం, తలనొప్పి, అనారోగ్యం కలిగినా విశ్రాంతి తీసుకోలేని అస్వతంత్రత. అది కేవలం తాను కొత్తచోట అడుగుపెట్టానన్న భయం మట్టుకు కాదు.

తను ఎన్ని కొత్తచోట్లకి వెళ్ళలేదు చిన్నతనంలో? స్వేచ్ఛగా ఆడుకొంటూ, చెట్టుకాయలు దొంగిలించి, కాకి ఎంగిలి స్నేహితులకు పంచి ఎంచక్కా సాయంత్రం ఇంటికి వచ్చే రోజుల్లో లేదేం తనకా భయం?

దూకుళ్ళు, దొంగాట, కోతికొమ్మచ్చి ఆడే రోజుల్లోనూ, లంగా గోచిపోసి మగపిలల్లతో గోలీలు, బిళ్ళంగోడు ఆడే రోజుల్లో తనెరగదు భయం?

ఈ భయానికి, ఆ భయానికి తేడా ఉంది. తన జీవితం కట్ట కడపటి క్షణం వరకూ, ఇక్కడే గడవాలన్న నిర్ణయం తనమీద ఎవరో బలవంతాన రుద్దినందుకు వచ్చిన భయం అయి ఉంటుంది ఇది. కాదు. తన భర్త తనకు స్వేచ్ఛనివ్వక తననో బానిసగా చూస్తూ ఆయన మాత్రం విలాసంగా జీవితం గడుపుతాడేమోనన్న తపన తెచ్చిన భయం అయి ఉండవచ్చు.

తను నోరు మెదిపితే తప్పు అర్థాలు తీస్తారన్న భయం. తన భర్త వ్యసనపరుడై తనని హింసిస్తాడేమోనన్న భయం, తనకు మరో సవతి ఎక్కడన్నా ఉందేమో అన్న భయం, ఇన్‌సెక్యూర్ కాంప్లెక్స్, పర్‌సిక్యూషన్ కాంప్లెక్సు తనను అనుక్షణం వెంటాడేవి, వేధించేవి.

ఇలా పుట్టెడు భయాలతో సంవత్సరాలు దాటించింది. తనూహించిన భయాలు అన్నీ వాస్తవం కాకపోయినా, తన స్వేచ్ఛకు, ఉనికికి, వ్యక్తిత్వానికి గుర్తింపు మాత్రం రాలేదు. తను మనస్సు చంపేసుకొని సంతోషంగా బ్రతకాల్సి

వచ్చింది. తను లొంగిపోవటం వల్లనేమి, నోరు మెదపకపోవటం వల్లనేమి తన సంసారం సజావుగా సాగింది. ఒడుదిడుకులు రాలేదు. కలతలు లేవు.

తనకు ముగ్గురు పిల్లలు. మొదటిది ఆరణి, మిగతా ఇద్దరూ మగపిల్లలు.

ఇప్పుడు ఆరణి ఎమ్.ఎ. చదివింది. తను పట్టుబట్టి ఆరణిని చదివించింది. ఎందుకంటే తనలా ఆరణి పెళ్ళినాటికి అస్వతంత్రురాలు కాకూడదు, భయపడకూడదు. పిరికిది కాకూడదని, ధైర్యంగా నలుగురిలో అనర్గళంగా తన కూతురు మాట్లాడుతుంటే తను గర్వపడాలని చదివించింది. అలాగే చదివింది ఆరణి. తన కోర్కెలకూ, ఆశయాలకూ వెలుగు చూపింది ఆరణి.

తన కూతురు మామలు, మరుదులు, మరదళ్ళు అంటే భయపడకూడదు. మారుతున్న సమాజంలో తన కూతురు స్వేచ్ఛగా, భర్తతో సమానంగా, ఆలోచించగల శక్తి కలిగి ఉండేలా చేసింది తను. కుటుంబం విషయంలో, సాధక బాధకాల్లో ఆమె, ఆమె భర్త సమిష్టిగా నిర్ణయం తీసుకోవాలి. ఆమె భర్త తన అభిప్రాయాన్ని ఆరణిపైన రుద్దకూడదు. ఆమె వ్యక్తిత్వాన్నీ భర్త గుర్తించాలి. ఇవే తను ఆరణిని చదివించడానికి వెనుక ఉన్న కారణాలు. అవే తనలో అర్థం లేని భయాలకు కారణాలు కూడానేమో?

కిటికీలోంచి బయటికి చూస్తూ గతంలోకి ఆలోచిస్తున్న ప్రియదర్శిని ఏదో చప్పుడు విని గిర్రున వెనక్కి తిరిగింది.

ఎప్పుడొచ్చిందో ఏమో కాని ఆరణి, ఆమె ఎక్కిళ్ళ ధ్వనిని గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు ప్రియదర్శినికి. గబగబా ఆమె దగ్గరకు నడిచింది ప్రియదర్శిని. దగ్గరకు తీసుకుంది ఆప్యాయంగా. తల నిమిరింది. "పెళ్ళి జరగబోతున్నందుకు సంతోషించక ఎందుకమ్మా దుఃఖం?" అని అడిగింది ప్రియదర్శిని.

"అమ్మా!" అంటూ బావురుమంది ఆరణి.

ప్రియదర్శినికేమీ పాలుపోలేదు. మళ్ళీ ప్రశ్నించింది ఆరణిని.

"నీకీ పెళ్ళి ఇష్టం లేదా?" అని అడిగింది.

"నువ్వు ఎవర్నన్నా ప్రేమించావా?" అని అడిగింది.

"ఏదన్నా పొరపాటు జరిగిందా" అని అడిగింది.

అన్నింటికి "పెళ్ళి వద్దమ్మా" అన్న సమాధానమే తల అడ్డంగా తిప్పుతూ చెప్పింది ఆరణి.

వివరంగా చెప్పమని కూతుర్ని అనునయించింది ప్రియదర్శిని.

"కాదమ్మా. నీలా ఏ చదువు లేనిదాన్నయితే నువ్వు నాన్నకు ఆయనవైపు వాళ్ళకు ఒదిగిపోయినట్టు ఒదిగిపోగలనేమో. ఇప్పుడు ఎమ్.ఏ. చదివి, సంపాదించుకొంటూ, వ్యక్తిత్వం నిలుపుకోవాలన్న తాపత్రయంతో నా భర్తకు వ్యతిరేకంగా నే ఏదైనా చేస్తే, కోరితే అప్పుడు గొడవే కదమ్మా!"

"పిచ్చిపిల్ల. నీ భర్త కూడా చదువుకున్నవాడేగా. నిన్ను అర్థం చేసుకుంటాడులే. అందుకోసం పెళ్ళి మానుకోవాలా?" అంది ప్రియదర్శిని.

"అది కాదమ్మా. నేను పడుకున్నప్పుడు కిరసనాయిలు పోసి నిప్పంటించి చంపుతున్నట్లు రాత్రి కలొచ్చింది. అది నిజమవుతుందేమో? ఈ పెళ్ళి వద్దమ్మా!"

ఇక మాట్లాడలేకపోయింది ప్రియదర్శిని, తన ఊహలు తల్లక్రిందులైనందుకు ఆ క్షణంలో. చదువుకున్నా, చదువుకోకపోయినా తన కాలానికి అత్తగారింట మృత్యు భయంలేదు. ఇప్పుడు మారుతున్న కాలానికి స్త్రీ వ్యక్తిత్వాన్ని మంట కలిపేందుకు కిరసనాయిలు చావులు వచ్చాయి. అందుచేత అప్పుడూ, ఇప్పుడూ చదువుకున్నా, చదువుకోకపోయినా స్త్రీ బ్రతుకు జింక బ్రతుకే అని అనుకొంది– ఎదురుగా జింకపైన బాణం ఎక్కుపెట్టిన బోయవాడి బొమ్మను చూస్తూ.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21–9–1988

❀

విడిన తెరలు

అది అమెరికాలోని ముఖ్యనగరాల్లో ఒకటైన షికాగో నగరం. సమయం రాత్రి పదిన్నర కావస్తున్నది. గగనసీమల్ని తాకుతున్న భవనాల్లో దీపాలు ఒక్కొక్కటే ఆరిపోతున్నాయి. వెడల్పాటి రోడ్లమీద రోల్సు రాయిస్, మెర్సిడిస్ కార్లు పలు వరసల్లో చీమల్లా వెళ్తున్నాయి. రోడ్లకిరువైపులా ఉన్న మెర్క్యురిక్ నియాన్ దీపాలు నిండు పున్నమి వెన్నెలను మ్రింగేసేలా వెలుగుతున్నాయి. ఆ రాత్రి చలి బాగా ఎక్కువగా ఉంది. ఆ నెలలో షికాగోలో చలి అమితంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత సున్నా డిగ్రీల కిందికి వెళ్ళినా ఆశ్చర్యపడవల్సిన పనిలేదు. అన్ని భవంతుల కిటికీ తలుపులు మూసుకొని ఉన్నాయి. కాని స్ట్రీట్ నెంబరు నైన్‌లోని సెకండ్ ఫ్లోర్ భవనం కిటికీ తలుపులు మాత్రం తెర్చుకొనే ఉన్నాయి.

కిటికీ దగ్గరికి రివాల్వింగ్ కుర్చీ లాక్కొని అందులో కూర్చుని ఒంటరిగా రోడ్డు మీదకి చూస్తున్నది శిల్పాదేవి. ఆ నిరీక్షణలో ఏవేవో గతస్మృతులు ఆవిడ మెదడులో తళుక్కున మెరిసి మాయమవుతున్నాయి. క్రీనీడల్లా ఏవో భయాలు, ఆందోళనలు ఆవిడ మనోఫలకంపై వ్రాలి చికాకు కల్గిస్తున్నాయి. మనస్సులోని అశాంతికి చిహ్నంగా అటూ ఇటూ కదుల్తూ అసహనంగా ఉంది శిల్పాదేవి. ఆవిడలోని అసహనం క్షణ క్షణానికి పెరిగిపోతున్నది. దీని కంతటికీ కారణం శిల్పాదేవి ఏకైక కూతురు ఇంకా ఇంటికి రాకపోవడమే.

చూడడానికి ఎంతో అందంగా పాలరాతి శిల్పంలా కన్పించే మృదులకు ఇంకా పదహారేళ్ళు నిండలేదు. వయస్సు తెచ్చిన వంపుసొంపులతో వింతశోభను

సంతరించుకొన్న మృదుల ఒక్కగానొక్క కూతురుగా గారాబంగా పెరగటంతో పెంకిఘటంగా తయారయింది. అన్నింటికిమించి పదేళ్ళ ప్రాయం దాటగానే స్వేచ్ఛనిచ్చి, విచ్చలవిడితనాన్ని పరోక్షంగా ప్రోత్సహించే అమెరికన్ సంస్కృతి మృదులపై ప్రభావం చూపటం మొదలుపెట్టి చాలాకాలమయింది. వయస్సులో చిన్నదైనా, నిర్లక్ష్యంతో కూడిన అహంకారం ఎక్కువ కావడంవల్ల మృదులతో మాటల్లో తలపడాలంటే ముందు కొంత రిహార్సలు వేసుకొంటే కాని సాధ్యపడదు ఎవ్వరికైనా.

అయినా సరే, ఆ రోజు తను మృదులతో తలపడ్డానికే నిశ్చయించుకొంది. క్రమశిక్షణ లోపిస్తున్న మృదులను సరైనసమయంలో హెచ్చరించకపోతే తర్వాత పశ్చాత్తాప్పడి ప్రయోజనం లేదని తన అభిప్రాయం! అలా ఎంతసేపు ఆలోచనల్లో గడిపిందో కాని ఇంటిముందు జపనీస్ పోలోకారు ఆగటంతో ఈ లోకంలోకి వచ్చింది ఆమె. కారులోంచి మృదుల బయటకొచ్చి కారు లోపలతనికి "ఛీర్ యూ" చెప్పి బోగెన్‌విల్లియా తీగెలతో ఆర్చిలాగా ఏర్పడ్డ కాంపౌండు గేటు తెర్చుకొని లోపలికి క్షణంలో ప్రవేశించింది.

వెన్షియన్ బ్లైండ్స్ క్రిందికి లాగి, కిటికీ మూసేసి, కుర్చీలోంచి లేచి, తలుపు తీయటానికి తలుపువైపు కాస్త గంభీరవదనంతో నడ్చింది శిల్పాదేవి.

తలుపు తీయటంతోనే, ఆ సరికి లిఫ్ట్‌లో పైకి వచ్చిన మృదుల "హాయ్ మామ్" అంటూ లోపలికివచ్చి చేతిలోని వేనిటీ బ్యాగ్‌ను సోఫాలోకి విసిరేసి దాంట్లో కూలబడి పోయింది. బాబ్డ్ హెయిర్ చిందరవందరగా రేగిపోయి, టక్‌లో ఉన్న జీన్స్ పాంట్, షర్టు బాగా నలిగిపోయి, ఎఱ్ఱబడ్డ కళ్ళతో మృదుల వాడిన గులాబిలా, నలిగిన మొగలిచెండులా కన్పించింది శిల్పాదేవి కళ్ళకు.

ఒక్కసారిగా తనలోని ఆవేశమంతా పెల్లుబికి పైకి వచ్చినా ఎందుకో తనను తాను తమాయించుకొంది.

ఓసారి మృదులను ఆపాదమస్తకం పరీక్షించి "గీజర్ ఇప్పుడే ఆఫ్‌చేశాను. నీళ్ళు బాగా వేడిగా ఉన్నాయి. స్నానం చేసిరా. భోంచేద్దువుగాని" అంది శిల్పాదేవి. మాతృవాత్సల్యాన్ని తాత్కాలికంగా కల్గిన ఆవేశం కప్పలేకపోయింది ఆమెలో.

"ఓహ్... బాత్... ఇప్పుడు ఓపిక లేదు మామ్" అంటూ నీరసంగా మూల్గింది మృదుల.

"మృదూ... చెప్పింది విను. లేచి వెళ్ళు" కొరకొర చూసింది శిల్పాదేవి.

"నువ్వెప్పుడూ ఇంతే మామ్. అన్నింటికీ ఫోర్స్ చేస్తావు" అంటూ విసవిసా తన రూమ్‌లోకి వెళ్ళిపోయింది మృదుల.

"పిచ్చిపిల్లా..." అని తన మనస్సులో తానే అనుకొని, వెళ్తున్న మృదుల వైపోసారి చూపు సారించి డైనింగ్ టేబిల్‌వైపు అరెంజ్‌మెంట్స్ చేయడానికి కదిలింది శిల్పాదేవి.

ఇంతలో మృదుల గదిలోంచి పాప్ మ్యూజిక్ విన్పడటంతో చిర్రెత్తుకొచ్చి అటువైపుకు నడక మళ్ళించింది.

మృదులకు ఎల్విస్ ప్రిస్‌లీ, కెంగ్ లాగిన్స్, టీనా టర్నర్‌ల మ్యూజిక్ సాంగ్స్ అంటే చాలా ఇష్టం. మృదుల గదిలోకి తొంగిచూసి అక్కడ కన్పడ్డ దృశ్యానికి నిశ్చేష్టురాలైంది శిల్పాదేవి.

మృదుల స్టీరియోలో వినిపిస్తున్న మ్యూజిక్‌కు అనుగుణంగా డాన్స్‌చేస్తూ మెలికలు తిరిగిపోతూ అతికష్టం మీద నేలకి నిలద్రొక్కుకుంటూ ఒక్కొక్కటిగా వంటిపై గుడ్డలు విప్పేస్తున్నది. మృదుల అలా ఎగరటం శిల్పాదేవికెంతో జుగుప్స, అసహ్యం కల్గించాయి. గబగబ లోపలికి నడిచి స్టీరియో స్విచ్ ఆఫ్ చేసింది తను.

స్టీరియో స్విచ్ ఆఫ్ చేశాక ఎంతోసేపటికిగాని మ్యూజిక్ పారవశ్యంతో తేలిపోతున్న మృదులకీ విషయం తెలీలేదు. మృదులకా విషయం తెల్సేటప్పటికి, శిల్పాదేవి అక్కడ్నించి వెళ్ళిపోయింది కూడ. అది ఎవరి పనో మృదులకు వెంటనే అర్థమయింది. "మామ్ ఎప్పుడూ ఇంతే" అని నసుక్కుంటూ టవల్ పట్టుకొని బాత్‌రూమ్‌లోకి నడిచింది. మృదుల బాత్ చేస్తున్నంతసేపూ టీనా టర్నల్ మ్యూజిక్‌ను సన్నగా ట్యూన్ చేస్తూనే స్నానం చేసింది.

* * *

భోంచేసి చేతులు కడుక్కొని, నేప్‌కిన్‌తో చేతులు తుడ్చుకొంటూ డైనింగ్ టేబిల్ దాటి, ప్రక్కనే కిటికీలో తాను ప్రొద్దున వదిలేసిన సర్ వాల్టర్ స్కాట్

నవల "ది పైరేట్"ను అందుకొని "గుడ్‌నైట్ మామ్" అంటూ బెడ్‌రూమ్‌వైపుకు అడుగులు వేయబోయింది మృదుల.

"స్టాప్ మృదూ... స్టాప్... నీతో ఓ క్షణం మాట్లాడాలి" ఆజ్ఞాపిస్తున్నట్లుంది ఆమె కంఠం.

"నో...మామ్ ఇప్పుడు కాదు. పడుకోవాలి... ప్లీజ్."

"నో... నీతో మాట్లాడితీరాలి."

"ఏమిటి మామ్? అంత అర్జంటా?"

"యస్... అంత అర్జంటే" నొక్కి పల్కింది శిల్పాదేవి.

"ఎబౌట్ వాట్..?"

"ఈ మధ్య మితిమీరుతున్న నీ ప్రవర్తన గూర్చి."

"డోన్ట్ బి సిల్లీ మామ్... ఇప్పుడు నేనేం చేశానని. నువ్వు రాను రాను డర్టి ఆర్థోడాక్స్‌వై పోతున్నావు."

"షటప్... చెప్పేది విను..."

"ఏమిటి? త్వరగా చెప్పు... నేనీ నవల కంప్లీట్ చేయాలి. పడుకోవాలి. అయినా రేపు ప్రొద్దున్న బ్రేక్‌ఫాస్ట్ టైములో మాట్లాడుకోవచ్చుగా... నువ్వు అన్నింటికీ ఇంతే" అంటూ చిందులు వేస్తూ ముఖం మాడ్చుకొని, మూతి ముడ్చుకొని డ్రాయింగ్ రూమ్‌వైపు నడిచింది.

మృదుల మాటల్లో అంతరార్థం తెలుసుకోలేనిదేమి కాదు తను. మర్నాటి ప్రొద్దున్న వరకూ విషయం వాయిదా వేస్తే తనలో ఇప్పుడున్న ఆవేశం చల్లారి పోతుందని మృదులకు బాగా తెల్సు. తనే రోజన్నా సీరియస్‌గా ఉంటే మృదుల ఇలానే మాట్లాడుతుంది. తనలో ఆవేశాన్ని చల్లార్చాలని ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. చాలామటుకు విజయవంతం అవుతుంటుంది కూడ. తనలోని బలహీనతే అది. కాస్త ఆలస్యమైతే తనలోని ఆవేశం మచ్చుకు కూడ కన్పించదు. తను చెప్పదల్చుకొంది తన స్మృతిపథం లోంచి పూర్తిగా మాయమవుతుంది. దాన్ని సరైన టైమ్‌లో ఎక్స్‌ప్లాయిట్ చేయటం ఎప్పుడూ మృదులవంతు అవుతూనే ఉంటుంది. నో ఇవాళ అలా కాకూడదు. తను మృదులకు తెలీని విషయాలు ఎన్నో చెప్పాలి. మృదులను ప్రస్తుతం నడుస్తున్న మార్గం నుంచి మార్చాలి.

అది వీలైనంత త్వరగా జరగాలి. అదే తనలోని ఆవేదనకు కారణం. అదంతా బయటకెళ్ళిపోతే కాని తన మనస్సుకు శాంతి ఉండదు. మరోసారి దృఢంగా నిశ్చయించుకొంది శిల్పాదేవి.

"నిన్ను కారులో ఇంటి ముందు డ్రాప్ చేసినతనెవరు?" సోఫాలో కూర్చుంటూ అడిగింది శిల్పాదేవి.

"డేవిడ్."

"అదే అతనెవరు?"

"మెట్రో టెలిఫోన్స్‌లో డిజైను ఇంజనీరు."

"అతనితో నీకు పరిచయం..?"

"సిటీ సెంట్రల్ మ్యూజిక్ క్లబ్‌లో."

"అంటే... మీ పరిచయమెంతవరకూ..?

"చాలా పరిచయం. డేవిడ్‌కు, నాకు ఇద్దరికి మ్యూజిక్ అండ్ డాన్స్ అంటే ప్రాణం. ఇద్దరం కల్సి డ్రింక్ చేస్తాం. డాన్స్ చేస్తాం. అతనికి నా హాబీస్ అంటే చచ్చేంత లైకింగ్. నాకు డేవిడ్ మానరిజమ్సు నచ్చాయి. అన్నింటికీ మించి అతనిలోని మేన్లినెస్ నాకు చాలా నచ్చింది. అందువల్ల ఇద్దరం అవుటింగ్, డేటింగ్ చేస్తున్నాం. ఇందులో తప్పేముంది?" ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది మృదుల.

ఆ క్షణంలో మృదుల ముఖంలోని అమాయకతకు ఏం సమాధానం చెప్పాలో, ఆమె చేసిన ఎదురుప్రశ్నకు ఎక్కడ మొదలు పెడ్తే విషయం మృదులకు బోధపడ్తుందో అర్థం కావటంలేదు శిల్పాదేవికి. అసలా పరిస్థితికి నవ్వాలో ఏడ్వాలో కూడ తెలీని సందిగ్ధత ఆ క్షణంలో.

క్షణంపాటు తల్లి నిరుత్తురాలవటం ఆశ్చర్యంగా గమనించింది మృదుల. "ఏంటి మామ్... అలా నా మొహంలోకే చూస్తూ ఉండిపోయావు..?"

"ఏంలేదు మృదూ... నీ వయస్సెంతో నీకు తెల్సో తెలీదో అని ఓ క్షణం సందేహం వచ్చింది."

"నా వయసా? సర్‌ప్రైజ్ మమ్మీ... అదేం డౌట్... స్వీట్ సిక్స్‌టీన్."

"ఇంకా టీన్ ఏజెస్‌లో ఉండగానే ఈ ప్రవర్తన ఏమిటమ్మా... ఇదే

వయస్సులో ఉన్న అమ్మాయి మన దేశం అంటే ఇండియాలో ఇంకా తల్లిచాటు బిడ్డగానే ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. మరి నీ ప్రవర్తనలో... నీ ప్ర...వ...ర్త...న...లో ఉఁ... మాట్లాడ్డానికే నాకు మాటలు రావటం లేదు...” భుజాలెగరేసి నిస్సహాయంగా ఓ పెద్ద నిట్టూర్పుతో ఆగిపోయింది శిల్పాదేవి.

“డోంట్ కంపేర్ మి విత్ బ్లడీ ఇండియన్‌యిజమ్... నాకు ఇండియా అంటే పరమబోర్. ఆ ఆర్థోడాక్స్ ట్రెడిషన్స్ అన్నా, అవుట్‌డేటెడ్ కల్చర్ అన్నా డామ్ ఇరిటేటింగ్‌గా ఉంటుంది. ఐ హేట్ దట్ బ్లడీ ఫ్రీడమ్‌లెస్ ఇండియన్ ఉమెన్‌హుడ్...” ఎంతో అసహ్యాన్ని వ్యక్తపరుస్తూ చెప్పింది మృదుల.

“నీ అజ్ఞానాన్ని, నీ సూపర్‌ఫిషీయల్ నాలెడ్జ్‌ను, వెర్రిమొర్రిగా ఇష్టం వచ్చినట్లు రాసి పారేసిన వెస్ట్రన్ క్రిటిసిసమ్‌ను చదివిన అహంకారంలో నువ్వు మనదేశాన్ని బిలిటిల్ చేయకు. ఓకే. ఓకే... ఇప్పుడు అసలు విషయానికి వద్దాం... డేవిడ్‌కు ఎన్నేళ్ళుంటాయి?”

“మేబి... ఎరౌండ్ థర్టీ.”

“అంటే నీ అవుటింగ్‌లకు, డేటింగ్‌లకు సరిసమాన వయస్కుడు కాక పోయినా నీకు షేమ్ అనిపించటం లేదన్నమాట.”

“ఏజ్ యీజ్ నో ప్రాబ్లమ్... మనస్సుకు ప్రేమించటం తెల్సి ఉంటే– అయినా నేను ఎడ్యుకేటెడ్. ఏ ప్రాబ్లమ్‌నైనా ఈజిలీ సాల్వ్ చేసుకోగలను యూ డోన్ట్ వర్రీ.”

“షటప్... జీవితంలో వచ్చే సమస్యలకు చదువొక్కటుంటే సరిపోదు. అనుభవం ఉండాలి... అయినా ట్వల్త్ క్లాస్ కూడ చదవని నువ్వు నన్ను ఎడ్యుకేట్ చేయాలని ప్రయత్నించకు. ఈ దేశంలో మ్యూజిక్, డాన్స్ పిచ్చిలో పడి ఎంతమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారో నాకు తెల్సు... నీకేం తెల్సు? ఈ మ్యూజికల్ సెక్సీ సాంగ్స్, క్లబ్‌డాన్స్‌లు, ఈ దేశం ఉమెన్‌హుడ్‌ను ఎంతో అప్రతిష్టపాలు చేశాయి. వెస్ట్రన్ కంట్రీస్, యూరప్ దేశాలు ఈ మ్యూజిక్ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాయి. ఈ దేశాలకు సంప్రదాయ సిద్ధమైన, సంస్కృతిపరమైన సంగీతం లేకపోవటమే ఈ నాశనానికి కారణం. కానీ

ఇండియా అలాంటి దారి తొక్కలేదు. తెల్సా..? తెల్సా..? డోంట్ ఫీల్ హై ఎయిర్ ఆఫ్ యువర్ సెల్ఫ్... బి మైండ్‌ఫుల్ దట్. అయామ్ యువర్ మదర్" బిగ్గరగా అరిచినంత పని చేసింది శిల్పాదేవి.

"సారీ మామ్, నిన్ను హర్ట్ చేయాలని అలా మాట్లాడలేదు. ఏదో అలా ఫ్రీస్టైల్‌లో మాట్లాడటం నా హేబిట్. అంతే" ముఖం చిన్నబుచ్చుకుంది మృదుల.

"ఓకే... ఓకే... కమ్ టు ది పాయింట్! డేవిడ్ గతం గురించి నీకు తెల్సిన వివరాలు..?"

'డేవిడ్‌కు గతంలో సోనియా అనే ఇటాలియన్ వైఫ్ ఉండేది. చచ్చేంత ఆర్థోడాక్సట. మ్యూజిక్, డాన్స్ అంటే ఏమాత్రం ఇష్టం ఉండేది కాదట ఆమెకు. పైగా సెక్స్ విషయంలో కూడ ఫ్రీగా ఉండేది కాదుట. చాలా ప్రైవసీ కోరుకొనే దిట. అదంతగా నచ్చక డేవిడ్ డైవొర్స్ తీసుకున్నాట్ట ఆమె నుంచి. ఆ తర్వాత చాలాకాలం అంటే నే పరిచయమయ్యే వరకూ లోన్లీగా గడిపేట్ట."

"అంటే నీకు తెల్సిన వివరాలు అంతేనన్నమాట."

"అంటే..."

"పూర్‌గర్ల్, ఒకసారి డైవోర్సు తీసుకొన్న మనిషితో జీవితం ప్రారంభించా లన్న ఆలోచన కల్గటం నిజంగా దురదృష్టం... అందునా అమెరికన్ లైఫ్‌లో డైవోర్స్ అంటే ఎంత సింపుల్‌గా తీసేస్తారో తెల్సి మరీ అతన్ని డేటింగ్‌కు ఎంకరేజ్ చేయడం పూర్ రిఫ్లెక్షన్ ఆఫ్ యువర్ ఎక్స్‌పీరియన్స్. ఈ దేశానికి పూర్తిగా భిన్నం ఇండియా. ఇండియాలో డైవోర్సు అనేది హైలీ హేటెడ్ వర్డు... యూ నో..? ఈ దేశంలో ఉమెన్ ఓ సెక్సీ సింబల్. కాని ఇండియాలో ఉమెన్ ఫ్యామిలీ గాడెస్... అండర్‌స్టాండ్..."

"మమ్మీ. నీ ఉపన్యాసాలతో నన్ను బోర్ కొడ్తున్నావు. ఇంకా నయం. ఇండియాలో ఆడవాళ్ళు బంక్రిపేడతో గొబ్బెమ్మలు చేసి దేవతల్లా పూజిస్తారు... నువ్వు అది నేర్చుకో... అని సలహా ఇవ్వలేదు" వ్యంగ్యంగా అంది మృదుల.

"ఒకప్పుడు నేను నీలానే మాట్లాడేను... చూడమ్మా మృదూ... సందర్భాన్ని బట్టి హాస్యం అయినా, అపహాస్యం అయినా బాగుంటుంది. నీకు ఇండియన్ కల్చర్ గురించి తెలీక అలా మాట్లాడుతున్నావు. నీకు ఇండియా గురించి

అర్థమవ్వాలి అంటే వాల్‌స్ట్రీట్ జర్నల్, వాషింగ్టన్ పోస్ట్ చదివితే ప్రయోజనం లేదు. రాధాకృష్ణన్, చిన్మయానందా, రంగనాథానంద, వివేకానంద పేర్లు ఎప్పుడన్నా విన్నావా? అవి చదివాక మాట్లాడితే నీ మాటలకో విలువుంటుంది. ఓకే" ఎఱ్ఱజీరలు పడ్డ కళ్ళతో ఉరిమినట్లు చూసింది శిల్పాదేవి. కాసేపు ఇద్దరి మధ్యా మౌనం చోటుచేసుకుంది.

'తను మమ్మీని అనవసరంగా రెచ్చగొడ్తున్నానా?' అని ఆలోచించసాగింది మృదుల. ఓసారి చేతిగడియారంవైపు చూసుకొంది. రాత్రి పదకొండున్నర కావస్తున్నది. చేతిలోని పుస్తకాన్ని ప్రక్కన ఉన్న స్టూల్‌పై పెట్టి ఓసారి ఆలోచించి మమ్మీ వైపు చూసింది. మమ్మీ ముఖం చాలా సీరియస్‌గా ఉంది. దేనిగురించో మథనపడ్తున్నట్లు అన్పించింది మృదులకు. ఆ సమయంలో మమ్మీని పల్కరించా లంటేనే భయంగా ఉంది తనకు. గడియారంవైపు, మమ్మీవైపు మార్చి చూస్తూ కూర్చుంది. కొద్ది క్షణాలు గడిచాక శిల్పాదేవి మృదులవైపోసారి చూసి మాట్లా డటం ప్రారంభించింది.

"చూడు మృదూ... నేనిప్పుడు చెప్పేది శ్రద్ధగా విను. ఎందుకిలా చెప్తు న్నానో తెల్సా... నీకోసం నేను జీవితమనే నౌకలో ఎలాంటి ఎడారుల మధ్య, పెనుగాలులు, తుఫానుల మధ్య ప్రయాణిస్తున్నానో నీకు అర్థమయ్యేందుకు. ఆ తర్వాత కూడ నువ్వు ప్రస్తుతం అనుసరిస్తున్న మార్గాల్నే ఎన్నుకుంటే, అయామ్ రియల్లీ హెల్ప్‌లెస్, గాడ్ ఎలోన్ కెన్ సేవ్ యు. బి ఓపెన్ మైండెడ్..."

"ఏమిటి మమ్మీ అది?"

"చెప్తా... విను."

* * *

సీతారామయ్యగారు కుటుంబంతో సహా అమెరికా వచ్చి స్థిరపడటం ఆయన జీవితంలోనే ఊహించని క్రొత్త మలుపు.

జన్మతః ఆంధ్రుడైన సీతారామయ్య బాపట్లలో చదువుకొని ఆంధ్రా యూనివర్సిటీ నుంచి కెమికల్ టెక్నాలజీలో డిగ్రీ తీసుకొని, హైద్రాబాద్‌లో వృత్తిరీత్యా కొన్నేళ్ళు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసి అద్భుతమైన పరిశోధనలు చేశారు.

కాని, దురదృష్టమేమంటే ఆయన పరిశోధనలకు భారతదేశంలో ఆశించి నంత గుర్తింపు లభించలేదు. అయినప్పటికీ అమెరికాలోని ఓ ప్రైవేట్ సంస్థ ఆయన్ని తన కంపెనీకి రీసెర్చ్ డైరెక్టర్‌గా ఉండమని ఆహ్వానించటంలో అనుకో కుండా వచ్చిన ఆహ్వానానికి ఆయన కుటుంబంలోని వారంతా సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యారు.

ముఖ్యంగా సీతారామయ్య ధర్మపత్ని జానకమ్మ పదహారణాల తెలుగింటి ఆడపడుచు. ఆవిడ తన భర్తకొచ్చిన గౌరవం అంతా ముమ్మాటికీ తన జాతక ప్రభావం వల్లనేనని ముసిరిపోయే సగటు స్త్రీమూర్తి.

'స్త్రీ చిత్తం, పురుషుడి భాగ్యం' అన్న సామెతను తూ.చ. తప్పకుండా విశ్వసించే అమాయక హృదయం ఆమెది. 'భర్తకు చేదుడువాదోడుగా ఉండి ఆయన్ని ఏ విషయంలోనూ నొప్పించకుండా కుటుంబ భారమంతా తను మోస్తుండబట్టే కదా ఆయన ఆ స్థితికి ఎదగ గల్గింది' అని తన మనస్సులో ఎప్పుడూ అనుకొంటుండేది.

రీసెర్చ్‌లో పూర్తిగా మునిగిపోయిన సీతారామయ్య ఇంటి విషయాలన్నిం టిని భార్య జానకమ్మ మీదనే వదిలేసేవాడు. సీతారామయ్యకు ఇద్దరమ్మాయిలు. పెద్దది రూప. చిన్నది కల్పన. పెద్దదాన్ని "చంటి" అని, చిన్నదాన్ని "చిన్న" అని ముద్దుగా పిల్చుకునేవాళ్ళు.

రూపకు, కల్పనకు ఏ విషయంలోనూ అభిప్రాయం కుదిరేది గాదు. రూప పెంకిగాను, మొండిగాను ప్రవర్తించేది. అందుకు భిన్నంగా ఉండేది కల్పన. వాళ్ళ అభిరుచులు కూడ వేరు వేరు.

అమెరికాకొచ్చిన కొద్దికాలంలోనే రూప (చంటి) వెస్ట్రన్ మ్యూజిక్స్ అన్నా, బాయ్‌ఫ్రెండ్స్ అన్నా ఆసక్తి చూపటం మొదలుపెట్టింది. అసలు ఆ మాటకొస్తే అమెరికన్ సంస్కృతిలో కొత్తవాళ్ళను సులువుగా ఆకర్షించేది మ్యూజిక్ క్లబ్బులు, ఫ్రెండ్సే.

కల్పన మటుకు మునుపటిలాగానే తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ జానకమ్మకు అన్ని విషయాల్లోనూ సాయపడేది. రోజు రోజుకు చంటికి బయట తిరుగుళ్ళు ఎక్కువ అవటం మొదలయింది.

చంటి వెస్ట్రన్ మ్యూజిక్ అంటేనే కల్పనకు ఎక్కడలేని ఏవగింపు.

"ఏయ్ చంటి, ఏంటా రణగొణధ్వని. వడగళ్ళ వానలా, చెవులు చిల్లులు పడేలా, ముందు కట్టెయి" అని చిన్ని (కల్పన) గొడవ చేసేది.

"నీకేం తెల్సు, ఈ మ్యూజిక్‌లోని వెచ్చదనం. నోర్మూసుకో" అనేది రూప.

"ఆఁహఁ... నీకు భలే బాగా తెల్సులే. మనింట్లో ఉన్న కంచుపాతర సామాగ్రిని అంతా ఓ చోట కుప్పేసి, బాత్తుంటే ఇంతకంటే బాగుంటుంది ఆ మ్యూజిక్. అయినా ఇవేం మ్యూజిక్‌లే, ఓ వయోలిన్ కాదు. ఓ వీణ కాదు. కనీసం కుండ తబలా, సన్నాయి వాయిద్యం కూడ కాదు. ఉరుములు ఉరిమినట్లు, కంచు సామాగ్రి అటకమీద నుంచి క్రింద పడ్డట్లు ఒకటే గోల" అని విసుక్కునేది చిన్ని. వాళ్ళిద్దరి మధ్య తగవు తీర్చలేక సతమతమయ్యేది జానకమ్మ.

అలా అని చంటిని జానకమ్మ విసుక్కోకుండా ఉండేది కాదు. తొడలపైకి పల్చటి స్కర్టు. పచ్చని నిగనిగలాడే తొడలు కన్పించేలా లోపల బెత్తెడు డ్రాయరు వేసుకొని దేశమ్మీదికి చంటి తిరగడానికి పోబోతుంటే "అవ్వ... మన ఇంటా వంటా లేదు ఈ భోగం వేషాలు... అయినా నీకిదేం పోయేకాలం... వయసొచ్చిన పిల్లవి. కల్పనలాగా ఎంచక్కా చీరె, జాకెట్టు కట్టుకోకుండా ఇదేం పిదప కాలం బుద్ధులంట" అని జానకమ్మ విసుక్కొనేది.

"చూడు మమ్మీ... ఒక్కొక్క దేశానికి ఒక్కో వేషభాషలుంటాయి. 'బి ఏ రోమన్ వెన్ యూ ఆర్ ఇన్ రోమ్' అని సామెత. ఆంధ్రాలో చీరె జాకెట్టు – అమెరికాలో స్కర్టు, పాంటేస్ ఒకటే. అయినా ఆచారాలు, మర్యాదలు దేశాన్నిబట్టి మారుతాయి. ఉదాహరణకు ఆంధ్రాలో అన్నం తినేటప్పుడుగాని, తిన్న తర్వాత గాని త్రేన్చితే ఎవ్వరూ "సారీ" చెప్పరు. అలాగే దగ్గినా, పదిమంది ముఖంపై పడేట్లు తుమ్మినా "ఎక్స్‌క్యూజ్ మి" అని నిలువునా చీల్చినా అనరు. కాని ఈ దేశంలో "బ్రియలేషన్", "స్నీజింగ్" అన్నింటికీ "సారీ" చెప్తారు. మనదేశంలో డ్రైనేజ్‌లేని మురిక్కాల్వలు, పెంటలు, దోమలు ఎక్కడపడ్తే అక్కడ సాక్షాత్కరిస్తాయి. రోడ్లపై ఉమ్ములు, బస్సుల్లో కక్కులు అక్కడ మామూలు. కానీ ఇక్కడ అలాంటివి మచ్చుకకి కూడ కన్పడవు. ఇదో భూతలస్వర్గం. మనదేశం భూతల నరకం. టేక్ ఈజీ మమ్మీ... కాలంతో, ప్రాంతంతో మనమూ మారాలి" అని

గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయింది రూప. జానకమ్మ రూప మాటకారితనానికి నోటిపై వేలు వేసుకోవటం తప్ప ఏమీ చేయలేకపోయింది.

ఓ రోజు చంటి ఇంటికి రాత్రి రెండు గంటలకు తూలుతూ వచ్చింది. చంటికోసం కాచుక్కూర్చున్న జానకమ్మకు చంటిని ఆ స్థితిలో చూడగానే షాక్ కొట్టినట్లయింది. జడ ఊడిపోయి, జుట్టు చిందరవందర అయి, ఫ్రాక్ నలిగి పోయి బుగ్గలపై గాట్లతో ఒళ్ళు తెలీనిస్థితిలో ఇంటికొచ్చిన కూతుర్ని చూడగానే జానకమ్మ మనస్సు ఏదో కీడు శంకించింది. ఉండబట్టలేక "ఏంటే చంటీ ఈ అవతారమేమిటి? ఏం జరిగింది?" అంటూ ఆదుర్దాతో పొంగి వచ్చే వేదనని అణిచి పెట్టుకొని మరీ అడిగింది.

"మమ్మీ... ఈ రోజు మైఖేల్ తన బర్త్‌డే పార్టీకి పిల్చాడు. అక్కడ డ్రింక్స్ తీసుకొమ్మని మైఖేల్, మైఖేల్ స్నేహితులు బలవంతం చేశారు. డ్రింక్స్ తీసుకు న్నాను. తప్పా మమ్మీ... దిసీస్ అమెరికా... అయినా డ్రింక్ మాంచి మజాగా ఉందిలే. నువ్వు కూడ డ్రింక్ కొట్టు మమ్మీ" అంటూ తన రూమ్‌వైపు నడిచి అలాగే బెడ్‌పై వాలిపోయింది.

జరిగినదానికి విస్తుపోయింది జానకమ్మ. ఈ విషయం భర్తకు తెలిస్తే ఆయన సున్నిత హృదయం ఎంత గాయపడ్తుందోనని కలవరం చెందింది. ఎలాగోలాగ చంటికి నచ్చచెప్పి ఈ అలవాటును మాన్పాలని అనుకొంది. ఆ రాత్రి జానకమ్మకు కుంటిపై కునుకు రాలేదు. తెల్లవారకముందే లేచి చంటి గదికి వెళ్ళింది. చంటికి, జానకమ్మకు ఎంతో వాదం జరిగింది. కాని చంటి పెడసరం ముందు జానకమ్మ ప్రయత్నం ఫలించలేదు.

చంటి ప్రవర్తన నానాటికీ మారిపోసాగింది. రోజూ త్రాగటం, ఆలస్యంగా ఇంటికి రావటం మామూలై పోయింది. ఒక్కొక్కసారి రాత్రిళ్ళు ఫ్రెండ్స్ రూము ల్లోనే చంటి నిద్రపోయేది. విషయం ఎంత దాచాలన్నా దాగలేదు. సీతా రామయ్యకు అత్యంత సన్నిహితుడైన స్నేహితుడు జాన్ ఒకసారి ఆయనకు మాటల్లో చంటి గురించి అన్ని విషయాలు వివరించాడు. సీతారామయ్యకు ఆవేశం ఆగింది కాదు. "ఈ రోజు చంటి, నేను మా ఇద్దరిలో ఎవరో ఒక్కరే ఉండాలి" అని నిశ్చయించుకొని ఇంటికి వచ్చాడు.

సీతారామయ్య ఉద్రేకం చూసి జానకమ్మ చాలా ఆందోళనకు గురయింది. ఏం జరుగుతుందోనన్న భయం ఆవిడ్ని అమితంగా పీడించసాగింది.

"భగవంతుడా... మచ్చ లేని ఈ కుటుంబానికి ఎంతటి విషమ పరీక్ష పెట్టావు" అంటూ విలవిల్లాడిపోయింది.

చంటికోసం ఇంటిల్లిపాది పచ్చి మంచినీళ్ళు కూడ త్రాగకుండా అలానే ఉండిపోయారు. కాని ఆ రాత్రి చంటి ఇంటికి రాలేదు. కనీసం మర్నాడు ప్రొద్దున్న కూడ రాలేదు. చంటి కోసం తన స్నేహితులందరిళ్ళకి ఫోన్‌లు చేశారు. కానీ ప్రయోజనం లేకపోయింది.

రోజులు, వారాలు, నెలలు గడిచాయి. చంటి రాలేదు... క్రమంగా చంటి గురించి ఆలోచించటం తగ్గించారు. సీతారామయ్య ఇంట్లో అందరూ చంటి జ్ఞాపకాలను మనస్సులోంచి తుడిచివేయసాగారు.

చాలారోజులవరకు చంటి ఎక్కడుందో వాళ్ళకు తెలీదు. అమెరికన్ నాగరికత వ్యామోహంలో పడ్డ చంటికి అమెరికాలోని స్త్రీ జీవితంపట్ల అవగాహన ఏర్పడేటప్పటికి నెల తప్పి చాలా కాలమయింది.

తను గర్భం తీయించుకోడానికి పెద్ద పెద్ద స్పెషలిస్టులనే కన్సల్టు చేసింది. కాని డాక్టర్లు ఎవ్వరు అయిదు నెలలు దాటిన గర్భం తీసేయటానికి ముందుకు రాలేదు.

తన బాయ్‌ఫ్రెండ్స్ ఎవ్వరూ తనపట్ల ఇప్పుడు ఇదివరకటి ఆసక్తి చూపటం లేదు. ఎవ్వరూ పుట్టబోయే బిడ్డకు తండ్రిగా ఉండేందుకు అంగీకరించటం లేదు. అయినా ఓసారి తనతో అత్యంత సన్నిహితంగా జీవితం గడిపిన మైఖేల్‌ను తన భర్తగా పుట్టబోయే బిడ్డకు తండ్రిగా ఉండమని ప్రాధేయపడింది. అందుకు నువ్వు చిత్తుగా త్రాగి పడి ఉన్నప్పుడు నేనుగాక నా ఫ్రెండ్స్ కూడ నిన్ను అనుభవించారు. నీ బిడ్డకు నేనే తండ్రినని ఎలా అంగీకరించను" అని ఎదురు ప్రశ్న వేశాడు.

తనో స్థానం పోగొట్టుకున్న సాధారణ అమెరికన్ స్త్రీ అని గ్రహించటానికి ఎంతోకాలం పట్టలేదు చంటికి. పరిస్థితితో రాజీపడింది. గుండె ధైర్యం తెచ్చుకొని నైల్స్ పేంట్సు కంపెనీలో రిసెప్షనిస్టుగా చేరింది. నెలలు నిండకముందే నొప్పులు

రావటంతో చంటి ఉంటున్న డార్మిటరీ ఇరుగు పొరుగు ఆమెను ఆస్పత్రిలో చేర్చి తమవంతు బాధ్యత నిర్వర్తించారు.

బిడ్డను అతి కష్టంమీద బయటికి తీశారు. నెలలు నిండకముందే ప్రసవం అవడంతో ఆమె దగ్గర బిడ్డకు కావల్సిన పాలు లేకుండా పోయాయి. బిడ్డను ఇంకుబేటర్‌లో పెట్టి జాగ్రత్తగా ఆ పసికందు ప్రాణాలని కాపాడుకుంటూ వచ్చారు డాక్టర్లు. తల్లిపాలు లేకపోవటంతో బిడ్డ బ్రతకటం కష్టమయింది.

ఏ తల్లైనా ముందుకొచ్చి తన పాలను బిడ్డకివ్వగల్గుతుందేమోనని పేపర్లో ప్రకటనలు గూడ చేశారు. కాని డబ్బిస్తే తప్ప తన పాలు ఇవ్వడానికి ఏ తల్లీ ముందుకు రాలేదు. చివరకు 'అమెరికన్ అన్‌వెడ్ మదర్స్ సొసైటీ' వాళ్ళు ఉదారంగా అందించిన సాయంతో బిడ్డకి మరో తల్లి పాలను కొనగల్గారు. ఎలాగో బిడ్డను రక్షించి, తల్లీబిడ్డను ఆస్పత్రి నుంచి విడుదల చేశారు.

పేపర్లలో ఈ విషయాలు చదివినా సీతారామయ్య హృదయం చంటిని క్షమించలేదు. జానకమ్మ మాతృహృదయం గిలగిలా తన్నుకొన్నా సీతా రామయ్యకు నచ్చచెప్పలేక మిన్నకుండిపోయింది. కల్పనకు మంచి సంబంధం చూసి ఇండియాలోనే పెళ్ళి జరిపించారు.

సర్వం కోల్పోయి జీవచ్ఛవంలా మారిన రూపకు ఓ భారతీయుడితో పరిచయం కల్గటం ఎడారిలో దాహంతో అలమటిస్తున్న వ్యక్తికి ఒయాసిస్ కన్పించినంత ఆనందాన్ని కల్గించింది. అతను ఓ విమానప్రమాదంలో పురుష త్వాన్ని కోల్పోయి వివాహం చేసుకోకుండా ఒంటరిగా జీవితం సాగిస్తున్న దురదృష్టవంతుడు. అతనామె దీనస్థితినర్థం చేసికొని రూప బిడ్డకు తండ్రిగా ఆమెకో తోడుగా ఉండటానికి అంగీకరించటంతో ఆమె సంతోషానికి అవధులు లేకపోయినయి. ప్రస్తుతం శారీరికవాంఛలకు అతీతంగా, గౌరవమైన ఉద్యోగం చేసుకుంటూ పట్టుదలతో జీవితాన్ని గడిపేస్తున్నది రూప. ఆమె జీవితాన్ని ఆధ్యాత్మిక మార్గం వైపుకు మళ్ళించింది.

* * *

"విన్నావా మృదూ... ఇంతవరకూ నే చెప్పింది. ఎంతో నాగరికత పెరిగిన ఈ దేశంలో పెళ్ళికాని తల్లులు కొన్ని మిలియన్లలో ఉన్నారు. వాళ్ళ పిల్లల

భవిష్యత్తు ఏమిటి? తల్లి, తండ్రి, ప్రేమ, ఆప్యాయత నోచుకోని ఆ పసికందులు మానసికంగా రేపు ఎలా మార్తారో ఊహించగలవా? ఈ పరిస్థితికి ఎవరు బాధ్యులు? వయస్సుకు మించిన స్వేచ్ఛ ఈ దుష్పరిణామానికి కారణం కాదంటావా... ఆలోచించు మృదూ... ఆ...లో...చిం...చు." ఇక మాట్లాడలేక పోయింది శిల్పాదేవి. శిల్పాదేవి కళ్ళు అశ్రుపూరితాలయినాయి. తల్లి చెప్పిన దాంట్లో ఎంతో వాస్తవం కన్పించింది మృదులకు.

క్షణకాలంపాటు జలభరితమైన కళ్ళవైపు చూసి అడిగింది మృదుల, "మమ్మీ ఇంతవరకూ చెప్పినది నీకు బాగా తెల్సినవాళ్ళ గురించా..?"

"లేదు మృదూ... లేదు. ఈ విషయాలు నీకు ఎన్నటికీ చెప్పగూడదను కొన్నా... కాని నీవు నడుస్తున్న మార్గం నాలో రేకెత్తించిన అనేక భయాలవల్ల ఈ రోజు నీకీ విషయాలు చెప్పవల్సివచ్చింది. రూప (చంటి) ఎవరో కాదమ్మా. ఈ రోజు నీ ముందు పేరు మార్చుకొని శిల్పాదేవిగా క్రొత్త జీవితం సాగిస్తున్న నేనేనమ్మా ఆ అభాగినిని... కల్పన నా చెల్లెలు 'చిన్ని'. నీ తండ్రిగా ఈ రోజు నువ్వు అనుకొంటున్న గగన్‌విహార్ నిజంగా నీకు ప్రాణంపోసిన తండ్రి కాదు. నీకు తండ్రిగా నిల్చి ఈ రోజు మన గౌరవాన్ని నిలబెట్టిన ఓ మానవతామూర్తి, మహామనీషమ్మా గగన్‌విహార్..."

హఠాత్తుగా తల్లి చెప్పిన విషయానికి మృదుల విచలితురాలయింది. ఆమె చెక్కిళ్ళ వెంట కన్నీరు కారసాగింది. తిన్నగా లేచి తల్లి ఒడిలో ఒదిగి పోయింది.

అప్పటిదాకా మబ్బులచాటున దాగిన పున్నమి రేడు ఒక్కసారిగా మబ్బుల వెలుపలికి వచ్చి ప్రశాంతంగా వెన్నెల జలతారు కురిపించసాగాడు.

–ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 19–25 సెప్టెంబర్, 1986

❀

బెస్ట్ ఆఫ్ లక్!

ఆ రోజు సీతారామ్ పెళ్ళిచూపులు... 'కన్యాశుల్కం'లో గిరీశంలా, 'బారిష్టర్ పార్వతీశం'లో పార్వతీశంలా టక్ చేసుకొని, అద్దాన్ని ముందుకూ వెనక్కూ మార్చి మార్చి ఇన్‌షర్టు సరిగ్గా వచ్చిందో లేదో చూసుకొంటూ, తన అందానికి తానే మురిసిపోతూ, ఉత్సాహంగా ఈల వేస్తూ ముస్తాబయ్యాడు.

పెళ్ళిచూపులకు ఆడపెళ్ళివారిచ్చిన సమయం తొమ్మిదిన్నర గంటలు. ధగ ధగ మెరుస్తున్న పాలిష్ చేసిన బూట్లు తొడుక్కొని, రూముకు తాళంవేసి పెళ్ళికూతుర్ని ఊహించుకుంటూ 'జడనిండ పూదండ దాల్చిన రాణీ' పాటను కూనిరాగంలో ఖూనీచేస్తూ, బయటికి వచ్చి, రోడ్డంబట నిల్చున్న ఆటోని చేరి, వెళ్ళాల్సిన గమ్యం చెప్పి ఆటోలో చతికిలబడ్డాడు.

ఇంతకీ సీతారామ్ చూడబోయే అమ్మాయి పేరు సుకన్య. వయస్సు ఇరవై సంవత్సరాలు. డిగ్రీ పాసయింది. సంగీతంలో కొద్దో గొప్పో ప్రవేశం కూడా ఉంది. కట్నం మాటకొస్తే పాతికవేల పైచిలుకు ఇవ్వగల స్తోమత గలవాళ్ళు. అందంలో మణిదీపంలాగుంటుంది. ఫొటో చూస్తూనే సీతారామ్ హృదయం గాలిలో స్వైరవిహారం చేసింది. అంత అందమయిన అమ్మాయిని తొలిసారి చూడబోతున్నందుకు సీతారామ్ ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

ఆటో తిన్నగా హిమాయత్‌నగర్ తొమ్మిదోనంబరు వీధి చేరింది. దిగి, ఆటోవాడికి ఇవ్వాల్సినదానికన్నా ఓ రూపాయి టిప్‌గా ఎక్కువ ఇచ్చి, ఈల వేసుకుంటూ హుషారుగా నడక సాగించాడు. పాకెట్ మిర్రర్ తీసి తలోసారి దువ్వి, అమ్మాయి వాళ్ళింటి నంబరు చూసుకొని గేటు దగ్గర ఆగాడు.

వచ్చింది పెళ్ళిచూపులకొచ్చినతనేనని ఎంతో అనుభవం ఉన్న అమ్మాయి తండ్రి బుల్ డాగ్‌లా ఇట్టే పసిగట్టేసి, హడావుడిగా ఎదురొచ్చి మరీ లోపలికి తీసుకెళ్ళాడు సీతారామ్‌ని. ఇల్లు ఎంతో అందంగా ఉంది. ముందుగది అంతా తివాసీ పర్చి, అందమైన సోఫాసెట్టు అమర్చి ఉంది. గోడలకు రంగురంగుల సీనరీలు వేలాడుతున్నాయి. ఓవైపు గోడకు జింకబొమ్మ వేలాడుతోంది. మనీ ప్లాంటు తీగ కిటికీలకల్లుకొని ఉంది. దాన్నించి పిచ్చికగూళ్ళు వేలాడుతున్నాయి.

ఇంటి అందానికి ముగ్ధుడైపోతున్న సీతారామ్‌కు, ఆ సరికే ముస్తాబయిన పెళ్ళికూతురు ఎదురుగా సోఫాలో సాక్షాత్కరించింది. ఆమె ముందు డెకలామ్ టాప్ టేబిల్‌పై వీణ పెట్టి ఉంది.

సన్నటి బారుజడ కుడిభుజంపై వేసుకొని, చిలకపచ్చని జరీచీర కట్టి ఏదో చీరల కంపెనీ అడ్వర్‌టైజ్‌మెంటులో హీరోయిన్‌లా కళకళలాడుతూ ధగద్ధాయమానంగా మెరిసిపోతున్నది. చూస్తున్నకొద్దీ ఇంకా చూసేలా ఉన్న గుండ్రటి పచ్చని ముఖం. కొనతేలిన చేప కళ్ళు, సన్నటి కోటేరేసిన ముక్కు, గులాబిరంగులో నిగనిగలాడే చెక్కిళ్ళు – చూస్తున్నకొద్దీ సీతారామ్‌కు తను హీరో అయి, ఆ అమ్మాయితో పెళ్ళిచూపుల సన్నివేశంలోనే 'శంకరాభరణం' సిన్మాలోలా 'సామజ వర గమన' యుగళగీతం పాడుతున్న ఫీలింగ్ వచ్చి తన్ను తానే మర్చిపోయాడు. 'టిఫిన్ తీసుకోండి" అని అమ్మాయి తండ్రి చెప్పేవరకూ తనో క్రొత్త ప్రదేశంలో వింత వింత కలల్లో తేలియాడుతున్న సంగతే గుర్తుకు రాలేదు సీతారామ్‌కు.

"థాంక్సండి. కతికితే అతకదంటారు. నేనీ రోజునే మా వాళ్ళకు ఉత్తరం రాస్తాను. మిగిలిన విషయాలు మీ పెద్దవాళ్ళు మాట్లాడుకోవచ్చు" అని చెప్పి క్రీగంట మరోసారి అమ్మాయిని చూసి జుట్టు సరిచేసుకొంటూ అదోరకం క్రొత్తపోజు పెట్టి బయటికి నడిచాడు.

మూడుగంటల సిన్మాలో హీరో హీరోయిన్లకి తొమ్మిది డ్యూయెట్స్ ఉంటే వారం రోజుల్లో ప్రత్యేక ఆటల్తో సహా – ఎన్ని డ్యూయెట్లు పాడుకోవచ్చో అన్ని డ్యూయెట్లూ ఊహించుకుంటూ కాలం గడిపేస్తున్న సీతారామ్‌కు 'పోస్ట్' అన్న పిలుపు తీవ్ర రసభంగం కల్గించింది.

ఆనంద పారవశ్యానికి భంగం కల్గిన చికాకుతోనే బయటికి వచ్చి సంతకం చేసి రిజిస్టర్డు లెటరు అందుకొన్నాడు. రిజిస్టర్డు లెటరుపైన ఫ్రమ్ అడ్రస్ చూసి సీతారామ్ ఒక్క గెంతు గెంతి, సీలింగ్ ఫాన్ తలకి కొట్టుకోవటంతో 'అబ్బా' అంటూ తల పట్టుకొని కుర్చీలో చతికిలబడ్డాడు.

కవరు చింపి ఉత్తరం చదవటం ప్రారంభించాడు–

"డియర్ సార్,

మీరు పెళ్ళిచూపులకొచ్చి ఎంతో ఉదారంగా టిఫిన్ కూడా తినకుండా వెళ్ళినందులకు చాలా థాంక్స్. పెళ్ళిచూపులకంటూ వచ్చి వెళ్ళేవాళ్ళతో మాకు– అంటే ఆడపిల్ల కలవారికి అయ్యే ఖర్చుని గ్రహించి ఆ భారం కొంత మీరు తగ్గించినందుకు మరోసారి థాంక్స్. నన్ను చూసి ఏ వంకా పెట్టకుండా గౌరవంగా వెళ్ళినందుకు మెనీ మెనీ థాంక్స్. పాతికవేల కట్నంతో, అయిదెకరాల సుక్షేత్రమైన పొలంతో – అఫ్‌కోర్సు – అవి మావాళ్ళే ఇస్తానన్నారనుకోండి – సంతృప్తి పడ్డందుకు చాలా చాలా థాంక్స్. 'నీకు వంట వచ్చా, పిడకలు చేయటం వచ్చా' అని పిచ్చి పిచ్చి ప్రశ్నలతో మీ మగపెళ్ళివారికి సహజంగా ఉండే పైత్యప్రకోపం నాపై చూపించకుండా మౌనంగా వెళ్ళినందుకు చెప్పలేనన్ని థాంక్స్. పుస్తకాలు చదివించి, సర్టిఫికెట్లు పరీక్షించి, చివరకు చందమామ పుస్తకం చదవమని అడగనందుకు కూడా ఎంతో థాంక్స్.

అసలు విషయానికొస్తే మీరు ఇదివరకటి వాళ్ళలా కాక పప్పులో కాలేసి నందుకు ఈ విషయం నేను ఈ విధంగా ముందే మీకు తెలియజేస్తున్నందుకు ఈ సారి థాంక్స్ మీ వంతు అవుతుందంటే ఆశ్చర్యం కాదు సుమా!

ఎందుకంటే – నే పుట్టుకతో రెండుకాళ్ళు లేని అవిటిదాన్ని కనుక! నేను సోఫాలో కూర్చున్నప్పుడు మీరు సరిగ్గా గమనించని నా రెండు కాళ్ళు కృత్రిమంగా ఏర్పాటు చేసినవి కనుక!! అబద్ధం చెప్పో మాయ చేసో మా పెద్దవాళ్ళు మీకు నన్ను కట్టబెట్టినా, నిజం తెల్సాక మీరు నాతో సుఖంగా కాపురం చేయలేరని చెప్పటానికి ఈ మాత్రం సాహసం చాలనుకొంటాను.

ఇట్లు

మీ శ్రేయోభిలాషి సుకన్య.

ఒక్కసారిగా భూమ్యాకాశాలు తల్లక్రిందులైనట్లు, కాళ్ళ క్రింద భూమి జరిగిపోతున్నట్లు, ఎండవేడికి మంచు కరిగినట్లు నీరుకారిపోయాడు సీతారామ్.

ఇంత డెలిబరేట్‌గా మోసమా! సీతారామ్ హృదయం శోకంతో ఆక్రోశించింది. సుకన్య ఎంతో మంచిది కాబట్టి ఈ విషయాన్ని భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ముందే తనకు తెలియబర్చింది. ఎంతో నైస్ గర్ల్. లేకపోతే జీవితాంతం తను అఘోరించాల్సి వచ్చేది. 'అసలు ఇలాంటి సంబంధం తెచ్చిన ఆ పెళ్ళిళ్ళ పేరయ్య సీతాపతిగాడ్ని నరికినా పాపం లేదు' అని వాడ్ని మనస్సులోనే తిట్టుకుంటూ దగ్గర్లోని పోస్టాఫీసుకెళ్ళి గబగబా రెండు ఉత్తరాలు వాళ్ళవాళ్ళకి గీకిపారేసి బయటపడ్డాడు.

* * *

కొన్ని నెలల తర్వాత జరిగినదాన్ని క్రమంగా మర్చిపోగల్గుతున్నాడనుకొంటుండగా దూరంగా సుకన్య ఎవరితోనో నడిచి వస్తూ కన్పించింది సీతారామ్‌కు.

తనకు నిజాన్ని చెప్పి మహోపకారం చేసిన ఆ సహృదయినికి స్వయంగా కృతజ్ఞతలు చెప్పాలని అప్పటికప్పుడే నిర్ణయించుకొన్నాడు సీతారామ్.

సుకన్య దగ్గరకు రాగానే "హల్లో" అని పల్కరించి ముందుగానే అనుకొన్నట్లుగా కృతజ్ఞతలు గడగడ వర్ణించాడు. అప్పటికిగాని సుకన్యకు విషయం బోధపడలేదు.

ఆమె ఓసారి జాలిగా సీతారామ్‌వైపు చూసి "భలేవారండి, నేను అవిటిదాన్నవటం ఏంటి? స్త్రీగా నా వ్యక్తిత్వాన్ని, నాలోని స్థిరమైన భావాలకు, అభిప్రాయాలకు ఓ రూపం ఇవ్వటానికి అలాంటి నాటకం ఆడక తప్పలేదు. పైగా కట్నం ఇచ్చిపుచ్చుకునే పెళ్ళంటే నాకు పరమ అసహ్యం. నేను ప్రేమించిన సురేష్‌తోనే నా వివాహం జరగాలని ప్రతిసారీ ఏదో ఓ నాటకం ఆడాల్సి వచ్చింది. వచ్చిన సంబంధాలన్నీ వచ్చినట్లే పోయాయి. చివరకు మావాళ్ళ ప్రాణం విసిగింది. నా ప్రయత్నంలో విజయం సాధించాను. సురేష్‌తో ఇటీవల రిజిస్టర్ మేరేజ్ చేసుకొన్నాను. నేను చేసింది సరైనదనే నా విశ్వాసం. ఆపై మీ సహృదయత మీద విషయం ఆధారపడి ఉంటుంది. నా ప్రక్కన ఉన్న ఈయనే

ఆ సురేష్" అంటూ సురేష్‌ని పరిచయం చేసింది.

"హల్లో" అంటూ సురేష్ కరచాలనం చేశాడు సీతారామ్‌తో. అప్పటివరకు ఆమె ప్రక్క నిల్చున్న సురేష్‌ను గమనించనే లేదు సీతారామ్.

వాళ్ళిద్దర్నీ చూస్తే తగిన జంట అనిపించింది సీతారామ్‌కు. ఆ అందాల రాశి సురేష్ సొంతం అయినందుకు, తను మరీ ఘోరంగా మోసపోయినందుకు నిశ్చేష్టుడై అలానే నిల్చుండిపోయాడు సీతారామ్. 'బెస్ట్ ఆఫ్ లక్' మాటలు మాత్రం అప్రయత్నంగా అతని నోటినుంచి వెలువడ్డాయి.

–ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 4 జూలై, 1986

❀

ప్రేమిస్తే పెళ్ళా..?

రూముకు తాళంవేసి వెనక్కి తిరిగాడు సీతాపతి. ఎదురుగా ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లుగా నిల్చుంది మాలతి. గులాబిరంగు చీరె, మ్యాచింగ్ బ్లౌజు, నుదుట ఎర్రటి తిలకం, సిగలో గులాబిపువ్వు, మేనిపసిమిలో ఉదయ భానుడి కిరణాల వెలుగులో మిసమిసలాడ్తున్నది మాలతి.

నాల్గడుగులు ముందుకేసి "ఎవరికోసం ఈ నిరీక్షణ?" అడిగాడు సీతాపతి.

"ఇంకెవరి కోసం? మీ కోసమే."

"అబ్బ ఎంత అదృష్టం" భుజాలు, కనుపాపలు ఒకేసారి ఎగరేశాడు.

"ఏమిటో అదృష్టం?" చిరునవ్వు ఆమె పెదాలపై లాస్యం చేసింది.

"లేకపోతే ఏమిటి? ఇలా తాళంవేసి వెనక్కి తిరిగేసరికి, వరూధినిలా, దివినుంచి భువికి దిగివచ్చిన అప్సర శిరోమణిలా, భానుడి పసిడి కిరణాలు తాకి విచ్చుకున్న తామరపువ్వులా మీరీ రీతిలో నా ముందు సాక్షాత్కరించటం, అందునా నాకోసమే నిరీక్షించటం నా అదృష్టం కాక ఇంకేమిటి?"

"ఆ! ఆ! ఆపండి వర్ణన అపర ప్రవరాఖ్య. ఆఫీసుకా తమ పయనం?" అడిగింది మాలతి లోలోన సీతాపతి పొగడ్తలకు గర్వపడ్తూనే.

"అవును."

"పదండి. నేనూ అటే వస్తున్నాను."

"అబ్బ, ఈ రోజు ఉదయాన్నే మీతో ఏడడుగులు నడిచే అవకాశం కూడ" తన ఆనందం ఆమెకి మరింతగా తెలియాలని మరీ మరీ నొక్కి చెప్పాడు సీతాపతి.

"ఏడడుగులేం ఖర్మం. వింతగా మాట్లాడుతున్నారు. తల్చుకుంటే ఎన్నడుగు లైనా వేయచ్చు. హైజంపులు, లాంగ్‌జంపులు కూడ చేయొచ్చు."

"వాటి గురించి కాదు నే మాట్లాడేది."

"మరి?"

"పెళ్ళిలో అగ్ని చుట్టు ప్రదక్షిణంచేసి నడిచే ఏడడుగుల గురించి" నవ్వుతూ చెప్పాడు సీతాపతి.

"చాలా తొందరపడుతున్నట్లున్నారు పెళ్ళికోసం."

"మనిషి పుట్టిందెందుకోసం?" ప్రశ్నార్థకంగా పోజిచ్చాడు సీతాపతి.

"పెళ్ళి కోసమే అంటారు" అంది ఓరచూపు చూస్తూ మాలతి.

"నన్నడిగితే అక్షరాలా అంతే అంటాను. అయినా ఒంటరి జీవితంలో థ్రిల్ ఏముంది? 'పెళ్ళిచేసుకొని ఇల్లు కట్టుకొని ఎల్లరు సుఖముగ ఉండాలోయ్' అన్నాడో మహాకవి, వినలేదా?" అన్నాడు సీతాపతి తన జీవితలక్ష్యాన్ని ఒక్క మాటలో వివరిస్తూ.

"విన్నాను. కాని పెళ్ళికి ముందు తెల్సుకోవాల్సినవి చాలా ఉన్నాయి. ముఖ్యంగా మీ మగవాళ్ళు" నొక్కి మరీ చెప్పింది మాలతి, "మీ" అక్షరాన్ని.

"అలానా" వ్యంగ్యంగా పల్కాడు సీతాపతి.

"లేకపోతే ఇలా పెళ్ళి చేసుకొని, అలా పశ్చాత్తాపపడటం, మరో ఆడదాన్ని చూసి వెర్రెత్తిపోవటం పెళ్ళనుకుంటున్నారా?" అంది సూటిగా సీతాపతికి తగిలేలా.

"అదేం కాదు. మీ ఆడవాళ్ళకు అనుమానం ముందు, ఆడతనం తర్వాత వచ్చాయి అంటాను. అదీ అసలు సమస్య. నాకు తెల్సి పెళ్ళాలకు ప్రేమతో జడలేసే భర్తలున్నారు. మునిమాణిక్యంగారి 'కాంతం' కథలు చదవండి."

"అంతేకాని మీ బలహీనత ఒప్పుకోనంటారు?"

"ఉంటే కదా ఒప్పుకొందుకు?" ముక్కులెగరేస్తూ అడిగాడు సీతాపతి.

"ఎంత అమాయకులు మీరు. నోట్లో వేలేసుకోండి. ముచ్చటగా ఉంటారు" వెక్కిరించింది మాలతి నాలిక బయటపెట్టి.

"అవునవును" అమాయకంగా నటిస్తూ పోజిచ్చాడు సీతాపతి తలూపుతూ.

మాటల్లోనే సీతాపతి పనిచేసే ఆఫీసు దగ్గరికొచ్చేశారు వాళ్ళిద్దరూ. సీతాపతి ఆగిపోయి, "థాంక్యూ ఫర్ యువర్ నైస్ కంపెనీ" అన్నాడు కృతజ్ఞతా భావాన్ని కళ్ళతో వ్యక్తపరుస్తూ.

"ఈ మాత్రానికి 'థాంక్స్' లాంటి పెద్ద పెద్ద మాటలెందుకులెండి" ఎద్దేవా చేస్తున్నట్లంది మాలతి.

"ఏమిటంత నీరసం వచ్చేసింది మీకు. ఈ కాస్త నడిచినందుకే కందిపోయి నట్లున్నారు."

"అదేమీ లేదు. మీకు మీతో కల్సి నడిచే స్త్రీ మనస్సే అర్థం కాలేదు. రేపు పెళ్ళయిన తర్వాత మాటేమిటాని!? అయినా పెళ్ళిదాకా ఆలోచించేవారికా మాత్రం స్త్రీ మనస్సు అర్థం చేసుకోవాలని తెలీదా?" సూటిగా బాణం విడిచింది మాలతి.

"ఏమిటో మీరనేది?" బుర్ర గోక్కున్నాడు సీతాపతి విషయం అర్థంకాక.

"నా చీరె గురించి, స్త్రీకి భర్త తర్వాత మిన్న ఏమిటో తెల్సా? చీరెలు, నగలు, గాజులు" చకచకా నడ్చుకొంటూ ముందుకుపోయింది మాలతి జడని ఓ విసురు వెనక్కి విసిరి.

సీతాపతి స్టన్ అయిపోయాడు మాలతి మాటలకు. తనకు అంత చిన్న విషయం తెలీనందులకు అతని చెంపలు సిగ్గుతో ఎర్రబడ్డాయి.

సినిమా హీరోలా కాకపోయినా పొట్టిగా పసిడిఛాయ, కోలముఖం, రింగులు తిరిగిన జుట్టు, కూలింగ్ గ్లాసెస్, ఇన్‌షర్టు వేసి చూడడానికి ఆకర్ష ణీయంగా ఉంటాడు సీతాపతి. రోజుకోరకం ప్యాంటు, షర్టు వేసి మ్యాచింగ్ కలర్ వాచ్ స్ట్రిప్, షూతో విలాస పురుషుడిగా గెటప్ అవుతుంటాడు ప్రతిరోజు. కో-ఆపరేటివ్ బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం రావటంతో మొదటిసారిగా నెల్లూరులో కాలు పెట్టాడు సీతాపతి. పనిచేసే బ్యాంకు బ్రాంచి దగ్గరలో ఓ డాబా పోర్షనులో చిన్న రూము అద్దెకు తీసుకున్నాడు. అదే ఇంటి వెనుకభాగంలో మాలతి వాళ్ళు అద్దెకుంటున్నారు. అక్కడ ప్రారంభమయింది మాలతితో పరిచయం సీతాపతికి. మాలతి కనుచూపుమేరలో అదృశ్యమయ్యేదాకా చూసి ఆఫీసులోకి అడుగుపెట్టాడు సీతాపతి.

'నిజమే. మాలతి కట్టిన చీరె చాలా బాగుంది. రియల్లీ ఐ ఫీల్ ఇట్. కాని ఆ చీరె బాగుందని కామెంట్ పాస్ చేయడానికి నాకో సెంటిమెంట్ అడ్డం వచ్చింది. తను సరిగ్గా ఆ సెంటిమెంట్ మీదనే దెబ్బకొట్టింది. ఆ సెంటిమెంట్ వెనుక ఓ విషాదగాథ దాగున్నదని మాలతికి తెలీదు. ప్చ్!!' మనస్సులోనే అనుకున్నాడు సీతాపతి.

* * *

అప్పట్లో నేను ఒంగోలులో శర్మా కాలేజీలో డిగ్రీ చదువుతుండేవాడ్ని.

ఆ రోజు ప్రొద్దున్న మూర్తి, నేను కూర్చుని చదువుకుంటున్నాం హాల్లో.

మూర్తి నా క్లాస్‌మేట్. రోజు మా ఇంటికొస్తూండేవాడు. అప్పుడప్పుడు మా ఇంట్లోనే భోంచేస్తుండేవాడు కూడ. మేమిద్దరం ఒకరికొకరం ప్రాణంగా ఉండేవాళ్ళం. నాకన్ని విషయాల్లోనూ వాడు చీఫ్ అడ్వయిజర్.

తలుపు త్రోసుకుని హఠాత్తుగా వచ్చింది అన్నపూర్ణ. ఆమె కుట్టిన రవిక గుడ్డల్ని మా అమ్మకిచ్చిపోదామని.

అన్నపూర్ణ, వాళ్ళమ్మ ఎదురింట్లో చిన్నరూములో అద్దెకుండేవాళ్ళు. వాళ్ళమ్మ ఆడవాళ్ళ బట్టలు కుట్టడంలో స్పెషలిస్టు అవటం మూలాన ఆ వీధిలోవారంతా ఆవిడ దగ్గరనే తమ జాకెట్లు, చీరె బార్డర్లు కుట్టించుకొనే వాళ్ళు. కుట్టిన బట్టలు ఎవరివి వారికి ఇళ్ళకు తీసుకెళ్ళి ఇచ్చొచ్చేది అన్నపూర్ణ.

అన్నపూర్ణకు పద్దెనిమిదేళ్ళకన్నా ఎక్కువుండవు. అన్నపూర్ణ రంగు నలుపైనా మీననేత్రాలు, గుండ్రటి ముఖం, పొడవాటి జడ, యౌవ్వన వంపులతో అందా న్నంతా పుణికి పుచ్చుకొన్న అజంతా శిల్పంలా ఉండేది.

మా ఇంటికి అన్నపూర్ణ తరచూ రావటంతో మా ఇద్దరి మధ్య మామూలు పరిచయం క్రమంగా స్నేహంగా మారింది.

పసుపురంగు ఓణీలోంచి బయటికి కన్పిస్తున్న వంపులు మెలికలు తిరుగుతుంటే హంసలా నడ్చుకొంటూ వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది అన్నపూర్ణ. ఆ వంపుల మెలికల కదలికకు నా గుండె జారి అరికాల్లోకి వచ్చిందంటే అతి శయోక్తి కాదు.

చేతిలో పుస్తకం క్రింద పడేసి చటుక్కున్న లేచి అన్నపూర్ణ వెనుక నడిచాను.

మా అమ్మ పూజ పనిలో ఉండటంతో అన్నపూర్ణతో తీరిగ్గా మాట్లాడ్డానికి వీలు కాలేదు. ఓ నిమిషం తర్వాత అన్నపూర్ణని పెరట్లోకి రమ్మని కన్ను గీటాను. ఇద్దరం పెరట్లోకి వెళ్ళాం.

"బాగున్నారా?" అడిగాను నేను మొదట మాటలు ప్రారంభిస్తూ.

బాగున్నట్లు తల ఊపింది.

"సినిమాలేవన్నా చూశావా?"

"చూశాను" అంది క్లుప్తంగా, మెల్లిగా.

"ఏ సినిమా?"

"కన్నవారి కలలు."

"వెరీగుడ్" అన్నాను నేను.

"నువ్వు చూశావా ఆ సిన్మా?" అడిగింది నన్ను.

"చూశాను. చాలా బాగుంది."

"శోభన్, వాణిశ్రీలు నా ఫేవరైట్ హీరో, హీరోయిన్లు" అంది అన్నపూర్ణ నా రియాక్షన్‌కోసం అన్నట్లు.

"భలే, వాణిశ్రీ నా ఫేవరైట్ హీరోయిన్. ఈ పసుపు ఓణీలో నువ్వచ్చం వాణిశ్రీలాగా ఉన్నావు. 'మధువలకబోసే' పాటలో వాణిశ్రీ అచ్చం ఇదే రంగు చీరె కట్టింది. ఎంత బాగుందో ఆ సీనులో. ఐ రియల్లీ లైక్ దిస్ కలర్ శారీ" అన్నాను.

"అలాగా" అంది కళ్ళు మిలమిలలాడిస్తూ.

"మధ్యాహ్నం సినిమాకి పోదాం వస్తావా?" అని అడిగాను.

పోదామన్నట్లు తలూపింది.

"పన్నెండున్నరకల్లా హాలు దగ్గరకొచ్చేయి. 'ఖైదీ బాబాయి' శోభన్, వాణిశ్రీ పిక్చరు చూద్దాం. సరేనా?"

"సరే"నని తలాడించింది.

"ఇక వెళ్దాం. అమ్మ గమనిస్తే మళ్ళీ అవస్థల పాలవుతాము" అన్నాను నేను. నిజమేనన్నట్లు కళ్ళు టపటప అన్పించి వెళ్ళిపోయింది అన్నపూర్ణ. ఆ తర్వాత జరిగినదంతా మూర్తికి చెప్పి రెండు టికెట్లు అడ్వాన్స్ బుకింగ్

చేయించుకురమ్మని డబ్బులిచ్చాను. సినిమాహాల్లో అన్నపూర్ణతో ఏదో మాట్లాడా లని తహతహ. కానీ అన్నపూర్ణ సినిమా చూడటంలో పూర్తిగా లీనమైపోయింది. అయినా లోపల పొంగే ఉద్వేగాన్ని ఆపుకోవటం నాకు సాధ్యం కాలేదు.

సినిమా మంచి సీనులో ఉండగా అదనుచూసి “నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?” అని ధైర్యంచేసి అడిగేశాను.

“ఊ” అన్నట్లు విన్పించింది. ఆ ప్రశ్నకు సిగ్గుతో ఆమె బుగ్గలు కెంపు లవుతాయి అనుకొన్నాను. అది నా ఫస్ట్ లవ్ కాబట్టి కవులు కావ్యాల్లో వర్ణిం చినట్లు అవుతుందేమోనని ఆమె బుగ్గలపైనే నా దృష్టంతా నిల్పాను. కానీ అలా ఏమీ కాలేదు. ఆశ్చర్యం వేసింది. అయినా అది కావ్యనాయకల విషయంలో ఏమోననుకొని ఆ సమయాన్ని ఆలోచనలతో వృధా చేయదల్చుకోక నాకు నేను సర్దుకున్నాను.

“నాతో పెళ్ళి నీకిష్టమేనా?” ధైర్యంగా అడిగేశాను.

“మీవాళ్ళు ఒప్పుకొంటారా?” తిరిగి ప్రశ్నించింది అన్నపూర్ణ.

“మావాళ్ళని ఒప్పించే బాధ్యత నాది.”

నావైపు చూసి ఓ చిరునవ్వు నవ్వి సిన్మా చూడటంలో నిమగ్నమయింది ఆమె. ఆమె చిరునవ్వు నాక్కొండంత నమ్మకం కలిగించింది. ఆమె నన్ను చేసుకోవటానికి అభ్యంతరం లేదనుకోవటానికి అంతకంటే ఏంకావాలి? నాలో నేను అలా అనుకొని “మరి నా డిగ్రీ అయ్యేంతవరకు ఓపిక పట్టగలవా?” అని కూడ అడిగేశాను.

తలూపింది అంగీకార సూచకంగా. అంతే ఆమె చేతిని నా చేతిలోకి తీసుకొని స్వర్గసీమలో విహరిస్తున్నంత ఆనందంతో సినిమా చూస్తూ గడిపేశాను.

ఆ తర్వాత మేమిద్దరం తరచూ సిన్మాకెళ్తుండేవాళ్ళం. అన్నపూర్ణ కట్టే ప్రతి చీరెనీ ఎంతో సునిశితంగా పరిశీలించి వర్ణించేవాడ్ని. అన్నపూర్ణ ముఖం లోని సంతోషం నాకెంతో వింత అనుభూతిని, సంతృప్తిని కల్గించేది. నేను ఎప్పుడెప్పుడు డిగ్రీ అయిపోతుందాని రోజులు దొర్లిస్తుండేవాడ్ని.

ఓ రోజు ఉదయం... “అన్నపూర్ణ వాళ్ళు ఈ ఊరొదిలి వెళ్ళిపోయార్రా” అని మా అమ్మ నాతో అనటంతో నా చెవుల్లో పిడుగు పడ్డట్లయింది.

"ఎందుకు?" అడిగాను జీరవోయిన గొంతుతో.

"ఎందుకేమిటి? అన్నపూర్ణ పెళ్ళి నిశ్చయమైందిట" అంది అమ్మ అదేదో చాలా లోకసహజమైనట్లు.

నాకు గోరుచుట్టుపై రోకటిపోటు పడ్డట్లనిపించింది. నేను ప్రేమించిన అన్నపూర్ణకు మరొకరితో పెళ్ళా? అవగాహన చేసుకొనే శక్తి క్రమంగా లోపిస్తున్నది నాలో. అయినా సరే, "ఎవరితో" అని అడిగాను అమ్మని.

"పెళ్ళికొడుకిది వాళ్ళూర్లో పెద్ద వ్యాపారంట. అన్నపూర్ణని చూసి కట్నం లేకుండా చేసుకుంటానని ముందుకొచ్చాడట. స్వంత ఊరి సంబంధం, బంగారం లాంటి సంబంధమని వాళ్ళమ్మ ఆ సంబంధం ఖాయం చేసికొందిట. అతనికిది రెండో పెళ్ళి. మొదటి పెళ్ళాం పెళ్ళయిన నాల్గు నెల్లకే జబ్బుచేసి చనిపోయిందిట. పిల్లలు లేరు. అన్నపూర్ణని కట్నం లేకుండా చేసుకోవటానికి ఎవ్వరూ ముందుకు రాలేదింతవరకూ. వాళ్ళమ్మ ఉన్న ఒక్క బాధ్యత తెంచేసుకొందామని ఎన్నో సంబంధాలు వెతికింది అన్నపూర్ణకు. చివరికి ఖాయమైంది. పోన్లే అదృష్ట వంతురాలు" అంటూ అమ్మ పన్లోకి జారుకొంది.

"ఎప్పుడు పెళ్ళి?" సగం చచ్చినా ఇంకా తెల్సుకోవాలన్న ఆశ నాలో ఎక్కడో దాగి ఉందనిపించింది.

"వచ్చే నెలే" అని లోపల్నుంచి అమ్మ అనటం విన్పించింది.

నాకు మటుకు ఆ షాక్ నుంచి తేరుకోవటం అప్పట్లో సాధ్యం కాలేదు.

* * *

మాలతి చీరె మీద సెంటిమెంట్‌తో ఆలోచనల్లోకి జారుకున్న సీతాపతి "సార్! టీ" అంటూ ఆఫీస్ బాయ్ బల్లపై టీ కప్పు పెట్టటంతో వర్తమానంలోకి తిరిగొచ్చాడు.

టీ కప్పు అందుకొని సీట్లో వెనక్కి వాలి మాలతి అన్న చివరి మాటల గురించి ఫీలవటం మొదలుపెట్టాడు.

'ఛీ... ఛీ... ఎంత పొరపాటు చేశాను. అన్నపూర్ణ విషయం మర్చి మాలతి చీరెపై ప్లెసంట్ కామెంట్స్ పాస్ చేస్తే మాలతి ఆనందమే తన ఆనంద మయ్యేది. ఆ కళ్ళల్లో మిలమిల మెరుపు తనకెంతో సంతోషాన్నిచ్చి ఉండేది.

ఇంత సిల్లీ మిస్టేక్ తనెప్పుడూ చేయలేదు' తనని తానే నిందించుకొన్నాడు. ఆఫీసులో పని ముగించుకొని ఇంటికి త్వరగా చేరాడా రోజు.

సీతాపతి మనస్సంతా మాలతే నిండి ఉంది. మాలతి రాకకోసం ఎదురు చూస్తున్న సీతాపతికి మాలతి గేటు దగ్గర కన్పడగానే ప్రాణం వచ్చినంత పనయింది. గేటు దగ్గరికి పరిగెత్తి గేటు తీస్తు "హల్లో" అన్నాడు.

"ఏమిటో చాలా ఆనందంగా ఉన్నారు?" అడిగింది మాలతి.

"మీ నడకే ఓ అందం. మీతో మాట్లాడటమే అందం."

"అబ్బో కవిత్వం కూడ వచ్చే మీకు."

"అరే. మీకు చెప్పలేదు కదూ! నే చిన్నప్పుడు కవితలు కూడ రాసేవాడిని."

"ఇప్పుడు మానేశారా?"

"అవును."

"ఎందుకు?"

"అప్పట్లో అందమయిన ఆడపిల్లలు చాలమంది ఉండేవాళ్ళు."

"ఇప్పుడేమి?"

"ఇప్పుడు మీలాగ అక్కడక్కడ ఒకరో ఇద్దరో అందమైనవాళ్ళు కన్పిస్తారు."

"భలే... మీకు పొగడటం బాగా వచ్చునే" వ్యంగ్యంగా అంది మాలతి.

"పొగడ్త కాదు. నిజం. మీరు చాలా అందంగా ఉంటారు. ప్రొద్దున మీ చీరె గురించి నా కాంప్లిమెంట్స్ చెప్పనందుకు మనస్ఫూర్తిగా 'సారీ' చెప్పుకొంటు న్నాను" అన్నాడు సీతాపతి ఆమె వ్యంగ్యం గ్రహించక.

"అరెరె... ఆ విషయం అంత సీరియస్‌గా తీసుకున్నారా? ఆ చీరె మార్చేసి చాలాసేపయింది. మీరింకా గమనించినట్లు లేదు?" దెబ్బకొట్టింది సీతాపతి ప్రెజన్స్ ఆఫ్ మైండ్‌ను మాలతి మళ్ళీ. నిజంగానే సీతాపతి మాలతి చీరె మార్చిన సంగతి గమనించనే లేదు. ఇలా దెబ్బకొడ్తుందని అసలే ఊహించని సీతాపతి తన కంగారు కప్పిపుచ్చుకొంటూ "అవునవును గమనించాను. ఈ చీరెలో మీరు చాలా అందంగా ఉన్నారు" అన్నాడు మాటలు తడుముకుంటూ.

సీతాపతి అవస్థ చూసి నవ్వుకుంటూ "ఇంతకీ ఏదన్నా ప్రోగ్రాం ఉందా, వట్టి కబుర్లేనా?" అని అడిగింది మాలతి.

"అబ్బే లేదు... ఆ!ఆ!ఆ!ఆ! ఉంది."

"ఏమిటి" అడిగింది.

"కన్ఫ్యూజన్. ఒకటే కన్ఫ్యూజన్."

"కన్ఫ్యూజన్ సరే. నేనడిగేది ప్రోగ్రాం గురించి."

"అదా... అది... ఏమిటో మీరొచ్చేవరకూ బాగానే ఉన్నాను. మిమ్మల్ని చూడగానే అంతా అయోమయంగా ఉంది" అంటూ చేతులు నలుపుకున్నాడు.

"ఎందుకండీ కంగారు. నేను ఎలా కన్పిస్తున్నాను. రాక్షసిలాగా ఏమన్నా కన్పిస్తున్నానా?"

"ఛ... ఛ... అలాందేమీ లేదు. మీ అందం ముందు నెమలి అందం, మీ మాట ముందు చిలుక పలుకు ఎందుకూ సాటిరావు. ఈ చీరెలో మీరు అద్భుత సౌందర్యరాశిగా, భూలోకరంభలా ఉన్నారు" ఈసారి సీతాపతి తడబడ లేదు. ఇందాకట్నించి మాలతి చీరె గురించి, ఆమె అందం గురించి ఎలాగో లాగా వర్ణించాలన్న అతని కుతూహలం అసలు కంగారుకు కారణం.

"థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్స్. ఇంతకీ రేపటి ప్రోగ్రాం గురించి నేనిప్పటికి ఓ డజనుసార్లు అడిగి ఉంటాను. మీరేమీ మాట్లాడరేంటి?"

"అదా... మీ ఇష్టం."

"అయితే మైపాడు చూశారా మీరు?"

"చూడలేదు" నీళ్ళు నములుతూ చెప్పాడు సీతాపతి.

"పోన్లెండి. రేపు చూద్దురుగాని. మైపాడులో సముద్రం ఉంది. సీ షోర్ చాలా బాగుంటుంది. రేపు ప్రొద్దున్న వెళ్దాం పదింటికి. రెడీగా ఉండండి బస్ స్టాండ్‌లో. ఓకే" అంది మాలతి.

"మరి నా ఆఫీసో?" అడిగాడు సీతాపతి తటపటాయిస్తూ.

"ఆఫీసెక్కడికీ పోదు. రేపు సెలవు పెట్టండి. నాకోసం ఆ మాత్రం త్యాగం చేయలేరా?"

"అమ్మమ్మ... ఎంతమాట, బోడాఫీసు. ఎక్కడికి పోతుంది. మీరడగాలే గానీ మీ కోసం ఏదైనా చేయగలను" అని పైకి అనుకొని, లోపల 'హతోస్మి! ఓ సి.ఎల్. గోవిందా! గోవిందా!' అనుకొన్నాడు సీతాపతి.

ఇంతలో ఇంటివాళ్ళమ్మాయి అక్కడికి రావటంతో గబగబ ఇద్దరూ విడిపోయారు. మాలతి లోపలికెళ్ళిపోయింది.

'ఇదొకతె మధ్యలో పానకంలో పుడకలా' అనుకొంటూ సీతాపతి తన రూమ్‌లోకి వెళ్ళి ప్యాంటు, షర్టు తగిలించుకొని, రూమ్ లాక్‌చేసి భోజనానికి బయల్దేరాడు.

ఇది కోయిన్స్‌డెన్సా లేక జరగాల్సి జరుగుతోందా తనకు అర్థం కావటం లేదు. కొత్తగూడెంలో స్వరాజ్యం కూడా అచ్చం ఇట్లానే మాట్లాడేది. స్వరాజ్యంతో ఆఫీసులో మొదలైన పరిచయం చివరికి ప్రేమ దాకా వచ్చింది. డిగ్రీలో ఉండగా అన్నపూర్ణ ప్రేమతో షాక్ తిన్న తనకు ఒంగోలు విడిచి కొత్తగూడెం వచ్చాక మళ్ళీ స్వరాజ్యం ప్రాణం పోసింది. స్వరాజ్యం తనలాగా పొట్టిగా ఉన్నా చక్కటి మేని పసిమి, గుండ్రటి ముఖం, ఎర్రటి బుగ్గలు, సన్నని పెదవులు, రోజుకో ఆర్గండి చీరె కట్టి కొండపల్లి బొమ్మలా ఉండేది. మనస్సులోనే స్వరాజ్యాన్ని ఊహించుకొంటూ గతంలోకి జారుకున్నాడు సీతాపతి.

* * *

ఆ రోజు ఆగస్టు పదిహేను.

ఆఫీసంతా సందడిగా ఉంది. స్వరాజ్యం ఒక్కతే ఓ మూల నుంచొని ఉండటం గమనించి చిన్నగా ఫ్రెండ్స్ మధ్యనుంచి తప్పుకొని ఆమె దగ్గరకెళ్ళాను నేను.

"స్వరాజ్యంగారు! మనకు స్వాతంత్ర్యం వచ్చి ముప్పయి ఏళ్ళయినా నాకు మటుకు మీతో పరిచయమయినాకనే స్వరాజ్యం వచ్చినట్లుంది!?" అంటూ సంభాషణ మొదలుపెట్టాను నేరుగా.

"హలో... మీరు భలే తమాషాగా మాట్లాడ్తారండి" అంది విష్ చేస్తూనే స్వరాజ్యం.

"మిమ్మల్ని చూస్తే నేనేమిటి... మూగవాడు కూడా మాట్లాడ్తాడంటే నమ్మండి" ప్రారంభించాడు సీతాపతి తన ప్రేమబాణాల్ని.

"ఈజ్ ఇట్?" కనుబొమ్మలెగరేస్తూ పల్కింది స్వరాజ్యం.

"ఎస్. రియల్లీ" ఖాయం చేశాను మరోసారి నేను.

"చాల్లెండి. మీవన్నీ ఉట్టిమాటలు" అంది స్వరాజ్యం నన్ను ఉడికిస్తూ.

"ఎంతమాట. నే మనసా వాచా కర్మణా శుద్ధి ఉన్నవాడ్నండి. ఆ మాట కొస్తే మా వంశంలో ఎవ్వరూ అబద్ధం ఆడి ఎరగరంటే ఆశ్చర్యం కాదేమో మీకు తెల్సా?"

"అయితే పదండి. సరదాగా బోట్లో భద్రాచలం దాకా పోయొద్దాం."

"భద్రాచలం దేనికి?" ఆశ్చర్యంగా అడిగాను, తన హఠాత్ నిర్ణయానికి.

"అక్కడ గోదావరిలో లాంచిలో పోవాలని ఎప్పట్నుంచో కోరిక. ఒంటరిగా పోవడానికి భయం. మగతోడుంటే కాస్త ధైర్యం. ఈవిధంగానైనా మీతో గోదావరిలో షికారుచేసి, రాములవారి దర్శనం చేసుకొన్నట్లవుతుంది" అంది స్వరాజ్యం నాపైన ఎంతో నమ్మకం వ్యక్తపరుస్తూ. నిజానికి అంత అందమయిన ఆడపిల్ల కోరుకుని వుంటే ఈ ఆఫీసులో ఎంతమంది పోటీ పడుండేవారో తన ఒక్కడికే తెలుసు అనుకున్నాడు సీతాపతి.

"అలాగే పదండి" అన్నాను జేబులో డబ్బులు తడుముకుంటూ.

బస్టాండులో బస్సు అప్పుడే బయల్దేరబోతున్నది భద్రాచలానికి. జనం అంతగా లేకపోవటంతో ఇద్దరం కిటికీ సీట్లు చూసుకొని ఎదురెదురుగా కన్పడేట్లు కూర్చున్నాం. బస్సు మంచి వేగం అందుకొంది. గాలి కిటికీలోంచి లోపలికి రయ్యిమని వీస్తున్నది. గాలికి చెదిరిన ముంగురులు స్వరాజ్యం అందాన్ని మరింతగా పెంచేశాయి. అప్పుడప్పుడూ స్వరాజ్యాన్ని చూస్తూ, రోడ్డుకిరువైపులా పెరిగిన దట్టమైన అడవులను చూస్తూ కూర్చున్నాను. బస్సు భద్రాచలానికి ముప్పావుగంటలో చేరింది. ఇద్దరం గోదావరి ఒడ్డంబట నడ్చుకొంటూ లాంచి దగ్గరికి చేరి లాంచి వాడితో మాట్లాడుకొని అందులోకి వెళ్ళాము.

లాంచి మెల్లగా సాగిపోతుంటే, స్వరాజ్యం "ఈ నదిలా నా హృదయం పరుగులు తీస్తుందీ – ఏ ప్రేమ కడలికో, ఏ వెచ్చని వడికో పరుగులు తీస్తున్నదీ" అన్న ఓ కవి మధురగేయాన్ని సన్నగా ఆలపిస్తూ కూర్చున్నది. కొద్దిసేపు తన పాటను విని నేనే మొదటిసారిగా ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ ధైర్యంచేసి అడిగాను "ఇలా ప్రకృతిని చూస్తూ పరవశించిపోతూ రోజులు గడిపేయటమేనా? పెళ్ళి చేసుకునే ఐడియా ఏదన్నా ఉందా?" అని. ఇదీ సీతాపతి ప్రేమ బాణీ–

అనుకొన్నాను మనస్సులో.

"అదేమిటి. పెళ్ళికేగా ఈ పాట్లన్నీ."

"మరి మా వాళ్ళకు, మీ వాళ్ళకు చెప్పేస్తే పోలా?"

"నిజమే! ముందు మీ ఉద్యోగం రెగ్యులరైజ్ కానీయండి."

"ఓకే... ఓకే మీ దయ, నా ప్రాప్తం. ఆ మాత్రం సెలవు ఇచ్చారు థాంక్స్."

"నేను రేపట్నుంచి లీవ్‌లో వెళ్తున్నాను" అంది స్వరాజ్యం.

ఆ మాట వినగానే పిడుగు పడ్డట్లనిపించింది నాకు. కాళ్ళు, చేతులు సన్నగా వణికాయి. వెన్నెముక నుంచి చలి పుట్టుకొచ్చింది. అయినా నన్ను నేను నిలద్రొక్కుకుని అడిగాను నా భయం వ్యక్తం కానీయకుండా, "మళ్ళీ ఎప్పుడొస్తారు?" అని.

"చెప్పలేను. అర్జంటు పనుంది. వెంటనే లీవ్ అప్లయ్‌చేసి రమ్మని నాన్నగారు రాశారు" అంది స్వరాజ్యం.

"సో అయామ్ మిస్సింగ్ యు ఫర్ సమ్‌టైమ్" అన్నాను నేను ఆమె లేకుండా ఆఫీసు నిర్జన ఎడారిలా ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహించు కుంటూ.

"ఎస్" అంది స్వరాజ్యం క్లుప్తంగా.

స్వరాజ్యం ఊరు వెళ్ళాక నెల రోజులకో కవరు వచ్చింది ఆమె నుంచి. ఆ కవరులో ఓ శుభలేఖ, చిన్న ఉత్తరం ఉన్నాయి.

"ఊహించని పరిస్థితుల్లో నా పెళ్ళి మరొకరితో నిశ్చయం చేశారు మా వాళ్ళు. ఇలా జరుగుతున్నందుకు మరోలా భావించరని ఆశిస్తాను. ఇన్నాళ్ళూ నాపట్ల మీరు చూపిన ప్రేమను, అభిమానాన్ని ఎన్నటికీ మరువలేను. నా పెళ్ళికి తప్పనిసరిగా రావల్సింది" అని ఉంది ఆ ఉత్తరంలో సంక్షిప్తంగా.

ఒక్క క్షణంసేపు అచేతనుడ్ని అయ్యాను. ఎట్నుంచో వచ్చిన గాలివాటుకు చేతిలోని శుభలేఖ, ఉత్తరం ఎగిరిపోయాయి. ఆ తర్వాత ఎంతోకాలం జరగక ముందే నన్ను రిట్రెంచ్ చేశారు. తప్పనిసరిగా కొత్తగూడెం వదిలి విజయవాడ వెళ్ళి ఇండియన్ మెడిసిన్ హౌస్ అనే ప్రైవేట్ మందుల కంపెనీలో చేరాను.

* * *

సీతాపతి, మాలతి మైపాడు నుంచి తిరుగుప్రయాణమయ్యారు. సీతాపతికి ఒక్కో అనుభవం ఓ మధురస్మృతిగా అనిపిస్తోంది. ఓసారి గడిచిన జీవితం, వర్తమానాన్ని సరిపోల్చుకుంటే ఇదంతా ఒక సరిక్రొత్త వింత అనుభూతిగా ఉంది. తను విజయవాడలో ఇండియన్ మెడిసిన్ హౌస్‌లో లాబ్ కెమిస్ట్‌గా చేరాక లక్ష్మితో పరిచయమవటం, చివరికి అది ప్రేమగా మారి, పరిణయం దాకా వచ్చి హఠాత్తుగా ఆగిపోవటం ఒక్కసారి సీతాపతి మదిలో సినిమా రీలులా తిరిగింది.

గుండె చటుక్కుమన్న శబ్దం వినిపించింది సీతాపతికి. హఠాత్తుగా గుండెమీద చేయి వేసుకొని ఆ మధురానుభూతికి స్పందిస్తున్నట్లుగా నిట్టూర్చాడు. 'మరుపురాని బాధకన్నా మధురమే లేదు' అన్న పాట మూర్తి పాడుతుంటే వినటం సీతాపతికి ఎంతో ఇష్టం. ఇప్పుడు ఆ పాటలోని మాధుర్యాన్ని అనుభవిస్తున్నాడు.

ఇంతలో "బాబూ సీతాపతి, నేను మీ ప్రక్కనే ఉండగా మీరే మధుర ఊహలలోనో తేలిపోయి సినిమా డ్యూయెట్లు పాడుకోవటం దేనికి?" అన్నది మాలతి.

"నువ్వు కూడా అలా ఊహల్లో వచ్చేయకూడదు. ఇద్దరం కలిసి పాడుకో వచ్చు" అన్నాడు సీతాపతి ఠపీమని.

"అది సరే నెల్లూరొస్తున్నది. సాయంత్రం రంగనాయకుల గుడి దగ్గర కలుద్దాం సరేనా?" అంది మాలతి.

"తమరి ఆజ్ఞ సదా శిరసా వహించే మీ ప్రేమ పూజారిని" అన్నాడు సీతాపతి.

"స్టాప్... స్టాప్... స్టాప్... సినిమా డైలాగులు, యద్దనపూడి నవలల డైలాగులు బాగా కంఠత పట్టేసినట్లున్నారు. ఇంతకీ బిఎస్సీలో ఎన్ని మార్కులు వచ్చాయి?" అంది నవ్వుతూ.

ఇద్దరూ నెల్లూరు చేరి, బుద్ధిమంతుల్లా చెరోదారిన ఇంటిముఖం పట్టారు. సాయంత్రం రంగనాయకులు గుడిదగ్గర మాలతితో మాట్లాడవలసిన కబుర్ల గురించి డైలాగులు ఫ్రేం చేసుకోవటంలో సీతాపతి నిమగ్నమయిపోయాడు.

పెన్నానది ఒడ్డున ఇసుకతిన్నెలపై కూర్చున్నారిద్దరూ. పెన్నానదిలో ఉప్పెనలా నీరు లేకపోయినా నీళ్ళు అందంగా సన్నగా మెలికలు తిరుగుతూ అడ్డొచ్చిన రాళ్ళను ముంచుతూ ప్రవహిస్తున్నాయి. మాలతి కాలివేళ్ళతో ఇసుకలో గీతలు గీస్తోంది. కళ్ళముందు అప్సరసలా కూర్చొని ఉన్న మాలతి అందాన్ని కళ్ళతోనే జుర్రేస్తున్నాడు సీతాపతి. అతని మనస్సులో ఆమెను తన స్వంతం చేసుకోవాలన్న తహతహ ఎక్కువ కావటం మొదలయింది. మాలతితో తన జీవితం ఎంత ఆనందంగా ఉంటుదో పదే పదే ఊహించుకొంటున్నాడు. ఊహించుకొన్న కొద్దీ అతని గుండె బరువెక్కటం మొదలయింది.

తను ప్రేమించిన ప్రతి అమ్మాయికి మరొకరితో పెళ్ళి జరిగిపోవటం సీతాపతి హృదయాన్ని తీవ్రంగా కదిలించిన విషయం. జరిగిన ప్రతి సంఘు టనను తన ప్రియాతి ప్రియమైన స్నేహితుడు మూర్తికి రాస్తూనే ఉన్నాడు. ఓసారి మూర్తి “ఈసారి నీ వలలో పడ్డ పిట్టని చేయి జారిపోనీకు. ముచ్చటగా ముగ్గులోకి ఈడ్చి మూడుముళ్ళు వేసేయి” అని ఉత్తరం కూడా రాశాడు. అవును. తను ప్రేమించిన అమ్మాయి తనని ప్రేమించాలి. ఆమెతోనే తన జీవితం ముడిపడాలి. ఆ ఆనందాన్ని, ఆ మాధుర్యాన్ని తను జీవితాంతం గ్రోలాలి. అదే తన కోరిక. ఆ కోరిక నెరవేరాలంటే వీలైనంత త్వరలో మాలతి తన స్వంతం కావాలి. అతనిలోని మానసిక సంఘర్షణ తారస్థాయినందుకొంటున్నది. మాలతి మౌనం, ఆ సుందర ప్రశాంత ప్రకృతి అతనిలోని మానసిక సంఘర్షణ లను అధికం చేస్తున్నాయి. ఇక భరించలేనన్నట్లుగా మాలతి ప్రక్కకు తిరిగి మాటలు ప్రారంభించాడు సీతాపతి తన అసలైన బాణీలోకి వచ్చేస్తూ.

“మన పెళ్ళి విషయం గురించి నీ అభిప్రాయం ఏమిటి?”

“వేరే ఏముంటుంది?” అమాయకంగా మొహం పెట్టింది మాలతి.

“అయితే మా వాళ్ళకు ఉత్తరం రాయమంటావా?”

తలూపింది మాలతి. ఎంతో సంతృప్తిగా నిట్టూర్చాడు ఆమె అంగీకారానికి సీతాపతి. మాలతితో తన పెళ్ళి నిశ్చయం కానున్నట్లు మూర్తికి కూడా ఉత్తరం రాసేయాలనుకున్నాడు. ఎప్పటి విషయాలు అప్పుడు మూర్తిగా రాయటం సీతాపతికి అలవాటు.

వాళ్ళ వాళ్ళు నెల్లూరు వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది సీతాపతికి. అతని హృదయం ఆనందంతో పొంగి పరవళ్ళు తొక్కింది. ఈ విషయం మాలతి చెవుల్లో వేయాలన్న సంబరంలో ఊగిపోసాగాడు సీతాపతి.

సాయంత్రం ఆఫీసు నుంచి వస్తుండగానే మాలతి ఎదురుపడింది.

"ఓ హేపీ న్యూస్" అన్నాడు సీతాపతి భుజాలెగరేస్తూ.

"ఏమిటది?" అడిగింది ప్రశ్నార్థకంగా.

"మా వాళ్ళు వస్తున్నారు వచ్చే వారం."

"ఎందుకు, నెల్లూరు చూడడానికా?" అడిగింది మాలతి వ్యంగ్యంగా.

"ఎందుకేమిటి? నిన్ను చూడటానికి. మన పెళ్ళి విషయం మాట్లాడ్డానికి" కనుపాపలెగరేస్తూ చెప్పాడు సీతాపతి.

"దానికా అవసరం లేదిక" తాపీగా చెప్పింది మాలతి.

"ఏం, నువ్వే చెప్పేశావా మీ వాళ్ళకు మన పెళ్ళి గురించి?"

"లేదు."

"మరి..."

"ఈ రోజే నా పెళ్ళి నిశ్చయమయింది."

"ఎవరితో?" ఉత్సుకతతో అడిగాడు సీతాపతి.

"ఓ ఇంజనీర్‌తో. ఆయన పెద్ద కంపెనీలో పనిచేస్తున్నారు. రెండువేలు జీతం" సీతాపతికి మాలతి మాటలు విన్పించలేదు. అతని హృదయం బ్రద్ద లైంది. లావా బయటికి పొంగి ్లతున్నట్లు ఆవేశంతో ఊగిపోయాడు.

"మరింతకాలం నువ్వు నాతో నెరిపిన ప్రేమాయణం?" ఉద్రేకంగా అడిగాడు సీతాపతి.

"అది ప్రేమని నువ్వనుకుంటే నేనేమీ చేయలేను. నేను ఎప్పుడూ నిన్ను ప్రేమించానని చెప్పలేదే... నాకెన్నాళ్ళనుంచో మా వాళ్ళు సంబంధాలు చూస్తు న్నారు. గోత్రాలు, గోచీలు, కట్నాలంటూ ఏవీ కల్సి రాలేదు. ఒక్కటీ సెటిల్ అవ్వలేదు. నువ్వు ప్రేమించిన అమ్మాయిలందరికీ పెళ్ళిళ్ళు త్వరత్వరగా అయి పోతున్నాయి. అంతెందుకు? నువ్వు నన్ను ప్రేమించగానే అలా నా పెళ్ళి నిశ్చ యమైపోయింది. ఇంతకుమించి ఉదాహరణేమి కావాలి? థాంక్స్ ఫర్ యువర్

లవ్. వెరీ సింపుల్ ప్రాక్టికల్ జోక్" చెప్పింది మాలతి.

నోరెళ్ళబెట్టి గుడ్లు తేలేశాడు సీతాపతి, తన గతం గురించి మాలతికెలా తెల్సిందా అన్న సంశయంతో.

సీతాపతి సంశయం గ్రహించిన మాలతి, "నీ గతం నాకెలా తెల్సునను కొంటున్నావా? నీ ప్రియమిత్రుడు మూర్తి నాకు కజిన్ బ్రదర్ అవుతాడు. వాడు చెప్పాడోసారి నాకంతా వివరంగా. వాడు చెప్పింది నిజమవునో కాదోనని ఓసారి ప్రయత్నించి చూశాను. నిజమే అయింది. చూడండి. నేనూ అందరి లాంటి సగటు ఆడపిల్లనని మర్చిపోవటం మీ దురదృష్టం. పెళ్ళి విషయంలో జాతకాలని నమ్మేవాళ్ళుండగా రుక్మిణీ కళ్యాణం, గిరిజా కళ్యాణం పారాయణం చేసి శివాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసే అమ్మాయిలున్న ఈరోజుల్లో మూర్తి చెప్పింది నిజమా? అబద్ధమా? తేల్చుకోవటానికి ప్రయత్నం చేయటం తప్పు కాదేమో! అయినా వాడు చెప్పినట్లే జరిగింది. థాంక్స్ టు మై బ్రదర్ ఆల్వేస్" మరోసారి చెయ్యూపి ముందుకు సాగిపోయింది మాలతి.

సీతాపతికి కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది.

❀

పాపం కరెంట్

'ఈ టి.వి.లు, రేడియోలు, మైకులు కనిపెట్టిన వాళ్లెవరోగానీ, ఒక్కడన్నా చేతికి దొరికితే బావుండు, ముక్కు పచ్చడయ్యేలా కొడ్తాను. అయ్యో! నాలాంటి విద్యార్థులుంటారేమో! వాళ్ళకి పరీక్షలనేవి ఉండి ఛస్తాయేమోనన్న ఇంగితం వాళ్లకు లేకున్నా కనీసం ఈ వాడుకునేవాళ్ళక్కూడా ఉండి చావదు. పగలు, రాత్రి భేదం లేకుండా మైకుల్లో సిన్మా పాటలు మ్రోగిస్తుంటారు! హైవాల్యూమ్‌లో టి.వి.లు, రేడియోలు చెవులు చిల్లులు పడేలా పెడుతుంటారు. ఎట్లా చదువుకొని చచ్చేట్లు?' అని మనస్సులోనే తిట్టుకొన్నాడు నారాయణ.

పల్లెటూరు బ్యాంకు పరీక్ష ప్యాసయి క్లర్కుగా ఓ బ్యాంకులో చేరాడు – హైద్రాబాద్‌లో.

పల్లెటూరు వాతావరణంలో ప్రశాంతజీవితం, విశాలమైన ఇళ్ళలో గడిపిన నారాయణకు ఈ మహానగరవాసం, ముఖ్యంగా ఎలుక కలుగుల్లాంటి ఇళ్ళల్లో మనుషులు అద్దెకుండటం చూసి ఎక్కడలేని చిరాకు, చీదర పుట్టసాగాయి. అంతేగాక అడపాదడపా రోడ్ల మధ్య నల్లజెండాలు పాతి, మైకులు పెట్టి సిన్మా పాటలు వేయటం, చీటికి మాటికి షాపులు మూసేయటం మరీ ఇబ్బందిగా మారింది నారాయణకు.

తను సి.ఎ.ఐ.ఐ.బి. ఫైనల్ పరీక్షకు కట్టాడు. అది ప్యాసయితే రెండు ఇంక్రిమెంట్లు రావటమేగాక, త్వరలో ఆఫీసరుగా ప్రమోషన్ కూడా వస్తుంది. కాని ఈ మధ్య పెరిగిపోయిన టి.వి.లు, రేడియోలు నారాయణ దీక్షను ఊహించని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

చదువుకు డిస్టర్బెన్సు మరీ ఎక్కువ కావడంతో బయటికి వచ్చాడు.

పాన్ షాపు దగ్గరకెళ్ళి, “ఈ మైకుల హోరు ఏమిటిలా?” అని అడిగాడు సిగరెట్ తీసుకొంటూ.

“మూసాపేట కౌన్సిలర్‌గార్కి ప్రజాసన్మానం” అని చెప్పాడా షాపువాడు.

ఉసూరుమనుకుంటూ సిగరెట్టు వెల్గించుకొని ఇంటి ముఖం పట్టాడు నారాయణ. ఇంట్లోకి అడుగు పెడ్తుండగానే కరెంటు పోయింది.

‘ఛ... ఛ! నేను అప్పుడు ఉన్నది పల్లెటూర్లోనైనా కరెంటు అరుదుగానే పోతుండేది. ఇప్పుడు ఈ హైద్రాబాదులో కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడొస్తుందో తెలీటం లేదు’ అని మనస్సులో అనుకుంటూ చిమ్నీ వెతికి దీపం వెలిగించి పుస్తకం ముందు కూర్చున్నాడు నారాయణ. ఆ రాత్రంతా కరెంటు రాకపోయినా నారాయణ చదువు మాత్రం నిరాఘాటంగా సాగింది.

మర్నాడు కూడా నారాయణ ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి కరెంటు పోయింది. నారాయణ ముందు రాత్రి అనుభవం గుర్తుంచుకొని బట్టలు మార్చుకొని చిమ్నీ వెలిగించి చదువు ఆరంభించాడు.

ఇరుగు పొరుగు ఆడవాళ్ళు అంతా బయటికొచ్చి – “ఛీ పాడు కరెంటు! సరిగ్గా సాయంత్రమే పోవాలా! త్వరగా వస్తుందో రాదో! అసలే ‘చిత్రలహరి’ కార్యక్రమం ఉంది! అదీ వారానికొకసారి” అని ఓ అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు.

అందులో ఓ ముసలామె నారాయణ రూము దగ్గరికొచ్చి “చూడు బాబూ! ఇంట్లో మగవాళ్ళు ఎవ్వరూలేరు. కాస్త కరెంటు ఆఫీసుకు పోయి కంప్లయింట్ ఇచ్చి, వీలైతే కరెంటువాణ్ని వెంట తీసుకురాకూడదు” అంది నారాయణతో.

నారాయణకసలే మొహమాటం. అందులోనూ పెద్దావిడ చెప్పటంతో తప్పనిసరై లేచి, లోపలికెళ్ళి ప్యాంటు, చొక్కా తొడుక్కొని బయటికి వచ్చాడు.

“పాపం మంచికుర్రాడు చెప్పగానే లేచాడు” అన్నారు మిగతా ఆడ వాళ్ళు.

అరగంటలో అద్దె సైకిలు మీద వెళ్ళివచ్చాడు నారాయణ. ఆడవాళ్ళంతా

నారాయణ రాకకోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు. వస్తూనే నారాయణని చుట్టుముట్టేసి, "వెళ్ళిన విషయం ఏమైంది?" అని అడిగారు.

నారాయణ "ప్చ్" అని పెదవి విరిచి– "ఇప్పుడు పోల్ దగ్గర ఫ్యూజ్ పోయిందట. ఇంత రాత్రిపూట ఎవ్వరూ పోల్ ఎక్కరట" అని చెప్పేసి తన రూముకి వెళ్ళిపోయాడు.

"ఔరా!" అనుకుని ఆడవాళ్ళు "ఇది ఎండాకాలం కూడా కాదు, ఇప్పుడే పరిస్థితి ఇట్లా ఉంటే ఇక వేసవిరోజుల మాట ఏంగాను? ఇంతింత డబ్బు పోసి కొన్న ఈ టి.వి.లనేంచేయాలి?" అని ముక్తకంఠంతో పలికారు నిరసనగా ఈసడిస్తూ.

నారాయణ తన చదువులో నిమగ్నమయిపోయాడు. అతను రోజూ ఇంటికొచ్చేటప్పుటికి కరెంటు పోవటం మాత్రం నిత్యకృత్యమైపోయింది. అతను బుడ్డిలైటులో చదువుకోవటం గమనించి ఇరుగూపొరుగూ ఎంతో జాలిపడ్డాడు. టి.వి.లు, రేడియోలు బర్రున మ్రోగే రోజుల్లో కూడా కన్పించని నారాయణ ఇప్పుడు వాళ్ళకు కన్పించసాగాడు.

అయితే... తన పరీక్షలయ్యేవరకు ఆ వీధిలోని పది ఇళ్ళకూ సాయంత్రం పూట కరెంటు సప్లయ్ తీసేయమని లైన్‌మాన్‌కు నారాయణ చెప్పిన సంగతి, పాతికరూపాయలు ఇచ్చిన వైనమూ మాత్రం ఇరుగుపొరుగు ఎవ్వరిరకీ తెలీదు.

–చతుర మాసపత్రిక, నవంబర్, 1989

❀

కుడి ఎడమైతే?

టెలిగ్రాం మరోసారి చదువుకొన్నాడు చంద్రం.

“స్టార్ట్ యిమ్మీడియట్లీ – బ్రదర్ – ప్రశాంత్” – ఫ్రమ్ కలకత్తా.

ఎంత ఆలోచించినా అంత అర్జంటుగా రమ్మని అన్నయ్య ఎందుకు టెలిగ్రామ్ ఇచ్చాడో అతనికి బోధపడలేదు.

ఆ రోజే తన ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ పరీక్షలు ముగిసాయి. స్నేహితులతో ఖజురాహోకు పిక్నిక్‌కు వెళ్ళాలన్న ప్రోగ్రాం కూడా పరీక్షల ముందే వేసుకొన్నాడు.

‘ఇంతలో హఠాత్తుగా ఈ టెలిగ్రాం ఊడిపడింది... ఏం చేయటం?’ తనలో తనే అనుకోసాగాడు.

తను లేకుండా పిక్నిక్ వెళ్ళటానికి తన ఫ్రెండ్స్ ససేమిరా ఒప్పుకోరు. ఒప్పుకోకపోతే మానే, తననసలు కలకత్తా వెళ్ళనిస్తారా అన్నది అసలు ప్రశ్న. తన మాటల హోరు, జోకుల జోరంటే వాళ్ళు చెవి కోసుకొంటారు. అప్పట్లో రెండేళ్ళ క్రితం అమెరికా వెళ్ళిన అన్నయ్య అంత హఠాత్తుగా ఎప్పుడు ఇండియా కొచ్చినట్లు? ఏమీ అర్థం కావటం లేదు. కనీసం ఉత్తరం కూడా రాయకుండా ఇలా టెలిగ్రాం. అందులో అడ్రసు ఇచ్చి ఉన్నపళంగా తన్ను రమ్మనమంటానికి కారణం ఏమయి ఉంటుంది? ఇవతల తనకెన్ని కమిట్‌మెంట్స్. ఒక్క క్షణం ఆలోచిస్తే...

ఇంజనీరింగ్ కాలేజీ ఫైనల్ ఇయర్ బ్యాచ్‌కి తనే గ్రూప్ లీడరు. సెక్షనులో అమ్మాయిలు రత్నమాల, చండిక, జగదాంబ, చిన్నీలు కాక ఫోర్త్ ఇయర్

అమ్మాయిల్ని కూడా తను ఆకట్టుకోవటం. ఎంతో మందికి తనంటే జెలసీ అన్న సంగతి యూనివర్సిటిలో చాలా మందికి తెల్సు. తనుంటేనే అమ్మాయిలు ఏ ప్రోగ్రాంకయినా వచ్చేది. లేని పక్షంలో ఏవో సాకులు చెప్పి తప్పుకొంటుం టారు. అమ్మాయిలతో లవ్ ఎఫైర్ పెట్టుకోదల్చిన వాడెవడైనా సరే తన దగ్గరికి రావాల్సిందే. తన ద్వారా ఏ అమ్మాయిని కోరుకుంటాడో ఆ అమ్మాయితో పరిచయం జరగాల్సిందే. తను అందరమ్మాయిల్నీ ఆకర్షించడు. హాలివుడ్ తార కొలతలు, మిస్ వరల్డ్ శరీరం వంపులున్న వాళ్ళనే సెలెక్ట్ చేసుకొని వాళ్ళనే ఆకర్షించటానికి ప్రయత్నిస్తుంటాడు. తనడిగితే మిస్ యూనివర్సిటీ తన వెంబడి వచ్చి తీరాల్సిందే. తన బ్యాచ్‌లోని రత్నమాల రెండుసార్లు మిస్ యూనివర్సిటీ అవార్డు అందుకొంది. మిగతావాళ్ళ అందం అంతా ఒకెత్తయితే రత్నమాల అందం ఒకెత్తు. మిగతావాళ్ళలో చాలామందితో అన్నీ చూశాడు, అప్పుడప్పుడు హోటల్సులో. ఒక్క రత్నమాలనే తనింకా దారిలో పెట్టనిది. అలా తనమ్మాయిల మీద గ్రిప్ మైంటైన్ చేసుకొంటూ వచ్చాడు మొదటినుంచి. అలాగని తనకెదురు తిరిగినవాళ్ళు లేకపోలేదు. అలాంటివాళ్ళతో రభస చేసు కోకుండా, గుట్టుగా యూనివర్సిటీ గూండాల కొదిలేసి వాళ్ళ సంగతి చూసు కోమని చెప్తుంటాడు. తను ప్రతిసారి పరీక్షలయినాక ఎక్కడో చోటుకి పిక్నిక్ వేయటం, అక్కడ ఆడపిల్లల్ని ఆట పట్టించటం, సరదాలు తీర్చుకోవటం. వినోదంగా తిరిగిరావటం జరుగుతుండేది. కాని ఈసారి అర్థాంతరంగా ఈ అవాంతరం వచ్చి పడింది.

ఇలా చంద్రం బుర్ర నిండా ఆలోచనలు జోరీగల్లా అలుముకోసాగాయి. ఒక్కసారి గతంలోకి వెళ్ళాడు.

నిజానికి అన్నయ్యను చూడక రెండేళ్ళయింది. అన్నయ్య తనని ఎంతో కష్టపడి ఇంతవాడ్ని చేసాడు. అమ్మ పోయిన తర్వాత అన్నయ్యే తల్లి, తండ్రి అయ్యారు తనకు. తనకోసం పెళ్ళికూడ చేసుకోకుండా ఇంతకాలం ఉన్నాడు. వచ్చే వదిన తనకు, అన్నయ్య డబ్బులు పంపటంలో అడ్డు పడ్తుందనో ఏమో, అన్నయ్యను తను ఎప్పుడు పెళ్ళి చేసుకోమన్నా "ఇప్పుడు నా పెళ్ళికి తొందరే ముందిరా. నీ చదువు ఒకటి అవగానే నేనాశించినట్లు నువ్వు ఎక్కడన్నా

మంచి ఇంజనీరుగా చేరితే ఆ తర్వాత నువ్వు ఆగమన్నా ఆగను" అని అన్నయ్య తనతో అయిదేళ్ళ క్రితం అనటం తనకు ఇంకా గుర్తుంది.

అన్నయ్యలాంటివాళ్ళు ఈ కాలంలో చాలా అరుదు. లీడర్‌గా ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తూ కూడా అన్నయ్య దృష్టి పెళ్ళిపై పడలేదంటే అన్నయ్య నిగ్రహశక్తి ఎంతో గొప్పది. అన్నయ్య లాగా తను ఛస్తే ఉండలేడు. తనకు ఆడగాలి లేనిదే జీవితం అంతా పేలవంగా, నిస్సారంగా ఉంటుంది. అన్నయ్య పంపించే డబ్బును తాను మంచినీళ్ళలా ఖర్చు పెడ్తాడు. అయినా అన్నయ్య ఏనాడూ తనను ఖర్చు వివరాలు అడగలేదు. ఎంత డబ్బు పంపమంటే అంత డబ్బు పంపించాడు. అలాంటి అన్నయ్య ఎందుకో టెలిగ్రాం ఇచ్చి రమ్మంటే తను వెళ్ళకుండా ఉండేదేలా? అన్నయ్య పట్ల తనకున్న బాధ్యత, ప్రేమ, గౌరవం ఇంతేనా? కాదు. అన్నయ్య అంటే తనకెంతో గౌరవం ఉంది. ఏది ఏమైనా తను వెళ్ళితీరాల్సిందే. ఫ్రెండ్స్ ఏమనుకున్నా ఫర్వాలేదు. తను అన్నయ్య హృదయం కష్టపెట్టకూడదు, పెట్టలేదు కూడా.

ఇలా అనుకొన్న వెంటనే చంద్రం ప్రయాణానికి ఆయత్తం కాసాగాడు. చంద్రం క్షణాల్లో తన స్నేహితులకు ఈ వార్త అందేలా అరేంజ్ చేశాడు. చంద్రం స్నేహితులకు ఈ వార్త పిడుగుపాటులా అన్పించింది. వెంటనే స్కూటర్ల మీద, మోటార్ బైకుల మీదా చంద్రం ఇంటికి చేరారు. చంద్రాన్ని ప్రయాణం వాయిదా వేసుకోమని, అంతగా తప్పనిసరయితే ఖజురాహో నుంచి నేరుగా కలకత్తా వెళ్ళమని బతిమాలారు. చంద్రం ససేమిరా అంగీకరించలేదు. కనీసం చంద్రం రాని పక్షంలో అమ్మాయిలు ఆగిపోకుండా పిక్నిక్ థ్రిల్ ఆవిరయి పోకుండా వాళ్ళని ఒప్పించి తమతో పంపమని బతిమాలారు. అది చంద్రంకు ససేమిరా ఇష్టం లేదు.

తనుంటేనే అమ్మాయిలు పిక్నిక్ రావాలి. వాళ్ళ మధ్యలో తను తిరుగులేని హీరోలా గోపికృష్ణుడిలా వెలిగిపోవాలి. అలాంటిది తను వాళ్ళని వెళ్ళమని ఎందుకు ఒప్పిస్తాడు? ఒప్పించే ప్రసక్తే లేదు. లోపల ఇలా అనుకొని పైకిమాత్రం తను ప్రయత్నించి చూస్తానని, అమ్మాయిల్ని స్టేషనుకు తీసుకురమ్మని చెప్పాడు చంద్రం. అలా చెప్పడంలో చంద్రం మరోటి కూడా ఆలోచించాడు. తనకు

వీడ్కోలు చెప్పడానికి అమ్మాయిలు స్టేషనుకు రావటంతో తను మరింత కాలరెగ రేసుకోవచ్చు అందరి మధ్యలో.

స్టేషను జనంతో రద్దీగా ఉంది. అమ్మాయిలతో సహా స్నేహితులంతా స్టేషనుకొచ్చారు. అందర్నీ విష్ చేశాడు చంద్రం గర్వంగా. ఓసారి ట్రయిన్ కంటించిన రిజర్వేషన్ ఛార్టును చూసొచ్చాడు చంద్రం. ఎవ్వరికి చంద్రం ఆ చార్టు ఎందుకు చూసాడో అర్థం కాలేదు. వాస్తవానికి చంద్రం చూసింది ముందు స్టేషనులో ఎక్కే వాళ్ళలో ఎవరన్నా ఆడవాళ్ళున్నారేమోనని. శాంతిసేన, ఏజ్ ఇరవైఐదు అని కన్పడటంతో చంద్రం మనసు శాంతించింది. ఓసారి టైము చూసుకున్నాడు చంద్రం. ఇంకా ఏడు నిమిషాలుంది.

"ఫ్రెండ్స్, మీకు కొన్ని నాటీ బ్రెయిన్‌టేజర్స్ వేస్తాను. సమాధానం చెప్పగలరేమో ట్రయిచేయండి" అన్నాడు చంద్రం.

'నాటీ బ్రెయిన్‌టేజర్స్' అని విన్పడటంతో రత్నమాలతో సహా ఎంతో ఉత్సుకతతో చూశారు. "అడుగు చంద్రం" అంది రత్నమాల.

"బి.పి. అనే రెండు ఇంగ్లీషు అక్షరాలకు బ్రయిడ్స్ పార్టీ, బ్యూటీపార్లర్ లాంటి పదాలను చెప్పుకోవచ్చు తమాషాగా. అలాంటిదే ఆడవాళ్ళకు వర్తించే మరో పదం చెప్పుకోండి చూద్దాం. వన్ మినిట్ టైం" చెప్పాడు చంద్రం.

ఒక్క నిమిషంలో ఎవ్వరూ చెప్పలేదు.

""బెడ్ పార్ట్‌నర్" చెప్పాడు చంద్రం.

రత్నమాల బుగ్గలు ఎరుపెక్కాయి. మిగతావాళ్ళు కూడా తలొంచు కున్నారు.

"ఇంకోటడుగు ఈసారి" అంది చండిక తలెత్తి.

"అయితే వినండి. కె.పి. అనే రెండు అక్షరాలకు కన్నెపిల్ల, కటిప్రాంతంకు ఎబ్రివేషన్‌గా వ్యవహరించవచ్చు. అలాంటిదే మరో ఆడవాళ్ళకు చెందే ప్రాంతం చెప్పుకోండి."

మళ్ళీ చాలాసేపు బుర్రలు గోక్కున్నారంతా. వన్ మినిట్ అయిపోయింది.

"సారీ. ఇంత చిన్నది తెలీదా? కామాటిపురా. బొంబాయిలో రెడ్‌లైట్ స్ట్రీట్ పేరు."

"ఇంకొకటి" అడిగారంతా.

"వస్తాదులా మొదలై పెనుపోటుతో గొప్ప గొప్ప రచయితైన ఓ తెలుగు రచయిత పేరు చెప్పగలరా?"

"ఆ నే చెప్తాను" అన్నాడు చంద్రం ఫ్రెండు ఒకడు.

"చెప్పు" అడిగారు మిగతా అంతా. "మల్లాది (మల్లు + ఆది)"

"ఏ మల్లాది, మన మల్లాది వెంకట కృష్ణమూర్తా?" అడిగింది జగదాంబ.

"కాదు, మల్లాది రామకృష్ణశాస్త్రి" చెప్పాడతను.

"ఈసారి లాస్ట్‌గా ఒకటడుగుతాను చెప్పగలరేమో ప్రయత్నించండి" అన్నాడు చంద్రం.

అంతా తలూపారు. "ఓ నవలని ఎలా కొంటే దాని ఖరీదు డెభై ఐదు రూపాయల పైనుంటుంది మార్కెట్టులో?"

దాదాపు అంతా ఏవేవో చెప్పారు గాని అసలు సమాధానం చెప్పలేక పోయారు.

"అయితే వినండి. నవలను డెయిలీ సీరియల్‌గా గాని, వీక్లీ సీరియల్‌గా గాని కొని చదివితే మీరు ఓ నవలకు డెభైఐదు రూపాయలు ఖర్చుపెట్టినట్లు" చెప్పాడు చంద్రం.

ఇంత లోపల గార్డు విజిల్ వేయటం, చంద్రం రైలెక్కటం జరిగిపోయింది ఒకేసారి. అందరూ సంతోషంగా వీడ్కోలు చెప్తూ చేతులూపారు. చంద్రం మాత్రం వాళ్ళడిగినట్లుగా మాత్రం అమ్మాయిలను పిక్నిక్‌కు వెళ్ళమని చెప్పలేదు. ఆ సంగతి వాళ్ళకు అప్పుడు గుర్తు కూడా లేదు.

చంద్రం శాంతిసేన రైలెక్కే వరకూ టిట్‌బిట్స్ మేగజైన్స్ తిరగేస్తూ కూర్చు న్నాడు. తన బెర్త్‌కాపోజిట్ బెర్త్ శాంతిసేనదని వాల్తేరులో రిజర్వేషన్ బోర్డు చూసినప్పుడే చంద్రంకు తెల్సు. సుమారు గంటన్నర దాటాక రైలాగిన స్టేషన్‌లో శాంతిసేన రైలెక్కింది. తన చేతిలోని ఎయిర్‌బ్యాగ్స్‌తో, ఓ చిన్నబుట్టతో వెనుక కూలీ వచ్చి వో బెడ్డింగ్ రైల్లో పెట్టేసి, డబ్బులు తీసుకొని వెళ్ళిపోయాడు. శాంతిసేన అందంగా ఉంటుందో ఉండదోనని చంద్రం ఎంతో భయపడ్డాడు. కాని నీలాల నింగిలోకి మిణుకు మిణుకుమని మెరిసే తార హఠాత్తుగా

భూమిపైకి దిగిందన్నంత అందంగా ఉంది శాంతిసేన. చంద్రం మనస్సు ఆనందంతో ఉరకలు తీసింది.

ఓసారి అటు ఇటూ కలయచూసింది శాంతిసేన. ఎదురుబెర్త్‌లో కూర్చున్న చంద్రం, తానూ తప్ప ఎవ్వరూ లేరు ఆ కంపార్టుమెంటు సెక్షనులో. ఓసారి చంద్రాన్ని పరీక్షగా చూసి మనస్సులో నవ్వుకొంది ఆమె. ఆమె చిరునవ్వు చంద్రానికి పలకరింపులా అన్పించింది. వెంటనే కళ్ళు కళ్ళు కలిపాడు. తనూ ఓ చిరునవ్వు నవ్వాడు. అలవోకగా నవ్వి శాంతిసేన తన బెర్త్‌లో కిటికి ప్రక్కగా కూర్చుంది.

చంద్రం తనే మొట్టమొదట పలకరించాలన్నట్లుగా "ప్లీజ్ ఎక్సుక్యూజ్ మీ, వాటర్ బాటిల్ ఉంటే యిస్తారా?" అడిగాడు బుట్టవైపు చూస్తూ.

"ష్యూర్, వెల్‌కం" అని వంగి బుట్టలోంచి బాటిల్ తీసి చంద్రానికి అందించబోయింది.

ఆమె వంగినప్పుడు ఆమె ఎదపైనే చూపులు నిల్పాడు చంద్రం. 'అబ్బ పక్షోజాలు ఎంతో బాగున్నాయి. తమను ఈ బంధిఖానలోంచి విడిపించమని, స్వేచ్ఛ ప్రసాదించమని ప్రాధేయపడుతున్నాయి' అనుకున్నాడు చంద్రం.

తను బాటిల్ అందిస్తున్నా చంద్రం బాటిల్ వంక చూడక ఏదో చూస్తుం డడం గమనించి ఓసారి తనవంక చూసుకుంది శాంతిసేన. బుట్టకోసం వంగి నపుడు తన పమిట అలానే ఒడిలో ఉండిపోవడంతో తన అనాచ్ఛాదిత వక్షో భాగం వైపు చంద్రం దృష్టి నిల్పాడని గ్రహించడానికి శాంతిసేనకెక్కువ సమయం పట్టలేదు.

"ఏయ్ మిష్టర్. యిదిగో బాటిల్" అంటూ చంద్రాన్ని ఈ లోకంలోకి వచ్చేలా పిల్చి, జారిపోయిన పమిటను పైకేసుకొంది శాంతిసేన.

శాంతిసేన పిలుపుకు కాదు చంద్రం ఈ లోకంలోకి వచ్చింది, ఆమె పమిట వేసుకోవడంతో తన కళ్ళముందు మనోహర దృశ్యం కరిగిపోయిందేనన్న సంగతి గ్రహించి.

"స్మార్ట్ అండ్ బ్యూటిఫుల్" అన్నాడు చంద్రం అప్రయత్నంగా తన సహజమైన ధోరణిలో.

"యూ నాటీ" అంది శాంతిసేన పెదవులపై దొర్లిన చిరునవ్వును ఆపుకొంటూ.

"థాంక్యూ, యంగ్‌మెన్ ఆర్ ఆల్‌వేస్ నాటీ. చిన్న బ్రెయిన్‌టేజర్ వేస్తాను, చెప్పుకోండి చూద్దాం" అన్నాడు మంచినీళ్ళ బాటిల్‌ని అందుకొని.

"ఏమిటో చెప్పండి. నాకు బ్రెయిన్ టేజర్స్ అంటే మహాయిష్టం."

"బ్యూటిపుల్ గర్ల్స్ అంతా లైక్ చేసేదొకటేమిటి?"

"ఫ్లవర్స్" చెప్పింది శాంతిసేన.

"నో."

"శారీస్."

"నో."

"నాటీనెస్ ఇన్ యంగ్‌మెన్."

నవ్వింది శాంతిసేన "బాగుంది" అంటూ.

"యింకొక ప్రశ్న, కొందరాడవాళ్ళకు ఓ చోట గుండ్రంగా, బరువుగా వ్రేలాడుతుంటాయి. ఏమిటవి?"

"ఛ, యిలాంటివడిగితే నోటితో ఎలా చెప్పడం?"

"పోనీ, చేత్తో చూపండి. నాకు తెల్సు మీకు బూతు అర్థమే వస్తుందని. అందుకే ఈ ప్రశ్న వేసాను. చెప్పలేరా, మీరు చెప్పకపోతే నేనే చెపుతాను. వన్ మినిట్ టైమ్."

శాంతిసేన నిమిషం సేపు మౌనం వహించింది.

"మీ చెవులకున్నాయే అవి."

"బుట్టకమ్మలా" ఆశ్చర్యంగా అడిగింది.

అవునని తలాడించాడు చంద్రం.

"బాగుంది. మరోటి అడగండి చూద్దాం. ఈసారి చెప్పగలనో లేదో."

"కొందరాడవాళ్ళు ప్రొద్దున, కొందరాడవాళ్ళు మధ్యాహ్నం ఓ బూతు పని చేసుకుంటారు, ఏమిటది?

"ఛీ ఛీ సిగ్గులేదు?"

"అదే పొరపాటు. యిందులో సిగ్గు పడాల్సిందేమీ లేదు. మీరూ

చేసుకొంటారు, ముందు చేస్తారు కూడా"

"ఛీ" అంది శాంతిసేన మళ్ళీ.

"వన్ మినిట్ టైమ్."

"సారీ, నావల్ల కాదు చెప్పటం" అంది శాంతిసేన.

"అదేమిటి మిల్క్ బూతు నుంచి పాలు తీసుకురావటం కూడా తప్పేనా మీ దృష్టిలో? మీరేమి ఆడవాళ్ళండీ..." అన్నాడు చంద్రం.

"అబ్బ ఇంకేమి చెప్తారో అనుకొన్నాను" అంది శాంతిసేన చెంపపైకి వాలిన ముంగురులను సవరించుకొంటూ.

చంద్రం కాసేపు మౌనం వహించాడు. అతని చూపులు ఆమె శరీరాన్ని పూర్తిగా తడుముతున్నాయి. ముందు ఆమె ఎర్రని బుగ్గలు. తర్వాత శంఖం లాంటి మెడ, ఆపైన పమిటచాటు దాగిన ఎత్తులు, యింకా క్రింద పల్చటి చీరెలోంచి నిగనిగలాడుతున్న పొత్తి కడుపును, నాభిని, ఆ తర్వాత బలిష్టంగా పర్చుకొన్న తొడలను పరీక్షగా చూసి మెల్లగా "సెక్సీ పర్సనాల్టీ" అన్నాడు ఆమెకు మాత్రం వినపడేలా.

యింతలో శాంతిసేన, "మిస్టర్! ఏమిటా చూపులు? ఎదుటివాళ్ళను నమిలి మింగేలా? మీ బుర్రకు పని పెడ్తానుండండి. ఓ టిట్‌బిట్ అడుగుతాను చెప్పుకోండి చూద్దాం" అంది.

"అలాగే" అన్నాడు చంద్రం బుద్ధిమంతుడిలా నటిస్తూ.

"ఓ నగరంలో కాలు పెడితే ఠపీమని చస్తారు, ఏమిటా నగరం?"

క్షణంసేపు ఆలోచించాడు చంద్రం. ఆమె అందం అతని ఆలోచనల్ని చెదరగొడ్తున్నది. నిముషాలు గడిచినా చంద్రం పెదవి విప్పలేదు.

"చూశారా చెప్పలేకపోయారు. యింత చిన్నదాన్ని, 'ఎలక్ట్రిసిటి'నే ఆ నగరం."

"యిప్పుడు నేను ప్రశ్న అడుగుతాను" అన్నాడు చంద్రం.

"అడగండి" అంది శాంతిసేన పమిట కప్పుకొంటూ.

"కొందర్ని చూస్తే కొంచెం లేస్తుంది. కొందర్ని చూస్తే బాగా లేస్తుంది? కొందర్ని చూస్తే ఏమనిపించదు. ఏమిటది?"

"మీరు బూతుపనుల మీద పరిశోధనలు చేసినట్లున్నారే. అవి తప్ప మీ ఆలోచనలు, చేష్టలు మరోరకంగా ఉండేట్లు లేవు" అంది శాంతిసేన చిరుకోపం ప్రదర్శిస్తూ.

"నాకంటే మీకే అందులో అనుభవం ఎక్కువలాగుంది. నేనేమి మాట్లాడినా మీకు అలానే అన్పిస్తుందేం? నా ప్రశ్నకు సమాధానం– జాలేస్తుంది. నేను ఆడవాళ్ళని చూస్తేనే జాలేస్తుందని చెప్పలేదే, మీకెందుకొచ్చింది బూతర్థం?"

"చాల్లెండి. సంతోషించాం మీ తెలివికి" అంది శాంతిసేన.

"మీకు కార్డ్సు ఆడటం వచ్చా" అడిగాడు చంద్రం.

"వచ్చు" అంది శాంతిసేన.

అదే ఆదనుగా బ్రీఫ్‌కేస్‌లోంచి కార్డ్సు తీసి శాంతిసేన బెర్త్‌పై హేండ్‌కర్చీఫ్ యిద్దరి మధ్యలో పర్చి ఆవిడ బెర్త్‌పైన కూర్చున్నాడు. శాంతిసేన కూడా చంద్రం వేపు తిరిగి, బెర్త్‌పైకి కాళ్లు లాగి పద్మాసనం వేసుకొని కూర్చుంది.

"అరెరె మీరూ యిటు తిరిగారా. యిందాకటిలాగే కూర్చోకపోయారా?"

"అదేం. దొంగచాటుగా నావి చూడడానికా?" అంది శాంతిసేన.

"ఏవి చూడ్డానికి?" కొంటెగా అడిగాడు చంద్రం.

అప్పుడర్థమైంది శాంతిసేనకు తాను మాట్లాడిందాంట్లో రెండర్థాలు వస్తాయని. "నావి అంటే నా కార్డులు" అందంగా చెప్పింది శాంతిసేన వాటిని చూపిస్తూ.

"అవా, యింకేవో అనుకున్నాను" చంద్రం అన్నాడు.

యిద్దరూ కాసేపు ఆటాడాక శాంతిసేనకు నిద్రమత్తు ముంచుకు రాసాగింది. ఆట ఆడేటప్పుడు రెండు మూడుసార్లు చంద్రం ఆమె చేతులు పట్టుకొని నలపటం, ఆ స్పర్శలోని హాయిని ఆనందించటం లాంటి చిలిపిపనులు చేశాడు.

"యిక నే పడుకోవాలి, మీ బెర్త్ మీదికి మీరు వెళ్ళొచ్చు" అంది పేకముక్కల్ని పేక్ చేస్తూ. చేసేది లేదన్నట్లు చంద్రం తన బెర్త్‌కి వెళ్ళి కూర్చున్నాడు.

క్షణంలో శాంతిసేన నిద్రలోకి జారుకుంది. తాను తెచ్చుకున్న బెడ్డింగ్ బెర్త్‌పై పర్చుకొని, నిద్రపోతున్న శాంతిసేన అందాన్ని కళ్ళతోనే జుర్రుకొంటూ నిద్రలోకి జారుకున్నాడు చంద్రం.

రైలొచ్చి కలకత్తా స్టేషన్‌లో ఆగింది. శాంతిసేనకు థాంక్స్ చెప్పి, అన్నయ్య కోసం తలుపు దగ్గరకొచ్చి నిల్చున్నాడు చంద్రం. అల్లంత దూరంలో అన్నయ్య కంపార్టుమెంట్‌లన్నీ వెతుక్కుంటూ రావటం కన్పడి, అన్నయ్య మంచిమనస్సును లోలోనే మెచ్చుకొంటూ ఎదురెళ్ళాడు చంద్రం.

"ఎంతకాలమైందిరా నిన్ను చూడక?" అంటూ ఆప్యాయంగా తమ్ముణ్ణి కౌగిలించుకున్నాడు ప్రశాంత్.

"నాకు అలాగే ఉంది" అన్నాడు చంద్రం ఎంతో ప్రేమగా.

"సరే. రా యింటికి పోదాం. కారు తెచ్చాను నీకోసం" అన్నాడు ప్రశాంత్.

"కారు కొన్నావా? ఎప్పుడు?"

"కారేమిటి? యింకా చాలా విశేషాలున్నాయి నీకు చెప్పాల్సినవి. తీరిగ్గా మాట్లాడుకుందాం పద."

యిద్దరూ మాటల్లో స్టేషన్ బయటకి నడిచారు.

"ముందు ఎక్కడన్నా హోటల్లో టిఫిన్ చేసి యింటికి పోదాం" అన్నాడు ప్రశాంత్.

"యింకా ఈ హోటల్ తిండి మొహం మొత్తలేదా అన్నయ్యా. హాయిగా పెళ్ళి చేసుకోకూడదూ. నీ పుణ్యమాని నేను వదిన చేతి వంట రుచి చూస్తాగా" అన్నాడు చంద్రం.

"అదీ ఎంతో దూరం లేదులే. అసలు నిన్ను అంత హఠాత్తుగా పిలిపించిందే ఆ విషయం చెప్పటం కోసం. అయితే ముందు నీకు సారీ చెప్పాలి నేను. ఉన్న ఒక్క రక్త స్పర్శ నీకు చెప్పకుండా నేను అమెరికాలో ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. ఆ అమ్మాయి నాకు రిసెర్చి చేస్తూ పరిచయమయింది. క్రమంగా ఆ పరిచయం ప్రేమగా మారింది. తన రిసెర్చి అయిపోయి డిగ్రీ తీసుకొని పోయిన వారమే ఇండియా వచ్చింది" చెప్పాడు ప్రశాంత్.

"హార్టీ కంగ్రాచ్యులేషన్స్, మరి పదినెలా వుంటుంది? పేరు, ఊరు వివరాలు చెప్పవేం? అడిగాడు చంద్రం ఆత్రుతగా.

"తినబోయే ముందు గారెల రుచి, చూడబోయే ముందు వదిన గురించి అడగటం ఎందుకు? కొంత సస్పెన్స్ ఉండాలి గదా. రేపో, ఎల్లుండో వదిన

వస్తుంది గదా, చూద్దువుగాని" చెప్పాడు ప్రశాంత్.

యిక చంద్రం ఏమీ మాట్లాడలేదు. ఎంతయినా అన్నయ్య. అన్నయ్యను పదిరకాలుగా ప్రశ్నలు వేయగల సాహసం తనకు లేదు. ఆ ఆచారం తామిద్దరూ మొదట్నుంచి మెయింటైన్ చేస్తూనే ఉన్నారు. హోటల్లో టిఫిన్ చేసి యిద్దరూ కార్లో ఇంటికొచ్చారు.

కారును గ్యారేజిలో పార్కు చేసి వచ్చి తలుపు తట్టాడు ప్రశాంత్. అది పెద్ద కాంపౌండ్. లోపల నాల్గు పోర్షన్లు దాకా ఉంటాయి. అన్నింటికి కల్పి సేఫ్టీ కోసం కామన్ ఎంట్రన్స్ పెట్టారు. ఐదు నిమిషాలు కొట్టాక ఎవరో తలుపు తీశారు.

"హాయ్, నువ్వెప్పుడొచ్చావు" అడిగాడు ప్రశాంత్ తలుపుతీసిన తన భార్యని చూస్తూనే.

"యిదిగో ఈ ప్రబుద్ధుడు నేను కలిసే వచ్చాం – ఒకే కంపార్టుమెంటులో, ఒకే రైలులో. వయసుకు మీకంటే చిన్నవాడైనా బుద్ధులు అన్నీ తమరివే" అంది ఆమె ప్రశాంత్‌తో.

శాంతిసేనను చూస్తూనే కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది చంద్రంకు. తాను ఎవరో అనుకొని పరమ అసహ్యంగా మాట్లాడిన వ్యక్తే చివరకు తన వదిన అవటంతో చంద్రంకు తల గిర్రున తిరిగినట్లయింది. "వదినా" అంటూ ఆమె కాళ్ళపై పడ్డాడు చంద్రం.

–మయూరి సచిత్ర వారపత్రిక, 25 డిసెంబర్, 1987

❀

తొలిముద్దు

"కాలేజి లైఫ్ అంటేనే ఓ అందమైన స్వర్గం. ఓ మధురానుభూతి. ఓ తీయని స్పందన. అలాంటి దానిలోకి అడుగుపెట్టి నాల్గు సంవత్సరాలయింది. కానీ ఒక్క అమ్మాయినీ లవ్ ఆడలేకపోయావు. కనీసం ఒక్కర్తెకు కన్ను కొట్టలేక పోయావు. అధమపక్షం అమ్మాయిల వంక తలెత్తి కూడా చూడలేదు. నీదీ ఓ బ్రతుకేనట్రా? రేపు పెళ్ళయితే మీ ఆవిడకు నీ కాలేజీ జీవితం గురించి గొప్పగా చెప్పుకొందుకు నాల్గు సంఘటనలు కూడా లేవు. నీలాంటివాడి స్నేహితుణ్ని అని చెప్పుకోడానికి నాకు సిగ్గుగా ఉంది" అన్నాడు అపర మన్మధుడవతారమైన సుధాకర్ తన ఆప్తమిత్రుడైన చారితో.

ఆ మాటలు ఎంతో కర్ణకఠోరంగా అన్పించాయి చారికి. తనని సుధాకర్ ఎద్దేవా చేయటం మామూలుగా జరుగుతున్నదే ప్రతిరోజూ. కాని ఈ రోజు తన మూడ్స్ వేరు. ఆ సంగతి గ్రహించకుండా యింత మంచి స్నేహితుడై వుండి తనని పట్టుకొని అలా ఎత్తి పొడవడం చారికి సుతరామూ నచ్చలేదు. లోపల్నుంచి రోషం తన్నుకొచ్చింది. యిద్దరూ కాలేజీ క్యాంటీను నుంచి టీ త్రాగి బయటికొచ్చారు.

"అలా అనకు. నాలో మంచితనాన్ని, సంస్కారాన్ని నువ్వు బలహీనతగా తీసుకొంటున్నావు. ఎప్పట్నించో చూస్తున్నాను. నీలాగా ఎదురయిన ప్రతి అమ్మాయిని లవ్వాడుతున్నట్లు, విరహబాధను తట్టుకోలేకపోతున్నట్లు నేను కథలల్లలేనా? అంతమాత్రానికే ఏమీ ఎరగని, చేతకానివాడ్ని అసలే కాదు. కావలిస్తే నువ్వు ఏ పరీక్షయినా పెట్టుకోవచ్చు. 'సై అంటే సై' అని ఋజువు

చేసుకోకపోతే అప్పుడడుగు" అన్నాడు చారి సుధాకర్‌తో గంభీరంగా.

సరిగ్గా ఆ సమయంలో ఎదురుగా కాలేజి లోపల్నుంచి యిద్దరమ్మాయిలు నడుచుకొంటూ క్యాంటీను వైపు రావటం కన్పించింది ఆ మిత్రద్వయానికి ఒకేసారి. వెంటనే సుధాకర్ చారివైపు తిరిగి "ఆ వస్తున్న అమ్మాయిల్లో ఒకరు కాంతిమతి. మరొకరు దమయంతి. ఆ యిద్దరిలో ఎవర్నో ఒకర్ని నువ్వు ముద్దు పెట్టుకోవాలి. ఏదో మామూలుగా 'బేబీ, చీచీ, నవ్వమ్మా' అన్నట్టు పసి పిల్లల్ని ఆడించే ముద్దు కాదు. కస్సుకస్సుమంటూ ఘాటైన కిస్సు పెట్టాలి. మరో విషయం. అమ్మాయిల్ని ముద్దు పెట్టుకొనేటప్పుడు నేర్పు, ఒడుపు చూపించాలి. నువ్వు యిచ్చిన ముద్దు పసందుగా ఉంటే ఆ అమ్మాయి కళ్ళకు మైకం కమ్మాలి. మొరటుగా ఉంటే చాచి గూబ అదిరేలా కొడ్తుంది. అలాంటిదే జరిగితే నువ్వు ఓడిపోయినట్లే, ఏమంటావు?" అనడిగాడు.

ఓసారి పరిశీలనగా ఆ యిద్దరమ్మాయిల్ని చూశాడు చారి. కొంచెం నాజూగ్గా ఉంది దమయంతి. కొంచెం బొద్దుగా లావుగా ఉంది కాంతిమతి. యిద్దరూ దాదాపు తన హైట్, ఫిజిక్ ఉన్నవాళ్ళే. సన్నగా వెన్నెముకలోంచి వణుకు పుట్టుకొచ్చింది చారికి. అటూ, యిటూ చూశాడు, రోడ్డు మీద ఎవరయినా ఉన్నారేమోనని. మరో మనిషి పురుగు కన్పించలేదు. అయినా యిద్దరమ్మాయిలున్నప్పుడు తనలాంటి సాహసం చేస్తే ఒకరు కాకపోయినా మరొకరు తను అంతో, యింతో ఎరిగిన వాళ్ళే. అదీగాక తనకు క్రితం రోజే పెళ్ళి నిశ్చయం చేసి పెద్దవాళ్ళు తాంబూలాలు కూడా తీసుకొన్నారు. యిప్పుడే దైనా రభస జరిగి యింటి దాకా వెళ్తే తన గతేమి కాను? యిలా ఆలోచిస్తున్నాడు చారి.

'ఏమిటి ఆలోచిస్తున్నావు? పెద్దడైలాగు కొట్టావుగా 'సై అంటే సై' అని, మరి యిప్పుడు వెనుకాడ్తున్నావేమిటి? పిరికిపంద. చేతకాదని ఒప్పేసుకో. సగం పరువన్నా దక్కుతుంది" అంటూ సుధాకర్, చారి ఆలోచనలు పసిగట్టిన ఆల్సేషన్ డాగ్‌లా కయిమన్నాడు చారి మీద.

ఆ మాటలు విన్న చారికి తల గిర్రున తిరిగినట్లయింది. యిక తన ఆలోచనలకు స్వస్తి చెప్పి "చూడు అలా పేట్రేగిపోకు. నా దమ్మేమిటో నేను

నిరూపిస్తానిప్పుడు" అన్నాడు చారి అమ్మాయిల వంక తీక్షణంగా చూస్తూ.

"అయితే పందెం కాయి?" అన్నాడు సుధాకర్.

"ఎంత" అన్నాడు చారి.

"వంద."

"సరే."

సుధాకర్ అక్కడే నిల్చుండిపోయాడు. చారి ముందుకు కదిలాడు. అడుగులో అడుగేసుకొంటూ పిల్లిలా రెండునిముషాల్లో చారి కాంతిమతి, దమయంతిని చేరాడు. యిద్దరూ చారిని విష్ చేసారు. చారి ఎదురు విష్ చేసి హఠాత్తుగా కాంతిమతిని ఓ నాల్గు అడుగులు యివతలికి లాగి ఆమె అధరాలపై గట్టిగా చుంబించి వదిలేసాడు. కాంతిమతి బుగ్గలు ఎరుపెక్కాయి. దమయంతి బిత్తరపోయింది. వాళ్ళిద్దరూ షాక్ నుంచి తేరుకొనే లోపల గిర్రున తిరిగి వచ్చేశాడు సుధాకర్ దగ్గరికి చారి.

ఎప్పుడూ మాటలు చెప్పే సుధాకర్‌కు, చారి మొదటిసారే ఆచరణలో పెట్టి చూపెట్టటం జీర్ణించుకోలేని హాలాహాలంలా అన్పించింది. సుధాకర్ జేబులోంచి వందరూపాయలు తీసి తన జేబులో పెట్టుకొంటూ "సాయంత్రం యింటికి రా. యిద్దరం సిన్మాకి పోదాం" అన్నాడు చారి. సుధాకర్ స్థాణువులా నిల్చుండిపోయాడు చారి వంక చూస్తూ.

క్రితం రాత్రి కాంతిమతితో చారికి వివాహం నిశ్చయమైన సంగతి కానీ, దమయంతి చారి మరదలన్న విషయం గానీ, కాంతిమతిని ముద్దు పెట్టుకొనే ముందు చారి దమయంతికి కనుసైగ చేసిన విషయం గానీ సుధాకర్‌కు తెలీనే తెలీదు. ప్చ్.

–ఉదయం వీక్లీ, 16 జూలై, 1987

❀

క్షతగాత్రుడు

ప్రదీప్‌కు రచయిత కావాలని ఎంతో ఉబలాటం. పోనీ సాదాసీదా రచయిత కావాలని అనుకొంటే ఆ విషయం వేరుగా ఉండేది. ఏకబిగిన వాసిలోనూ, రాసిలోనూ ప్రస్తుతం పెద్ద పెద్ద రచయితలున్న స్థాయికి ఒకేసారి ఎదగాలని అతని అభిలాష. అందుకోసం అతను అహోరాత్రులు పుంఖానుపుంఖాలుగా కథలు, నవలలు రాయటం మొదలుపెట్టాడు. కాని ఏ ఒక్క కథ ప్రచురణ వెలుగుకు నోచుకోలేదు. ఎన్ని వ్రాస్తే అన్నీ తిరిగొచ్చేవి. అయినా అతను నిరాశ పడలేదు. పట్టు విడవలేదు.

కాకపోతే అతనికో కొత్త సమస్య వచ్చిపడింది. అది అతను సిటీనుంచి యిల్లు కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి మార్చటం. ఆ కాలనీలో సుమారు రెండువేల యిళ్ళ దాకా ఉన్నా, అక్కడి వాళ్ళకు ఉత్తరాలు అందించేందుకు పోస్ట్‌మాన్ లేదు. అందుచేత కాలనీవాసులంతా కల్సి కూకట్ పల్లి పోస్ట్‌మాస్టర్‌తో ఆ విషయం విన్నవించుకోగా, ఓ చదువుకున్న కుర్రాడ్ని యింటింటికి నెలకింత జీతం యిచ్చే పద్ధతి మీద కుదిర్చాడు పోస్ట్‌మాస్టర్. తనకున్న ప్రధాన సమస్య తీరిపోగానే మళ్ళీ కొత్త ఊపులో విజృంభించాడు ప్రదీప్.

ఆ కాలనీలో ఉన్న యిళ్ళన్నింటికి కల్సీ వంద ఉత్తరాలు వస్తే ప్రదీప్ ఒక్కడికే మటుకు యాభై అరవై ఉత్తరాలు (తిరిగొచ్చే కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు) దాకా వచ్చేవి రోజుకు. మొదట్లో కుర్ర పోస్ట్‌మాన్‌కు ఈ విషయం అంతగా పట్టకపోయినా క్రమంగా దినదినం పెరిగిపోతున్న ప్రదీప్ పోస్టు అతని దృష్టిని సులువుగా ఆకర్షించగలిగింది.

ఓసారి ప్రదీప్‌ను కల్సి "మీకు తిరిగొచ్చే కట్టలు కట్టలు కథలు, నవలలు, వ్యాసాలు కేవలం నెలకు పది రూపాయల జీతానికి తీసుకురావటం నాకు సాధ్యం కాదు. మీరిచ్చే డబ్బు పెంచండి లేకపోతే కథలు, నవలలు, వ్యాసాలు రాయడమన్నా మానేయండి" అన్నాడు ఆ కుర్ర పోస్ట్‌మాన్.

అప్పటికే రోజూ తను రాసేవాటికి అయ్యే తెల్ల కాగితాలకు, రీఫిల్స్, స్టాంపులు, కవర్లకు ఖర్చులు పెరిగిపోయి డబ్బుకు యిబ్బంది పడుతున్నాడు ప్రదీప్. ఆ పరిస్థితిలో పోస్ట్‌మాన్ జీతం పెంచడానికి అతని మనస్సు అంగీకరించ లేదు. అంతేగాక ప్రదీప్‌కు ఎప్పటున్నంచో ఓ తీరని చిరు కోరిక ఉండిపోయింది. అది తన కథలు పత్రికవాళ్ళు కాకుండా మరెవరయినా చదివి వాటిని బాగుందని మెచ్చుకోవటం. తనింట్లో ఎవర్ని కథలు చదవమని అడిగినా ఏదో వంకన తప్పించుకోవటం మామూలుగా జరిగేదే.

అందుకేదో బాగా ఆలోచించి "చూడు బాబు నువ్వు నా కథలు, నవలలు గట్రా రోజు మా యింటికి తేనక్కర్లేదు. వారానికి ఓ రోజు నీకు వేరే పోస్టు తక్కువగా ఉన్ననాడు అన్నీ కలిపి బ్యాగులో వేసుకొని తీసుకురా. ఈ లోపుగా వీలు అయితే సాయంత్రం పూట నా కథలు ఓసారి చదివి అవి ఎందుకు తిరిగొచ్చాయో, ఎలా రాస్తే తిరిగొచ్చి ఉండేవి కాదో చెప్పు. అందువల్ల నీకు నాలెడ్జి పెరుగుతుంది, నాకు మంచి పాఠకుడు స్నేహితుడు అయినట్లుంటుంది. నీ శ్రమ ఉంచుకోనులే. నా నవలలేవయినా అచ్చయితే చివర్లో నీకు కృతజ్ఞతలు వేయిస్తాను" అంటూ చెప్పేది మెల్లగా బుజ్జగింపుగా చెప్పి చివరి వాక్యాన్ని బాణంలా సంధించాడు ఆ కుర్ర పోస్ట్‌మాన్‌పైకి.

'తనని అంతవరకు కథలు చదివి అభిప్రాయం చెప్పమని అడిగిన వ్యక్తే లేడు. అటువంటిది అంత పెద్దమనిషి తనని కథలు చదివి తన అభిప్రాయం చెప్పమనటం నిజంగా తనకెంతో గౌరవం. సత్కారం చేసినట్లు' అని మనస్సులో అనుకొని ప్రదీప్ చెప్పిన దానికి సంతోషంగా ఒప్పుకొన్నాడు ఆ కుర్రాడు.

ఉన్నట్టుండి పోస్ట్‌మాన్ రావటం ఆగిపోవడంతో కాలనీవాసులంతా అయోమయంలో పడ్డారు. ఏం జరిగిందో తెలీక ఆ మాటకొస్తే వారంరోజుల యినా పోస్ట్‌వాడు రాకపోవటంతో ప్రదీప్‌కు కూడ రకరకాల భ్రమలు,

భ్రాంతులు కల్గాయి, ఓవేళ తన కథలన్నీ ఆకస్మాత్తుగా ప్రచురణకు స్వీకరించ బడ్డాయేమోనని. ఆ రోజు భుజాన ఓ పెద్ద చాకలిమూటలాంటిదేసుకొని కాశమ్మ హౌసింగ్ బోర్డు కాలనీలోకి అడుగు పెట్టగానే ఓ పాతికేళ్ళ యువకుడు ఎదురుగా వస్తూ కన్పించాడు ఆమెకు. "చూడన్నా, యిక్కడ ప్రదీప్ అనే వెధవ రాస్కెల్ ఎక్కడుంటాడు" అని అడిగింది కాశమ్మ అతన్ని.

"యిక్కడ్నించి చాలా దూరం వెళ్ళాలి. అవును నీ భుజాన ఉన్నది పోస్ట్ బ్యాగ్‌లాగా ఉంది. ఈ మధ్య మాకు పోస్ట్‌మాన్ రావటం లేదు. ఆ కుర్రాడు మానేసి నీకు అప్పచెప్పాడా ఏమిటి కథ" అడిగాడతను.

"కాదు దొరా. ఆ సచ్చినాడెవడో ప్రదీపట. కథలు, కాకరకాయలు రాస్తాడట. ఆటిని మా ఆయన చదివి అభిప్రాయం చెబితే అచ్చయినాక మా ఆయన పేరేస్తానన్నాడట వాటిమీద. దాంతో మా ఆయన ఆడి కథలన్నీ విరగచదివి మతి పోగొట్టుకున్నాడు. ఆడి సేతులు కాల. ఆడి ముఖం మండ, ఆడికి పోయ్యేకాలం రాను. ఆడి కథలన్ని భూతాలు పిశిచాలపైననేనట. బంగారం లాంటి నా మొగుడు మతి సెడకొట్టాడు. ఉండు వాడింటికి పోయి వాడి సంగతి చూసి, ఈటిని ఆడి ముఖాన కొట్టి మరీ వస్తా" అంది కాశమ్మ.

"అయ్యో పాపం! అలాగా, నువ్వా పోస్ట్‌మాన్ భార్యవా? ఎంత అన్యాయం జరిగింది? పాపం! కష్టాల్లో ఉన్నట్టున్నావు, బ్యాగ్ నాకిచ్చేయి, నేనిస్తా ప్రదీప్‌కు. ఆయన నాకు స్నేహితుడే. నువ్వేసే చివాట్లేవో నేనే వేస్తాను. ఈ పది తీసుకెళ్ళి మీ ఆయనకు పండ్లు కొనిపెట్టు, నువ్వెళ్ళు ఎండన బడివచ్చినట్లున్నావు."

"సర్లే దొర. ఆడి సంగతి యిప్పుడు కాకపోతే రేపయినా తేల్చుతాను. ఈ కథలు ఆడిముఖాన కొట్టు" అంటూ బ్యాగు అందించింది కాశమ్మ పదినోటు తీసుకొని. ఆవిడ వెనక్కి మళ్ళగానే "హమ్మయ్య పెద్ద గండం తప్పింది. పుసుక్కున 'నేనే ప్రదీప్‌ను' అని చెప్పాను కాదు. చెప్పుచ్చుకు కొట్టేది. అయినా స్టాంపులం టించిన కవర్లు యికపై పెట్టను గాక పెట్టను" అనుకొంటూ యింటిముఖం పట్టాడు ప్రదీప్.

–మయూరి సచిత్ర వారపత్రిక, 4 మార్చి, 1988

❀

గుణపాఠం

కలెక్టర్‌గా మొదటిసారి ఆఫీసులోకి అడుగు పెట్టింది కుమారి అరుణ.

ఆమె తండ్రి, తాతలు దేశం కోసం పడ్డ కష్టాల్ను ఆదర్శంగా తీసికొని తానూ దేశసేవ చేయాలన్న తాపత్రయంతో, ప్రజలకు న్యాయం చేసే అవకాశం కల్గిందన్న సంతోషంతో ఐ.ఎ.ఎస్. ప్రొబేషన్‌ను పూర్తిచేసి కలెక్టరుగా తొలిసారి ఆఫీసులోకి అడుగు పెట్టింది.

అంతకుముందు ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు ఎందరో పనిచేసి పోయిన ఆఫీస యినా దాని స్థాయి చూస్తే కడుపు త్రిప్పింది అరుణకు.

వేల ఖర్చుతో ప్రభుత్వ ట్రైనింగ్ పూర్తి చేసుకొని చిత్తశుద్ధితో వచ్చే ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు రాజకీయకుట్రల కలహాల్లో, అవినీతి ఆకర్షణల్లో దిగబడి ఎటువంటి స్థాయికి దిగజారుతున్నారో ఆ ఆఫీసు స్థితి చెప్పకనే చెప్తుంది.

వెంటనే త్రాగి పారేసిన బ్రాందీ, విస్కీ సీసాలు, సిగరెట్ పీకలు వేసే యాష్ ట్రేలు తీయించేసింది. ఆఫీసు గదిలో సోఫాల్ను, ఆడంబర చిహ్నాల్ను స్టోరు రూముకు పంపించేసింది. ఆఫీసు హాలు మొత్తం శుభ్రం చేయించింది. దేశనాయకుల పటాలపై ఎండిపోయి వ్రేలాడుతున్న క్రితం సంవత్సరం వేసిన పూలమాలల్ను తీయించేసి వాటిని శుభ్రంగా తుడిపించి గోడలకు వేలాడ దీయించింది.

ఎవరు ఎంతటి వారైనా హోదాలతో నిమిత్తం లేకుండా పర్మిషను తీసుకొని లోపలికి రావాలని, పవిత్రమైన తన ఆఫీసు గదిలో సిగరెట్ త్రాగకూడదని ఆదేశించింది.

రోజూ రెండు గంటలు ప్రజల నుంచి నేరుగా విజ్ఞప్తులు అందుకుంటూ, వాటికి సంబంధించిన వివరాలు ఓ నోట్ బుక్‌లో వ్రాసుకొంటూ వయస్సులో చిన్నదైనా ఎంతో పరిణతి చెందిన ఆఫీసర్‌గా మాతృప్రేమ, సహనంతో వ్యవహరిస్తూ ప్రజల్లో మంచి విశ్వాసం సంపాదించసాగింది.

ఎమ్మెల్యేలు, ఎంపీలు వచ్చినా ఎంతో సాదరంగా, వినయంగా మాట్లాడి వారికి చట్టపరమైన సమస్యలు వివరించి ప్రజా సమస్యల్ను పరిష్కరించడంలో వారికి సంతృప్తి కల్గేలా మాట్లాడి పంపేది.

ప్రతి మంచిపనికి కొంత వ్యతిరేకత వుంటూనే వుంటుంది మూర్ఖులున్న సమాజంలో. ఆమె తీరు కొంతమందిలో అసహనాన్ని రేపింది. కలెక్టరు ఆఫీసు సొంత ఇంటిలా వాడుకోవడానికి అలవాటుపడిన కొంతమంది రాజకీయ నాయకులకు, గూండాలకు అరుణ పద్ధతికి విరుగుడు చూడాలనిపించింది. అందుకు 'తాను' సిద్ధం అంటూ ముందుకు వచ్చాడు అధికార పార్టీ కార్యకర్త వెంకోబరావు.

ఓ రోజు హఠాత్తుగా అరుణ ఆఫీసు గదిలోకి బలవంతంగా ప్రవేశించి, సిగరెట్ కాలుస్తూ, కిళ్ళీ నములుతూ, పోజుగా కాలర్ ఎగరేస్తూ తను ఆక్రమించుకున్న భూమికి శాశ్వత పట్టా ఇమ్మని గొడవ చేయసాగాడు.

అరుణ ఓర్పు నశించేదాకా మంచిగా చెప్పి చూసింది అతనికి. కాని వెంకోబరావు ఆమెను లక్ష్యపెట్టలేదు. అందుకు ఆడదేమి చేయగలదన్న చులకన భావం, అతని వెనుకనున్న రాజకీయమద్దతు ఆజ్యం పోశాయి. ఆమెను నానా దుర్భాషలాడాడు. చివరికి అరుణ జవానుల సాయంతో వెంకోబరావును బయటికి బలవంతంగా పంపక తప్పలేదు.

తర్వాత కొద్దిరోజులకే మంత్రిగారి నుంచి అరుణకు అతని పర్యటన గురించిన కబురు అందింది.

కలెక్టరు అరుణ మంత్రివర్యులను సగౌరవంగా ఆదరించి తన ఆఫీసులోకి తీసుకెళ్ళింది. మంత్రివర్యులు ఆమె చెప్పేది విలాసంగా వింటూనే జేబులోంచి సిగరెట్టు ప్యాకెట్ తీసి ఒకటి అంటించి రింగులు రింగులుగా పొగను ఆమె మీదికి వదలసాగాడు. ప్రజా నాయకుడైన మంత్రే అలా ప్రవర్తించడానికి

నిర్ణయించుకొంటే అతని క్రింది అధికారిణిగా తనేమి చేయగలదు. తన ఆదర్శాలను మంత్రి పుంగవులు నలిపి నల్లేరు చేస్తున్నా సహిస్తూ మంత్రిగారికి అన్ని వివరాలు వివరించింది. మధ్యలో అరుణ తన పి.ఎ.ను పిల్చి ఏదో చెప్పడం మంత్రిగారు తన ఆనందంలో గమనించనేలేదు. ఆమె అహం దెబ్బ తీశానన్న తమకంలో తేలిపోసాగాడు మంత్రివర్యులు.

బాధ్యత గల ఆఫీసర్ల పట్ల ఎంత హుందాగా ప్రవర్తించాలో తెలీని మిడిసిపాటుతో మంత్రుల జాబితాలో తాను దిగజారిపోతున్న సంగతి అసలే మర్చిపోయాడాయన.

కొద్దిసేపు అలా గడిపి మంత్రిగారు లేచాడు సీట్లోంచి. ఆయన వెనుకే కలెక్టరు అరుణ కూడా కదిలింది. ఇద్దరూ మెట్లు దిగి కారు వద్దకు వచ్చారు.

మంత్రిగారు అరుణవైపు ఓసారి గర్వంగా చూసి, కారు తలుపు తెరిచి "వెంకోబరావూ ఇక బయటికి రావయ్యా!" అని పిల్చాడు చిరునవ్వులొలికిస్తూ.

"ఇంకెక్కడి వెంకోబరావు? వారం క్రితం నా ఆఫీసుగదిలోకి బలవంతంగా ప్రవేశించి, నా ఆజ్ఞలను ధిక్కరిస్తూ, సిగరెట్ త్రాగటమే గాక, నానా మాటలతో న్యూసెన్సు సృష్టించాడన్న కారణంగా, మేజిస్ట్రేటుగా నా అధికారాన్ని ఉపయోగించి మీ కారులో కూర్చుని వున్న అతన్ని నేను ఇంతకుముందే అరెస్ట్ చేయించాను. పాపం, నన్ను దెబ్బతీయాలని, మీ గూండా వెంకోబరావును సంతోష పర్చాలని మీరు వేసిన పథకం పారినట్లు లేదు. నైతికంగా పతనమైన నికృష్ట రాజనీతి మీది. కాదు బేతాళనీతి మీది. కాని నాది దాన్ని మించిన ప్రజా శ్రేయస్సు కోరే బాధ్యత కల అరుణ స్ఫూర్తి. మైండ్ ఇట్" అంటూ గిర్రున వెనక్కి తిరిగింది అరుణ.

దిమ్మెరపోయిన మంత్రివర్యులు చేతిలోని సిగరెట్టు చుర్రుమని కాలటంతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు, చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనై.

–వనితాజ్యోతి సచిత్ర మాసపత్రిక, నవంబర్, 1988

❀

ప్రేమలేఖ

రామానికి ప్రేమించి పెళ్ళి చేసుకోవాలన్న సరదా కాలేజీలో చదువుతుండగానే కలిగింది.

తన స్నేహితులు ఈశ్వర్‌రెడ్డి, నగేష్‌లను ఎప్పుడూ అమ్మాయిల్ని ప్రేమించటం గురించి వివరాలు అడుగుతుండేవాడు.

నగేష్, ఈశ్వర్‌రెడ్డిలు రామంలా 'ప్రేమ' గురించి 'ప్రేమించటం' గురించి వివరాలు కనుక్కునే స్థాయి దాటిపోయి చాలా కాలమైంది.

నిజానికి రామం, నగేష్, ఈశ్వర్‌రెడ్డిలు ముగ్గురు వాళ్ళ కాలేజీ అందగాళ్ళ సంఘంలో సభ్యులే.

కాని ఈశ్వర్, నగేష్‌లతో అమ్మాయిలు స్నేహం చేస్తూ, గలగల నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెప్తుంటే రామానికి అరికాలి మంట నెత్తికెక్కేది. గుండె పిండేసినట్లయ్యేది. కానీ ఏమి చేయాలో తోచక, నిస్సహాయంగా ఉండిపోయేవాడు.

అంతమాత్రాన నిరుత్సాహపడలేదు. ఈశ్వర్, నగేష్‌లు ఎలా అమ్మాయిల్ని వలలో వేసుకుంటున్నారో జాగ్రత్తగా పరీక్షించి, పరిశోధించి తనూ అలాగే చేయాలని ఉద్యుక్తుడయ్యాడు. మరి నేటి కాలేజీలు ఈ వెర్రివేషాలకు, వెకిలి వేషాలకు ఆటపట్లు కదా!

ఈశ్వర్, నగేష్‌లు అప్పుడప్పుడు క్లాసులో నోటు పుస్తకం అడ్డుపెట్టుకొని ఏవో ప్రేమలేఖ లాంటివి రాసి అమ్మాయిలపై రాకెట్లలా విసరటం, అమ్మాయిలు ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ వాటిని అందుకొని చదవటం తన

పరిశోధనలో మొట్టమొదటిసారిగా గ్రహించాడు.

వెంటనే తను ప్రేమిస్తున్న ఊర్మిళకు మొదటిసారిగా గాఢంగా, ఘాటు ఘాటుగా తన ప్రేమను వ్యక్తపరుస్తూ ఉత్తరం రాశాడు.

ఆ విషయం ఈశ్వర్, నగేష్‌వాళ్ళకు చెప్పదల్చుకోలేదు రామం. ఎందుకంటే తన ప్రేమలేఖకు జవాబు రాగానే తన ఘనవిజయం గురించి వాళ్ళకు మీసం మెలివేసి గర్వంగా చెప్పాలని అతని ఆలోచన.

రెండురోజులయింది. ఊర్మిళ నుంచి జవాబు కోసం ఉవ్విళ్ళూరుతూ ఎదురుచూస్తున్నాడు రామం. కాని, మూడురోజులకు కూడా ఊర్మిళ నుంచి జవాబు రాలేదు. ఆ రోజు సాయంత్రం తనే నేరుగా ఊర్మిళను కలిసి, ఆమె సమాధానం అందుకోవాలని అందరూ వెళ్ళిపోయేదాకా కాలేజీలో గర్ల్స్ రూమ్ దగ్గర్నే కాపేశాడు.

ఈశ్వర్, నగేష్‌లు తమతో 'సిన్మాకు వస్తావా?' అని కూడా అడిగారు. కాని రామం ఊర్మిళను కలుసుకొనే మోజులో "రాను, పనుంది. నేనుంటాను. మీరెళ్ళండి" అని చెప్పి పంపించేసి, హమ్మయ్య అని ఊపిరి పీల్చుకొన్నాడు.

కాసేపయిన తరువాత ఇద్దరు ఆజానుబాహుల్లాంటి వ్యక్తులొచ్చి, రామాన్ని ఎడాపెడా వాయించి ఒళ్ళు నుగ్గుచేసి– "మా చెల్లెలు ఊర్మిళకు ప్రేమలేఖ రాస్తావుట్రా. మళ్ళోసారి ఇలాంటి పిచ్చిపని చేశావంటే చంపి, ఊరవతల చాకి చెరువులో వేస్తాం జాగ్రత్త!" అని బెదిరించి వెళ్ళిపోయారు.

ప్రాణం పిడికిట్లో పెట్టుకొని కిందనుంచి లేచిన రామానికి ఊర్మిళ తన అన్నలతో కలిసి వెళ్ళడం కనిపించి ఈశ్వర్, నగేష్‌లున్నా బాగుండేది, తనని రక్షించి ఉండేవాళ్ళు అని వగరుస్తూ ఇంటిముఖం పట్టాడు రామం.

ఆ తరువాత కొన్నిరోజులకు ఝాన్సీ నుంచి ప్రేమలేఖ వచ్చింది రామానికి. రామం ఆ ఉత్తరం చూసి ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. తనను తొలిసారిగా ప్రేమించిన అమ్మాయి ఝాన్సీవంటి అందగత్తె అవటమే గాక, ఆమె కోసం ఎంతోమంది పడుతున్న పాట్లు గుర్తుకొచ్చేసరికి ఒక్కసారిగా గర్వం, సిగ్గు ముంచుకొచ్చేశాయి రామానికి.

ఝాన్సీ రాసినట్లు 'విజయ థియేటరు' గేటు దగ్గర ఆమె కోసం టిక్కెట్టు

కొని ఎదురుచూడటం ప్రారంభించాడు. అతని మనస్సు– లోపల కలిగే ఆలోచనలకు– దూదిపింజలా తేలిపోతోంది. చీకటి పడింది. 'అవును, వెల్తురుండగా ఆ అమ్మాయి రావడం ఎవరైనా చూస్తే అమ్మో! ఇంకేమన్నా ఉందీ?'– గుండెపై ఓసారి చెయ్యి వేసుకొని 'తెలివైన పిల్లే' అని లోలోన ఆమె తెలివికి ఎంతో సంతోషించాడు. చీకటి పడ్డా ఇంకా ఆమె రాలేదు. 'ఏమై ఉంటుందబ్బా?' అని ఆలోచించి, ఆలోచించి బుర్ర వేడెక్కించుకోసాగాడు. చివరికి బహుశా ఏదైనా అనుకోని అవాంతరం వచ్చి ఆమె రాలేకపోయి ఉంటుందనుకొని సినిమా టైము అయిపోయాక టిక్కెట్లు చించేసి ఇంటి త్రోవ పట్టాడు రామం.

ఝాన్సీ రాసిన ప్రేమలేఖ ఈశ్వర్, నగేష్‌లకు రేపు చూపించి, తనకింతకు ముందు జరిగిన అవమానానికి బదులుగా వాళ్ళనుంచి ఓదార్పు పొంద వచ్చునని అనుకొంటూ నడుస్తున్నాడు రామం.

కానీ రామాన్ని ఏడిపించేందుకు ఈశ్వర్, నగేష్‌లే ఆ ప్రేమలేఖ రాసి, రామం సినిమాహాలు దగ్గర పిచ్చిమొహం వేసుకొని ఎదురుచూస్తుంటే, దూరం నుంచి చూస్తూ మనసారా నవ్వుకొన్న సంగతి 'ప్రేమ'మోజులో ఉన్న రామానికి తెలిసే అవకాశం లేదు. ప్చ్!

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28 జూన్, 1989

❀

అభిమానులు

ప్రతాప్, శర్మ కలిసి సత్యప్రసాద్ పెళ్ళికి ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు వెళ్ళాలని అంతకు ముందునాడే నిర్ణయించుకొన్నారు. వాళ్ళ ముగ్గురి స్నేహబంధం ఆకు, మొగ్గ, పిందె మధ్యనున్న అనుబంధం లాంటిది. అందుచేత ఓ మంచి గిఫ్ట్ కొనుక్కొని మరీ వెళ్ళాలనుకొన్నారు.

ప్రతాప్ మెడికల్ రిప్రెజెంటెటివ్‌గా అంబుజా కంపెనీలో పని చేస్తున్నాడు. శర్మ బలాల్ ట్రావెల్స్ ఎమ్.డి.కి పి.ఏ. నిజానికి శర్మకన్నా ప్రతాప్‌కే సావకాశం ఎక్కువైనా, నడుము పట్టుకొని తోస్తేగాని అడుగు ముందుకు వేయడు ప్రతాప్.

ముందు అనుకొన్నట్టుగా అబిడ్స్‌లోని గుజరాతీ మందిర్‌లో తన స్నేహితుడి పెళ్ళికని బాస్ దగ్గర పర్మిషను తీసుకొని చిక్కడపల్లిలో ప్రతాప్ రూముకొచ్చాడు శర్మ, అఘమేఘాల మీద రొప్పుతూ రోస్తూ మధ్యాహ్నం ఒంటిగంటకు మండే ఎండలో. శర్మ వచ్చేటప్పటికి ప్రతాప్ టి.వి. చూస్తున్నాడు. ఆ రోజు షార్జాలో ఛాంపియన్స్ ట్రోఫీ వన్‌డే ఇంటర్నేషనల్ జరుగుతోంది.

తనొచ్చేటప్పటికి రెడీగా ఉంటాడని ఊహించిన శర్మకు ప్రతాప్ గెటప్ చూసి స్పృహ తప్పినంత పనైంది. చింపి నెత్తితో, భుజాన కండువాతో, నడుము చుట్టూ అడ్డబట్టతో చాపమీద కూర్చుని గోడనానుకొని టి.వి. చూస్తున్నాడు ప్రతాప్ సిగరెట్ పొగ రింగులు రింగులుగా వదుల్తూ. "ఇదేమి అవతారం? సత్యప్రసాద్ పెళ్ళికి రావటంలేదా?" అడిగాడు శర్మ ఎంతో నిరాశగా.

"వస్తాను. ఒక్కక్షణం ఉండు" అంటూ ముఖం మళ్ళీ టి.వి.వైపు పెట్టేశాడు సీరియస్‌గా. లోపలికి వచ్చి కుర్చీలో చేరగిలబడ్డాడు శర్మ.

ఇంతలో మ్యాచ్‌కు హఠాత్తుగా లంచ్ బ్రేకు రావడంతో ప్రతాప్ "అరెరే. మ్యాచ్ మంచి పట్టులో ఉండగా బ్రేకు ఇచ్చారే" అని మెల్లగా పైకంటూ శర్మ వైపు తిరిగి "శర్మా! ముందు నువ్వెళ్ళు, మంచి గిఫ్టు కొనుక్కురా. ఈ లోపల కొంత మ్యాచ్ కూడా చూసినట్లుంటుంది" అన్నాడు.

ప్రతాప్ ప్రవర్తనకు ఆశ్చర్యపోయాడు శర్మ. అతనికి అర్థం కానిదల్లా ప్రతాప్‌కు ఇంత క్రికెట్ పాండిత్యం ఎలా అబ్బిందబ్బా అన్నదొకటే!

"ఇంతకీ బ్యాటింగ్ ఎవరు?" అడిగాడు శర్మ. "ఇండియా వర్సెస్ వెస్టిండీస్. అబ్బ! నువ్వు చూడలేదు గురూ! చంద్రకాంత్ పండిత్, బిన్నీ ఎంత బాగా బ్యాట్ చేశారనుకొన్నావు?" అన్నాడు ప్రతాప్.

"అలాగా, ఎన్ని ఓవర్లు అయినాయి? స్కోరెంత?"

"నలభై అయిదు అయినాయి. ఆట ఆలస్యంగా మొదలుపెట్టారుటలే. స్కోరు వన్‌నైంటీ సెవెన్ ఫర్ ఫైవ్."

"అయితే ఆ అయిదు ఓవర్లయ్యి, వాళ్ళు బ్యాటింగ్ స్టార్ట్ చేసేదాకా ఈ అవతారం మార్చవా?" అడిగాడు శర్మ. "అంతేగా మరి?" అన్నాడు ప్రతాప్ అదోలాంటి పోజిచ్చి. "మరి నే వెళ్తాను. నువ్వెప్పుడు వీలైతే అప్పుడు వేషం మార్చుకొని బయలుదేరు" అని లేచాడు శర్మ. శర్మకు ప్రతాప్ ప్రవర్తన చూస్తుంటే ఒళ్ళంతా కారం పులుముకొన్నట్లయింది. "శర్మా! ఆగు, కూర్చో. ఓ గంటలో ఎవరు గెల్చేది తేలిపోతుంది. ఇప్పుడు ఒంటిగంటే కదా" అన్నాడు ప్రతాప్.

"సారీ గురూ! క్రికెట్ గురించి తెలిసినవాళ్ళు, క్రికెట్ ఆడేవాళ్ళు టి.వి.ని ఇలా కళ్ళకు కట్టుకొని చూడటంలో అర్థముంది. ఆఖరికి ఆడుతున్నవాళ్ళెవరో కూడా తెలీని నీలాంటివాళ్ళు షోకుగా, ఫ్యాషనుగా క్రికెట్‌ను టి.వి.లో చూడటం నాకు కడుపులో తిప్పినట్లుంది. ఇంతకీ మ్యాచ్ ఇండియా వర్సెస్ వెస్ట్ ఇండీస్ కాదు, వెస్ట్ ఇండీస్ వర్సెస్ పాకిస్తాన్. మధ్యలో నీకు చంద్రకాంత్ పండిత్, బిన్నీ ఎక్కడ కనపడ్డారు? టి.వి. వాళ్ళకు ఫోను చేసి అడగాలి" అన్నాడు శర్మ బయటికి నడుస్తూ. బిత్తరపోయి శర్మవైపు అలా చూస్తుండిపోయాడు ప్రతాప్.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 31 మే, 1989

❀

బ్రోకర్

నేను, సరోజ కల్సి ఈ సంవత్సరం ఎమ్.ఎస్సీ.లో బోటనీ చేద్దామను కోవడం ఓ ఊహించని దుర్ముహూర్తంలో జరిగిపోయింది ఈసారి కూడా.

ఇద్దరం బి.ఎస్సీ. బోటనీలో ఫస్ట్ క్లాసులో పాసయ్యాం కూడా. అయితే ఎగ్రికల్చర్ బి.యస్సీ. చదివినవారు మాకు ప్రతి రంగంలో పోటీ రావటంతో మాకు మా అర్హతకు తగ్గ ఉద్యోగం లభించలేదు. అదీగాక పై చదువులు చదివేందుకు మాకు అప్పట్లో తగిన ఆర్థిక స్తోమత కూడా లేదు. పైపెచ్చు "ఆడవాళ్ళకు పెద్దచదువులు ఎందుకు?" అన్న ఓ సుదీర్ఘ చర్చ కూడా ప్రారంభ మైంది మా ఇళ్ళలో. దాంతో అప్పట్లో ఆ ప్రయత్నం విరమించుకొన్నాం.

ఇంతలో "ఉద్యోగం వున్న ఆడపిల్లల్నే పెళ్ళి చేసుకొంటాం" అనే కాలం– మనం రాకెట్ యుగంలోకి అడుగు పెట్టినంత వేగంగా వచ్చేయడం, మగపిల్లలు మీసాలు మెలివేస్తూ, వాళ్ళ తల్లిదండ్రులు రొమ్ములు విరుచుకొంటూ రోడ్లమీద పడటం కూడా జరిగిపోయింది.

ఈ ఊహించని కాలగమనానికి, పరిణామానికి మా ఇంట్లో పెద్దల ప్రాణం దిమ్మెర పోయినా, సంప్రదాయ శ్లేష్మంలోంచి బయటికి రాలేక గిలగిలా మా వాళ్ళు కొట్టుకొంటున్నా, మా మేనమామ, మేనత్తల పుణ్యమా అంటూ మేము పల్లెటూర్నుంచి అమాంతంగా వచ్చి రాష్ట్ర రాజధాని హైద్రాబాదు మహానగరంలో పడ్డాం ఉద్యోగాల వేటలో.

వచ్చీరాక ముందే అడ్డమైన ప్రతి కంపెనీలోని ప్రతి ఉద్యోగానికి దరఖాస్తులు శరపరంపరగా వదలసాగాం. కొన్నింటికి "మార్నింగ్ అప్లై,

ఈవినింగ్ రిప్లై అయితే, కొన్నింటికి "అప్లై - అప్లై- నో - రిప్లై" అయింది.

ఎట్లాగైతేనేం చివరకు నేను ఐడిపిఎల్ అనే ఓ పెద్దసంస్థలోను, నా స్నేహితురాలు సరోజ ఇక్రిసాట్‌లోను ఉద్యోగాలలో చేరాం. కాకపోతే కొంత మా ఆశయాలు, ఆశలు, తారుమారైన మాట వాస్తవం.

ఎందుకంటే నే చదివింది మొక్కల గురించి కాని పని చేయాల్సింది జంతువులు, మందుల పైన. అంటే సైంటిఫిక్ పోస్టన్న మాట. ఇక సరోజ ఇక్రిసాట్‌లో చేయాల్సింది డబ్బా వాయించడం. అంటే టైపింగ్ పోస్టన్న మాట.

"ఆహా! ఈ పుణ్యభూమిలో పుట్టడం మన తప్పా?" అని ఓ మహాకవి గారన్నట్టు, రోజూ ప్రశ్నించుకొంటూనే ఉద్యోగం ఏడ్చే మమ్మల్ని ఆ నాల్గు జీతంరాళ్ళ కోసం కక్కుర్తిపడే ఇద్దరు మగరాయుళ్ళు పెళ్ళి కూడా చేసుకున్నారు.

ఈ స్థితిలో మా ఆశయాలకు, ఆకాంక్షలకు తిలోదకాలు ఇచ్చేద్దామనుకొం టుండగా హఠాత్తుగా అన్నామలై విశ్వవిద్యాలయంవారు ఎమ్.ఎస్సీ. ప్రైవేటుగా చదవడానికి ఓ కరస్పాండెన్సు కోర్సు ప్రారంభించారు.

ఒక్క క్షణం వెలుగంతరించిన మా కళ్ళలో మళ్ళీ నీలిమెరుపులు! ఆనందాతి రేఖలు! ఏదో సాధించాలన్న సంకల్పం- ఇంత కాలానికి, ఇన్నేళ్ళకు అది నెరవేరబోతున్నందుకు! లేకపోతే ఏమిటి? ఈ సువిశాల భారతంలో ఈ దివ్యమైన ఆలోచన ఎన్నేళ్ళకు వచ్చింది, ఓ యూనివర్సిటీకైనా. ఇది వ్యవసాయ దేశమైనా ఎమ్.ఎ., ఎమ్.కాం. వాళ్ళకు ఎన్నిరకాల వసతులు!

వెంటనే సదరు మొగుడనే పారసైటును పర్మిషను అడిగి, మా జీతం డబ్బుల్తోనే ఎమ్.ఎస్సీ. చదువుకొంటామని చెప్పి ఇద్దరం అప్లై చేశాం.

అది మా జీవితకాలపు కోరిక. ఏనాటికైనా ఎమ్.ఎస్సీ. చేసి, మాకిష్టమైన రంగాల్లో పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకోవాలని ఏదో తపన, ఆర్తి. కాని అర్థం చేసికొనేదెవరు?

అది నిజమైతే ఎంత బాగుంటుంది! అమ్మో! ఓ వేళ సీటు రాకపోతే! ఇంట్లో వెక్కిరింతలు. బయట ఇకఇకలు పకపకలు. ఎలా? ఏం చేయాలి?

ఈ సంకట స్థితిలో మాకు ఓ సోదరి ఓ చిన్న ఉచిత సలహా పారేసింది ఓసారి బస్సులో వస్తుంటే.

ఆవిడగారు అదే యూనివర్సిటీలో బి.ఇడి. కరెస్పాండెన్సు కోర్సు చేస్తు న్నారు. ఆవిడకు సీటు ఓ బ్రోకరు ద్వారా వచ్చిందిట. ఓ మూడు వేలు బ్రోకరుకు సమర్పించుకుంటే మాక్కూడా సీటు వస్తుందని ఆవిడ సలహా పారేసి చటుక్కున బస్సు దిగి మాయమైపోయింది.

మాకు పోయిన ప్రాణం, పోతున్న ప్రాణం, పోబోతున్న ప్రాణం– ఒకేసారి లేచి వచ్చింది.

ఇద్దరం వికసిత వదనాలతో, చిరుదరహాసంతో ఏదో గొప్ప నిధి రహస్యం తెల్సినవాళ్ళలా మనస్సులో గర్విస్తూ ఇళ్ళకు చేరాం.

తర్వాత రెండురోజులకే ఇద్దరం వెళ్ళి ఆ బ్రోకరుగార్ని కలిశాం. సగం డబ్బు ముందు, మిగతా సగం డబ్బు తర్వాత ఇచ్చే ఒప్పందం మీద సంతకాలు చేసి, సగం డబ్బు ఇచ్చి – ఇహ సీటు ఖాయం అని అనుకొని ఇంటికొచ్చాం.

రెండు నెలలు గడిచింది. ఓ రోజు హఠాత్తుగా నాకు ఎమ్.ఎస్సీ.లో సీటు వచ్చినట్టు ఆ యూనివర్సిటీ నుంచి ఉత్తరం వచ్చింది.

ఇక మా వారు తెగ సంబరపడిపోయారు. నేనైతే మరీను. వెంటనే సరోజవాళ్ళింటికి వెళ్ళాను. నాకు సీటు వచ్చిన సంగతి తెల్సి సంతోషించినా, తనకు సీటు రాలేదన్న బాధ ముఖంలో కొట్టొచ్చినట్టు కన్పించింది. ఆ రోజు సాయంత్రమే బ్రోకరు దగ్గరికి వెళ్ళి అసలు విషయం చెప్పాం. కొద్దిరోజుల్లో సెకండ్ లిస్టులో సరోజక్కూడా వస్తుందని చెప్పాడా బ్రోకరు.

కాలం గిర్రున తిరుగుతోంది. నాకు పుస్తకాలు, సిలబస్ అన్నీ రావడం కూడా మొదలైంది. కాని సరోజకు మాత్రం సీటు రాలేదు. ఈలోగా నేను బ్రోకరుకు మిగతా సగం కట్టలేదు. నాకెందుకో అనుమానం కల్గింది. చివరకు ఓ రోజు బ్రోకరు సరోజ డబ్బులో ఓ అయిదు వందలు మినహాయించుకొని మిగతాది తిరిగిచ్చేశాడు. అప్పుడు నా అనుమానం బలపడింది. అంటే అసలు బ్రోకరు మాకెవ్వరికీ సీటు ఇప్పించగలవాడు కాదన్నమాట. మాకు వస్తే అతని ఘనత. రాకపోతే కొంత డబ్బు తీసుకొని మిగతాది వాపసు అన్నమాట. ఈ మోసం నాకెందుకో చాలా బాధ కల్గించింది. నాలా ఎంతమంది ఇలా మోస పోతున్నారో! మోసపోతారో! తల్చుకొంటే భయం వేసింది.

వెంటనే నేను, సరోజ ఈ విషయం చర్చించుకొని, జరిగిన మోసం బయటపెట్టాలన్న ఉద్దేశంతో దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి కంప్లైంట్ ఇచ్చాం.

అక్కడ కూర్చున్న సబ్ ఇన్‌స్పెక్టర్ మాతో ఎంతో మర్యాదగా మాట్లాడి కంప్లైంట్ రాసుకొన్నాడు.

"దయచేసి మా డబ్బు మాకు ఇప్పించండి" అన్నాం ఇద్దరం ప్రాధేయ పూర్వకంగా.

"ష్యూర్" అన్నాడు ఎస్.ఐ. చిరుదరహాసంతో.

మేము సంతోషంగా ఇళ్ళకు వచ్చేశాం. వస్తూ వస్తూ "పాపం ఎస్.ఐ. చాలా మంచివాడే. లేకపోతే చదువుకున్నవాళ్ళు బ్రోకర్ దగ్గరికి ఎలా వెళ్ళారు? అని ఎదురు సుత్తి వేస్తాడేమోనని భయపడ్డాను" అన్నాను నేను సరోజతో.

ఇక్కడే మేము తప్పటడుగు వేసిన సంగతి తర్వాత తెల్సింది మాకు.

వారం తర్వాత ఎస్.ఐ. మా ఇంటికి కానిస్టేబుల్‌తో కబురు చేశాడు. అదృష్టవశాత్తూ మా వారు లేరు. ఎందుకంటే ఈ నిర్వాకం గురించి మావారికి చెప్పలేదు కూడా.

వెంటనే నేను పోలీసుస్టేషన్‌కు వెళ్ళాను. "ఏంటమ్మా? చూస్తే పెద్దమనిషి లావున్నావు పాపం. ఆ బ్రోకరు నిప్పులాంటి మనిషి. ఎంతో కష్టపడి నీకు సీటు ఇప్పిస్తే నువ్వు ఇవ్వాల్సిన మిగతా పదిహేనువందలు ఇవ్వకుండా, పైగా కంప్లైంటు ఇస్తావా?" అని నన్ను దబాయించేసరికి నాకు కాళ్ళు, చేతులు వణికాయి.

"నా మెరిట్‌పైనే నాకొచ్చింది. ఇది మోసం" అని ఎస్.ఐ.తో చెప్పటానికి గొంతులోంచి మాటలు పెగల్లేదు. పైగా అది పోలీస్‌స్టేషన్. నేనేదైనా మాట్లాడితే! అమ్మో! ఇంకేమన్నా వుందా? అసలే పోలీస్‌ల రేప్‌లు, లాకప్‌హత్యలు ఎక్కువ ఈ దేశంలో.

"అలాగాండి. నాకు తెలీదులేండి. చాలా కష్టపడ్డాడన్న మాట ఆ బ్రోకర్ నాకు సీటు తెప్పించడం కోసం. పోన్లేండి. నా కంప్లైంట్ విత్‌డ్రా చేసుకొంటాను" అన్నాను నేను లోలోన తిట్టుకుంటూ.

"అదేం కుదరదు. మీరతనికి పదిహేను వందలు ఇవ్వకుండా ఎగ్గొట్టారని

అతను మీమీద కంప్లైంట్ ఇచ్చాడు. ఆ డబ్బు కట్టి బయటకు కదలండి మీరు” అన్నాడు ఎస్.ఐ. గుడ్లురుముతూ.

నాకు కాళ్ళు, చేతులు చల్లబడ్డాయి. వాడి వెధవచూపులకి ఒళ్ళంతా జర్రులు ప్రాకినట్టుంది. ఏవేవో గుర్తుకు రాసాగాయి. గుండెదడ అధికమైంది.

ఇంతలో దభీమని సరోజ ఊడిపడింది. క్షణంలో విషయం గ్రహించి, ఇంటికెళ్ళి అది పదిహేనువందలు పట్టుకొచ్చి ఎస్.ఐ. చేతుల్లో పోసి నన్ను విడిపించింది. ఇద్దరం వేగంగా బయటకు పరిగెత్తాం ఎందుకంటే మా మొగుళ్ళు మాతో మళ్ళీ సంసారం చేయమంటే అగ్నిపరీక్షలెక్కడ ఎదుర్కోవాలో అన్న భయంతో. ఇది రామరాజ్యం కదా!

తర్వాత తెలిసింది. ఆ ఎస్.ఐ. బ్రోకరు దగ్గర నా కంప్లైంట్ చూపించి, నా దగ్గర వాడి కంప్లైంట్ చూపించి, ఇద్దర్నుంచి డబ్బు గుంజి వాడు ఆటోమేటిక్ ఇంపోర్టెడ్ యషికా కెమెరా మావారి షాపు నుంచే కొన్నాడని. ఔరా ఏమి ప్రజా సంక్షేమం!

–వనితాజ్యోతి సచిత్ర మాసపత్రిక, మార్చి, 1989

❀

కళాకారులు

"హల్లో శర్మగారూ!" అంటూ ముందు సీట్లో కూర్చున్నతను నాతోపాటే అప్పుడే హోటల్లోకి అడుగుపెడ్తున్న శర్మను విష్ చేశాడు.

"హల్లో!" అంటూ ఒక్క క్షణం నిశ్చేష్టుడైనట్టు కన్పించి, మరుక్షణంలోనే తేరుకొన్నాడు శర్మ.

"బాగున్నారా? ఏమిటి యివాళ హోటల్‌కు రావటం ఆలస్యమైనట్లుందే?" అన్నాడతను.

"అవునండీ. ఇంతకీ మీరెట్లున్నారు?" అడిగాడు శర్మ.

"ఓ! నిక్షేపంలాగున్నాము. ఆ బైదిబై మీట్ మై ఫ్రెండ్ శేషయ్య" అంటూ తన ఎదురు సీట్లో కూర్చున్నతన్ని శర్మకు పరిచయం చేశాడతను.

"నైస్ టు మీట్ యూ. అయామ్ శర్మ. వర్కింగ్ యిన్ బలాల్" చెప్పాడు శర్మ చాలా సంతోషంగా.

నేనోసారి యిద్దరి వంక కలయజూసాను. నాకు ఆ యిద్దరూ కొత్తమొహాలే అయినా పెద్దమనుషుల్లా. మర్యాదస్తుల్లా కన్పించారు. నన్ను నేను వాళ్ళకు పరిచయం చేసుకుందామనిపించింది.

"సారీ. మావాడు నన్ను పరిచయం చేయటం కూడా మర్చిపోయాడు మీతో మాటల్లో పడి. అయామ్ పవన్ కుమార్. వర్కింగ్ యిన్ ఇ.సి.ఐ.ఎల్." అంటూ వాళ్ళ మాటల్లోకి తలదూర్చాను.

ఆ ఇద్దరూ ఓసారి నావంక తేరిపార చూసి 'అలాగా' అన్నట్లు తలూపి, మళ్ళీ మాటల్లోకి జారారు. వాళ్ళ చూపుకు రామాయణంలో పిడకలవేట,

పానకంలో పుడక లాంటి ఏవేవో సామెతలు నా మొహం మీదకు పేడముద్దల్లా వచ్చి పడ్డట్టన్పించింది.

ఇంతలో సర్వర్ "ఏం కావాలి" అంటూ మా ముందు ప్రత్యక్షమయ్యాడు.

వెంటనే అటు తిరిగి మాట్లాడుతున్న శర్మను గిల్లాను. 'అబ్బ' అంటూ ఈ లోకంలోకి వచ్చినవాడిలా మావాడు నా వైపు ఓ కోరచూపు చూసి, సర్వర్ వైపు తిరిగి "ఆ వచ్చావా? ఒక్క క్షణం" అని వాడితో చెప్పి మళ్ళీ తన స్నేహితుల వైపు తిరిగాడు.

"మీరు టిఫిన్ ఏదయినా తీసుకొంటారా? లేక కాఫీనేనా?" అని అడిగాడు శర్మ వాళ్ళని.

"టిఫిన్ తీసుకోవాలి శర్మా! ఈ పూట శనివారం కదా. నేను ఎండాకాలం కాబట్టి చల్లగా ఉంటుందని 'దహివడ' తింటాను. శేషయ్య చపాతిగాని, పూరీగాని తింటాడు. మరి నీ ఇష్టం" అన్నాడు.

"అలాగా, గుడ్!" అంటూ మూడు ప్లేట్ల పూరి, ఓ ప్లేటు దహివడ ఆర్డరిచ్చాడు శర్మ. వాడిచ్చిన ఆర్డరు వినగానే నాకు ఒళ్లు మండింది. వాడికి మా ఆవిడ గురించి సమస్తం తెలుసు. వెంటనే సర్వర్‌తో నా వంతు ఆర్డర్ను కాన్సిల్ చేయమని చెప్పాను. సర్వర్ వెళ్ళిపోయాడు. మళ్ళీ వాళ్ళు ముగ్గురు ముచ్చట్లలో పడిపోయారు. మధ్య మధ్య "వాడా, ఆ బ్రహ్మయ్య కదూ? తెల్సు, తెల్సు." "శంకరమా! వాడెందుకు తెలీదు నాకు? వాడు, నేను నాగేశ్వర రావు సినిమాలకు కాలేజీ ఎగ్గొట్టి పోయేవాళ్ళం కదూ!" అంటూ మా శర్మ పెద్దగా నవ్వుతూ ఎవరి పేర్లో ఉచ్చరించటం మాత్రం మధ్య మధ్య వినపడ సాగింది నాకు.

వాళ్ళు శర్మకు చాలాకాలం క్రితం నుంచి స్నేహితులు గామోను. లేకపోతే మా శర్మ అంత యిదవ్వడు. కాకపోయినా ఒక్కటి మాత్రం వాస్తవం, మంచి స్నేహితులు కలవక, కలవక చాలా కాలానికి కలిస్తే 'యివి' అంటూ అంటూ మాట్లాడుకోటానికి తెలీకపోయిన వాళ్ళ పేర్లు, వీళ్ళ పేర్లు చెప్పుకొంటూ గంటలు గడిపేస్తారు. నిజంగా అది ఓ మధురానుభూతి వర్ణనకు. మాటలకు అందని స్పందన, ఆనందం అన్పించింది నాక్కూడా.

టిఫిన్లు అయ్యాక కాఫీలు అయ్యాయి. పగలబడి నవ్వుతూ వాళ్ళలా మాట్లాడుకొంటుంటే నాకు ముచ్చటేసింది.

"శర్మా, యిక లేద్దామా?" అన్నాను నేను, అప్పుడు ఎనిమిది అవుతుంటే, మా ఆవిడ అపరకాళీ అవతారం హఠాత్తుగా గుర్తుకు రావటంతో.

నా మాట పూర్తికాక ముందే వాళ్ళిద్దరూ లేచి "సారీ శర్మా! చాలాసేపు కూలేసినట్లున్నాము" అంటూ నా వైపు ఓ కసురు కసిరినట్లు చూపు విసిరేశారు. వాళ్ళని డిస్టర్బ్ చేసినందుకేమో అలా చూశారనుకొన్నాను నేను.

వాళ్ళు లేచి బయటికెళ్లారు. శర్మకు మొహమాటమే కాదు. డబ్బు మంచి నీళ్ళలా తాహతుకు మించి ఆడంబరం కోసం ఖర్చుపెట్టే జబ్బు కూడ ఉంది. అందుకే నేను మౌనంగా బయటికొచ్చి పానుషాపులో సిగరెట్టు తీసుకొంటు న్నాను. శర్మ వందనోటు యిచ్చినట్టున్నాడు. కొంత సమయం తర్వాత చిల్లర సంపాయించి బయటికొచ్చాడు. వాళ్ళు శర్మతో కరచాలనం చేసి వెళ్ళిపోయారు. శర్మ నా వైపు వచ్చి నేనందించిన బెర్కిలీ ఫిల్టర్ అందుకొన్నాడు.

"శర్మా! యింతకీ ఈ స్నేహితులు ఎప్పటివారోయ్. అంత పడిపడి కబుర్లు చెప్పుకొన్నారు?" అన్నాను ఆసక్తిగా.

"భలేవాడివోయ్. నేను తెనాలిలో ఉండగా డా॥ అక్కినేని నాగేశ్వరరావు అభిమాన సంఘం వెలగబెట్టానుగా. ఆ బాపతు నన్నెరిగినవాళ్ళలా ఉన్నారు... అసలు వాళ్ళెవ్వరో యిప్పటికి గుర్తుకు రావటంలేదు. అయినా తెల్సినవాళ్ళ పేర్లు చెప్తుంటే నా తెనాలి స్వర్ణయుగం నాటి పరిచయస్థులని గ్రహించి, ఆ విషయం బయటపెట్టకుండా వాళ్ళని గుర్తు ఎరిగినట్లే నేను కబుర్లు చెప్పాను. ఎంతయినా తెనాలి కళాకారుడిని కదా. నటనలో మనవాళ్ళకి అనుమానం రానీయలేదు. చూశావా? అదేనోయ్ మన మహిమ" అన్నాడు శర్మ తన నటనా నైపుణ్యానికి తానే పొంగిపోతూ.

నాకు నవ్వొచ్చింది శర్మ పెట్టిన పోజుకు. నా నవ్వు వాడిలో ఏదో అనుమానం రేపినట్లుంది. "ఏం? నీలో నువ్వే అలా నవ్వుకొంటున్నావు?" అని అడిగాడు.

"నీ కంటే నీ స్నేహితులు మరీ పెద్ద కళాకారులే. అందుకు నవ్వొచ్చింది"

అన్నాను నేను.

"ఏమిటలా అంటున్నావు?" అడిగాడు సందేహంగా, అహం దెబ్బతిన్నట్లు ముఖం పెట్టి.

"చెప్పలేకేం. 'పిచ్చి ముఖం. మనం నోటికొచ్చిన వాడిపేరు చెప్పినా తెల్సినట్టు మహా నటించేశాడు. అసలు ఈ రోజు చిక్కడపల్లిలో ముష్షైరా కార్యక్రమం, రత్నా కేఫ్‌లో శర్మగాడికి ముహూర్తం పెట్టి టిఫిను, కాఫీ అప్పళంగా దొబ్బితిన్న సంగతి వాడికి తెలీనే తెలీదు. ఏదయితేనేమీ? ఈ పూటకు మన అవసరం తీరింది. మళ్ళీసారికి ఇంకో శాస్త్రిగాడు దొరక్కపోడు. కాకపోతే కాస్త కాపేసి ఉంచితే వాడి బ్యాగ్‌గ్రౌండు గూడ తెల్సుకోవటం కష్టం కాదు. యిలాంటి మొగమాటపు కళాకారులుండగా మనలాంటి కళాకారులకు ఎదురు లేదు' అని వాళ్ళనుకోవటం నాకు విన్పడింది కనుక అన్నానులే" అన్నాను నేను.

ఇక మా వాడు మాట్లాడలేదు. నాకు మటుకు ఈ దర్జా కళాకారులు మళ్ళీ ఎక్కడన్నా తారసపడితే వాళ్ళకి ఎలా జోహార్లు పలకాలో వెంటనే తట్టింది.

-మయూరి సచిత్ర వారపత్రిక, 7 ఆగస్టు, 1987

❀

ఎర్రగురువింద

శంకర్రావు భార్య శాంత తన ఇల్లు, పిల్లలు, భర్త తప్ప మరే విషయం బుర్రకెక్కించుకోదు. ప్రొద్దున్నే లేచి క్యారేజి తయారుచేసి భర్తను ఆఫీసుకు పంపించినది మొదలు పిల్లల్ని స్కూలుకు పంపటం, యింటిపనులు చేసుకోవటం, మిగిలిన సమయంలో తాను ఓపెన్ యూనివర్సిటీకి ప్రయివేటుగా కట్టిన బి.ఏ. పుస్తకాలు చదువుకోవటం, అప్పుడప్పుడు వారపత్రికలు లాంటివి తిరగేయడంతో ఆవిడ దినచర్య గడిచిపోతుంది.

యిరుగు పొరుగు అమ్మలక్కలతో కబుర్లు చెప్పటం, మహిళా సమాజం పేరిట దేశం మీద పడి భర్తని, పిల్లల్ని వాళ్ళ కర్మకు వాళ్ళను వదిలివేయటం శాంతకు ససేమిరా యిష్టం ఉండదు. సరిగ్గా ఈ విషయంలోనే శాంతకు ఎదురింటి కాంతంకు చుక్కెదురయింది.

ఎదురింటి కాంతం ఎన్నిసార్లు డింకీలు కొట్టిందో కానీ మొత్తానికి బియస్సీ ప్యాసయ్యాననిపించింది పెళ్ళికి ముందే. మహిళా సమాజం వాళ్ళంతా ఆవిడ డిగ్రీని మెచ్చుకుంటూ ఆవిడ చేత చిన్నపాటి నర్సరీ స్కూలు ప్రారంభింపచేశారు వాళ్ళుండే కాలనీలో. దానితో ఆవిడ తానే ప్రిన్సిపాల్ కమ్ టీచర్‌గా ఆ స్కూలుకు ఒకే ఒక పెద్దదిక్కయినట్లు కళ్ళు నెత్తిమీద పెట్టుకొని మాట్లాడ్తుంటుంది. ఆవిడను ఆకాశంకెగేసి ఆవిడ పొందే ఆనందంలో తమవంతు పాలు యధాశక్తిగా పంచుకొంటూ కాలం గడిపేసే స్నేహితురాళ్ళు మరో ముగ్గురున్నారు– లక్ష్మి, సరోజ, అరుణ. ఎవ్వరూ వాళ్ళ పేర్లున్నంత నాజూగ్గా ఉండరన్నది వేరే విషయం.

వాళ్ళు నల్గురూ ఓ చోటికి చేరితే మహాభారతంలో దుష్ట చతుష్టయం

గుర్తుకు రాక మానదు. అమెరికా అణ్వస్త్రపరీక్షలపై చర్చ ప్రారంభించి, చిన్నగా పంజాబ్ అందోళన, గుజరాత్‌లో హింసాకాండ, ఆంధ్రాలో యిటీవల జరిగిన బి.సి. రిజర్వేషన్ల గొడవ వంటి అంతర్జాతీయ, జాతీయ సమస్యలతో సహా ఆ వీధిలో కామాక్షమ్మ మొగుడ్ని ఆఫీసుకు పంపించి స్కూటరుపై ఎవడితో పోతుంది, ఎవతైనా భర్తకు తెలీకుండా బియ్యం అమ్ముకుని ఉదయం ఆట సిన్మాకు వెళ్తుందా, ఎవరు ఆ రోజు పట్టుచీర కట్టి పూలజడ వేసుకొన్నారో కూడా వాళ్ళ చర్చల్లో అంశాలే.

యిలాంటి ముచ్చట్లను మొదట్లో విని, అలాంటి వాళ్ళతో కాలక్షేపం చేయటం అంత వృధా ప్రయాస మరోటి లేదని నిశ్చయించుకొని యింటివరకే తన కార్యక్రమాన్ని పరిమితం చేసుకొంది శాంత. ఆమె అలా ఒక్కత్తే యింట్లో మ్రగ్గిపోవటానికి కారణం శాంతకు ఆమె భర్త స్వేచ్ఛనివ్వకపోవటమేనని కాంతం, ఆమె స్నేహితురాళ్ళు చాలాసార్లు నిర్ధారించారు. ఎలాగైనా శాంతలో చైతన్యం తెచ్చి, ఆవిడకు స్వేచ్ఛని కల్పించి తమలో ఓ మనిషిగా జాతిజీవన స్రవంతిలోకి తీసుకురావాలని వాళ్ళు నడుం బిగించారు.

అనుకున్నదే తడవుగా ఆ రోజు సాయంత్రం నాల్గింటికి ముహూర్తం నిర్ణయించి సరోజను శాంత యింటికి పంపారు మిగతా ముగ్గురూ. తనకు భారతంలో కృష్ణుడి పోర్షను, రామాయణంలో అంగదుడి హోదా లభించి నందుకు లోలోనే మురిసిపోతూ రాయబారానికి బయల్దేరింది సరోజ.

శాంతకు కాంతం ప్రజ్ఞాపాటవాలను గురించి, కాంతం ద్వారా తన స్నేహితులు నేర్చుకున్న ప్రపంచ పరిజ్ఞానం గురించి వివరించి చెప్పాలని ఎంతగానో ప్రయత్నించింది సరోజ. కాంతం నుంచి శాంత నేర్చుకోవాల్సిన అనేక లౌకిక, రాజకీయ నీతుల గురించి నచ్చచెప్పి చూపింది. కానీ శాంత సరోజ ప్రయత్నాలేవీ పడనీయలేదు. పైగా ఆ విధంగా కాలం వృధా చేయటం తనకిష్టం లేదని, అవకాశమొస్తే తనే ఎప్పుడన్నా వచ్చి వాళ్ళతో కాలక్షేపం చేయగలనని ఎదురు నచ్చచెప్పి సరోజను వచ్చిన దారినే త్రిప్పి పంపింది.

సరోజతో గంటసేపు జిగిబిగిగా వాదించేప్పటికి శాంతకు ప్రాణం కడబట్టి నట్లయింది. ఓసారి గడియారంవైపు చూసింది. సరిగ్గా ఐదయింది సమయం.

పిల్లలు కూడా వచ్చే వేళయిందనుకొంది మనస్సులోనే. సరిగ్గా అప్పుడు గుర్తు వచ్చింది శాంతకు తన భర్త రాత్రి ప్రొద్దుపోయినాక వస్తానని చెప్పిన సంగతి. కాంతం ఆంతర్యం ఓసారి మనస్సులోనే విశ్లేషించుకొని, చిరునవ్వు నవ్వుకొని యింకే మాత్రం ఆలస్యం చేయకుండా గబగబా యింటి పనుల్లోకి చొరబడింది శాంత. యింటి పనుల్లోంచి తెమిలి పిల్లల్ని చదివించి వాళ్ళకు ప్రక్కలు వేసి పడుకోబెట్టి, తను టేబిల్ లైటు వేసుకుని, కమర్షియల్ జాగ్రఫీ చదువుతూనే పడక్కుర్చీలో వెనక్కి వాలింది. ఎప్పుడు కళ్ళు మూతలు పడ్డాయో శాంతకు తెలీనే తెలీదు.

రాత్రి బాగా ప్రొద్దుపోయినాక, సిటీకెళ్ళిన శంకర్రావు తిరిగొచ్చి "శాంతా శాంతా" అని తలుపుకొట్టి బిగ్గరగా పిల్చాడు. రెండుమూడుసార్లు కాలింగ్‌బెల్ నొక్కి చూశాడు. చుట్టప్రక్కలవాళ్ళంతా ఆ సరికే నిద్రలో మునిగిపోయారు.

ఓసారి టైము చూసుకున్నాడు శంకర్రావు. రాత్రి పావు తక్కువ పది కావస్తున్నది. ఆ కాలనీలో అందరూ రాత్రి తొమ్మిది గంటలకే తలుపులేసుకొని శయ్యామందిరం ఆశ్రయిస్తుంటారు. అందువలన అంతా నిశ్శబ్దంగా ఉంది. శంకర్రావుకు ఏం చేయాలో పాలుపోలేదు. 'సాధారణంగా తను ఆలస్యంగా వస్తానని చెప్పిన రోజు శాంత తన కోసం బయటనే కూర్చుని దీపం వేసుకొని ఏదో చదువుకొంటూంటుంది. ఈ రోజు యిలా నిద్రపోతున్నదేమిటి చెప్మా? బహుశా బడలిక వల్ల కన్ను మూయగానే నిద్ర పట్టినట్లుంది శాంతకు. ఇంటి పనంతా తానే చేసుకోవటం వల్ల బాగా బడలిక చేసుంటుంది. అందువల్లనే అంత త్వరగా నిద్రపట్టుంటుంది ఆమెకు' మనస్సులోనే అనుకొన్నాడు శంకర్రావు, తలుపు సందుల్లోంచి బెడ్‌రూమ్‌లో వెల్గుతున్న టేబిల్ లైటు చూసి.

శంకర్రావు శాంతని పిలవటం, ఆవిడ తలుపు తీయకపోవటం, అక్కడే ఆలోచిస్తూ తచ్చట్లాడ్తున్న శంకర్రావును కాంతం, ఆమె స్నేహితులు గమనించక పోలేదు. మధ్యాహ్నం తాము పంపిన రాయబారం విఫలం కావటంతో కాంతం, లక్ష్మి, సరోజ, అరుణలకు ఎంతో అవమానంగా, పుండుపై కారం చల్లినట్లుంది. పాపం, భర్త యినుప పాదాల క్రింద స్వేచ్ఛ లేకుండా నలిగిపోతున్న శాంతను మార్చాలన్న తమ సదుద్దేశానికి శాంతే ఎదురుతిరగటం వాళ్ళకు భరించలేని

రోషాన్ని, ఆవేదన్ని కల్గించింది. అందుకే కాలనీ అంతా నిద్రలో మునిగున్నా వాళ్ళకు మాత్రం నిద్ర పట్టలేదు. ప్రతీకారం ఎలా తీర్చుకోవాలన్నదే వాళ్ళందరి ఏకైక లక్ష్యం.

సరిగ్గా అదేసమయంలో శంకర్రావు తన భార్యని నిద్రలేపటానికి విఫల ప్రయత్నం చేయటం చూసిన వాళ్ళందరికి హఠాత్తుగా ఓ దివ్యమైన ఆలోచన వచ్చింది. శంకర్రావును శాంతపైకి ఎలాగైనా ఉసిగొల్పి రెచ్చగొట్టితే శాంతకు తగినశాస్తి చేసినట్లవుతుందని వాళ్ళ ఆలోచన. ఆవిధంగానైనా వాళ్ళకు జరిగిన అవమానానికి, తమ పెద్దరికాన్ని ధిక్కరించినందుకూ లేశమాత్రంగానైనా ఆవిడకు శాస్తి చేసినట్లవుతుందన్నది వారి అంతర్యం.

అనుకున్నదే తడవుగా కాంతం యింటి అరుగుపైన కూర్చున్న నల్గురూ ఒకరికొకరు కనుసైగలు చేసుకున్నారు. "ఏమిటో, మొగుడు బయటికెళ్తే తిరిగి యింటికొస్తాడన్న ధ్యాస కూడా ఉండదు ఈ రోజుల్లో ఆడవాళ్ళకి" అని మొదలు పెట్టింది కాంతం, సరోజను గిల్లుతూ సంభాషణ రక్తి కట్టించమని.

"అవునవును. పైకి అది చదువుతున్నాం. యిది చదువుతున్నాం అని గొప్పలు చెప్పుకోవటం మాత్రం బాగా తెల్సు. చదువుతున్నకొద్దీ భర్త పట్ల ఉండాల్సిన గౌరవం పెరగటం లేదు, తరుగుతోంది ఈ రోజుల్లో. భర్తల్ని ఎలా చూసుకోవాలో తెలీనప్పుడు డిగ్రీలు మాత్రం ఎందుకంటా. నాలిగ్గీచుకోడానికి తప్ప" అంది సరోజ లక్ష్మివైపు చూస్తూ శాంతపై తన కసినంతా వెళ్ళగ్రక్కుతూ.

వెంటనే లక్ష్మి అందుకొంది, "యిదే మా ఆయననైతేనా... నా డొక్క చించి డోలు కట్టేవాడు. అయినా ఈరోజుల్లో మగాళ్ళు మునుపటివాళ్ళ మాదిరి కాదులే. నా అదృష్టం మా ఆయన ఈ కాలం తరహా మనిషి కాదు. పులి, సింహం కలబోసి మా ఆయన అయ్యాడు. ఆయనకు కోపం వస్తుందంటేనే మా అందరికి హడల్. మరి మనమూ చూస్తున్నాం – త్యాగయ్య కదా" అని.

"ఈ కాలం మగాళ్ళంతా ఆడవాళ్ళకు దాసోహమంటున్న రోజులివి. ఛీ, ఛీ, పెళ్ళాన్ని అదుపాజ్ఞల్లో పెట్టుకోలేని మగాళ్ళు కూడా మగాళ్ళేనాంట? శుభ్రంగా చీరె, గాజులు తొడుక్కొని ఆవిడ్ని పేంటు, చొక్కా వేసుకోమంటే పోలా, ఏమయినా యిదో చోద్యంలేమ్మా" అంటూ శంకర్రావును రెచ్చగొట్టటానికి

ప్రయత్నించింది లక్ష్మి.

"కరెక్టుగా చెప్పావు లక్ష్మి. యిదేమి చోద్యమోగాని భర్త లేకుండా అలా ఒంటిరిగా బిక్కుబిక్కుమంటూ నిద్రపోవటం నావల్ల అసలు కాదనుకో. అయినా మగాడంటే కాస్త గట్టిగా ఉండాలి కాని యిలా పెళ్ళాన్ని కోప్పడితే ఆవిడగారు కందిపోతుందని భయపడే మగాళ్ళని యిప్పుడే చూస్తున్నాం" తనవంతు పాఠం గడగడా ఒప్పచెప్పింది అరుణ.

వీళ్ళ సంభాషణ వింటుంటే శంకర్రావుకు ఎక్కడలేని కోపం, చిరాకు కల్గింది. 'ఎవరింటి విషయం వాళ్ళు ఏడవక తనపై, తన భార్యపై విసుర్లు వేయటం వీళ్ళకేమి సరదానో. అయినా వాళ్ళకీ అవకాశం యిచ్చినందుకు శాంతననాలి. వాళ్ళనని ప్రయోజనం లేదు' లోలోనే అనుకొన్నాడు శంకర్రావు. తనింక అక్కడ ఓ క్షణం కూడా ఉండలేకపోయాడు.

'ఓ గంట పోయినాక రావచ్చులే. అప్పటికి శాంతకు నిద్రమత్తు కూడా కాస్త తీరుతుంది. విషయమేమిటో కూడా తెలుస్తుంది. ఎటూ రేపు శలవేగదా. యిప్పుడు వీళ్ళ ముందు హడావుడి చేసి చులకనయిపోవటం దేనికి' అనుకొంటూ స్కూటర్ స్టార్టు చేసి రోడ్డు పైకి వెళ్ళాడు.

శంకర్రావు అలా వెళ్ళగానే ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ షేక్‌హ్యాండ్సు యిచ్చుకుంటూ, 'ఈ రాత్రికి శంకర్రావు చేతిలో శాంతకు మంచి సత్కారం లభిస్తుందిలే' అని మనస్సులో సంతోషపడ్తూ ఎవరి దారిన వాళ్ళు పోయారు.

శంకర్రావు తిరిగి యింటికొచ్చేసరికి రాత్రి పదకొండున్నరయింది. ఈసారి శాంత బయట అరుగుపైనే ఒక్కర్తే కూర్చుని తనకోసమే ఎదురుచూస్తున్నది. భర్తను చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది శాంతకు. 'తనిందాకా మొద్దునిద్ర పోయినప్పుడు ఆయన వచ్చివెళ్ళారేమో, యిక రాత్రంతా ఏ స్నేహితుడి రూము లోనో పడుకొని ప్రొద్దునే వస్తారేమో' అని మధనపడ్తోంది శాంత అంతవరకూ.

శాంత చూపుల్లోనే తనరాకకోసం ఎంత నిరీక్షిస్తుందో సులువుగా గ్రహిం చాడు శంకర్రావు. యిందాకటి కోపం, చిరాకు యిప్పుడు శంకర్రావులో లేవు. శంకర్రావు లోపలికి రాగానే తలుపేసి "సారీ" చెప్పింది శాంత. "ఈ చిన్న విషయానికి మన మధ్య సారీ లాంటి పెద్ద పెద్ద మాటలెందుకులే గానీ,

యిందాక నువ్వు నిద్రపోతున్నపుడు ఎదురింటి కాంతం, ఆవిడ స్నేహితు రాళ్ళు నిన్ను, నన్ను ఎన్ని మాటలన్నారో తెల్సా? నాకసలు కోపం ఆగలేదు. ఎట్లానో నన్ను నేను తమాయించుకొని మళ్ళీ రోడ్డుపైకెళ్ళాను" అంటూ జరిగిం దంతా వివరంగా చెప్పాడు శంకర్రావు శాంతకు.

"అలాగా" అంటూ మధ్యాహ్నం తనకు, సరోజకు జరిగిన సంభాషణ గురించి సంక్షిప్తంగా చెప్పి "ఓసారి యిటు రండి" అని వెంట తీసుకెళ్ళి తలుపు తీసి "కాంతం యింటివైపు ఓసారి చూడండి" అంది తను ప్రక్కకు తప్పుకొంటూ. ఎదురుగా కన్పడ్తున్న దృశ్యం చూసి శంకర్రావు అవాక్కయిపోయాడు. కాంతం భర్త బయట మెట్ల ప్రక్కన అరుగుపై టవల్ పర్చుకొని నిద్రపోతున్నాడు ఆ చల్లో వణుకుతూ.

కాంతం భర్త పొద్దుపోయి యింటికి వచ్చి తలుపు తడ్తే ఆవిడ ఎంతకీ తలుపు తీయకపోవటంతో చివరకు ఆయన ప్రాణం విసిగి అక్కడే టవల్ పర్చుకొని నిద్రపోవటం... తను చూసినదంతా వివరంగా చెప్పింది శాంత. చలికి వణుకుతూ ఆయనలా ముడుచుకొని పడుకోవటం చూసి శంకర్రావుకు ఎంతో జాలేసింది. శాంతవైపు చూశాడు ఏమి చేద్దామన్నట్లుగా. "మనింటికి పిల్చుకురండి. ఈ రాత్రికి మీరిద్దరూ బెడ్‌రూములో పడుకోండి. నేను డ్రాయింగ్ రూములో పడుకొంటాను" చెప్పింది శాంత భర్త అభిప్రాయం గ్రహించి.

శాంత చెప్పిందే తడవుగా శంకర్రావు వెళ్ళి ఆయన్ని లేపి తీసుకొచ్చి తనింట్లో పడుకోబెట్టుకొన్నాడు.

మర్నాడుదయం తన భర్త శంకర్రావుగారింట్లో కాఫీ త్రాగుతుండటం చూసిన కాంతంకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ముందు 'ఈ విషయం తన స్నేహితులకు తెలిస్తే ఎలా సమాధానం చెప్పుకోవాలా?' అన్నది కాంతం ప్రధాన సమస్య అయికూర్చుంది. పశ్చాత్తాపం మాట దేముడికే తెలియాలి.

–ఉదయం వీక్లీ, 29 అక్టోబర్, 1987

❀

మనోవైకల్యం

గంటసేపు ఆర్టీసీ బస్సుకోసం నిరీక్షించి అప్పుడే వచ్చిన బస్సును తోసుకొని ఎక్కుతున్న జనంతో తలపడలేక నిదానంగా అందరూ ఎక్కాక ఎక్కాడు తను.

తన జీవితంలో సిటీ బస్సు ఎక్కటం మొదటిసారి కాదు. కొన్నివేలసార్లు ఎక్కుంటాడు. కొన్ని వందలసార్లు కాళ్లూ, చేతులు పచ్చడి చేయించుకొనుంటాడు తను. కాని ఆటోలో వెళ్ళలేని ఆర్థిక నిస్సహాయత, బండి కొనుక్కోలేని వెనుకబడ్డ తనం, ఈ వయస్సులో కూడా తనని ఆర్టీసీ బస్సులోనే వెళ్లమని శాసించాయి. తనలాంటి దౌర్భాగ్యులెందరో అనుకుంటూ బస్సులో జనాన్నంతా ఓసారి పరికించి చూశాడతను.

అక్కడక్కడ మినహాయిస్తే అన్ని సీట్లలో ముగ్గురు చొప్పున ఇరుక్కుని కూర్చున్నారు జనం. ఓ మూల సీట్లో మాత్రం ఇద్దరే కూర్చుని కనిపించారు తనకు. బహుశా అక్కడ తనలాంటి పల్చని మనిషికి కూస్తంత స్థలం దొరక్క పోదన్న ఆశతో అటువైపు జనంను తప్పుకోమని బ్రతిమాలుతూ వెళ్లాడు.

తను వెళ్లి అక్కడ నిల్చున్నా తన వయస్సు, మాసిన బట్టలు, నెరిసిన జుట్టు, వడిలిన దేహం వాళ్ళిద్దరికీ తనపై జాలి కల్గించలేదు.

'కూర్చోండి' అంటూ ఆ ఇద్దరూ సర్దుకొంటారేమోనని ఆశించాడు తను. కాని అలాంటి విడ్డూరమేమీ జరుగలేదు. అది గూడ తన మనస్సు చెప్తున్న సత్యమేనన్పించింది తనకే. మరో పది నిముషాలకు కండక్టరు వచ్చి టిక్కెట్లు కొట్టటం ప్రారంభించాడు. ఆ ఇద్దరి వైపే తన చూపుల్ని నిలిపి చూస్తున్నాడు.

వయస్సులో చాలా చిన్నవాళ్ళు అయినా తనడక్కుండా స్థలం ఇచ్చే మనస్తత్వం వాళ్ళకున్నట్లు అన్పించ లేదు తనకు.

ముందు తానే అడుగుదామనుకొన్నాడు. కాని తన మాటను త్రోసిపుచ్చే చిన్నమాట వాళ్ళేదయినా అంటే తనే మళ్లీ బాధపడాలి. అందుకోసం మళ్లీ ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

బస్సు కదిలింది. ఎగుడుదిగుడు గుంటలతో ఎత్తెత్తేస్తూ భారీగా నడుస్తోంది బస్సు. తన దగ్గరికొచ్చాడు కండక్టరు. తనూ, ఆ ఇద్దరు కుర్రాళ్ళు టిక్కెట్లు తీసుకున్నారు. కాని, దురదృష్టవశాత్తూ వాళ్ళు కండక్టరుకు డబ్బునిస్తూ చెప్పిన దిగే స్థలం పేరు తను సరిగ్గా వినలేకపోయాడు.

అలాగే ఓపిగ్గా నుంచొని వాళ్ళవైపే చూస్తున్నాడు తను. వాళ్ళు కూడా అప్పుడప్పుడు తనవైపే చూడటం గమనించాడు కూడా.

క్రమంగా బస్సు నత్తనడకతో బద్ధకంగా ఒక్కో స్టేజి దాటుతోంది.

వాళ్ళు దిగుతారేమోనన్న ఆత్రుత, ఆశ తనలో ఎప్పుటికప్పుడు. వాళ్ళు మాత్రం కిటికీలోంచి చూపులు బయటికి సారించి బస్సు ఆగినప్పుడల్లా లేవ బోయి, ప్రతి స్టేజిని నిశితంగా పరికించి మళ్లీ కూర్చుంటున్నారు. అలా కొన్ని స్టేజీలు దాటాక వాళ్ళు ఎక్కడా దిగకపోవడంతో బహుశా వాళ్ళు ఈ ప్రాంతానికి క్రొత్తవారు కావచ్చునేమోనన్న అనుమానం కల్గింది తనకు.

సాధారణంగా క్రొత్త ప్యాసింజర్లు తాము దిగాల్సిన స్టేజి గుర్తుపట్టలేక పొరబడి మరోచోట దిగి నానా అవస్థల పాలవుతుంటారు ఈ మహానగరంలో. అందుకని చేసేదిలేక వాళ్ళ వైపే మౌనంగా చూస్తుండిపోయాడు.

తను వాళ్ళవైపు చూసినప్పుడల్లా వాళ్ళు తమలో తాము మాట్లాడుకొని మళ్లీ కిటికీలోంచి బయటికి చూస్తున్నారు. చేసేదేముందనిపించింది– తనకు మాట కలుపుదామంటే గతంలో అలాంటి సందర్భాలలో ఎదురైన అవమాన చ్ఛాయలు మదిలో మెదిలి.

నలభై నిముషాలలో పోవాల్సిన బస్సు రద్దీ కారణంగా, రోడ్ల దరిద్రపుస్థితి కారణంగా గంటంపావుకు గమ్యస్థానం చేరుకొంది.

కాళ్లు పీక్కుపోతుంటే బస్సు దిగాడు తను ఈసురోమంటూ. వాళ్లు తన

వెనకే దిగుతూ అనుకొనే మాటలు తన చెవిన పడి నివ్వెరపోయాడు తను.

"ముసలిపీనుగని ఊరించి, ఊరించి తెగ ఏడిపించాము. మనం దిగాల్సిన స్టేజి ఎప్పుడో దాటిపోయిందని ఆ ముసలోడికి తెలీనే తెలీదు. పాపం, ప్చ్" అన్నాడొకడు మరొకడితో బయటికి వచ్చి షేక్‌హ్యాండ్ ఇస్తూ.

తన అరవయ్యేళ్ళ వయస్సులో అటువంటి శాడిస్ట్ మెంటాలిటీ ఉన్న కుర్రకారును చూడడం మొదటిసారి. అసహ్యంగా ఓ చూపు వాళ్ళకు అర్థ మయ్యేలా చూసి ముందుకు సాగిపోయాడు తను.

–ఉదయం వీక్లీ, 17 డిసెంబర్, 1987

❀

ఆటవిక సంస్కారం

ఆటవిక జాతుల్లో సంస్కారం, నాగరికతలు ఏ రూపంలో ఉండేవో ఎమ్.ఎ. సోషియాలజీ చేసిన మురళి నాకు అనర్గళంగా చెప్తున్నాడు. వాడు తరచూ నాకు చెప్పే సబ్జెక్టు అదే అయినా నేనెంతో శ్రద్ధగా వింటానికి కారణం వాడు చెప్పే తీరు అమోఘం గాబట్టి.

అంతలో "సార్, కొంచెం ఈ ఇల్లు ఎక్కడో చెప్తారా?" అని అడిగారు ఇద్దరు ఆగంతకులు మేం కూర్చున్న చోటికి వచ్చి.

ఓసారి వాళ్ళను నఖశిఖపర్యంతం పరీక్షించాను. ఇద్దరూ కాస్త వయస్సు మళ్ళిన వాళ్ళలా కనబడ్డారు. గడ్డం రెల్లులా పెరిగింది ఇద్దరికి. గోచీపోసి కట్టిన ముతక ఖద్దరు ధోవతి, లాల్చి, భుజంపైన ఉత్తరీయం ధరించిన ఆ ఇద్దరూ ఏదో మారుమూల ప్రాంతం నుంచి వచ్చినట్లుగా అనిపించింది వాళ్ళ మాసిన అవతారం చూస్తుంటే. మురళి వాళ్ళిచ్చిన అడ్రసు కాగితం అందుకొని పరీక్షగా చూసి, తల పైకెత్తి తీవ్రంగా ఆలోచించసాగాడు.

"తిండి తిప్పలు లేకుండా పొద్దుట్నించి తిరుగుతున్నాం బాబు. ఈ అడ్రసున్న బాబు అమ్మ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఒక్కడే ఇక్కడ రూములో ఉంటు న్నాడు" చెప్పారిద్దరూ ముక్తకంఠంతో.

నాకెంతో జాలి వేసింది వాళ్ళ పరిస్థితి వింటుంటే. అసలు హైదరాబాద్‌ను భాగ్యనగరం అన్నా, కీకారణ్యం అన్నా పెద్ద తేడా కనిపించదు. ముఖ్యంగా ఎవరి ఇల్లన్నా వెతికి దొరకబుచ్చుకోవాలనే విషయంలో కేవలం ఇంటి నెంబరు సాయంతోనో, లేక వ్యక్తి పేరునో ఇంతకుముందు చూసిన గుర్తుందనుకునో

ఎవరన్నా ఇల్లు వెతకవచ్చుననుకుంటే పప్పులో పులుసు, నెయ్యి కలుపుకుని మరీ కాలు వేసిన చందం అవుతుంది.

ఇంతలో మావాడు వాళ్ళకేవో చూపిస్తూ కొన్ని గుర్తులు చెప్పి అక్కడికి వెళ్తే తప్పకుండా ఆ అడ్రసులో ఉన్న ఇల్లు ఉంటుందని ఘంటాపథంగా చెప్పటంతో వాళ్ళు మా ఇద్దరికి మరో నమస్కారం పెట్టి ముందుకు కదిలారు.

“ఇంతకీ ఎక్కడ ఆపాను? ఇదే వెధవ న్యూసెన్సు. అరగంట బయట చల్లగాలికి కూర్చుంటే అడ్రసు చెప్పమంటూ అరవైమంది వస్తారు. వచ్చేవాళ్ళకు వేళాపాళా కూడా ఉండదు. ఆ గుర్తొచ్చింది. ఆటవికులు మేధావంతులు కాకపోయినా దెబ్బకు దెబ్బ తీయటంలో బాగా ఆరితేరినవారు” అంటూ మళ్ళీ మొదలుపెట్టబోయాడు మురళి తన ఉపన్యాసం.

“పోన్లే, ఇప్పటికయినా వాళ్ళకు ఖచ్చితమైన అడ్రసు గుర్తులు దొరికాయి. పాపం, పెద్దవాళ్ళు. నిజానికి మనం జీవితంలో తెల్సీ తెలియక చేసే పుణ్య కార్యాల్లో ఇవి కొన్ని శ్రమలేనివి. పుణ్యానికి పుణ్యం కూడా” అన్నాను నేను వాడి ఉపన్యాసానికి అడ్డం పడ్తూ.

“భలేవాడివిలే. ఇది పుణ్యమో, పాపమో నాకు తెలీదు గాని ఒక్కటి మాత్రం వాస్తవం. నే చెప్పిన చోట నూరు శాతం వాళ్ళకు ఆ అడ్రసులోని ఇల్లు దొరక్కపోవచ్చు. ఇంత తిరిగినవాళ్ళు మరొక్క ఛాన్సు తీసుకోలేరా అని ఏదో వేగ్ రిమంబరెన్స్‌తో చెప్పాను కాని కచ్చితంగా ఆ అడ్రసు ఎక్కడో నాకూ తెలీదు” అన్నాడు మురళి అదేదో చాలా చిన్న విషయమైనట్లు నిర్లక్ష్యంగా.

హఠాత్తుగా వాడలా అనేసరికి నా వెన్నెముకపైన ఎవరో కొరడా ఝుళి పించినట్లయింది. ఒక్కసారి వాడి వంక తీవ్రంగా చూసి, ఏమనాలో తోచక “ఇప్పుడే వస్తా” అని లేచి వచ్చేశాను.

రెండు రోజులు పోయాక ఓ ఉదయం మురళి మా ఇంటికి వచ్చి “సెస్ బిల్డింగ్ ఎక్కడో నీకు తెల్సా?” అని అడిగాడు.

“తెలుసు పాటిగడ్డ, రసూల్ బజార్ మధ్య ఉన్న పోలీస్ లైన్సు దగ్గర ఉంది” వివరంగా చెప్పాను.

“ఈ రోజు ఒంటిగంటకు బ్యాంకు పరీక్ష ఉంది. వీలైతే సెలవు పెట్టి

నువ్వు కూడా రాకూడదు నా వెంట?" అడిగాడు మురళి.

ఆ రోజు ఆదివారం కాబట్టి నాక్కూడా సెలవే. ఈమధ్య షిఫ్టులు మారి నా ఆఫ్ ఆదివారం అయిన సంగతి మురళికి తెలీదు.

"అలాగే" అని తలూపాను నేను.

మేం పాటిగడ్డ–రసూల్ బజార్ చేరేసరికి పావు తక్కువ ఒంటిగంట అయింది. అక్కడ అటూ ఇటూ కలతిరిగాము, ఎంతో వేగంగా అడుగులు వేస్తూ. మాకు ఎక్కడా సెస్ బిల్డింగ్ కనపడలేదు. అడ్రసులో బేగంపేట అని ఉంది. కాని కొందర్ని అడిగితే అది బేగంపేటలో లేదు అమీర్‌పేటలో అన్నారు. అమీర్‌పేట పరిగెత్తాము. అక్కడ కూడా ఎవ్వరూ సెస్ బిల్డింగ్ ఎక్కడో చెప్పలేక పోయారు. పైగా ఆదివారం కావటం వల్ల షాపులు మూసి వుండి, రోడ్లపైన జనం పల్చగా కూడా ఉండటంతో మేం చాలా ఇరుకున పడాల్సి వచ్చింది.

టైము కాస్తా గిర్రున తిరిగిపోయింది. మాకు తిప్పట మిగిలింది. మురళి ముఖం చూస్తే ఏడుపొక్కటే తక్కువన్నట్లు వుంది.

సెస్ బిల్డింగ్ ఎక్కడో తెలీకుండానే, పరీక్ష టైము దాటటంతో తిరిగి చిక్కడపల్లి చేరాం. మురళికదే చివరి బ్యాంక్ పరీక్షయినందుకు వాడు పడ్డ బాధ వర్ణనాతీతం దారి పొడుగునా.

ఇంటికి చేరాక వాడి నుంచి సెలవు తీసుకున్నాను.

"ఆటవికులు మేధావంతులు కాకపోయిన దెబ్బకు దెబ్బ తీసేవాళ్ళు." అదే మనస్తత్వానికి మురళి బహుశ నాలాంటి వారి వద్ద ఖరీదైన పరిహారం చెల్లించాడేమో అనిపించింది. ఎందుకంటే సెస్ బిల్డింగ్ ఎక్కడో నాకు కచ్చితంగా తెలుసు. కావాలనే చెప్పలేదు. ఆటవికులకు ఆటవిక సంస్కారం.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 4 జనవరి, 1989

నిర్మోహమాటం

గణేశన్ బజర్ నొక్కాడు. బయట నిలబడ్డ ఎటెండర్ స్ప్రింగ్ డోరు తెరుచుకొని లోపలికి వెళ్ళాడు.

"సార్" అని వినయంగా అడిగాడు ఎటెండర్.

"కేంటీన్లో టిఫిన్ ఏముందో కనుక్కో" అంటూ గణేశన్ సీరియస్‌గా తన ఫైల్స్ వంక చూసుకోసాగాడు. క్షణంలో కేంటీన్‌కు వెళ్ళొచ్చిన ఎటెండర్ స్ప్రింగ్ డోరు త్రోసుకుంటూ లోపలికెళ్ళాడు. ఆఫీసర్ సీరియస్‌గా పనిలో మునిగి ఉండటం గమనించి ఒక్క క్షణం తటపటాయించాడు– 'చెప్పాలా? వద్దా?' అని. ఎందుకైనా మంచిదని "సార్!" అన్నాడు మెల్లిగా.

"ఏంటి?" – అన్నాడు గణేశన్ తలెత్తకుండా వెంటనే. "రోస్ట్ ఉల్లిపాయ మినప – వేడిగా ఉంది సార్" అన్నాడు తడుముకోకుండా.

"అయితే అర్జంటుగా ఒక ప్లేటు విత్ కొబ్బరి చట్నీతో పట్రా" అని క్లుప్తంగా ముగించాడు గణేశన్.

వెంటనే చకచకా వెళ్ళిపోతున్న ఎటెండర్ని "చూడూ, వెళ్తూ వెళ్తూ మన కొత్త స్టెనోగార్ని లోపలికి పంపించు" అన్నాడు.

"త్వరగా పట్టుకురా" అని గుర్తుచేస్తున్నట్లుగా, పరిగెట్టటానికి సిద్ధంగా ఉన్న ఎటెండర్ వైపు చూస్తూ పెద్దగా అరిచాడు గణేశన్.

ఎటెండర్ వెళ్ళిపోయాడు.

"మే ఐ గెట్ యిన్ సార్" – అని స్టెనో అడగటంతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు గణేశన్ తన ఆఫీస్ ఫైళ్ళ మధ్య నుండి.

తలెత్తి చూసి డోర్ దగ్గర నుంచున్న స్టెనోను లోనికి రమ్మన్నాడు గణేశన్.

స్టెనో వచ్చి ఆఫీసరుకెదురు సీట్లో కూర్చున్నాడు. గణేశన్ - స్టెనోకు డిక్టేట్ చెయ్యవలసిన లెటర్ గురించి ఫైల్స్ తిరగేస్తూ వీలయినంత సంక్షిప్తంగా చెప్పడానికి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

పది నిమిషాలు గడిచాయి.

రూము అంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంతలో ఎటెండర్ వచ్చి టిఫిన్‌పళ్ళెం అక్కడ పెట్టేసి వెళ్ళిపోయాడు. మరికొన్ని క్షణాల తర్వాత గణేశన్ "టేక్" అని అన్నాడు స్టెనో నుద్దేశించి–

లెటర్ డిక్టేట్ చేయటం పూర్తిచేసి తలెత్తిన గణేశన్– ప్లేటులో చేయి కడిగి రుమాలుతో చేతులు తుడుచుకొంటున్న స్టెనోని చూసి నిశ్చేష్టుడయ్యాడు.

–చతుర మాసపత్రిక, జనవరి, 1978

❀

రసాభాసం

సురేష్ బర్త్‌డే ఆ రోజు. సురేష్ స్నేహితులు కిషోర్, సాంబు, కోటిలింగం అతని బర్త్‌డే ఘనంగా జరగాలని పట్టుబట్టారు. వాళ్ళ హడావుడికి తట్టుకోలేక హాస్టల్నుంచి వాళ్ళను తీసుకొని బయటపడ్డాడు సురేష్.

ముందుగా నల్గురూ కల్సి హోటలు తాజ్‌కెళ్ళి నాల్గుసీట్లు ఖాళీగా ఉన్న టేబిల్ ముందు కూర్చుని, సర్వర్ను పిల్చి నాల్గు ప్లేట్ల ఇడ్లీలకి ఆర్డరు యిచ్చారు. అంతలోనే సురేష్‌కు టాయిలెట్‌కు వెళ్ళాల్సివచ్చి, మిగతా వాళ్ళకు ఆ విషయం సౌంజ్ఞ ద్వారా చెప్పి టాయిలెట్ వైపుకు నడిచాడు.

వచ్చిన పని ముగించుకుని తలెత్తి ఎదురు గోడపైకి చూసిన సురేష్‌కు దానిపై వ్రాసున్న నాల్గువాక్యాలు ఆశ్చర్యాన్ని కల్గించాయి. "హోటలు సీతా లాడ్జిలో రూమ్ నెంబరు ఎనిమిది వద్ద ఓ అందమైన అమ్మాయి మీ కోసం వీక్షిస్తున్నది. గంటకు వంద" అని రాసుంది.

అది చదివి ఆశ్చర్యంలోంచి తేరుకోలేక సతమతమవుతూ గబగబ హోటలు లోపలికెళ్ళి తన మిగిలిన ముగ్గురు స్నేహితులకు ఆ విషయం చెప్పి, వాళ్ళను కూడ లాక్కుపోయి ఆ గోడపై రాసున్నదాన్ని చూపించాడు సురేష్.

దాన్ని చూసి ఆనందంతో ఈలలు వేశారు ముగ్గురు. వెంటనే ఆ అనుభవం ఏదో చూడాలని, ఆ సదవకాశం జారవిడ్చుకోకూడదన్న తీర్మానానికి వచ్చారు. అందరూ తమ తమ దగ్గరున్న డబ్బు లెక్కచూసుకొన్నారు. వందరూపాయలు లెక్కకు అమ్మాయి ఖర్చు క్రింద తీసేయగా మిగిలిన డబ్బు మందు, విందుకు సరిపడ తేలింది.

అనుకొన్నదే తడవుగా హోటలులో టిఫిన్ ముగించుకొని బయటపడి కావల్సినవన్నీ కొనుక్కొని, ఓ ఆటోలో సీతాలాడ్జికి చేరారు నల్గురూ. అందరూ మెట్లెక్కి పైకెళ్ళి రూంనెంబరు ఎనిమిది దగ్గర ఆగారు. వాళ్లలో ఒకరు నెమ్మదిగా రూము గొళ్ళెం కొట్టారు. వెంటనే తలుపులు తెర్చుకొన్నాయి. తలుపు తీసిన అమ్మాయి అందాన్ని చూసేసరికి వాళ్ళకు మూర్ఛపోయినంత పనయింది.

అజంతా శిల్పం సొగసు, ఎల్లోరా శిల్ప సౌకుమార్యం మూర్తీభవించిన ఆమెను చూసి వాళ్ళు తమ అదృష్టానికి తెగ మురిసిపోయారు. తమలో ముందు ఎవరు నోరు తెరవాలన్న సందిగ్ధంలో ఉండగా ఆ అమ్మాయే పల్కరించింది వాళ్ళని.

"హలో, నా పేరు రమ్య... మీరు..?" ఆగిపోయింది మధ్యలోనే.

"మేము... మే...ము... హో ...ట ... ల్... తా... జ్..." ధైర్యం చేసి అక్షరం పొడిగా పల్కాడు సాంబు. అవునన్నట్లు మిగతా ముగ్గురు తలూపారు.

"అర్థమయింది... లోపలికి రండి" అని వెనక్కి జరిగింది. నల్గురూ లోపలికి ప్రవేశించారు. రూము ఎంతో అందంగా ఉంది. డబుల్‌కాట్ బెడ్, ఎటాచ్డ్ బాత్‌రూమ్, శ్రేష్టమైన అగరొత్తుల వాసన, రమ్య పూసుకొన్న ఫారిన్ సెంటు, అన్నీ కల్సి వాళ్ళని ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి. నల్గురూ తాము తెచ్చినవి బల్లపై పెట్టి కూర్చోబోయారు.

"ఎంతసేపు కాంట్రాక్టు? గంటనా, మధ్యాహ్నం దాకానా, రోజల్లానా?" నిర్మొహమాటంగా అడిగింది రమ్య.

"గంటే" నల్గురు కల్సి ముక్తకంఠంతో బదులు చెప్పారు. "అయితే అడ్వాన్సు యిచ్చేయండి" అంది రమ్య. సురేష్ ముందుగానే తన దగ్గర తీసి పెట్టుకొన్న డబ్బుని రమ్య చేతిలో పెట్టాడు. రమ్య ఆ డబ్బును తన పర్సులో దాచుకొంది. బట్టలు ఒక్కొక్కటే తీసేయటం మొదలుపెట్టింది రమ్య. సురేష్ గబగబ బట్టలూడ తీసేశాడు. మిగతావాళ్ళు బయట వెయిట్ చేయసాగారు.

ఇంతలోనే సురేష్‌కి ఎవరో తలుపు కొట్టిన శబ్దమయింది. ఇద్దరు ఉలిక్కి పడ్డారు. అతని గుండెలు మామూలుగా కొట్టుకోవటం మానేసాయప్పుడు. ఆ సమయంలో తలుపు తీసే ధైర్యం లేదు. చివరికి రమ్య తలుపు తీసింది.

"ఉన్నఫళంగా బయటికి రండి" అరిచినంత పనిచేశాడు యస్సయి. డ్రాయర్‌తోనే బయటికొచ్చాడు సురేష్. కానిస్టేబుల్ జేబులోంచి బేడీలు తీసి అతని చేతికి తగిలించడానికి సిద్ధమయ్యాడు.

వెంటనే సురేష్‌తో పాటు నల్గురూ యస్సయి కాళ్ళ మీద పడి ఎలాగోలాగ వదిలిపెట్టమని బ్రతిమాలుకొన్నారు. బుద్ధి గడ్డి తిందన్నారు. ఇంకెప్పుడూ ఇలా చేయమన్నారు. అంతవరకు ఏ పాపం ఎరగమని ఒట్టేశారు. అలా చాలా సేపే బ్రతిమాలుకొన్నాక వాళ్ళ చేతి గడియారాలు, వంటిపై బట్టలు మాత్రం లాక్కొని వాళ్ళు అలానే పారిపోవడానికి అనుమతించాడు యస్సయి.

చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనై బయటపడ్డారు నల్గురూ...

"వెర్రి వెధవలు... ఈ మధ్య బొత్తిగా ఆదాయం లేక ఎంతో ఇబ్బందితో బాధపడే మనమే ఆ హోటలో టాయిలెట్ గోడపైన అలా రాయించామని వాళ్ళూహించలేదు" అన్నాడు యస్సయి వేషంలో ఉన్న ఓ పెద్ద సైజు గూండా, కానిస్టేబుల్ వేషంలో ఉన్న వాడి శిష్య శిఖామణితో. కానిస్టేబుల్ వేషంలో ఉన్నతనూ, రమ్య, పారిపోతున్న సురేష్ మిత్రుల్ని చూసి పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకొన్నారు.

–స్రవంతి వినూత్న వారపత్రిక, 19 మార్చి, 1987

❀

కవరులో డబ్బు

ఆ రోజు సుధాకర్‌కు డబ్బు చాలా అవసరం. అర్జంటుగా హౌసింగ్ బోర్డు అప్లికేషన్ ఫీజు రెండువందల రూపాయలు కట్టాలి. ఎంతోమందిని అడిగి చూశాడు. కాని, ప్రయోజనం లేకపోయింది. పైగా అది నెలాఖరు. లాస్ట్ డేట్ దగ్గర పడుతున్నది. ఏం చేయటమా అని సతమతమవుతున్న సుధాకర్ ఇంటికి హఠాత్తుగా వచ్చాడు సుధాకర్ క్లోజ్ ఫ్రెండ్ శ్రీను.

"హలో శ్రీను, నీ గురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు సుధాకర్.

"అలాగా. అంత అర్జంటుగా నే గుర్తుకొచ్చానంటే విషయం చాలా సీరియస్ అయి ఉంటుంది" అన్నాడు శ్రీను నవ్వుతూ.

"అర్జంటుగా రెండువందలు కావాలి. ఫస్టుకిచ్చేస్తా. సర్దుతావా?" డైరెక్టుగా విషయంలోకి వచ్చాడు సుధాకర్.

"నీకు తెలియనిదేముంది? నా వైఫ్ మీ ఊళ్ళోనే కదా చదువుతోంది! ఆవిడ ఖర్చు తడిసి మోపెడంత అవుతున్నది. ఏదో అర్జంటుట. మూడొందలు పంపమని ఉత్తరం రాసింది. ఈ రోజు ఎమ్.ఓ. టైము కూడా దాటిపోయింది. బ్యాంకుకు ఆఫ్ డే. చివరికి డబ్బును కవర్లో పెట్టి పోస్ట్ చేద్దామని బయల్దేరాను" అని కవరు చూపించాడు శ్రీను.

"కవరులో పెట్టి పంపితే ఎవరన్నా కొట్టేస్తే?" అడిగాడు సుధాకర్.

"ఏం భయం లేదు. భద్రంగా కాగితంలో చుట్టి పంపితే అనుమానం రాదు" ధైర్యంగా చెప్పాడు శ్రీను. కాసేపు కూర్చున్నాక "పోస్ట్ఆఫీసు క్లియరెన్సు టైమ్ అయిపోతుందేమో" అంటూ లేచి వేగంగా వెళ్ళిపోయాడు శ్రీను.

శ్రీను వెళ్ళిపోగానే ఠక్కున ఓ ఆలోచన తట్టింది సుధాకర్‌కు. అంతే. మర్నాడు తన ఐడియా కార్యరూపంలో పెట్టాడు. సోమవారం తన ఊరెళ్ళి శ్రీను వైఫ్ ఉండే వీధి పోస్ట్‌మాన్‌ను కలిసి ఫలానా ఆవిడకు ఏదైనా కవరు వచ్చిందా అని అడిగాడు సుధాకర్. పోస్ట్‌మాన్ ఏం లేదంటూ చేయి ఊపటంతో సుధాకర్ గుండె ఆగినంత పనయింది. సెకండ్ డెలివరీ టైమ్ కూడా దాటాక చేసేది లేక చేతులు దులుపుకొంటూ తిరుగు ప్రయాణం కట్టాడు సుధాకర్.

ఆ మరునాడు ఆ దారిన పోతూ శ్రీను సుధాకర్‌ని పలకరించి వెళ్దామని వాళ్ళింటికి వెళ్ళాడు. శ్రీనును చూడగానే తన సందేహం నివృత్తి చేసుకోవడానికి మాటల మధ్యలో అడిగాడు సుధాకర్, “నువ్వా కవరు ఆరోజు సాయంత్రం పోస్ట్ చేశావా! లేదా?” అని.

“లేదు. ఈమధ్యలో ఎవరో పోస్ట్‌మాన్ను అడిగి మా ఆవిడకొచ్చే ఉత్తరాలను ఇంటర్‌సెప్ట్ చేస్తున్నారన్న సంగతి లాస్ట్‌మినిట్‌లో గుర్తొచ్చి ఆ డబ్బును మాకు తెలిసిన మనిషి ద్వారా పంపించాను” అన్నాడు శ్రీను.

ఇదివరలో కూడా కవరులో డబ్బు పెట్టి పంపే విషయం గురించి సుధాకర్‌కు చెప్పటం, ఆ డబ్బు చేరకపోవటం, అడిగినప్పుడు అలా చెప్పాలనే నిశ్చయించుకొని, ముందు అనుకొన్న ప్రకారంగా చెప్పినట్లు సుధాకర్‌కు తెలియనే తెలియదు పాపం. అసలు వాళ్ళావిడ డబ్బు పంపమనే రాయలేదు. ఇక శ్రీను డబ్బు పంపే అవసరమేముంది?

కాని, సుధాకర్‌కు ప్రాణం పోయినంత పనైంది. తన దగ్గరున్న పాతిక రూపాయలు కూడా ఛార్జీలకు వదలటంగాక, తన బండారం బయటపడిందే మోనన్న భయంతో సుధాకర్ ముఖం పాలిపోయింది. దెబ్బకు దెబ్బ మెత్తగా వేశాడు శ్రీను.

–ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18 ఫిబ్రవరి, 1987

❀